ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY
కరీంనగర్ 24-8-2017 గురువారం సిటీ సంపుటి 44 సంచిక 15
రూ. 5-00. పేజీలు 16+16
www.eenadu.net
Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Anantapur, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

పాతాళ గంగ పైపైకి!



పాతాళంలోని గంగ పైపైకి వస్తోంది.. దాదాపు 80 అడుగుల్లోని భూగర్భజలం పైకి ఉబికి వస్తోంది. మహబూబాబాద్ జిల్లా గంగారం మండల కేంద్రంలో అటవీ శాఖ చెక్ పోస్టు సమీపంలో తాగునీటి సరఫరాకు బోరు వేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో భూగర్భ జలం మోటారు ఆన్ చేయకుండానే పైకి ఉబికి వస్తోంది. సమీప రైతులు తమ పొలాలకు ఆ నీటిని మళ్లించుకుంటున్నారు.

-కొత్తగూడ, న్యూస్‌టుడే

ఓబీసీ ఉపవర్గీకరణ

రాష్ట్రాల మాదిరిగా విభజించేందుకు కమిషన్ ఏర్పాటు

- కేంద్ర మంత్రివర్గం నిర్ణయం
- 12 వారాల్లో నివేదిక
- వార్షికాదాయ పరిమితి రూ.8 లక్షలకు పెంపు

ఈనాడు - దిల్లీ

కేంద్ర జాబితాలోని ఓబీసీల ఉపవర్గీకరణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం కమిషన్ వేయాలని తీర్మానించింది. బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో దీనిపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ఛైర్‌పర్సన్‌ను నియమించిన నాటి నుంచి 12 వారాల్లోపు ఈ కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుంది. మంత్రివర్గ సమావేశానంతరం కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ, సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి థావర్‌చంద్ గెహ్లోత్ ఈ విషయాలు వెల్లడించారు. ఈ కమిషన్ కేవలం ఓబీసీల ఉపవర్గీకరణ పరిశీలనకు మాత్రమే పరిమితమవుతుందని స్పష్టం చేశారు. జాతీయస్థాయిలో ఓబీసీ కేటగిరీలో క్రీమీలేయర్ గరిష్ఠ వార్షికాదాయ పరిమితిని రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షలకు పెంచుతూ కేంద్ర మంత్రిమండలి నిర్ణయించినట్లు జైట్లీ (మిగతా 2లో)



కమిషన్ ఏం చేస్తుంది?

రాజ్యాంగంలోని ఆర్టికల్ 340 కింద ఉపవర్గీకరణపై ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేస్తారు. కేంద్ర ప్రభుత్వ ఓబీసీ జాబితాలో ఉన్న కులాలు/వర్గాలకు రిజర్వేషన్ ఫలాలు అందడంలో ప్రస్తుతమున్న అసమానతలను ఈ కమిషన్ పరిశీలిస్తుంది. ఓబీసీల ఉపవర్గీకరణకు ఎలాంటి యంత్రాంగం, ప్రమాణాలు, నిబంధనలు, కొలమానాలు ఉండాలి, ఎలాంటి శాస్త్రీయ విధానం అనుసరించాలి అన్నదానిపై కసరత్తు చేస్తుంది. కేంద్ర ఓబీసీ జాబితాలో ఉన్న సంబంధిత కులాలు/వర్గాలు/ఉపకులాలు/పర్యాయపదాలను గుర్తించి, వాటిని సంబంధిత ఉపవర్గీకరణల వారీగా వర్గీకరిస్తుంది.

ఉప వర్గీకరణతో ఉపకారమే
సామాజిక, రాజకీయ, మార్పులకు శ్రీకారం

12 లో

కమలానికి ఓబీసీ వికాసం!
రాజకీయ ప్రయోజనాలపై భాజపా ఆశలు

దందాలన్నీ ఇక బంద్



సమగ్ర భూసర్వేతో వివాదాలకు శాశ్వత పరిష్కారం

- 15 నుంచి భూరికార్డుల ప్రక్షాళన
- ప్రజాప్రతినిధులందరూ పాల్గొనాలి
- ఒక్కొక్కరు మూడు గ్రామాల్లో బాధ్యత తీసుకోవాలి
- నేనూ మూడు గ్రామాల్లో పర్యవేక్షిస్తా
- మండలానికో రిజిస్ట్రేషన్ కార్యాలయం: సీఎం కేసీఆర్

> 'ఏటీఎం ద్వారా ఏ బ్యాంకులో, ఏ ప్రదేశంలో డబ్బులు విత్‌డ్రా చేసుకున్నా వెంటనే ఆన్‌లైన్‌లో తెలుస్తుంది. వినియోగదారునికి మెసేజ్ వస్తుంది. భూరికార్డులూ ఇలాగే ఉండాలి. పాస్‌పుస్తకాల్లో ఎక్కడ మార్పు జరిగినా అంతటా తెలిసిపోవాలి. ప్రతిదీ పారదర్శకంగా జరగాలి. ప్రభుత్వ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయకుండా నిషేధిత జాబితా తయారుచేయాలి. ఆ భూముల రిజిస్ట్రేషన్ అంగీకరించని విధంగా సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయాలి'
>
> \- సీఎం కేసీఆర్

ఈనాడు - హైదరాబాద్

భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని వచ్చే నెల 15 నుంచి పెద్దఎత్తున ప్రారంభించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. అన్ని మండలాల్లో ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తలా మూడు గ్రామాలు పంచుకొని స్వయంగా పాల్గొనాలని, తాను కూడా మూడు గ్రామాలు ఎంపిక చేసుకుంటానని తెలిపారు. భూరికార్డులను ప్రక్షాళన చేయడం వల్ల ఎన్నో సమస్యలు పరిష్కారమవుతాయని, సమగ్ర భూసర్వేతో భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, దందాలన్నీ బంద్ అవుతాయని ముఖ్యమంత్రి చెప్పారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఉద్యోగులు, రైతు సంఘాలు, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. భూరికార్డుల ప్రక్షాళన ప్రక్రియ కోసం కొంత మంది ఉద్యోగులను తాత్కాలికంగా నియమిస్తామన్నారు. భూమి రికార్డుల నిర్వహణ, రిజిస్ట్రేషన్ విధానం అత్యంత పారదర్శకంగా సరళంగా ఉండాలని, అలా ఉంటేనే రైతులకు పెట్టుబడి పథకం విజయవంతమవుతుందని తెలిపారు. సమగ్ర భూసర్వేపై, రిజిస్ట్రేషన్ల విధానంలో మార్పులు, భూరికార్డుల నిర్వహణ తదితర అంశాలపై బుధవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి అధికారులతో సమీక్షించారు. భూ రికార్డుల ప్రక్షాళనకు అవలంభించాల్సిన పద్ధతులపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్‌రావు నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన అధ్యయన నివేదికపై చర్చ జరిగింది. సమగ్ర భూసర్వే నిర్వహించాలనే నిర్ణయం వెనుక నేపథ్యాన్ని ఈ సందర్భంగా సీఎం వివరించారు.

'వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. బతకడమే కష్టంగా మారింది. భార్యకు చీర కొనలేడు. పిల్లలకు పాఠశాల రుసుములు చెల్లించలేడు. ఇతర పనులేమీ లేకుండా కేవలం వ్యవసాయాన్ని మాత్రమే నమ్ముకున్న దురవస్థ రైతులది. పరువు కోసం తెల్లదుస్తులేసుకొని తిరుగుతారు గానీ పరిస్థితి ఏమీ బాగుండదు. పంట సీజన్‌లో బ్యాంకులు, మిత్తి వ్యాపారుల చుట్టూ తిరిగి అప్పు పుట్టించుకొంటారు. తీరా అనేక కారణాల వల్ల రైతు పంట నష్టపోతే పెట్టిన పెట్టుబడి పోయి అప్పు మాత్రమే మిగులుతుంది. దానికి వడ్డీ పెరుగుతుంది. బతుకు భారమవుతుంది. ఈ దుస్థితి నుంచి రైతును గట్టెక్కించాలని ఎప్పటి నుంచో ఆలోచిస్తున్నా. రైతుల కోసం ఏమీ చేయాలని చాలా మందితో మాట్లాడాను. చివరికి వ్యవసాయానికి పెట్టుబడి ప్రభుత్వమే సమకూరిస్తే రైతులకు అప్పుల తిప్పలు తప్పుతాయని భావించాను. కాలం కలిసి రాక పంటలు పండకపోతే రైతులు పెట్టుబడి కోల్పోయే ప్రమాదం ఉండదు. ఫలితంగా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోరు. అందుకోసమే ప్రభుత్వం ఎంతవ్యయమైనా భరించి, ప్రతీ ఎకరాకు ఏడాదికి రూ.8 వేలు ఇవ్వాలని నిర్ణయించింది. పెట్టుబడి తర్వాత ప్రాధాన్యమున్న సాగునీటిని కూడా అందివ్వడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. వచ్చే ఏడాది నాటికి కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా దాదాపు 40 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. పాలమూరు, సీతారామ ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతోంది. అవసరమున్నంత మేరకు ఉచిత విద్యుత్‌ను అందించడం వల్ల రైతులు భూగర్భ జలాలను గరిష్ఠ స్థాయిలో ఉపయోగించుకోగలుగుతారు.

అసైన్డ్ భూముల్లో సాగు చేసే వారికీ పెట్టుబడి సాయం

సెప్టెంబరు 12 నుంచి ప్రారంభమయ్యే భూరికార్డుల ప్రక్షాళన సందర్భంగా రైతుల ఆధీనంలోని వ్యవసాయ భూములతో పాటు గ్రామంలో అటవీ, ప్రభుత్వ, (మిగతా 2లో)

సర్వరోగ జీవనశైలి..!

రాష్ట్రంలో 15 % మందిలో మధుమేహం

- 15.75 శాతం అధిక రక్తపోటు బాధితులు
- ఏటా పెరుగుతున్న క్షయ బాధితులు
- హెచ్ఐవీ కేసుల నమోదులో జాతీయస్థాయిలో ఐదోస్థానం
- 'జాతీయ ఆరోగ్య ముఖచిత్రం 2017' నివేదిక వెల్లడి
- జీవన విధానంలో మార్పులే కారణమని నిపుణుల విశ్లేషణ
- వేపుళ్ల వాడకం పెరగడం, వ్యాయామం లేకపోవడమూ కారణమే

2లో



పీఠాల్ని కదిపిన రైలు

- యూపీలో మరో ప్రమాదం... 100 మందికి గాయాలు
- పూర్తి నైతిక బాధ్యత నాదే: రైల్వే మంత్రి
- రాజీనామా చేస్తానని ప్రధానికి చెప్పిన సురేశ్ ప్రభు
- రైల్వేబోర్డు ఛైర్మన్ రాజీనామా ఆమోదం

11లో



రైల్వే మంత్రిగా గడ్కరీ!

11లో

- 12 మంది మంత్రుల శాఖల్లో మార్పు
- సెప్టెంబరు 2 లోగా కేబినెట్ విస్తరణ

ఇదీ సంగతి!



మట్టి వినాయకులు పెట్టే వారింటికే స్వారీ కొస్తా స్వామీ!

తడపని చినుకు

- 215 మండలాల్లో తీవ్ర వర్షాభావం
- పంటల సాగు 84 శాతానికి చేరిక
- వ్యవసాయశాఖ తాజా నివేదిక

ఈనాడు - హైదరాబాద్

కొన్ని చోట్ల రోజూ వర్షాలు...మరికొన్ని ప్రాంతాల్లో చినుకు జాడ లేక ఎండుతున్న పైర్లు....తెలంగాణలో విభిన్న వాతావరణంతో రైతుల పరిస్థితి అయోమయంగా ఉంది. గత జూన్ ఒకటి నుంచి బుధవారం నాటికి 8 జిల్లాల్లో మాత్రమే సాధారణంకన్నా అధిక వర్షపాతం నమోదైంది. మిగిలిన 23 జిల్లాల్లో లోటు ఏర్పడింది. కొన్ని జిల్లాల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. పెద్దపల్లి, కుమురం భీం-ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, వికారాబాద్ వంటి జిల్లాల్లో ఒక్క మండలంలోనైనా సాధారణ వర్షపాతం లేదు. కొన్ని మండలాల్లో అత్యంత దారుణంగా 50 శాతానికి పైగా లోటు ఏర్పడింది. రాష్ట్రంలోకెల్లా అత్యధికంగా రఘునాథ్‌పల్లిలో సాధారణంకన్నా 61 శాతం తక్కువ వర్షం కురిసింది. వాతావరణశాఖ నిబంధనల ప్రకారం వర్షపాతం లోటు 50 శాతానికి మించి ఉంటే కరవు పరిస్థితులున్నట్లుగా చెబుతారు. లోటు 19 శాతం వరకు ఉన్నా సాధారణ వర్షపాతం ఉన్నట్లుగా నమోదు చేస్తారు. ఈ 19 శాతానికి మించి లోటు ఉన్న మండలాలు 215 అని తేలింది. లోటు ఒకశాతం నుంచి 19 శాతం వరకు ఉన్న మండలాలు మరో 50కి పైగానే ఉన్నాయి.

రాష్ట్రంలో గత జూన్ ఒకటి నుంచి బుధవారానికి వర్షపాతం(మిల్లీమీటర్లు)

నెల	సాధారణం	కురిసింది	తేడా (శాతాల్లో)
జూన్	128.3	188.8	47
జులై	242.7	146.2	-40
ఆగస్టు	162.8	128.9	-21
మొత్తం	533.8	463.9	–13

ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ తాజా నివేదికలో తెలిపింది.

వరి నాట్లు 66 శాతం

రాష్ట్రంలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నందున అన్ని పంటల సాగు విస్తీర్ణం 84 శాతానికి చేరింది. ఇప్పటికి వేయాల్సినదానిలో 66 శాతం విస్తీర్ణంలో వరి నాట్లు వేశారు. మరో పక్షంలోగా (మిగతా 2లో)



భూరికార్డుల ప్రక్షాళన, సమగ్ర భూ సర్వే నిర్వహణపై బుధవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో అధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి, మంత్రులు జోగు రామన్న, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, ఉపముఖ్యమంత్రి మహమూద్‌అలీ, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి తదితరులు

దందాలన్నీ ఇక బంద్

(మొదటి పేజీ తరువాయి)

దేవాదాయ భూములు, ప్రజోపయోగ కార్యక్రమాలు, ప్రభుత్వ భవనాలకు ఉపయోగించే, చెరువులు, కుంటల కింద ఉన్న భూముల పూర్తి వివరాలు సేకరించాలి. వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాల కోసం బదలాయిస్తే ఆ వివరాలు, ప్రభుత్వం సేకరించి భూముల, ప్రభుత్వం అసైన్ చేసిన భూ వివరాలు నమోదు చేయాలి. అసైన్డ్ భూముల్లో వ్యవసాయం చేసుకునే పేదలకు కూడా పెట్టుబడి పథకం అమలు చేస్తాం. గ్రామ కంఠాన్ని నిర్ధారించాలి. మొదటి దశలో వివాదాలు లేని భూముల రికార్డులను సరిచేయాలి. రెవెన్యూ గ్రామం పరిధిలోని ప్రతీ భూమి వివరాలను నమోదు చేయాలి. రెండో దశలో తెలంగాణ భూభాగాన్ని సర్వే చేయించి, కొత్త పటాలు (మ్యాప్‌లు) రూపొందిస్తాం.

పొరపాట్లు జరిగితే భారీ కుంభకోణమే

1932-36 మధ్య నిజాం రాజ్యంలో భూ సర్వే జరిగింది. ఆ తర్వాత ఎనిమిది దశాబ్దాల కాలంలో అనేక మార్పులు సంభవించాయి. అవన్నీ సరిగా నమోదు కాలేదు. అందుకే భూరికార్డుల నిర్వహణలో తీవ్రగందరగోళం ఏర్పడింది. వివాదాలకు కూడా కారణమవుతుంది. వ్యవసాయ శాఖ వివరాలకు, రెవెన్యూ వారి వద్ద ఉన్న వివరాలకు పొంతన లేదు. దీంతో ప్రభుత్వం ఏ ప్రాతిపదికన పెట్టుబడి అందించాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. పొరపాట్లు జరిగితే వేల కోట్ల రూపాయల కుంభకోణమవుతుంది. అందుకే భూమి ఎవరి ఆధీనంలో ఉందో, పెట్టుబడి ఎవరికి చెందాలో ఖచ్చితంగా తెలియాలి.

అన్నీ ఆన్‌లైన్‌లో

భూరికార్డులన్నింటినీ సరి చేసిన తర్వాత ఆ వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పెట్టాలి. ఏ చిన్న మార్పు జరిగినా అంతా ఆన్‌లైన్‌లో తెలిసిపోవాలి. బ్యాంకులు అవలంభిస్తున్న కోర్ బ్యాంకింగు విధానం లాంటిది భూరికార్డుల నిర్వహణలో అనుసరించాలి. కోర్ బ్యాంకింగ్‌లాంటి వ్యవస్థను నడపడానికి ప్రతీ రెవెన్యూ కార్యాలయంలో ఒక ఐటీ అధికారిని నియమించాలి. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ శాఖలో వేయి మందిని నియమించాలి. ఎక్కువ సామర్థ్యం కలిగిన కంప్యూటర్లు, ఎక్కువ బ్యాండ్ విడ్త్ కలిగిన నెట్ కనెక్షన్ కల్పిస్తాం. రెవెన్యూ కార్యాలయాన్నీ ఒకదానికొకటి అనుసంధానమవుతాయి.

పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు

రిజిస్ట్రేషన్లు పారదర్శకంగా జరగాలి. క్రయవిక్రయాలు జరిపే రైతులిద్దరూ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లాలి. రిజిస్ట్రార్ వద్ద ఇద్దరి పాస్‌పుస్తకాలు ఇవ్వాలి. రిజిస్ట్రార్ రెండు పాస్ పుస్తకాలను తీసుకొని అమ్మేవారి పాస్ పుస్తకం నుంచి భూమిని తొలగించి, కొన్నవారి పుస్తకంలో చేర్చాలి. రిజిస్ట్రారే ఈ రెండు పాస్ పుస్తకాలను కొరియర్ ద్వారా తహసీల్దార్‌కు పంపాలి. నాలుగు పనిదినాల్లో తహసీల్దార్ క్రయవిక్రయాలకు సంబంధించిన వివరాలను తమ కార్యాలయంలో నమోదు చేసుకోవాలి. పాస్‌పుస్తకాలపై దీనిని అటెస్ట్ చేయాలి. పేరు మార్పిడి చేయాలి. తిరిగి రిజిస్ట్రార్‌కు పంపాలి. రిజిస్ట్రార్ తన రికార్డుల్లో నమోదు చేసుకొని కొరియర్ ద్వారా రైతులకు పంపాలి. అమ్మేవారు, కొనేవారు కేవలం ఒక్కసారి మాత్రమే రిజిస్ట్రార్ కార్యాలయానికి రావాలి. మళ్లీ మళ్లీ తిరగడం, పైరవీలు చేయడం ఇక ముందు ఉండకూడదు, పాస్‌పుస్తకాలు, పహాణీల నిర్వహణను మరింత సరళం చేయాలి. అవసరం లేని కాలమ్స్ తీసివేయాలి. పాస్‌పుస్తకాలు కూడా కొత్తవి ఇవ్వాలి. ప్రత్యేకమైన పెన్నులు మాత్రమే పడే విధంగా వాటిని తయారు చేయాలి. నీటిలో పడినా తడవకుండా, పాడవకుండా ఉండే విధంగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. పాస్ పుస్తకాల సైజు తగ్గించాలి. స్టాంపుల, రిజిస్ట్రేషన్ చట్టాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అవసరమైన మార్పులు చేయాలి. భవిష్యత్తులో ప్రతీ మండలానికి ఒక రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు చేయాలి. వీలైతే తహసీల్దార్లకే భూ రిజిస్ట్రేషన్ అధికారమిచ్చే అవకాశాలు పరిశీలించాలి. రెవెన్యూ కోర్టులు కూడా ఇన్ని ఉండాలా? కలెక్టర్ వద్ద గల ఒక్కకోర్టు మాత్రమే నిర్వహించాలా అనే విషయంపై కూడా నిర్ణయం తీసుకోవాలి. అధికారులకు సముద్రమంతా ఓపిక ఉండాలి. తెలంగాణ రాష్ట్రంలో మనమంతా పట్టుబడితే గుడుంబా మహమ్మారి పారిపోయింది. పేకాట బంద్ అయింది. రికార్డుల ప్రక్షాళనతో భూముల సమస్యలుండవు.'

సమావేశంలో ఉపముఖ్యమంత్రి మహమూద్‌అలీ, మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జోగురామన్న, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి, విప్ గొంగిడి సునీత, కార్పొరేషన్ల ఛైర్మన్లు భూంరెడ్డి, కిషన్‌రావు, ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, సుధీర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, సలహాదారు రమణాచారి, సీనియర్ అధికారులు బీఆర్ మీనా, బీపీ ఆచార్య, పార్థసారథి, నర్సింగ్‌రావు, జగన్మోహన్, శాంతికుమారి, వెంకట్రామిరెడ్డి, స్మితా సబర్వాల్ పాల్గొన్నారు.

సమగ్ర భూసర్వే కార్యాచరణ ఇలా

- సెప్టెంబరు 1 నుంచి 9 వరకు 11 మందితో గ్రామ రైతు సంఘాల సమన్వయ సమితులు ఏర్పాటవుతాయి. గ్రామంలో వ్యవసాయభూమి కలిగిన రైతులందరూ సభ్యులుగా ఉంటారు.
- సెప్టెంబరు 10నుంచి 15వరకు రైతు సమన్వయ సమితుల సదస్సులు మండల స్థాయిలో నిర్వహిస్తారు.
- సెప్టెంబరు 15న రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ గ్రామం యూనిటుగా భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమం అన్ని మండలాల్లో ప్రారంభమవుతుంది. డిసెంబరు నెలాఖరు వరకు కొనసాగుతుంది.
- రాష్ట్రం మొత్తాన్ని 1,100 యూనిట్లుగా నిర్ణయించారు. 3,600 బృందాలను ఎంపిక చేస్తారు. రెవెన్యూ అధికారి, వ్యవసాయాధికారి, గ్రామ రైతు సంఘం సమన్వయంతో ఒక్కో గ్రామంలో ఒక్కో బృందం నెలరోజుల పాటు ఉండి గ్రామసభలు నిర్వహించి, రైతులందరి సహకారం, అంగీకారంతో భూరికార్డులను సవరిస్తారు. ఒక్కో బృందం ఒక్కో గ్రామంలో నెల రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఇలా ఒక్కో బృందం మూడు నెలల్లో మూడు గ్రామాల్లో రికార్డులను ప్రక్షాళన చేస్తుంది.
- సీఎం కేసీఆర్‌తోపాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా 3గ్రామాల్లో భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారు.
- ఎలాంటి వివాదాలు లేని భూములు దాదాపు 85 శాతం నుంచి 95 శాతం వరకు ఉంటాయని అంచనా. ఈ భూముల రికార్డులను ముందుగా ప్రక్షాళన చేస్తారు. పేరు మార్పిడులు, క్రయవిక్రయాలు జరిగిన వివరాలన్నీ తీసుకుంటారు. రికార్డులకు తుది రూపం ఇస్తారు. ఈ రికార్డులను ఆన్‌లైన్‌లో ఉంచుతారు. రెండో దశలో వివాదాస్పద భూములకు సంబంధించిన పరిష్కార మార్గాలు చూస్తారు. కోర్టు వివాదాలుంటే కోర్టు తీర్పులను అనుసరించి, యాజమాన్య హక్కులను నిర్ణయిస్తారు. డిసెంబరు నెలాఖరు నాటికి రికార్డులన్నీ సరిచేసి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. దీని ఆధారంగానే రైతులకు పెట్టుబడి పథకం అమలు చేస్తారు.

ఇంజినీరింగ్‌కు ఒకే ప్రవేశ పరీక్ష వచ్చే ఏడాదికి లేనట్లే!

దిల్లీ: వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు నీట్ మాదిరిగానే ఇంజినీరింగ్ కోర్సులకూ జాతీయ స్థాయిలో ఒకే ప్రవేశ పరీక్ష నిర్వహించాలన్న ప్రతిపాదనను తాత్కాలికంగా నిలిపివేయాలని కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. నీట్ విజయంపై సమీక్షించిన తర్వాతే దీనిపై ముందడుగు వేయాలని భావిస్తోంది. 2018లో ఇంజినీరింగ్ కోర్సులకు దేశవ్యాప్తంగా ఉమ్మడి ప్రవేశ పరీక్షను నిర్వహించబోమని మానవ వనరుల శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. అయితే, ఆ ప్రతిపాదనను విరమించుకోవటంలేదని, అమలుకు తాత్కాలిక విరామం మాత్రమే ఇస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో ఉమ్మడి ప్రవేశ పరీక్షను నిర్వహించటంలోని సాధ్యాసాధ్యాలపై అఖిలభారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) నివేదిక ఇవ్వనుందని వెల్లడించారు. నీట్ మాదిరిగానే ఇంజినీరింగ్‌కు దేశవ్యాప్తంగా ఒకే ప్రవేశ పరీక్ష ఉంటే బాగుంటుందనే అభిప్రాయంతో మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఆ దిశగా చొరవ తీసుకుంది. ఈ ఏడాది నీట్ నిర్వహణలో తలెత్తిన సమస్యలు ప్రభుత్వాన్ని పునరాలోచనలో పడేసినట్లు తెలుస్తోంది. తాజా నిర్ణయం వల్ల సీబీఎస్ఈ నిర్వహించే జేఈఈ(మెయిన్స్), వివిధ రాష్ట్రాలు, ప్రైవేటు విద్యాసంస్థలు విడివిడిగా నిర్వహించుకునే ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు వచ్చే ఏడాది యథావిధిగా కొనసాగే అవకాశం ఉంది.

ఓబీసీ ఉపవర్గీకరణ

(మొదటి పేజీ తరువాయి) తెలిపారు. ఓబీసీ కేటగిరీలో ఏటా రూ.8 లక్షల దాకా ఆర్జించేవారు సైతం ఇప్పుడిక రిజర్వేషన్ల ప్రయోజనాల్ని పొందవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం పరిమితిని పెంచాలని మంత్రివర్గం నిర్ణయించిందన్నారు. క్రీమీలేయర్ గరిష్ఠ పరిమితిని పెంచే అంశాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల అసోంలో సంకేతాలిచ్చారనీ, సదరు నిర్ణయాన్ని మంత్రివర్గంలో ఆమోదించే ప్రక్రియ బుధవారంతో పూర్తయిందన్నారు. దీనిని ప్రభుత్వ రంగ సంస్థలకూ వర్తింపజేసే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు.

రాజకీయ ప్రయోజనాల్లేవు: కేంద్రమంత్రులు

ఓబీసీలను వర్గీకరించాలన్న నిర్ణయంలో ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేవని కేంద్రమంత్రులు జైట్లీ, గెహ్లోత్‌లు వెల్లడించారు. ఇప్పటి వరకూ రిజర్వేషన్ ఫలాలు దక్కనివారికి కూడా వాటిని అందించాలన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ఓబీసీలను వర్గీకరించాలని 1992లోనే సుప్రీంకోర్టు తీర్పు చెప్పినట్లు గెహ్లోత్ వెల్లడించారు. బీసీలను వెనుకబడిన, అత్యంత వెనుకబడిన తరగతులుగా వర్గీకరించడానికి న్యాయపరమైన ప్రతిబంధకాలేమీ లేవని ఇంద్రాసాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు(డబ్ల్యూపీ(సి) నె.930/1990)లో 1992 నవంబర్ 16న సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందనీ, ఒకవేళ ఏదైనా రాష్ట్రం బీసీలను వర్గీకరించాలనుకుంటే చట్టపరిధిలో అదేమీ అసాధ్యం కాదని కూడా అభిప్రాయపడిందని వెల్లడించారు. దేశంలో ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరి, కర్ణాటక, హరియాణా, ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్, బిహార్, మహారాష్ట్ర, తమిళనాడు, జమ్ముల్లో వర్గీకరణ అమలవుతున్నట్లు జైట్లీ తెలిపారు. 2015లో జస్టిస్ ఈశ్వరయ్య నేతృత్వంలోని ఓబీసీ కమిషన్, 2012-13ల్లో పార్లమెంటరీ స్థాయీసంఘం కూడా ఓబీసీలను వర్గీకరించాలని సిఫార్సు చేసినట్లు గెహ్లోత్ వెల్లడించారు. ఓబీసీల తాజా జనాభా లెక్కలు వెల్లడించే అంశం ప్రస్తుతం హోంమంత్రిత్వశాఖ పరిధిలో ఉన్నట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తమ వద్ద 2005కిపైగా ఓబీసీ వర్గాల సమాచారం ఉన్నట్లు వెల్లడించారు.

రిజర్వేషన్ వ్యవస్థను పునఃసమీక్షించేది లేదు: తమ ప్రభుత్వం పేదల కోసం అంకితమై, వారి సంక్షేమం కోసమే పని చేస్తోందని కేంద్ర మంత్రులు పేర్కొన్నారు. సామాజిక న్యాయం, అంత్యోదయమే తమ లక్ష్యమన్నారు. రిజర్వేషన్లను పునఃసమీక్షించాలని రెండేళ్లక్రితం డిమాండ్లు వినిపించాయి కదా? అన్న ప్రశ్నకు జైట్లీ స్పందిస్తూ అలాంటి ప్రతిపాదనేమీ తమవద్ద లేదనీ, ఉండబోదని పేర్కొన్నారు. ఎస్సీల అంశంపై అడిగినప్పుడు అదేతరహా సమాధానమిచ్చారు.

153 కిలోల భారీ సమోసాకు గిన్నిస్ రికార్డులో చోటు

లండన్: తూర్పు లండన్‌లోని ఒక మసీదులో ముస్లిం వలంటీర్ల బృందం తయారు చేసిన భారీ సమోసాకు గిన్నిస్ రికార్డులో చోటు దక్కింది. 12 మంది ముస్లిం వలంటీర్ల బృందం సుమారు 15 గంటలపాటు కష్టపడి వండిన 153 కిలోల భారీ సమోసాను గిన్నిస్ సంస్థ ప్రతినిధులు ప్రపంచ అతి పెద్ద సమోసాగా ధ్రువీకరించారు. 2012 జూన్‌లో ఉత్తర ఇంగ్లాండ్‌లోని బ్రాడ్‌ఫోర్డ్ కళాశాల తయారు చేసిన 110.8 కిలోల సమోసానే ఇప్పటి వరకు ప్రపంచంలో అతిపెద్దది కాగా, తాజాగా వలంటీర్ల బృందం చేసిన సమోసా ఆ రికార్డును బద్దలు కొట్టింది.

పక్కా ప్రణాళికతోనే హేతువాదుల హత్య

- భిన్న కోణాల్లో దర్యాప్తు జరపండి
- బొంబాయి హైకోర్టు సూచన

ముంబయి: మహారాష్ట్రలోని ఇద్దరు హేతువాదులు నరేందర్ దభోల్కర్, గోవింద్ పన్సారేల హత్య కేసులు పక్కా ప్రణాళికతో జరిగాయని, ఈ రెండింటి మధ్య సంబంధం ఉందని బొంబాయి హైకోర్టు అభిప్రాయపడింది. నిందితులకు సంస్థాపరమైన మద్దతు ఉన్నట్టు కనిపిస్తోందని అందువల్ల ప్రస్తుత విధానంలో కాకుండా భిన్న కోణాల్లో దర్యాప్తు జరపాలని ఆదేశించింది. పన్సారే కేసును రాష్ట్ర సీఐడీ, దభోల్కర్ హత్య కేసును సీబీఐ దర్యాప్తు చేస్తున్నాయి. ఇవి రెండు చెదురుమదురు సంఘటనలు కావని, నిందితులకు ఆర్థిక సహాయం లభించినట్టు ఉందని జస్టిస్ ఎస్.సి.ధర్మాధికారి, జస్టిస్ విభా కంకణ్‌వాడిలతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. దభోల్కర్‌ను 2013లో సారంగ్ అకోల్కర్, వినయ్ పవార్‌లు కాల్చి చంపినట్టు సీబీఐ గుర్తించినా, వారింకా పట్టుబడలేదని తెలిపింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంతకాలం అజ్ఞాతంలో ఉండడం కష్టమని, అందువల్ల బ్యాంకు లావాదేవీలు, రైలు టిక్కెట్లు తదితరాలను ఆధారం చేసుకుని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేయాలని సూచించింది. 2015 ఫిబ్రవరి 16న కొల్హాపూర్‌లో పన్సారేపై కాల్పులు జరపగా, ఆయన అదే రోజు 20న మరణించారు. కేసుల దర్యాప్తును స్వయంగా పర్యవేక్షించాలంటూ ఆయా కుటుంబాల సభ్యులు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని విచారిస్తున్న ధర్మాసనం.. పోలీసులకు పలు సూచనలు చేస్తూ తదుపరి విచారణను సెప్టెంబరు 13వ తేదీకి వాయిదా వేసింది.



ముంబయిలోని జీఎస్‌బీ సేవా మండల్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం ఇది.. 68 కిలోల బంగారం, 327 కిలోల వెండితో చేసిన ఆభరణాలతో ఈ ప్రతిమను అలంకరించారు

తడపని చినుకు

(మొదటి పేజీ తరువాయి)

వంద శాతానికి చేరవచ్చని అంచనా. పప్పుధాన్యాల సాగు 15 శాతం, నూనెగింజల పంటలు 38 శాతం తగ్గాయి. నూనెగింజల పంటల సాగు అంతంతమాత్రంగా ఉంది. వీటిలో ఏ ఒక్కటీ 70 శాతానికి మించి వేయలేదు. గతేడాది రికార్డుస్థాయిలో సాగైన కంది ఈసారి 14శాతం తగ్గడం గమనార్హం.

పంటల సాగు తీరు(లక్షల హెక్టార్లు)

పంట	సాగు కావాల్సింది	సాగైంది
వరి	5.46	6.20
పత్తి	13.70	18.24
మొక్కజొన్న	4.84	4.46
కంది	2.71	2.40
సోయాచిక్కుడు	2.52	1.62
పెసర	1.24	0.87
మినుము	0.35	0.29
జొన్న	0.57	0.41
పసుపు	0.43	0.44
ఆముదం	0.44	0.25

50 శాతానికి పైగా లోటున్న మండలాలు

జిల్లా	మండలం	లోటుశాతం
జనగాం	రఘునాథ్‌పల్లి	61
”	చెల్పూరు	54
మంచిర్యాల	కాసిపేట	59
”	తాండూరు	58
”	చెన్నూరు	54
మెదక్	కొల్చారం	57
”	చిలప్‌చేడ్	55
కుమురంభీం	వాంకిడి	52
”	జైనూరు	50
నిర్మల్	నిర్మల్	50
వికారాబాద్	బొంరాస్‌పేట	53
”	పరిగి	52
”	పెద్దేముల్	51
పెద్దపల్లి	పాలకుర్తి	56
”	అంతర్గాం	52
యాదాద్రి	బొమ్మలరామారం	54

సర్వరోగ జీవనశైలి..!

ఈనాడు - హైదరాబాద్

జీవన శైలి. మనిషి ఆరోగ్యాన్నయినా..అనారోగ్యాన్నయినా శాసించేది ఇదే. ప్రస్తుతం రెండో తరహా జీవన విధానాన్ని మనుషులు ఇష్టపడుతున్న నేపథ్యంలో..అది అనేక దుష్పరిణామాలను బహుమతిగా అందిస్తోంది. వ్యాధుల రూపంలో ముప్పేటదాడిచేస్తూ..మనకు సవాల్ విసురుతోంది. దేశంలోనూ..ముఖ్యంగా తెలంగాణలో జీవనశైలి వ్యాధులు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయని జాతీయ ఆరోగ్య ముఖచిత్రం 2017' వెల్లడించడమే దానికి నిదర్శనం.

మధుమేహం, అధిక రక్తపోటు, గుండెపోటు, క్యాన్సర్ తదితర వ్యాధులు క్రమేణా అన్ని వయసుల వారినీ కబళిస్తున్నాయి. రాష్ట్రంలో 15 శాతం మంది మధుమేహులుండగా..15.75 శాతం మంది అధిక రక్తపోటు బాధితులుండటం పరిస్థితికి దర్పణం. క్యాన్సర్ కేసుల నమోదు 0.74 శాతం. ఈ గణాంకాలు జాతీయ సగటు కంటే కూడా అధికంగా ఉండటం గమనార్హం. దేశం మొత్తమ్మీద అన్ని రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణలో సిఫిలిస్ (ఓ రకం సుఖవ్యాధి) వ్యాధిగ్రస్తుల సంఖ్య కూడా ఎక్కువగా ఉండటం, రాష్ట్రంలో క్షయ కేసుల నమోదు కూడా ఏటికేడు పెరుగుతుండడం ఆందోళన కలిగించే అంశం. హెచ్ఐవీ కేసుల నమోదులోనూ దేశంలో తెలంగాణ ఐదోస్థానంలో ఉంది. కేంద్ర ఆరోగ్య కుటుంబ మంత్రిత్వ శాఖ ఇటీవల విడుదల చేసిన 'జాతీయ ఆరోగ్య ముఖచిత్రం 2017' నివేదిక ఈ విషయాలు వెల్లడించింది. జీవనశైలి వ్యాధులను నివారించడంతోపాటు.. సాంక్రమిక వ్యాధులను అరికట్టడంపైనా తక్షణమే దృష్టిసారించాల్సిన అవసరముందని ఈ నివేదిక గుర్తుచేస్తోంది.


అవాంఛనీయ మార్పు ఫలితమే

కాలంతోపాటు మార్పు సహజమే అయినా..జీవనశైలిలో వచ్చిన విపరీత మార్పుల ఫలితంగా వ్యాధులు విజృంభిస్తున్నాయని ఆ నివేదిక తేల్చిచెప్పింది. గ్రామీణానికి, నగర జీవనానికి మధ్యనున్న సన్నని గీత క్రమేపీ చెరిగిపోవడంతో..జీవనశైలి వ్యాధుల విస్తరణ పట్టణాల నుంచి ఇప్పుడు పల్లెలకూ వ్యాపించిందని స్పష్టం చేసింది. ఒకప్పుడు 40-50 ఏళ్లలో కనిపించే వ్యాధులు ఇప్పుడు 20-30 ఏళ్లలోనే కనిపిస్తుండడం దానికి దర్పణమే. శారీరక శ్రమ తగ్గిపోవడం..అన్ని ఆహార పదార్థాలలోనూ చక్కెర వాడకం పెరగడం, నూనెలను విచ్చలవిడిగా వినియోగించడం..ఆహారంపై నియంత్రణ లేకపోవడం..మానసిక ఒత్తిడి, ఆహారం, గాలి, నీరు.. ఇలా అన్నీ కాలుష్యమయం కావడం, మద్యపానం, ధూమపానాలు జతకూడడం..వెరసి పల్లె, పట్నమన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారినీ జీవనశైలి వ్యాధులు చుట్టుముడుతున్నాయని నివేదిక తేల్చింది. యుక్త వయసులోనే అధిక రక్తపోటు, గుండెపోటు, మధుమేహం, క్యాన్సర్ వంటి వ్యాధులను ఎదుర్కోవాల్సి వస్తోందని విశ్లేషించింది.

నివేదికలోని ఇతర ముఖ్యాంశాలు..

- దేశవ్యాప్తంగా జీవనశైలి వ్యాధులపై 15,468,520 మందిని పరీక్షించగా సగటున మధుమేహులు 8.52శాతం. అధికరక్తపోటు, గుండెపోటు, సాధారణ క్యాన్సర్ బాధితులు 10.91, 0.67, 0.18 శాతం.
- దేశంలో కుక్కకాటు మూలంగా రేబిస్ వ్యాధి సోకిన వారందరూ(వందశాతం) మృతిచెందారు.
- దేశంలో ఆత్మహత్యలకు పాల్పడిన వారిలో అత్యధికులు(44,593 మంది) 30-45 ఏళ్ల మధ్య వయస్కులే.
- జాతీయ స్థాయిలో డయేరియా(నీళ్ల విరేచనాలు) మరణాలు 1540 కాగా..అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో (303) మంది మరణించారు. తెలంగాణలో 8,71,497 కేసులను గుర్తించగా.. 17 మంది చనిపోయారు.
- టైఫాయిడ్ నమోదులో తెలంగాణ 1,33,838 కేసులతో దేశంలో ఆరో స్థానంలో ఉంది. తొలి ఐదు స్థానాల్లో ఉత్తరప్రదేశ్(4,95,698), బిహార్(2,04,366), ఆంధ్రప్రదేశ్(1,70,249), పశ్చిమ్‌బెంగాల్(1,61,264), మహారాష్ట్ర(1,37,617) ఉన్నాయి.
- అత్యవసర శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లతో మృతిచెందిన కేసుల్లో తెలంగాణ(77మంది) దేశంలో 9వ స్థానంలో ఉంది.
- డిఫ్తీరియా కేసులు తెలంగాణలో 2016లో 486 నమోదయ్యాయి. తెలంగాణ కంటే డిఫ్తీరియా కేసులు ఎక్కువగా నమోదైన రాష్ట్రాలు దిల్లీ(907), పశ్చిమ్‌బెంగాల్(761). దిల్లీలో అత్యధికంగా 135 మంది చిన్నారులు డిఫ్తీరియా కారణంగా 2016లో చనిపోయారు.
- తెలంగాణలో నిమోనియా కేసులు 16,378 నమోదు కాగా, 17 మంది చనిపోయారు.
- సిఫిలిస్ కేసులు దేశవ్యాప్తంగా 2015లో 26,334.. 2016లో 22,537 నమోదు కాగా..తెలంగాణలో అత్యధికంగా 9230, 7494 చొప్పున నమోదయ్యాయి.
- తెలంగాణలో క్షయ కేసులు కూడా ఏటా పెరుగుతున్నాయి. 2015లో 17,653 క్షయకేసులు కొత్తగా నమోదు కాగా, 2016 కొచ్చేసరికి ఆ సంఖ్య 21,466కు పెరిగింది.
- హెచ్ఐవీ కేసుల్లోనూ తెలంగాణ దేశంలో ఐదో స్థానంలో ఉంది. రాష్ట్రంలో 65,069 మంది హెచ్ఐవీ బాధితులు ఔషధ చికిత్స పొందుతుండగా..తెలంగాణ కంటే అత్యధికంగా హెచ్ఐవీ బాధితులున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్(1,50,249), కర్ణాటక(1,36,323), మహారాష్ట్ర(1,80,450), తమిళనాడు(1,00,092) ఉన్నాయి.
- దేశంలో పురుషుల్లో అత్యధికంగా ఊపిరితిత్తుల క్యాన్సర్(1,02,300) బాధితులు ఉండగా..రెండో స్థానంలో నోటి క్యాన్సర్ బాధితులు(99,495)న్నారు. మహిళల్లో రొమ్ము క్యాన్సర్ కేసులు 1,79,790, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులు 1,04,060గా నమోదయ్యాయి.
- దేశంలో సాంక్రమిక వ్యాధుల కారణంగా మృతుల వివరాలు పరిశీలిస్తే..అత్యధికంగా నిమోనియా కారణంగా 27 శాతం, అత్యవసర శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లతో 24 శాతం మృతి చెందారు.

దేశంలో 2016లో వివిధ సాంక్రమిక వ్యాధుల కారణంగా మరణాలు



2016 సంవత్సరంలో దేశ వ్యాప్తంగా వేర్వేరు వ్యాధుల నమోదు, మరణాల వివరాలు

వ్యాధి	కేసుల సంఖ్య	మరణాలు	నష్ట తీవ్రత (శాతాల్లో)
రేబిస్	86	86	100
జపనీస్ ఎన్‌సెఫలైటిస్	1666	283	17
హెచ్1, ఎన్1 (స్వైన్‌ఫ్లూ)	1786	265	14.8
అక్యూట్ ఎన్‌సెఫలైటీస్ సిండ్రోమ్	11438	1301	11.4
ఎన్‌సెఫలైటీస్	7213	551	7.6
డిఫ్తీరియా	3380	177	5.2
మెనింజోకోకల్ మెనింజైటీస్	3132	150	4.8
టెటనస్(నవజాత శిశువులు కాకుండా)	3554	158	4.4
టెటనస్(నవజాత శిశువులు)	227	10	4.4
వైరల్ మెనింజైటీస్	9194	142	1.5

మన చేతుల్లోనే మన ఆరోగ్యం



జీవనశైలిలో మార్పుల ఫలితంగా వస్తున్న వ్యాధులను నివారించుకోవడం మన చేతుల్లోనే ఉంటుంది. ఏదో ఒక వంకతో వ్యాయామాన్ని వాయిదా వేయడాన్ని మానుకోవాలి. నోటి రుచిని అదుపులో పెట్టుకోవాలి. మన ఆరోగ్యం మనచేతుల్లోనే ఉందని గట్టిగా విశ్వసించినప్పుడు ఇదంతా పెద్ద కష్టమేమీ కాదు. నిత్యం కనీసం 40 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి. ఆహారంలో కొవ్వుపదార్థాలను, చక్కెర వాడకాన్ని తగ్గించాలి. నూనెల వినియోగాన్ని నియంత్రించాలి. వేపుళ్లు శరీరానికి హానికరం. బరువు పెరుగుతున్నామని గుర్తించగానే నియంత్రణపై కఠినంగా దృష్టిపెట్టాలి. మద్యపానం, ధూమపానం వంటి దురలవాట్లను దూరం చేసుకోవాలి. వృత్తిపర మానసిక ఒత్తిళ్లను తగ్గించుకునే మార్గాలు అన్వేషించాలి. యోగా, ధ్యానం వంటి వాటితో కొంతమేరకు ఉపశమనాన్ని పొందొచ్చు.

–డాక్టర్ మనోహర్, విశ్రాంత జనరల్ మెడిసిన్ విభాగాధిపతి, ఉస్మానియా వైద్య కళాశాల

అప్రమత్తతే శ్రీరామరక్ష



సిఫిలిస్ ఒక సుఖవ్యాధి. లైంగిక కలయిక ద్వారా వ్యాపిస్తుంది. తొలిదశలో జననావయవంపై పుండుగా ఏర్పడుతుంది. వైద్యుని పర్యవేక్షణలో 10-15 రోజుల పాటు చికిత్స అందిస్తే పూర్తిగా నయమవుతుంది. అవగాహన కొరవడి, నకిలీ వైద్యుల వద్దకెళ్లి ఈ వ్యాధిని కొందరు నిర్లక్ష్యం చేస్తుంటారు. అందువల్ల ఇది తగ్గినట్లే తగ్గి మలిదశలో మళ్లీ విజృంభిస్తుంది. శరీరంలో గుండె, మెదడు తదితర ఇతర అవయవాలపైనా దుష్ప్రభావం చూపుతుంది.

–డాక్టర్ పుట్టా శ్రీనివాస్, విశ్రాంత వైద్యవిద్య సంచాలకులు

గ్రహం అనుగ్రహం

24-8-2017 గురువారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం వర్ష రుతువు; భాద్రపద మాసం; శుక్ల పక్షం
తదియ: రా. 9-30 తదుపరి చవితి
ఉత్తర నక్షత్రం: సా. 4-01 తదుపరి హస్త
అమృతఘడియలు: ఉ. 8-46 నుంచి 10-23 వరకు
వర్జ్యం: రా. 12-37 నుంచి 2-16 వరకు
దుర్ముహూర్తం: ఉ. 9-58 నుంచి 10-48 వరకు తిరిగి మ. 2-58 నుంచి 3-48 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ. 5-48; సూర్యాస్తమయం: సా. 6-17
శ్రీవరాహ జయంతి

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	22.1	31.2
మహబూబ్‌నగర్	23.0	33.0
ఖమ్మం	23.0	35.0
హైదరాబాద్	23.8	32.7
నిజామాబాద్	24.0	30.0
కరీంనగర్	24.0	34.0
రామగుండం	25.6	31.8
సూర్యాపేట	28.0	34.0

శ్రుతిమించుతున్న సీనియర్లు

- వైద్యకళాశాలల్లో నూతన విద్యార్థులపై జులుం
- ముమ్ముందు తమతోనే అవసరముంటుందంటూ బెదిరింపులు
- కొద్దిరోజులు తప్పదంటూ స్వయానా ఆచార్యులే వంత
- బెంబేలెత్తుతున్న జూనియర్లు

ఈనాడు – హైదరాబాద్

"నీ పేరేంటి? ఎక్కడ్నించి వచ్చావ్? మాటకు ముందు తప్పనిసరిగా సర్ అనే పిలవాలి. క్యాంటీన్, లైబ్రరీల్లో కనిపించొద్దు. గుంపులుగా తిరగొద్దు. ఏంటీ డ్రెస్? మేం ఆపమనే వరకూ గుంజీలు తీయి. ఎవరికైనా ఫిర్యాదు చేశారో.. అంతే.. ముమ్ముందు మాతోనే మీకు పని.. జాగ్రత్త"... ఇదీ ప్రఖ్యాత గాంధీ వైద్యకళాశాలలో జూనియర్లపై సీనియర్ వైద్య విద్యార్థుల జులుం. తెలంగాణలోని వైద్య కళాశాలల్లో ర్యాగింగ్ యథేచ్ఛగా కొనసాగుతోందనడానికి ఇదో మచ్చుతునక మాత్రమే. కొత్తగా వైద్యకళాశాలల్లోకి అడుగుపెట్టిన విద్యార్థులతో సరదా పరిచయాల పేరిట కొందరు సీనియర్లు వికృత పోకడలకు పోతున్నారు.

గత వారం తరగతులు ప్రారంభమైన నేపథ్యంలో వైద్య కళాశాలల్లోకి అడుగుపెట్టిన తొలి ఏడాది విద్యార్థులకు సీనియర్ల నుంచి చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా అమ్మాయిలను లక్ష్యంగా చేసుకొని కొందరు సీనియర్లు చెలరేగిపోతున్నట్లు తెలుస్తోంది. అమ్మాయిలు ధరించిన దుస్తులపైనా వ్యాఖ్యలు చేసే నీచానికి కొందరు సీనియర్ వైద్యవిద్యార్థులు దిగజారడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలానా తీరు దుస్తులే వేసుకురావాలని ఆంక్షలు విధిస్తున్నారని విద్యార్థినులు వాపోతున్నారు. ఆసుపత్రిలో క్షేత్రస్థాయి అనుభవ శిక్షణకు వెళ్లినప్పుడు అక్కడ సీనియర్ల పాత్రే కీలకమవుతుందనీ.. ఇప్పుడు ఎదిరిస్తే భవిష్యత్తులో తమ నుంచి ఎలాంటి సహకారమూ ఉండదని కొందరు సీనియర్ వైద్యవిద్యార్థులు బెదిరింపులకు దిగుతున్నట్లు తెలుస్తోంది. సీనియర్ల శ్రుతిమించిన చేష్టలకు భయపడి కొందరు విద్యార్థినులు కళాశాలకు వెళ్లడానికే వణికిపోతున్నారు.

వసతిగృహాల్లో వికృతరూపాలు

వైద్యకళాశాలల్లోని వసతిగృహాల్లో ఉంటున్న వైద్యవిద్యార్థులపై సీనియర్ల నుంచి మరింత వికృతరూపాల్లో ర్యాగింగ్ ఎదురవుతున్నట్లు బాధితులు చెబుతున్నారు. రాత్రుళ్లు తమ గదికి పిలిపించుకొని అసభ్యంగా మాట్లాడడమే కాకుండా గుంజీలు తీయించడం, గోడ కుర్చీలు వేయించడం, మద్యం సీసాలు కొనుక్కురమ్మని పురమాయించడం.. వంటివి చేస్తున్నారని జూనియర్లు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గత నాలుగైదు రోజుల్లోనే ఇలాంటి ఘటనలు వరుసగా జరుగుతుండడంతో గాంధీ, ఉస్మానియాల్లో కొత్తగా చేరిన విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని కొందరు ఆచార్యుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. అయితే ఆ ఆచార్యుల్లో కొందరు ర్యాగింగ్‌కు మద్దతుగా మాట్లాడి.. కొద్దిరోజులు సర్దుకుపోతే ఆ తర్వాత అంతా సద్దుమణుగుతుందని హితవు పలకడంతో తల్లిదండ్రులు హతాశులయ్యారు. ఇటీవల కళాశాలలో విద్యార్థులతో నిర్వహించిన శిక్షణ తరగతుల అనంతరం.. ఇదే విషయాన్ని బాహాటంగానే కొందరు ఆచార్యులు చెప్పడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ర్యాగింగ్ వికృత చేష్టలు ప్రభుత్వ కళాశాలలైన గాంధీ, ఉస్మానియా, కాకతీయలతోపాటు పలు ప్రైవేటు వైద్యకళాశాలల్లోనూ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. తరగతులు ప్రారంభమైన తొలి రోజుల్లోనే దీనికి అడ్డుకట్ట వేయకపోతే.. ముమ్ముందు ఈ విష సంస్కృతి మరింతగా జడలు విప్పే ప్రమాదముంది.

ఎంసీఐకి నేరుగా ఫిర్యాదు చేయొచ్చు

ర్యాగింగ్ నిరోధానికి కేంద్ర స్థాయిలో సహాయ కార్యదర్శి బీడీ జైన్‌ను ర్యాగింగ్ నిరోధకానికి నోడల్ అధికారిగా భారతీయ వైద్య మండలి(ఎంసీఐ) నియమించింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యకళాశాలల్లోనూ ప్రత్యేకంగా ర్యాగింగ్ నిరోధక బృందాన్ని ఏర్పాటుచేయాలని ఆదేశాలు జారీచేసింది. ఆయా కళాశాల బృందాలు నేరుగా కేంద్ర నోడల్ అధికారితో సంప్రదింపులు జరపొచ్చు. విద్యార్థులూ ర్యాగింగ్‌పై తమ ఆందోళనను, సమస్యలను anti-ragging-mci@nic.in కు మెయిల్ చేయొచ్చు. అయితే, అధికశాతం వైద్యకళాశాలల్లో ఇప్పటి వరకూ ర్యాగింగ్ నిరోధక బృందాన్ని ఏర్పాటుచేయలేదు.

ర్యాగింగ్ శిక్షార్హం..

- ఇంజినీరింగ్ కళాశాలల్లో 31 శాతం, వైద్య కళాశాలల్లో 17 శాతం, ఇతర కళాశాలలు, సంస్థల్లో 52 శాతం ర్యాగింగ్ జరుగుతున్నట్లు ఓ అంచనా.
- ర్యాగింగ్‌కు పాల్పడిన వారితోపాటు అందుకు ప్రోత్సహించిన వారూ శిక్షార్హులే.
- ఏడ్పించడం, హేళన చేయడం, ఇతర ఇబ్బందులకు గురిచేయడం లాంటివి చేస్తే ఆరు నెలల జైలుశిక్ష ఉంటుంది.
- శారీరకంగా వేధించినా, బలప్రయోగం చేసినా ఏడాది జైలు.
- అడ్డుకున్నా, గాయపర్చినా రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తారు.
- అపహరణ, అత్యాచారం, తీవ్రంగా గాయపరిస్తే ఐదేళ్ల జైలుశిక్షతో పాటు జరిమానా.
- ర్యాగింగ్ వేధింపులకు మృతి చెందినా, ఆత్మహత్యకు కారణమైనా జీవితకాలం జైలుశిక్ష పడే అవకాశం ఉంటుంది.



నాగావళి నదిలో పడిన పిడుగు

అమ్మో.. అగ్గిపిడుగు

వంగర, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా వంగర మండలంలోని రుషింగి-కిమ్మి గ్రామాల సమీపంలోని నాగావళి నదిలో అగ్గిపిడుగు పడింది. బుధవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులు మొదలయ్యాయి. అదే సమయంలో.. స్థానిక యువకుడు ఒకరు తమ పొలంలో నిలబడి తీరం కోతకు గురైన చిత్రాలు తీస్తుండగా ఒక్కసారిగా పిడుగుపడింది. ఆ సమయంలో చిక్కిన చిత్రమిది. మరోవైపు.. పిడుగుపాటుకు రెండు గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళన చెందారు.

రేపటి నుంచి భారీ వర్షాలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సంచాలకుడు వై.కె.రెడ్డి చెప్పారు. కోస్తా జిల్లాలపై ఉపరితల ఆవర్తనం ఉన్నందున దాని ప్రభావంతో వర్షాలు తెలంగాణలో సైతం పెరుగుతాయని తెలిపారు. గత రెండు రోజులుగా అంతంతమాత్రంగానే కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకు అత్యధికంగా మిర్యాలగూడ, కొణిజెర్ల, రామన్నపేటల్లో 4 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది.

బేషరతుగా క్షమాపణ చెప్పండి

- కాంగ్రెస్ నేత దాసోజు శ్రవణ్‌కు ఐసీఎఫ్‌ఏ లేఖ

ఈనాడు, హైదరాబాద్ : సీఎం కేసీఆర్ ప్రతిభను గుర్తించి నిబంధనల ప్రకారమే ఉత్తమ పురస్కారానికి ఎంపిక చేశామని, స్థానిక రాజకీయాలతో దురుద్దేశపూరితంగా తమ సంస్థపై దుష్ప్రచారం చేసినందుకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్‌కు బుధవారం రాసిన లేఖలో 'భారతీయ ఆహార, వ్యవసాయ మండలి'(ఐసీఎఫ్‌ఏ) కోరింది. వ్యవసాయాభివృద్ధికి కృషి చేసేవారి సేవలను గుర్తించి ఈ సంస్థ ఏటా జాతీయ స్థాయిలో 'ఉత్తమ వ్యవసాయ లీడర్‌షిప్' పేరుతో పురస్కారాన్ని ప్రకటిస్తుంది. ఇటీవల సీఎం కేసీఆర్‌కు ఈ పురస్కారాన్ని ప్రకటించగా, ఈ సంస్థ స్వప్రయోజనాల కోసం, దురుద్దేశంలో ఇస్తోందని శ్రవణ్ ఆరోపించారు. ఆయన చేసిన ఆరోపణలన్నింటికీ వివరంగా సమాధానాలిచ్చింది. ఫిక్కీ, సీఐఐ మాదిరిగా తమ సంస్థ సెక్షన్ 8 ప్రకారం రిజిస్టర్ అయిందని ఐసీఎఫ్‌ఏ కార్యనిర్వాహక సంచాలకుడు(ఈడీ) ఎన్.ఎస్.రణ్‌దవా లేఖలో వివరించారు. ఉత్తమ పురస్కారాల పంపిణీ 2008 నుంచి ప్రారంభించామని, ఆ ఏడాది అప్పటి ఉమ్మడి ఏపీ సీఎం వై.ఎస్.రాజశేఖరరెడ్డికి ఇచ్చినట్లు గుర్తుచేశారు. దేశంలో ఇలా ఇప్పటికే పలు రాష్ట్రాలకు, ఉన్నతస్థాయి సంస్థలకు ఇచ్చామని పేర్కొన్నారు. పురస్కారాల కమిటీకి 2008, 2009లో అప్పటి హరియాణా గవర్నర్, సీనియర్ కాంగ్రెస్ నేత డాక్టర్ ఎ.ఆర్.కిద్వాయ్ ఛైర్మన్‌గా ఉన్నారని తెలిపారు. ఆయన తరవాత ఎం.ఎస్.స్వామినాథన్, మరో 24 మంది ప్రముఖులతో కమిటీ ఏర్పడిందన్నారు. విత్తన కంపెనీల ప్రయోజనాల కోసమే కేసీఆర్‌కు పురస్కారమిస్తున్నట్లు చేసిన ఆరోపణలో వాస్తవం లేదని, ఈ సంస్థకు విత్తన కంపెనీ ఒక్కటీ లేదని, పాలకమండలిలో ఒక్కరైనా కంపెనీ ప్రతినిధి లేరని ఆయన వివరించారు. ప్రతి ఆరోపణకు వివరంగా సమాధానమిచ్చిన ఆయన బేషరతుగా క్షమాపణ చెప్పాలని కోరారు. లేఖ ప్రతిని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీకి సైతం పంపారు.



బుధవారం మెప్మా ఉద్యోగులతో సమావేశమైన మంత్రి కేటీఆర్

పట్టణాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం

- పురపాలక శాఖ మంత్రి కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని పట్టణాల అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచుతామని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లోని రిసోర్స్‌పర్సన్ల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటామన్నారు. బుధవారమిక్కడ మంత్రి మెప్మా ఉద్యోగులు, రిసోర్స్‌పర్సన్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారి సమస్యలపై చర్చించారు. మహిళల తోడ్పాటుతో ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. పట్టణాల్లోని పేదల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పురపాలక సంస్థల్లో తడి -పొడి చెత్తలపై ప్రజలను చైతన్యం చేయడంలో మెప్మా కీలక పాత్ర పోషించాలని మంత్రి సూచించారు. పట్టణాల్లో టీకాలు వేయించడం, పౌష్టికాహార పథకాల అమలుపై దృష్టిపెట్టాలని.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలపై మహిళలకు అవగాహన పెంచాలని కోరారు. త్వరలోనే మెప్మా ఉద్యోగులతో ముఖ్యమంత్రి సమావేశమవుతారని కేటీఆర్ తెలిపారు. తమకు తక్కువ వేతనాలు ఉన్నాయని.. పెంచాలని రిసోర్స్‌పర్సన్లు కోరారు. వేతనాలపై సీఎం సానుకూల నిర్ణయం తీసుకుంటారని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పురపాలక శాఖ కార్యదర్శి నవీన్ మిత్తల్, డైరెక్టర్ టి.కె.శ్రీదేవి ఇతర అధికారులు పాల్గొన్నారు.

'గాంధీ'లో గవర్నర్‌కు వైద్య పరీక్షలు

- కుడికాలు మడమపై ఆనెను పరీక్షించిన వైద్యులు

గాంధీ ఆసుపత్రి,(హైదరాబాద్) న్యూస్‌టుడే: గాంధీ ఆసుపత్రిలో గవర్నర్ నరసింహన్ బుధవారం వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఆయన కుడికాలి మడమపై చిన్న ఆనె(కార్న్) వల్ల నడుస్తున్నప్పుడు నొప్పి వస్తుండటంతో పరీక్షలు చేయించుకొని, వైద్యుల సలహాలు తీసుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆసుపత్రికి వచ్చిన గవర్నర్‌ను సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్ తదితరులు ఐదో అంతస్తులోని చర్మవ్యాధుల విభాగానికి తీసుకువెళ్లారు. గవర్నర్ కాలును పరీక్షించిన వైద్యులు ప్లాస్టిక్ సర్జరీ వైద్యుల సలహా తీసుకోవాలని సూచించారు. సంబంధిత విభాగాధిపతి సుబోధ్‌కుమార్ శస్త్రచికిత్స గదిలో ఉండడంతో పిలవడానికి వెళ్తున్న సిబ్బందిని గవర్నర్ వారించి వచ్చేవరకు తాను వేచి ఉంటానని చెప్పారు. పది నిమిషాల అనంతరం సుబోధ్‌కుమార్‌తోపాటు సాధారణ సర్జరీ విభాగాధిపతి ఎన్‌వీఎన్ రెడ్డి గవర్నర్ కాలును పరీక్షించి చిన్నపాటి శస్త్రచికిత్స అవసరముంటుందని తెలిపారు. కనీసం 2 వారాలపాటు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుందని సూచించారు. ప్రస్తుతం పని ఒత్తిడి వల్ల రెండు వారాల విశ్రాంతి తీసుకోవడం సాధ్యపడదని, వీలుచూసుకుని శస్త్రచికిత్స చేయించుకుంటానని గవర్నర్ వారికి వివరించారు. ఈ సందర్భంగా నరసింహన్ ఆసుపత్రి ఆవరణను పరిశీలించారు. తిరిగి వెళుతున్నప్పుడు పారిశుద్ధ్య నిర్వహణ బాగుందని ప్రశంసించారు. ఇంకా మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రికి ఎమ్మారై స్కానింగ్ యంత్రం అవసరముందా అంటూ అధికారులను ఆరా తీశారు. ప్రస్తుతం ఒకటి ఉందని, మరొకటి అందుబాటులోకి వస్తే రోగులకు నిరీక్షణ తప్పుతుందని అధికారులు వివరించారు. సిబ్బంది కొరత ఉందని తెలిపారు. తాను ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని గవర్నర్ చెప్పారు. గాంధీ ఆసుపత్రికి పేదలే కాకుండా అందరూ వచ్చి వైద్యం చేయించుకోవాలని అభిప్రాయపడ్డారు. నరసింహన్ ఆసుపత్రిలో అరగంటపాటు ఉన్నారు.



గాంధీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్న అనంతరం వెలుపలకు వస్తున్న గవర్నర్ నరసింహన్

17న ప్రధాని గుజరాత్ పర్యటన

నర్మద డ్యామ్ కొత్త గేట్లను ప్రారంభించనున్న మోదీ

అహ్మదాబాద్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెల 17న గుజరాత్‌లో పర్యటించనున్నారు. ఆ సందర్భంగా నర్మద డ్యామ్‌కు కొత్తగా నిర్మించిన గేట్లను ఆయన ప్రారంభిస్తారు. అనంతరం వడోదర జిల్లాలోని దభాయ్‌లో నిర్వహించే బహిరంగసభలో ప్రసంగిస్తారు. కొత్త గేట్ల వల్ల నర్మద డ్యామ్ ఎత్తు 138.68 మీటర్లకు పెరిగింది. సెప్టెంబరు 17 ప్రధాని మోదీ పుట్టిన రోజు కావటం గమనార్హం.

సరిహద్దుల్లో శాంతికి యంత్రాంగం

ఫ్లాగ్ మీటింగ్‌లో భారత్, పాక్ సైనిక కమాండర్ల అంగీకారం

జమ్మూ: తరచూ చొరబాట్లు, కాల్పుల విరమణ ఒప్పందాల ఉల్లంఘనలు వంటి ఘటనలతో ఉద్రిక్తతలు నెలకొంటున్న భారత్, పాక్ సరిహద్దుల్లో శాంతియుత వాతావరణాన్ని కొనసాగించటానికి అవసరమైన ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలని రెండు దేశాలకు చెందిన సైనికాధికారులు ఓ అంగీకారానికి వచ్చారు. ఇరు దేశాల బెటాలియన్ కమాండర్ల స్థాయి సైనికాధికారుల ఫ్లాగ్ మీటింగ్ బుధవారం ఉదయం పూంచ్ సెక్టార్‌లోని చకన్ దా బాగ్‌లో జరిగింది. దాదాపు 50 నిమిషాల పాటు కొనసాగిన భేటీలో.. వాస్తవాధీన రేఖ (ఎల్ఓసీ) వెంట రెండు దేశాల స్థానిక కమాండర్ల మధ్య పరస్పర సమాచార మార్పిడికి ఎల్లవేళలా అవకాశం ఉండాలనే ప్రతిపాదనపై ఏకాభిప్రాయం వ్యక్తమయ్యింది. వాస్తవాధీన రేఖ వెంట రెండు దేశాల సైనికులు సంయమనం పాటించాలని అనుకున్నారు. చకన్ దా బాగ్ ద్వారా రాకపోకలు, వర్తక వ్యాపారాల పునరుద్ధరణపైనా చర్చించుకున్నారని భారత రక్షణ మంత్రిత్వ శాఖ అధికారులు వెల్లడించారు. సరిహద్దుల ఆవల నుంచి చొరబాట్లకు ఉగ్రవాదులను ప్రోత్సాహించటం, పదే పదే కాల్పుల ఉల్లంఘనలకు పాల్పడుతూ వారికి సహకరిస్తున్న పాకిస్థాన్ సైనికుల చర్యలపై గట్టిగా అభ్యంతరం తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది తొలి ఏడు నెలల కాలంలోనే పాక్ సైన్యం 285 సార్లు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. భారత్‌కు చెందిన 11 మంది ఈ కాల్పుల్లో మృతి చెందారు. వీరిలో 9 మంది సైనికులు.

బీజింగ్ నుంచి అయిదు లక్షల జనాభా తరలింపు!

బీజింగ్: దాదాపు 3 నుంచి 5 లక్షల మంది ప్రజలను బీజింగ్ నుంచి దానికి సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న షియాంగాన్ నగరానికి తరలించాలని చైనా యోచిస్తోంది. ఇప్పటికే బీజింగ్ జనాభా 2 కోట్ల పది లక్షలకు చేరింది. బీజింగ్‌పై జనాభా పెరుగుదల భారం పడకుండా ఉండేందుకు చైనా ఈ నిర్ణయం తీసుకుంది. బీజింగ్‌కు ఆనుకొని నైరుతి దిశలో నిర్మిస్తున్న కొత్త నగర ప్రాంతాన్ని రాజధానేతర కార్యకలాపాలకు వినియోగించనున్నట్లు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తెలిపారు.



ఉత్తమ పనితీరు కనబర్చిన వివిధ ఆర్టీసీ డిపోలకు చెందిన మెకానిక్‌లు, సిబ్బందితో సంస్థ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ, ఎండీ రమణరావు తదితరులు

సంస్థను లాభాల బాట పట్టించాలి

- టీఎస్‌ఆర్టీసీ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: కార్మికులు, సిబ్బంది అంకిత భావంతో పనిచేసి టీఎస్‌ఆర్టీసీని నష్టాల్లోంచి లాభాల బాట పట్టించాలని ఆ సంస్థ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో టీఎస్‌ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అధిక మైలేజీ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టీసీ గొప్ప సంస్థగా ప్రగతి సాధించేందుకు అహర్నిషలు కృషి చేస్తున్నామన్నారు. 2011 డిసెంబరు నుంచి 2017 ఫిబ్రవరి వరకు 808 బస్సులు ఒక్కోటి 8 లక్షల కిలోమీటర్లు నడుస్తాయని అంచనా వేస్తే 12 లక్షల కిలోమీటర్ల వరకు తిరగడం శుభపరిణామమన్నారు. ఈ ఘనత అశోక్ లేలాండ్‌దేనన్నారు. ఆర్టీసీ బస్సులు తిరగని 1,400 గ్రామాలకు బస్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సంస్థ ఎండీ జీవీ రమణారావు మాట్లాడుతూ.. గతేడాది నుంచి అదనపు ఖర్చులు తగ్గించి సంస్థకు రూ.130 కోట్ల ఆదాయాన్ని పెంచినట్లు తెలిపారు. వివిధ డిపోలకు చెందిన 1616 మంది డ్రైవర్లు, మెకానిక్‌లను అవార్డులకు ఎంపిక చేసి, అందులో 684 మందికి పురస్కారాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అశోక్ లేలాండ్ సౌత్ ఇండియా అధ్యక్షుడు జలజ్‌గుప్తా, జోనల్, రీజనల్ మేనేజరు కె.మోహన్, దివాకర్‌రెడ్డి, అధికారులు రవీందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్కసుతోనే కాంగ్రెస్ అడ్డుపడుతోంది

తెరాస ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

ఈనాడు, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అక్కసుతోనే తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డుపడుతోందని తెరాస ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. బుధవారం తెరాస ఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎంకు వస్తున్న ఆదరణను చూసి కాంగ్రెస్ నేతలు తట్టుకోలేకపోతున్నారన్నారు. పదవులకు రాజీనామా చేసి మళ్లీ పోటీ చేసే సత్తా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి ఉందా అని ప్రశ్నించారు. విపక్షాలు అభివృద్ధిని అడ్డుకునే కుట్రలు మాని భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

ప్రభుత్వంపై దుష్ప్రచారం: ఎమ్మెల్సీ కర్నె

తెలంగాణ కాంగ్రెస్ నేతలు, ఐకాస ఛైర్మన్ కోదండరాం రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని, రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బ తీస్తున్నారని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ విమర్శించారు. తెరాస ఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కోదండరాం అబద్ధాల చిట్టాతో దిల్లీలో సంచరిస్తున్నారన్నారు. ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి మేరకే తెలంగాణ ప్రభుత్వం అప్పులు తెస్తుందనే అవగాహన ఆయనకు లేకపోవడం శోచనీయమన్నారు.

కచ్ జిల్లాలో కంపించిన భూమి

భుజ్: గుజరాత్‌లోని కచ్ జిల్లాలో భూమి స్వల్పంగా కంపించింది. బుధవారం మధ్యాహ్నం 2గంటలసమయంలో సంభవించిన భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.1గా నమోదైంది. ఒక్కసారిగా భయభ్రాంతులకు గురైన స్థానికులు ఇళ్ల నుంచి బయటకు పరుగులుపెట్టారు. ఘటనలో ఎలాంటి ప్రాణహానీ జరగలేదు.

దీన్ దయాళ్ వైద్య కళాశాల యజమాని ఆస్తుల జప్తు

చెన్నై: తిరువళ్లూర్‌లోని దీన్‌దయాళ్ మెడికల్, ఎడ్యుకేషనల్ ట్రస్టు అధిపతి టి.డి.నాయుడుకు చెందిన రూ.48 కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టరేట్(ఈడీ) బుధవారం జప్తు చేసింది. తన సంస్థ ఆధీనంలోని వైద్య కళాశాలలో సీట్లు ఇప్పిస్తానని విద్యార్థులను మోసగించడం, అక్రమ నగదు చెలామణి, నకిలీ ధ్రువపత్రాలతో బ్యాంకులను మోసగించడం వంటి కేసులు ఆయనపై నమోదయ్యాయి. తిరుత్తణిలోని వ్యవసాయ భూములు, శ్రీపెరుంబుదూర్‌లోని ఇళ్ల స్థలాలు, గువ్వంచేరిలోని స్థలాలను జప్తు చేసింది. అక్రమ నగదు చెలామణి చట్టం కింద 2015లో ఆయనను అరెస్టు చేసింది. బ్యాంకులను రూ.136 కోట్ల మేర మోసగించడం, వైద్య కళాశాల సీట్లు ఇప్పిస్తానని విద్యార్థుల నుంచి రూ.16 కోట్లను అక్రమంగా వసూలు చేసిన వ్యవహారంలో ఈ ఆస్తులు జప్తు చేసినట్టు ఈడీ ప్రకటించింది. 'భారత వైద్య మండలి (ఎంసీఐ) అనుమతి లేకుండానే తిరువళ్లూర్‌లోని దీన్‌దయాళ్ వైద్య కళాశాలలో సీట్లు ఇప్పిస్తానని విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి రూ.కోట్లలో సొమ్ము వసూలు చేశారు. సీట్లు ఇవ్వకపోగా, ఇదేమని అడిగినందుకు బెదిరించార'ని ఈడీ పేర్కొంది.

ఒక క్లిక్‌తో పట్టణ ఆస్తుల సమగ్ర సమాచారం

- 12.5 లక్షల ఆస్తులు జియో ట్యాగింగ్
- లైసెన్సులు, అనుమతులు సులభతరం
- రిజిస్ట్రేషన్‌లో విధిగా అసెస్‌మెంట్ సంఖ్య
- సిటిజన్ బడ్డీ యాప్ వినియోగించుకోవాలి
- పురపాలకశాఖ డైరెక్టర్ టి.కె.శ్రీదేవి వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని పట్టణ స్థానిక సంస్థల్లో ఆస్తులు వివరాలను పూర్తిగా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు పురపాలకశాఖ డైరెక్టర్ టి.కె.శ్రీదేవి తెలిపారు. నగరపాలక సంస్థలు, పురపాలకసంఘాల ల్యాండ్ రిజిస్ట్రీలో ఆస్తులకు సంబంధించిన సమగ్ర సమాచారం ఉందని చెప్పారు. రాష్ట్రంలో 72 పట్టణ స్థానిక సంస్థల్లోని ఆస్తులకు సంబంధించినవారి పేరు, వివరాలు, వివాదాలు ఏమైనా ఉన్నాయా? లేక నిషేధిత జాబితాలో ఉన్నాయా? ఆస్తి ఎలావచ్చింది? పన్ను ఎంత సహా అనేక విషయాల సమాచారం ఇందులో ఉంటుందన్నారు. ఆస్తిపన్ను సంఖ్య లేదా ఇంటి నంబరు నమోదు చేస్తే వివరాలు వస్తాయన్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ మినహాయించి 12.5 లక్షల ఆస్తుల జియో ట్యాకింగ్ కూడా పూర్తయిందని, వాటికి సంబంధించి ఫొటోలు కూడా ఉంటాయన్నారు. ఇప్పటి వరకూ భువన్ పోర్టల్‌లో 10 లక్షలు అప్‌లోడ్ అయ్యాయని త్వరలో మిగిలినవి కూడా అప్‌లోడ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. పారదర్శకత, వాస్తవపరిస్థితి స్పష్టంగా తెలియడంతో వివాదాలకు తావుండదన్నారు.

అనుమతులు ఆన్‌లైన్‌లోనే..: పురపాలక శాఖ ద్వారా తీసుకునే వివిధ అనుమతులు, లైసెన్సుల విధానాన్ని సరళీకృతం చేశామని శ్రీదేవి పేర్కొన్నారు. వ్యాపార అనుమతులకు గతంలో 14 అనుబంధ పత్రాలను జత చేయాల్సి ఉండగా ప్రస్తుతం రెండు జత చేస్తే సరిపోతుందన్నారు. పౌర సేవా కేంద్రాలు, మీసేవ, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం.. లేదంటే స్మార్ట్‌ఫోన్ వినియోగించుకుని సేవలు పొందవచ్చన్నారు. స్మార్ట్‌ఫోన్‌లలో సేవలకు 'సిటిజన్ బడ్డీ' అనే యాప్ తెచ్చామన్నారు. ప్రస్తుతం ఈ యాప్‌ను 18 వేల మంది డౌన్‌లోడ్ చేసుకోగా 10 వేలమంది వినియోగిస్తున్నారని చెప్పారు. వివిధ శాఖల ద్వారా రావల్సిన అనుమతులకు ఒకే దరఖాస్తు, ఒకే అఫిడవిట్ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. భవననిర్మాణ అనుమతులు, ఆస్తిపన్ను చెల్లింపులు పూర్తిగా ఆన్‌లైన్ చేశామన్నారు.

అందుకే మ్యూటేషన్లలో జాప్యం..: పట్టణ స్థానిక సంస్థల్లో మ్యూటేషన్లలో జాప్యం గురించి మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ సమయంలో అసెస్‌మెంట్ సంఖ్య కాకుండా డోర్ నంబరు వేయడం వల్లే జాప్యం జరుగుతోందని పురపాలకశాఖ డైరెక్టర్ శ్రీదేవి అన్నారు. విధిగా అసెస్‌మెంట్ సంఖ్య వేసేలా రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ప్రయత్నిస్తున్నామన్నారు. అసెస్‌మెంట్ సంఖ్య లేకున్నా అప్పటికప్పుడు రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనే అసెస్‌మెంట్ సంఖ్య తీసుకునేలా కూడా అనుసంధానం చేశామన్నారు.

ఈనాడు

మాదక శక్తుల్ని మట్టుపెట్టాలి!

మాదక మాఫియా కార్యకలాపాలకు అనధికారిక కేంద్రస్థలిగా చలామణీ అవుతున్న భాగ్యనగరానికి ఆ అప్రతిష్ఠను తుడిచిపెట్టే ధ్యేయంతో నమోదైన అపూర్వ చొరవిది. భిన్న వ్యవస్థలు, యంత్రాంగాలు మాదక ఉగ్రవాదంపై లక్షిత దాడికి పూరించిన సమరశంఖం- సరికొత్త ఒరవడికి నాంది పలికింది! పంజాబ్, గోవాలను తలదన్నేలా ప్రపంచ డ్రగ్ మాఫియా పటంలో హైదరాబాద్ 'ప్రత్యేక గుర్తింపు' పొందడానికి ఏళ్ల తరబడి నిఘా వైఫల్యాలు శాయశక్తులా పుణ్యం కట్టుకున్నాయి. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి హైదరాబాదులో కేంద్ర నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో పేరుకొక కార్యాలయం నెలకొల్పినా, అది అలంకారప్రాయంగా మిగలడం- విద్రోహ శక్తులకు కోరలు తొడిగింది. మాదకద్రవ్యాల నియంత్రణలో ముఖ్యపాత్ర పోషించాల్సిన ఆబ్కారీ శాఖ- మద్యం విక్రయాలతో సర్కారీ రాబడి పెంపొందించడంలో తలమునకలై, అడపా దడపా గంజాయి రవాణాదారులపై దాడులతోనే సరిపుచ్చడం- ఆనవాయితీగా స్థిరపడింది. డీఆర్ఐ (డైరెక్టొరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటెలిజెన్స్), కస్టమ్స్, పోలీసు విభాగాలూ మాదక ఉత్పాతంపై ఎన్నడూ సరిగ్గా దృష్టి కేంద్రీకరించిందే లేదు. అటువంటిదిప్పుడు వాటితోపాటు సీఐడీ, సీఐఎస్ఎఫ్, ఇమిగ్రేషన్, రైల్వే రక్షకదళం తదితరాలూ జట్టుకట్టి మత్తు మహమ్మారిపై ఉమ్మడి పోరుకు దీక్ష పూనుతున్నాయి! ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే కాదు- మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడు లాంటిచోట్లా డ్రగ్స్ వినియోగం చిలవలు పలవలు వేసుకుపోతున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అందువల్ల అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే తరహా సమష్టి పోరాటస్ఫూర్తి ప్రదర్శితమైతేనే- మాదక రక్కసి కోరలు పెరకడానికి మార్గం సుగమమవుతుంది!

ఇటీవల ఆబ్కారీ అధికారుల దాడిలో కెల్విన్ ముఠా పట్టుబడిన దరిమిలా, విచారణ ప్రక్రియలో తీగ లాగితే ఎన్నో డొంకలు కదిలాయి. సినీ ప్రముఖుల వాంగ్మూలాల ఆధారంగా జీషాన్, కమింగా ప్రభృతుల నామధేయాలూ తెరపైకి వచ్చాయి. డార్క్‌నెట్ ద్వారా భారీ వ్యవస్థ ఏర్పరచుకున్న అంతర్జాతీయ ముఠాలకు కెల్విన్ తదితరులు పెద్ద ఖాతాదారులని బట్టబయలైంది. గోవా, ముంబై నగరాలనుంచి చక్రం తిప్పుతున్న నలభైమంది దాకా బడా స్మగ్లర్లకు భాగ్యనగరంతో లావాదేవీల బంధమూ రచ్చకెక్కింది. ఆఫ్రికా, లాటిన్ అమెరికాలనుంచి కొకైన్, హెరాయిన్ ఇక్కడికి నిరంతరాయంగా పెద్దయెత్తున దిగుమతి అవుతున్నాయన్న కథనాలు నిశ్చేష్టపరచాయి. డార్క్‌నెట్ లేదా డీప్‌వెబ్‌లో ఫలానా రకం మాదకద్రవ్యం ఇంత పరిమాణంలో కావాలని సంప్రతించిన గంట వ్యవధిలోనే, ఇచ్చిన చిరునామాకు కొరియర్ ద్వారా సరకు చేరిపోతోంది. మరోవైపున- విశాఖ, ముంబై, చెన్నై, కోల్‌కతా నౌకాశ్రయాలనుంచి పరిసర నగరాలకు మాదక సరఫరాలు జోరెత్తుతున్న వైనాన్ని హైదరాబాద్ మేధోమథనం ధ్రువీకరించింది. పట్టపగ్గాలు లేకుండా విజృంభిస్తున్న మాదక మాఫియా వ్యాపారం ఒక్క పంజాబులోనే రూ.60 వేలకోట్లకు మించుతోంది. 'గ్లోబల్ ఫైనాన్షియల్ ఇంటెగ్రిటీ' అంచనా ప్రకారం, విశ్వవ్యాప్తంగా మాదక ద్రవ్యాల వ్యాపార పరిమాణం రూ.42 లక్షలకోట్లకు పైమాటే. అంతర్జాలం ద్వారా జరిగే మాదక లావాదేవీల నియంత్రణ కష్టతరమని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో చేతులెత్తేసిన నేపథ్యంలో- పోరాట వ్యూహాల్ని సాకల్యంగా ప్రక్షాళించాల్సిందే. విద్యార్థులు మొదలు బహుళజాతి సంస్థల్లో ఉన్నతాధికారుల వరకు, సంపన్న వర్గాల వంశాంకురాల నుంచి గ్లామర్ ప్రపంచం దాకా... అంతటా కమ్మేసిన జాతీయ విపత్తు ఇది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పరంగా ఇంతకాలం నిక్షేపంగా వర్ధిల్లిన అలసత్వాన్ని ఊడ్చిపారేసి అన్ని కంతల్నీ మూసేస్తేనే ఆ మహమ్మారి విజృంభణను నిలువరించగలిగేది!

సమస్య తీవ్రతను బట్టి పరిష్కారాన్వేషణ పదును తేలాలి. చాప కింద నీరులా మత్తు మాఫియా వ్యాపిస్తూపోవడాన్ని సమర్థంగా నిలువరించాలి. పర్యటన, చదువు, వ్యాపారం, వైద్యచికిత్సల పేరిట దేశంలోకి ప్రవేశించి మాదక దందాకు తెగబడుతున్న విదేశీయుల్లో దాదాపు 80 శాతం మేర నైజీరియన్లే ఉంటున్నారు. రకరకాల వీసాలతో ఇక్కడికొచ్చి ఆపై ఆనుపానులు చిక్కకుండా పోతున్నవారి గుట్టుమట్లు రాబట్టే నిమిత్తం ఆఫ్రికన్ పర్యాటకులందరికీ విశిష్ట సంఖ్యనొకదాన్ని కేటాయించి జీపీఆర్ఎస్‌తో అనుసంధానిస్తామంటున్నారు. మత్తుమందుల పార్సిళ్లను పసిగట్టడానికి శంషాబాద్ విమానాశ్రయంలో సుశిక్షిత జాగిలాన్ని నియమిస్తామంటున్నారు. ఇటువంటి ప్రాథమిక చర్యలన్నీ ఈసరికే దేశమంతటా పట్టాలకు ఎక్కి ఉండాల్సింది! ప్రపంచంలోనే అత్యధికంగా యువత పోగుపడి ఉన్న దేశం మనది. కోట్లాది బాలబాలికలు, యువతీయువకుల భవితవ్యానికి కర్కశంగా తూట్లు పొడుస్తున్న మాదక దుష్ప్రభావాలకు అడ్డుకట్ట వేయడంలో ఇప్పటికే ఎంతో వృథా కాలహరణం జరిగింది. తరతమ భేదాలతో రాష్ట్రాలన్నింటా సామాజిక జీవనాన్ని సంక్షుభితం చేసేస్తున్న మాదక మాఫియాపై ఉక్కుపాదం మోపేలా జవసత్వాలు సమకూరుస్తూ కీలక విభాగాలన్నింటా చురుగ్గా ఖాళీల భర్తీ చేపట్టాలి. మాదక పదార్థాల వినియోగం, ఉత్పత్తి, నిల్వ, వ్యాపారం- దేన్నికైనా మరణదండన విధిస్తున్న సింగపూర్, థాయ్‌లాండ్, కాంబోడియా, వియత్నాం ప్రభృత దేశాలకు దీటుగా ఇక్కడా చట్ట నిబంధనల కూర్పు, అమలును పరిపుష్టీకరించాలి. లెక్కకు మిక్కిలి విభాగాల పనితీరును అర్థవంతంగా సమన్వయీకరించేందుకు 'అమెరికన్ డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ' తరహాలో పటిష్ఠ వ్యవస్థను అవతరింపజేయాలి. దేశంలో ఎక్కడ ఏ మూల ఉప్పందినా తక్షణం అక్కడి మాదక శక్తుల మెడలు వంచేలా సమాచార మార్పిడి, నిఘా వ్యవస్థ, కార్యదళాలు పదును తేలితేనే- మత్తుచెర నుంచి జాతి విముక్తమవుతుంది!

పిడివాదానికి... తలాక్ తలాక్ తలాక్!





కులదీప్ నయ్యర్

'సుప్రీం' ధర్మాసనం నిజంగానే సర్వోన్నతమనదగిన తీర్పు వెలువరించింది. ఇస్లాం మూల సూత్రాలకు విరుద్ధంగా ముస్లిం వివాహిత మహిళలకు ముమ్మార్లు 'తలాక్' చెప్పి, వారితో తెగతెంపులు చేసుకునే అనాగరిక సంప్రదాయానికి సుప్రీంకోర్టు చెల్లుకొట్టింది. భారత రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలకు పట్టంకట్టిన తీర్పు ఇది! భారతీయ పౌరులందరికీ స్వేచ్ఛగా, స్వతంత్రంగా జీవనం సాగించే ప్రాథమిక హక్కును రాజ్యాంగం కల్పించింది. 'తలాక్' పలికి విడాకులు ఇచ్చే పద్ధతి రాజ్యాంగ మౌలిక స్ఫూర్తికి పూర్తి వ్యతిరేకం. మధ్యయుగ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన ఈ విధానం ఇంతకాలం దేశంలో కొనసాగిందంటే అందుకు ఛాందసవాదుల మౌఢ్యమే కారణం. షా బానో కేసులో సైతం ముస్లిం వర్గంలోని పిడివాదులు సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా ఉద్యమించారు. విడాకులు పొందిన ముస్లిం మహిళలకు నిర్దిష్ట భరణం నిర్దేశిస్తూ 1985లో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును వ్యతిరేకిస్తూ ఛాందసవాదులు దేశవ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు, ఆందోళన ప్రదర్శనలకు దిగారు. మతానికి సంబంధించిన ఆచార వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి కోర్టులకు అధికారం లేదని ఆనాడు వారు వాదించారు. విడాకులు పొందిన ముస్లిం మహిళలకు నిర్వహణ ఖర్చుల చెల్లింపు ప్రస్తావన షరియత్‌లోనే ఉందని ముస్లిం పర్సనల్ లా బోర్డు వాదించింది. ఆ నేపథ్యంలోనే సుప్రీం తీర్పును నీరుగారుస్తూ రాజీవ్ ప్రభుత్వం 'మనోవర్తి' చట్టం తీసుకురావడం, ఆ చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తూ భాజపా దేశవ్యాప్త ఆందోళనలకు దిగి రాజకీయంగా బలం పుంజుకోవడం తెలిసిందే!

హక్కుల కోసం పోరాటం

లౌకిక సమాజంలో 'తలాక్'కు తావులేదు. సౌదీ అరేబియాతోపాటు పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి అనేక ముస్లిం దేశాలు ఆ పద్ధతిని నిషేధించాయి. ఈ జాడ్యం భారత్‌ను కొన్ని వందల ఏళ్లుగా పట్టిపీడిస్తోంది. అయితే దీనిపై బహిరంగంగా చర్చించేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ముస్లిం మహిళల హక్కులను చిదిమేస్తూ సమస్య నిరాటంకంగా కొనసాగింది. పురుషాధిక్య సమాజానికి ప్రతీకలా తలాక్ ఇంతకాలం మనగలిగింది. ఆ దుస్సంప్రదాయానికి సర్వోన్నత న్యాయస్థానం చరమగీతం పాడటం లౌకిక భారతావనికి శుభసంకేతం. స్వాతంత్ర్యానంతరం భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ గట్టిగా జోక్యం చేసుకోవడంతో హిందూ వైయక్తిక చట్టంలో ఓ కీలక సంస్కరణకు చోటు దక్కింది. రాజ్యాంగ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ ఎంత వ్యతిరేకించినా- నెహ్రూ గట్టిగా పట్టుపట్టి మరీ విడాకుల విధానానికి హిందూ వైయక్తిక చట్టంలో చోటు దక్కేలా కృషి చేశారు.

ఖురాన్ ఏ రకంగానూ తలాక్‌ను సమర్థించలేదు. నిజానికి అది పవిత్ర గ్రంథం ప్రవచించిన మౌలిక సూత్రాలకు పూర్తి వ్యతిరేకమైన భావన. స్త్రీ పురుష సమానత్వం కోసం దేశంలో దశాబ్దాలుగా ఉద్యమాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఎంతోమంది ముస్లిం మహిళలు 'తలాక్'ను సవాలు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో పలు కేసులు వేశారు. ఈ చర్యలను ముస్లిం మత పెద్దలు సహించలేదు.



ముమ్మారు తలాక్, బహుభార్యాత్వానికి వ్యతిరేకంగా ముస్లిం మహిళల ప్రదర్శన(పాతచిత్రం)

సమానతా హక్కులకు పట్టం కట్టిన తీర్పు

వివాదం ముదిరిన నేపథ్యంలో తలాక్‌పై ముస్లిం సమాజం అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఓ ప్రశ్నావళిని విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. కానీ, చివరి క్షణంలో ఆ ప్రయత్నాలను విరమించుకుంది. ప్రశ్నావళి విడుదల చేయాలన్న ప్రభుత్వ ప్రయత్నాలను ముస్లిం పర్సనల్ లా బోర్డు తుదికంటా వ్యతిరేకించింది. ఆ బోర్డులో ఒక్క మహిళకూ స్థానం లేదు. ముస్లిం మహిళల అభిప్రాయాలు పూర్తిగా తెలుసుకున్న మీదట ముస్లిం పర్సనల్ లా బోర్డు నిర్ణయాలు వెలువరిస్తోందా అంటే అదీ లేదు! దేశంలోని ఎంతోమంది ముస్లిం మహిళలు 'బోర్డు' తీరును తీవ్రంగా దుయ్యబట్టారు. అయినప్పటికీ దాని వైఖరి ఇసుమంతైనా మారలేదు. రాజ్యాంగం, చట్టాలతో సంబంధం లేకుండా తమ మాటే చెల్లుబాటు కావాలని బోర్డు సభ్యులు ఇష్టారాజ్యం వ్యవహరించారు. ఈ వ్యవహారం ఏదో ఒక రోజు పార్లమెంటులో పెద్దయెత్తున చర్చనీయాంశమయ్యే అవకాశం కొట్టిపారేయలేనిది. ముస్లిం సమాజంలోని భిన్న వర్గాలతోపాటు ఇతర వర్గాలూ ఈ సమస్యను తీవ్రంగా పరిగణిస్తున్నాయి. తమపై దాష్టీకం చలాయిస్తున్న మతపెద్దలను ముస్లిం మహిళలు అనేకచోట్ల సామాజికంగా బహిష్కరిస్తున్నారు. ప్రజాభిప్రాయం తెలుసుకోగోరే ప్రశ్నావళినే వ్యతిరేకిస్తే ఇక దేశంలో చర్చ జరిగేదెలా?

తమకు సంబంధించి జరుగుతున్న చర్చలో, తమ జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాలు తీసుకుంటున్నప్పుడు తమను మాట మాత్రంగానైనా సంప్రతించకపోవడంలోని ఔచిత్యాన్ని దేశవ్యాప్తంగా మహిళాలోకం గట్టిగా వ్యతిరేకించింది. వారిది న్యాయబద్ధమైన వాదన. కోట్లాది ముస్లిం మహిళల జీవితాలను మలుపు తిప్పే కీలకాంశంపై అభిప్రాయం తెలిపే హక్కు కూడా వారికి ఇవ్వకపోవడం నిజంగా దారుణం. ఈ అంశంపై పార్లమెంటు ఉభయ సభల్లోనూ నిర్మాణాత్మక చర్చ జరగాలని మహిళలు భావిస్తున్నారు. ఈ విషయంలో రాజకీయ పార్టీలు సైతం మరింత స్పష్టంగా తమ అభిప్రాయాలను వెల్లడించాలి. ఓటు రాజకీయాల కారణంగా పార్టీలు ఈ విషయంలో బహిరంగంగా మాట్లాడేందుకు వెనకాడుతున్నాయి. దేశంలో 80 లోక్‌సభ స్థానాలున్న ఉత్తర్ ప్రదేశ్ సహా అనేక రాష్ట్రాల్లో ముస్లిముల ఓట్లు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నాయి. సమాజ్‌వాది పార్టీకి కొంతకాలం క్రితం వరకూ ముస్లిముల మద్దతు పుష్కలంగా ఉండేది. ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకత ప్రబలడంతో ఆజం ఖాన్ వంటి కీలక ముస్లిం నాయకుల మద్దతు ఉన్నప్పటికీ- అఖిలేశ్ యాదవ్ అక్కడ విజయం సాధించలేకపోయారు. ఇక ముస్లిం వర్గాన్ని తనవైపు తిప్పుకొనేందుకు రాహుల్ గాంధీ చెయ్యని ప్రయత్నం లేదు. కానీ రాహుల్ మాటలను జనం పెద్దగా పట్టించుకుంటున్నట్లు కనిపించదు. ప్రజలను ఆకర్షించే శక్తి సామర్థ్యాలు రాహుల్‌లో కనిపించడం లేదు. రాహుల్ బదులు సోనియాగాంధీ రంగంలోకి దిగినా కాంగ్రెస్ పార్టీ కొంత మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. ఒకవేళ ప్రియాంక గాంధీ పార్టీ పగ్గాలు చేపడితే కాంగ్రెస్ పరిస్థితి మెరుగుపడవచ్చు.

రాజ్యాంగ స్ఫూర్తి బాటలోనే...

రాజకీయాలను పక్కనపెడితే ముమ్మార్లు 'తలాక్' చెప్పే పద్ధతి ప్రజాస్వామ్య భారతావనికే తలవంపులు తెచ్చే సంప్రదాయం. రాజ్యాంగంలో ప్రవచించిన మౌలిక సూత్రాలకు ఇది వ్యతిరేకం. స్వాతంత్ర్యానంతరం ఏడు దశాబ్దాల కాలం ఈ అనాగరిక సంప్రదాయం కొనసాగడమే ఆశ్చర్యం కలిగిస్తుంది. మహిళల హక్కులపట్ల కనీస గౌరవం లేని వ్యవస్థలను సాంతం ప్రక్షాళించాల్సిన అవసరముంది. 'తలాక్' స్థానంలో కొత్త చట్టం తీసుకురావాలన్న డిమాండ్లు ఈనాటివి కావు. అయితే ఏ ప్రభుత్వమూ ఆ పని చేసేందుకు సాహసించలేదు. సుప్రీం ధర్మాసనం తీర్పు నేపథ్యంలో ప్రస్తుతం భారతీయ జనతాపార్టీ ప్రభుత్వమైనా గట్టి పూనిక వహించి 'తలాక్' స్థానే కొత్త చట్టం తీసుకువస్తుందా అన్నది చూడాల్సి ఉంది. రాజకీయావసరాలు ఎన్నయినా ఉండవచ్చుగాక... దేశంలో బహుళత్వ స్ఫూర్తి మాత్రం దెబ్బతినరాదు. ఓట్లకోసం లౌకిక భారతావనికి తూట్లు పొడవరాదు. రాజ్యాంగ పీఠికలోనే స్వతంత్ర దేశంగా భారత్ అనుసరించి సాగాల్సిన విధివిధానాలను, సిద్ధాంతాలను స్పష్టంగా వివరించారు. ఆ స్ఫూర్తిని అర్థం చేసుకొని, అమలులో పెడితే ఎలాంటి వివాదాలూ ఉండవు.

(రచయిత- ప్రముఖ పాత్రికేయులు, బ్రిటన్‌లో భారత మాజీ హైకమిషనర్)

తొండపు స్వామీ... దండము నీకు!

గణాధిపతి హాస్య రసానికి అధిపతి. చందమామయ్యే పాపం ఎందుకో అలా నీలాపనిందలపాలయ్యాడు కానీ, ఆ బొర్ర దేవుణ్ని చూస్తే నవ్వు రానిదెవరికి? హాయిగా చవితి పండుగ ముందునాడు, వినాయకుడి ముచ్చట్లు చెప్పుకొందాం. అదే పుణ్యం పురుషార్థం కూడానూ!

జాజి, జవ్వాజి అంటూ పత్రులు ఇరవయ్యొక్క రకాల్తోనా గజాననుడికి పూజా పునస్కారాలూ? అన్నేసి రకాల ఆకులు ఈ కరవు రోజుల్లో దొరుకుతాయనే! కరివేపాకు రెబ్బ కూడా కాడ పది కాడ నిలబడి కిందికి దిగిరానంటుందబ్బా రైతు బజార్లల్లో! జనాలేవన్నా ఆ అదానీ, అంబానీలకు దగ్గరి చుట్టాలా పక్కాలా? బీదా బిక్కీ ఒక్కపూట బొక్కేందుకే ఇంత బలుసాకు రెక్క దొరక్క బిక్కచచ్చి బతకతా ఉంటే- మళ్లా ఇదేం విపరీతమయ్యా మహానుభావా!

గారెలు, బూరెలు, వడపప్పు, పాయసాలంటూ చేంతాడంత పట్టీలు పట్టుకు చందాలకని ఇల్లిల్లూ తిరిగి వేపడం, ఉండ్రాళ్ల మీదకు దండు గొలుపమంటూ ఆ బొజ్జ గణపయ్యను ఊరికే రెచ్చగొట్టొద్దు బాబోయ్! దినం గడవడమే గండంగా ఉందిగదా ఇక్కడ మహాశయా!

ఏ దినుసుమీద ఎంత జీఎస్‌టీ వాతో... కొన్న తరవాత కానీ తేలడం లేదు రాత! ఏదో విధాయకం కనక భాద్రపద చవితికి సరదాగా వినాయకుణ్ని ఓసారి వచ్చి పొమ్మనడమే కాని- చూసీ చూడనట్లు సర్దుకుపోవాలని ఆ లంబోదరుడికి మాత్రం తెలీదా?

సరే, ఎలాగో ఆ ఎలుక వాహనుడు వాలిపోతున్నాడు కాబట్టి, కొన్ని హెచ్చరికలు ముందస్తుగా మనమూ చెప్పక తప్పదు. శ్రీ గజాననా... శ్రద్ధగా విను నాయనా! గుళ్లల్లోని దేవుళ్లే నేరుగా భక్తుల ఇళ్లకు వెళ్లొచ్చే కొత్త రోజులు వచ్చి పడ్డాయిప్పుడు. కుడుముల మీద మరీ అంత యావుంటే కుదరదు. ఏ భక్తుడి బీరువాలోనో లటుక్కుమని ఇరుక్కునే ప్రమాదం కద్దు. జర భద్రం జగన్నాయకా!

పోయిన ఏడాది మాదిరే పూజలో వెయ్యి నోట్లు విసిరితే ఉబ్బి తబ్బిబ్బు కావద్దే! ఆ చెల్లని నోట్లతో నిన్ను బోల్తా కొట్టించేసి, నీ నుంచి వరాలు దండుకొనే పథకాలు దండిగా తయారవుతున్నాయ్ నీ పూజా పందిళ్ల వెనక వినాయకా! అమాయకంగా ఎవరి మాయలోనూ పడిపోవద్దు. ఆనక ఏ ఈడీ కేసులోనో ఇరుక్కుంటే మీ 'డాడీ' వచ్చి విడిపించాలన్నా- ఫలితం సున్నా!

స్వరాజ్యం నుంచి సురాజ్యానికి పరుగులెట్టేస్తోందట ఈ మధ్య మరీ శరవేగంతో మా దేశ ప్రగతి రథం. అయినా మునుపటి మాదిరే ఈసారీ మా ముసలీ ముతకా నేతాశ్రీలు తమ వారసులకో, దగ్గరి నీరసులకో పదవులిచ్చి తీరాలని పట్టుపట్టక మానరు. దగ్గరివారిని కూడా దూరం పెట్టే రాజకీయం జోరుగా సాగే వేళ, ఎప్పటి మాదిరిగా తొందరపడి 'తథాస్తు' అన్నావో- ఇహ మా రాజకీయ సుడిగుండంలోకి నువ్వే వచ్చి చిక్కడ్డట్లే గజాననా! ఆనక తమ చిత్తం స్వామీ!



'కోరిన విద్యలకెల్ల ఒజ్జ'వని బుజ్జగించి మరీ ఏ చెత్త బడులకో అనుమతులు రాబట్టేస్తారండోయ్ విద్యా వ్యాపారుల దండు. ఆ అడ్డా సరకుతో జర భద్రంగా ఉండాలి జగన్మాత తనయ! అత్యున్నత న్యాయస్థానాలే నిదానంగా పోయే విధానాలతో ఉంటే, నీకు మరీ అంత అత్యుత్సాహం తగదు! ఆనక జరిగే తగాదాల్లో పార్టీ కావద్దు!

పుట్టిన రోజు వేడుకలకని అంత ఉల్లాసంగా వచ్చేస్తున్నావు. మంచిదే కానీ, ఎన్నికల వేడి నీకన్నా ముందస్తుగానే వచ్చి పడిందిప్పుడు వాడవాడలా! పాడు నేతలు నీ అభయ హస్తాన్ని ఎంతలా వాడుకుంటారోనన్నదే మా భయం. ఎచ్చులకుపోయి ఎవరి ఉచ్చులోనూ ఇరుక్కుపోకుండా ఉండటానికే ముందస్తుగా నీకీ హెచ్చరికలు!

మాదక ద్రవ్యాల వినియోగం మహజోరుగా సాగే సీజన్లోనే వచ్చి పడాలా నీ చవితి పండుగ సంబురాలు శంభు తనయా! పూజా పత్రిలో రవ్వంత గంజాయి ఆకు దొరికినా చాలు- కైలాసగిరికి నువ్వు తిరిగి వెళ్లే మాట కల్ల! జర భద్రం జగన్నాయకా!

పుస్తకాల సంచి బరువు బాధల నుంచి బడి పిల్లకాయలను కాపాడాలని రెండు తెలుగు ప్రభుత్వాలూ తెగ తంటాలు పడిపోతున్నాయి. భారీ కాయమాయె నీది! ఏ ఆకతాయితనానికో పసిపిల్లకాయల భుజంమీదకు ఎక్కుతావోనని భయం!

అడుగడుగునా అభివృద్ధికి అడ్డు తగులుతూ చెడ తిరిగే దున్నపోతులకే దేశం గొడ్డుపోలేదు. వాటి మీద ఎక్కి, వాళ్ల వంకర బుద్ధులనన్నా తిన్నం చెయ్యి స్వామీ- నీ చవితి పండగకు అప్పుడు ఓ చక్కని సార్థకతా ఏర్పడినట్లు ఉంటుంది.

అన్నట్లు, ఆఖరుగా నిమజ్జన దృశ్యం ఉంటుంది. ఎప్పట్లా ట్యాంకుబండ్ మీదే అది తప్పనిసరా స్వామీ? బోలెడంత జనం సొమ్ము ధారపోస్తేగాని ఆ మాత్రమైనా పరిశుద్ధమైంది కాదీ సాగరు జలాలు! మళ్లీ మురికి చెయ్యడమంటే ఎవరి ముల్లెకో లాభం చేకూర్చడమన్న మాటే! నీ భక్తులకు నువ్వే నచ్చజెప్పాలి. న్యాయస్థానాల తీర్పుల్ని గౌరవించడం నువ్వే నేర్పించాలి విఘ్నేశ్వరా!

నీ మూషిక వాహనాన్నే నమ్ముకుని రావయ్యా గణనాయకా! నామోషీ ఏం లేదులే. కాకుంటే మా కొత్త 'పాయింట్ల' పద్ధతికి కాస్త నీ కొంటె మూషికం అలవాటు పడాలంతే! ఏనుగు చెవులని ఏమంత బేఫర్వా వద్దు. ఎన్నికల మధ్యలోకదా నీ చవితి పండుగ వచ్చి పడిందీ! మా 'బూత్' రాజకీయాలకి ఓ బేలు దూదుండలు తప్పనిసరి. గుర్తుంచుకొని వెంట తెచ్చుకో... పండుగ తొమ్మిది రోజులూ రెండు చెవుల్లో దోపుకొందువుగాని!

ఉచిత ఫోను సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి కాబట్టి ఇంత విపులంగా నీతో ముచ్చటించడానికి వీలైంది. చివరగా చిన్న విన్నపం. నీతోపాటు సిద్ధిని, బుద్ధిని వెంట తీసుకురావయ్యా! వాళ్లిద్దరే మా పెద్దమనుషులందరికీ ఇప్పుడు అత్యంత అవసరమని మా మెజారిటీ సామాన్యుల తిరుగులేని తీర్మానం!

- కర్లపాలెం హనుమంతరావు

ఈనాడు లేఖలు

రుణాలందక ఇక్కట్లు

ఈ ఖరీఫ్ పంటకాలంలో వ్యవసాయశాఖ పలు చర్యలు చేపట్టింది. పంటల ఎంపిక, విత్తన శుద్ధి, సేంద్రియ ఎరువుల వాడకంతో కలిగే ప్రయోజనాల గురించి ఇప్పటికే కొన్నిచోట్ల అవగాహన శిబిరాలు నిర్వహించారు. రైతులకు గతంలో ఎదురైన కొన్ని ఇబ్బందులు పునరావృతం కాకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు అధికారవర్గాలు ప్రకటించాయి. కానీ వివిధ ప్రాంతాల్లో విత్తనాలు, ఎరువుల కోసం చేతిలో డబ్బు లేక పలువురు అవస్థలు పడుతున్నట్లు ఇప్పటికే వార్తలొచ్చాయి. రుణాలు కోరుతూ వారు పట్టాదారు పాసుపుస్తకాలు చేతపట్టి బ్యాంకుల ముందు బారులు తీరుతున్న దృశ్యాలూ కనిపిస్తున్నాయి. గంటల తరబడి వేచిఉన్నా ఎటువంటి ఫలితమూ లేకపోవడం ఆయా రైతుల్ని నిరాశకు గురిచేస్తోంది. అందువల్ల కొంతమంది తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు వడ్డీ వ్యాపారుల్ని ఆశ్రయిస్తున్నారు. గత్యంతరం లేక అధిక వడ్డీలకు వారు రుణాలు తీసుకోవాల్సి వస్తోంది. ప్రస్తుత సీజనులో వ్యవసాయదారులందరికీ పంట రుణాలు అందేలా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. బ్యాంకు శాఖల్లో నగదు నిల్వలు పెరిగేలా, అవి రుణాల రూపంలో అవసరమైనవారికి చేరేలా చూడాలి.

- వై. ప్రభాకర్, మిట్టకోడూరు, వికారాబాద్ జిల్లా

వివరాలు వెల్లడించండి

కొన్ని ప్రభుత్వ కార్యాలయాలకు పనులపై వెళ్లేవారు, అక్కడి అవినీతి బాగోతాల్ని చూసి విస్తుపోవాల్సి వస్తోంది. దస్త్రం కదలాలన్నా, దానిమీద సంతకం కావాలన్నా ఎంతో కొంత ముట్టజెప్పాలని బాహాటంగానే అడుగుతుండటం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. మరో వంక- ఆశ్రిత పక్షపాతం, లంచగొండితనం వంటి వ్యవహారాల్ని అరికట్టడానికి అవినీతి నిరోధక శాఖ మెరుపు దాడులు సాగిస్తోంది. అక్రమాలకు పాల్పడే ప్రబుద్ధుల్ని పట్టుకొని, కేసులు నమోదు చేసి, న్యాయస్థానాల ఎదుట హాజరుపరుస్తోంది. అంతటితో ఆ శాఖ బాధ్యత తీరినట్లు కాదు. కేసుల విచారణ, నేరం రుజువు కావడంతో పడిన శిక్షల వివరాల్ని వెంటవెంటనే వెల్లడించాలి. అందువల్ల అక్రమార్కుల వెన్నులో వణుకు పుడుతుంది. అనుచిత మార్గాల్లో సంపాదించాలంటే భయపడతారు. అటువంటి నేరాలు క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుంది.

- తల్లాప్రగడ ప్రభాకర్, హైదరాబాద్

మనిషి లక్ష్యం

లోకంలో ఏ పనినైనా సక్రమంగా, సమర్థంగా, విజయవంతంగా నిర్వహించాలంటే- ముఖ్యంగా కావాల్సింది లక్ష్యం పట్ల స్పష్టత. 'ఏ ప్రయోజనం ఉద్దేశించి ఒక పని చేస్తున్నాడో దాన్ని మరిచినవాడు- ఎన్ని వనరులు శక్తియుక్తులు కలిగినా, ఎంత శ్రమపడినా తాను అనుకున్నది సాధించలేడు. 'గమ్యం ఏమిటో, దానికి సులభమైన సురక్షితమైన మార్గమేమిటో ఆలోచించుకొని అప్రమత్తంగా వ్యవహరించేవారు అరుదు' అని చిన్మయానంద స్వామి అంటారు.

మనిషి జీవితానికి ముఖ్య లక్ష్యం ఏమిటి అనే ప్రశ్నకు సమాధానం కోసం- అనేకమంది తపశ్శక్తి సంపన్నులు, వినిర్మల హృదయులైన మహర్షులు ఎంతోకాలం అన్వేషించారు. ధర్మ అర్థ కామ మోక్షాలనే చతుర్విధ పురుషార్థాలు సాధించే ప్రయత్నమే మానవుడి ప్రధాన లక్ష్యం కావాలి. అదే ఈ జన్మలో, జన్మాంతరాల్లోనూ శ్రేయస్కరంగా ఉంటుందని వారు నిర్ణయించారు. చతుర్విధ పురుషార్థాల ప్రాముఖ్యంలో హెచ్చుతగ్గుల గురించి మహాభారతంలో ఒక ఆసక్తికరమైన చర్చ కనిపిస్తుంది.

'నాలుగింటిలోనూ ఏది ఉత్తమ పురుషార్థం' అని ధర్మరాజు ప్రశ్నిస్తాడు. సత్యం, శౌచం, దయ, దానం అనేవి నాలుగు పాదాలుగా గలది ధర్మం. ధర్మ వివేచన ఎంతో లోతైన విషయం. తపస్సు, త్యాగం, శ్రద్ధ, క్షమ, చిత్తశుద్ధి, దయ, సత్యం, సంయమనం మొదలైనవాటి ఆచరణే ధర్మం. అదే లోకాన్ని నిలిపే ఆధారం. 'ధర్మాచరణ చేసేవాడికి ధన కనక వస్తు వాహన రూపమైన 'అర్థం' దానంతట అదే వచ్చి చేరుతుంది. ఆ అర్థం వల్ల కామమూ సిద్ధిస్తుంది. అందువల్ల అన్నింటికీ మూలమైన ధర్మ పురుషార్థమే సర్వోత్తమం. అర్థం మధ్యమం. కామం అధమం' అని బదులిస్తాడు విదురుడు.

'లోకంలో ప్రజలకు సంబంధించిన విద్య, వ్యవసాయం, వాణిజ్యం, పశుపాలన వంటి వ్యాసంగాలన్నింటికీ ధనార్జనే ముఖ్యోద్దేశం. ధనమే లేనప్పుడు అటు ధర్మాచరణ గాని, ఇటు కామ పురుషార్థ సాధన గాని అసాధ్యమవుతాయి. ధర్మార్థ కామాలలో అర్థానిదే పెద్దపీట' అని అర్జునుడు చెబుతాడు.

'మనిషి జన్మ ఎందుకు? తుమ్మెద మకరందాన్ని ఆస్వాదించినట్లు- ప్రకృతి ప్రసాదించిన వనరుల నుంచి అతడు అత్యంత సుఖకరమైనవాటిని పొందాలి. పెరుగులో సారం వెన్న అవుతుంది. జీవితంలో సారం అంటే- కోరికలు తీరాక ఆనందించడమే! అందుకే కామ పురుషార్థం అధమం అనడం న్యాయం కాదు. ధర్మార్థ కామాలు మూడింటిలో ఒక్కటే సాధించినవాడు అధముడు. రెండైనా సాధించుకొన్నవాడు మధ్యముడు. మూడూ సాధించినవాడు ఉత్తముడు' అంటాడు భీమసేనుడు.



అంతర్యామి

'విదురుడి సిద్ధాంతం బాగుంది. మిగిలినవారు చెప్పినవీ అంతే. నేను చెప్పేదీ వినండి. ప్రాణులకు ఒకే జన్మ కలిగితే- ఆ జన్మంతా ధర్మాచరణ చేసుకొంటూ, దాని ద్వారా అర్థం ఆర్జించి, ఆ అర్థంతో ధర్మబద్ధమైన కోరికలు తీర్చుకొంటూ జీవించడానికే సరిపోతుంది. ప్రాణులు కర్మఫలం అనుభవించడానికి మళ్లీ మళ్లీ పుడుతూ గిడుతూ ఉండటం సహజమే. ఇది జనన మరణ చక్రం. ఈ భవబంధాలు దుఃఖదాయకాలు. వాటి నుంచి విముక్తినిచ్చి నిత్యానందం కలిగించే మోక్ష పురుషార్థం కోసం ప్రయత్నం సాగించాలి. అది దుఃఖభారాన్ని శాశ్వతంగా వదిలిస్తుంది' అని ధర్మరాజు విశదీకరిస్తాడు.

తీరిక చేసుకొని వివేచించగల వారు- పరిపూర్ణ జీవితానికి ధర్మ అర్థ కామ మోక్షాలు సాధించడమే సరైన లక్ష్యం అని గ్రహిస్తారు. ఈ పురుషార్థాలు పరస్పర విరుద్ధాలు కావు. ధర్మాచరణ వల్ల దాని ఫలమైన అర్థాన్ని పొందవచ్చు. అర్థం ద్వారా, ధర్మానికి విరుద్ధం కాని భోగాలు అందుకోవచ్చు. సుఖం కలిగినప్పుడు అహంకరించకూడదు. దుఃఖం కలిగినప్పుడు దైన్యంతో కుంగిపోకూడదు. మోక్ష సాధనకు పెద్దలు చెప్పిన యోగ మార్గాల్ని యథాశక్తి అనుష్ఠించాలి. ఇదే శాంతిపర్వం అందజేసిన సలహా!

- మల్లాది హనుమంతరావు



సచివాలయ ఉద్యోగులకు మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఐఏఎస్ అధికారి సత్యనారాయణరెడ్డి

'మట్టి గణపతులతో పర్యావరణానికి మేలు'

ఈనాడు, హైదరాబాద్: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించడమే మేలని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) సభ్య కార్యదర్శి సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. పీసీబీ, తెలంగాణ సచివాలయ సంఘం ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులకు బుధవారం మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ సహకారంతో 70 వేల మంది విద్యార్థులకు మట్టి గణపతి విగ్రహాలను అందిస్తున్నామన్నారు.

హైకోర్టు సిబ్బందికి మట్టి గణపతుల పంపిణీ: తెలంగాణ, ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘాలు, తెలంగాణ పీసీబీ, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో హైకోర్టు ప్రాంగణంలో బుధవారం న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి మట్టి గణపతి విగ్రహాలు, మొక్కలను పంపిణీ చేశారు. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి, జస్టిస్ పి.నవీన్‌రావు, న్యాయవాది సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణలో బాహాబాహీ

- **పెద్దపల్లిలో కాంగ్రెస్, తెరాస నాయకుల తోపులాట**

పెద్దపల్లి

కాళేశ్వరం ప్రాజెక్టు పర్యావరణ అనుమతి కోసం పెద్దపల్లిలో బుధవారం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ రసాభాసగా మారింది. తెరాస, కాంగ్రెస్ కార్యకర్తలు బాహాబాహీకి దిగారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నీటిపారుదల ఆయకట్టు అభివృద్ధి శాఖ.. ప్రాజెక్టుకు అనుసంధానమైన సిరిపురం బ్యారేజీ, అన్నారం, గోలివాడ పంప్‌హౌస్‌లపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్, ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, పుట్టా మధుకర్, ఎమ్మెల్సీ భానుప్రసాదరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 18.26 లక్షల ఎకరాలను సాగులోకి తెచ్చేందుకు గోదావరి, ప్రాణహిత నదుల ద్వారా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పనులు చేపడుతోందన్నారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల పర్యావరణానికి హాని జరుగుతుందని, ఎక్కువ గ్రామాలు మునిగిపోతాయంటూ ప్రతిపక్షాలు నిర్వాసితులను మభ్యపెడుతున్నాయని ఆరోపించారు. అనంతరం భూ నిర్వాసితుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల నిర్వాసితులు భూములు కోల్పోవడమేగాక చుట్టుపక్కల గ్రామాలు మునిగిపోతాయన్నారు. 2 వేల మందికి పైగా నిర్వాసితులకు పరిహారం విషయంలో అన్యాయం జరిగిందని, దీనిపై నేతలు స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ వర్గీయులు 'కేసీఆర్ డౌన్.. డౌన్..' అంటూ నినాదాలు చేశారు. శ్రీనివాస్ సభావేదికపై బైఠాయించడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. తెరాస, కాంగ్రెస్ నాయకులు పరస్పర ఆరోపణలకు దిగారు. ఇరు పార్టీల కార్యకర్తలు పరస్పరం కుర్చీలు విసురుకుంటూ ముష్టిఘాతాలకు దిగారు. వేదికపైనున్న శ్రీనివాస్‌పై తెరాస కార్యకర్తలు దాడి చేశారు. వెంటనే పోలీసులు సభలో ఉన్న మాజీ మంత్రి శ్రీధర్‌బాబు, శ్రీనివాస్‌లతో పాటు దాదాపు 150 మంది కాంగ్రెస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. శ్రీనివాస్‌కు గాయాలవడంతో ఆసుపత్రికి తరలించారు.





శ్రీధర్‌బాబు, శ్రీనివాస్‌లను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు ★ సభలో కుర్చీలు విసురుకుంటున్న కాంగ్రెస్, తెరాస కార్యకర్తలు

కాళేశ్వరానికి నల్గొండ జిల్లా వాసుల మద్దతు

చిట్యాల, న్యూస్‌టుడే: చిట్యాల, నార్కట్‌పల్లి ప్రాంతాల రైతుల కలలను సాకారం చేయగలదన్న ఆశాభావంతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి అనుకూలంగా ఉన్నట్లు నల్గొండ జిల్లాకు చెందిన రైతు, ప్రజాసంఘాలు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు 16వ ప్యాకేజీ పనులపై బుధవారం చిట్యాలలో ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహించారు.



అఖిలేష్‌తో వైద్యులు

తెగిన చేయి అతికించిన వైద్యులు

బిహార్ యువకుడికి యశోద వైద్యుల చికిత్స

ఈనాడు, హైదరాబాద్: ప్రమాదవశాత్తూ తెగిపడిన చేతిని యశోద ఆసుపత్రి వైద్యులు శస్త్రచికిత్స ద్వారా విజయవంతంగా అతికించి ఓ యువకుడికి కొత్త జీవితం ప్రసాదించారు. ఆ వివరాలను ఆసుపత్రి యాజమాన్యం బుధవారం మీడియాకు విడుదల చేసింది. బిహార్‌కు చెందిన అఖిలేష్‌కుమార్(18) చౌటుప్పల్‌లోని ఓ రబ్బరు ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. ఈనెల 3న రబ్బర్ కటింగ్ మిషన్‌తో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తూ ఎడమ చేయి మణికట్టు వరకు అందులో ఇరుక్కొని తెగి పడింది. దీంతో అఖిలేశ్‌తోపాటు అతని చేయిని సెలైన్ ద్రావణంలో ఉంచి మంచులో భద్రపరిచి స్థానికంగా ఓ ఆసుపత్రికి, అక్కడి నుంచి సోమాజిగూడ యశోద ఆసుపత్రికి తరలించారు. యశోదలో సీనియర్ ప్లాస్టిక్ సర్జన్ శశికాంత్, సీనియర్ వాస్క్యులర్ సర్జన్ దేవేందర్‌సింగ్, సునీల్ దాచేపల్లి, కె.శశికిరణ్, సీఎస్ చంద్రశేఖర్ బృందం పరిశీలించి, చేతిని అతికించేందుకు శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించింది. సాధారణంగా ఇలాంటి ప్రమాదాల్లో కండరాలతో సంబంధం లేకుండా వేళ్ల వంటి భాగాలు తెగినప్పుడు ఎక్కువ సమయం సంరక్షించి అతికించవచ్చు. తాజా ఘటనలో కండరాలు, రక్తనాళాలు, నాడులతో నిండిన చేయి పూర్తిగా తెగినప్పుడు గోల్డెన్ అవర్ అంటే 6-8 గంటల్లోగా తిరిగి అతికించాలి. ఇటీవల వైద్య చికిత్సల్లో వచ్చిన మార్పుల వల్ల నిర్ణీత సమయం దాటాక వచ్చినా సరే అతికించడానికి వీలు ఏర్పడుతోందని వైద్యులు తెలిపారు. ఈ శస్త్ర చికిత్సకు దాదాపు ఎనిమిది గంటలు పట్టిందన్నారు. తెగిన చేతిని అతికించాక రక్తప్రసరణ అయ్యేందుకు ఒక రోజు పట్టింది. ఈ ప్రక్రియ విజయవంతం కావడంతో రెండోదశలో చేతి కండరాలు, నాడులను అతికించి పూర్తిస్థాయిలో పునరుద్ధరించినట్లు వైద్యులు వివరించారు. 48గంటల్లోనే వేళ్లలో చలనం వచ్చిందని, రెండు వారాల తర్వాత కోలుకోవడంతో డిశ్చార్జి చేసినట్లు తెలిపారు.

'సింగూరు నుంచి నిజాంసాగర్‌కు 4 టీఎంసీలే ఇవ్వగలం'

ఈనాడు, హైదరాబాద్: సింగూరు జలాశయం నుంచి నిజాంసాగర్‌కు 4 టీఎంసీలు మాత్రమే విడుదల చేయగలమని సంబంధిత ఇంజినీర్లు స్పష్టం చేశారు. ఈ మేరకు విడుదల చేయడానికి అనుమతించాలని నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులను కోరారు. సింగూరు నుంచి నిజాంసాగర్ ఆయకట్టు అవసరాలకు 9 టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఎతొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదావరి బేసిన్ కమిషనర్‌కు లేఖ రాసింది. దీని ఆధారంగా నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులకు కమిషనర్ లేఖ రాశారు. నిజాంసాగర్‌కు 8.35 టీఎంసీల నీటి కేటాయింపు ఉందని, మిషన్ భగీరథకు కేటాయింపుల తర్వాత 6.35 టీఎంసీలకు తగ్గిపోయిందని అందులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న నీటిలో నాలుగు టీఎంసీలు మాత్రమే నిజాంసాగర్‌కు వస్తాయని తెలిపారు.

ప్రభుత్వం తీరు అప్రజాస్వామికం

- **టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భట్టివిక్రమార్క**

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రజాభిప్రాయ సేకరణలో తెరాస ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. బాధిత రైతుల తరఫున మాట్లాడితే పోలీసులతో దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. మాజీ మంత్రి శ్రీధర్‌బాబు సహా ఇతర నేతలు, రైతుల అరెస్టును ఖండిస్తున్నామన్నారు. బుధవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రజాభిప్రాయసేకరణ ఘటనలపై బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

బలవంతంగా సంతకాలు: జీవన్‌రెడ్డి

కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయసేకరణలో బాధితులతో బలవంతంగా ఒప్పందంపై సంతకాలు చేయిస్తున్నారని సీఎల్పీ ఉపనేత టి.జీవన్‌రెడ్డి ఆరోపించారు. సుందిళ్ల నుంచి ప్రవాహం(గ్రావిటీ) ద్వారా నీటిని తీసుకునే అవకాశం ఉన్నా దీన్ని విస్మరించడంతో ప్రజలపై భారం పెరుగుతోందన్నారు. 2013లో భూసేకరణ చట్టం ప్రకారం భూసేకరణ చేయాలన్నారు. నష్టపరిహారాన్ని ప్రభుత్వం తగ్గిస్తోందన్నారు. మాజీ మంత్రి శ్రీధర్‌బాబు సహా ఇతర నేతల అరెస్టును ఖండిస్తున్నట్లు మండలిలో కాంగ్రెస్ పక్ష ఉపనేత పొంగులేటి సుధాకరరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక ప్రాజెక్టుకైనా జాతీయ హోదా సాధించారా? అని ప్రశ్నించారు. డిండికి నీటి తరలింపుపై శాసనసభలో చర్చకు సిద్ధంగా ఉన్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే వంశీచందర్‌రెడ్డి తెలిపారు. మంత్రి చర్చకు రావడానికి జంకుతున్నారని అసెంబ్లీ వేదికగానే తేల్చుకుంటానని తెలిపారు.

బహిరంగ చర్చకు సిద్ధమా?: పొన్నాల

కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరువల్లే రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు జరగడం లేదని ముఖ్యమంత్రి కేసీఆర్ అసత్యాలు మాట్లాడుతున్నారని, సీఎంకు చిత్తశుద్ధి ఉంటే ప్రాజెక్టులపై బహిరంగ చర్చకు రావాలని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య సవాల్ విసిరారు. బుధవారం హన్మకొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టుల పునరాకృతికి కాంగ్రెస్ వ్యతిరేకం కాదన్నారు. అయితే ఆ విధానం సరిగాలేదని, పారదర్శకంగా వ్యవహరించకపోవడాన్నే తప్పుపడుతున్నామని చెప్పారు.

గల్ఫ్ ఎన్నారైల పట్ల నిర్లక్ష్యం: సురేష్‌రెడ్డి

తెరాస ప్రభుత్వం గల్ఫ్ ఎన్నారైల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ స్పీకర్ కె.ఆర్.సురేష్‌రెడ్డి ఆరోపించారు. ఎన్నారైల విధానం రూపొందిస్తామని గత ఏడాది జులైలో చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకూ సిద్ధం చేయలేదన్నారు. బుధవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఎన్నారై విభాగం ఛైర్మన్ వినోద్‌తో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గడచిన మూడేళ్లలో తెలంగాణకు చెందిన 600 మంది గల్ఫ్‌లో చనిపోయారని తెలిపారు. వీరికి ప్రభుత్వం ఒక పైసా కూడా సాయం చేయలేదన్నారు. గత మూడేళ్లలో చనిపోయిన వారి కుటుంబాలకు ఐదు లక్షల రూపాయలు చొప్పున పరిహారం అందించాలన్నారు.

సీఎం కేసీఆర్‌కు ఉపరాష్ట్రపతి ధన్యవాదాలు

పౌరసన్మానం, స్వాగత మర్యాదలు అపూర్వమని వెంకయ్యనాయుడు ప్రశంస

దిల్లీ: తెలంగాణలో తన పర్యటన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అందించిన స్వాగత మర్యాదలకు, శుభాకాంక్షలకు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన కేసీఆర్‌కు ప్రత్యేకంగా లేఖ రాశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన ఆతిథ్యం అపూర్వమని కొనియాడారు. పౌరసన్మానం కార్యక్రమంలో చక్కని తెలుగులో కేసీఆర్ చేసిన ప్రసంగం తనను ఆకట్టుకుందన్నారు. చక్కని తెలుగు భోజనాన్నీ అందించారని ప్రశంసిస్తూ శుభాభినందనలు తెలిపారు.

'శ్రీశైలం, నాగార్జునసాగర్‌లకు నీరు విడుదల చేయాలి'

ఈనాడు, దిల్లీ: కర్ణాటకలో జలాశయాలు నిండుగా ఉన్నా తెలంగాణ, ఏపీల్లో ప్రాజెక్టులు ఎండిపోతున్నాయని తెరాస ఎంపీ బూర నర్సయ్యగౌడ్ పేర్కొన్నారు. బుధవారం దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. శ్రీశైలం, నాగార్జున సాగర్‌లకు ఎగువ నుంచి నీరు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర జలవనరుల మంత్రి ఉమాభారతికి విజ్ఞప్తి చేశానని చెప్పారు. తెలంగాణకు 20 టీఎంసీలు విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు.



బుధవారం దిల్లీలో రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్‌తో అఖిలపక్ష నేతలు ఎల్.రమణ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డి.రాజా, చాడ వెంకటరెడ్డి, కోదండరాం, అజీజ్‌బాషా, సంపత్ కుమార్ తదితరులు

రాష్ట్రపతితో అఖిలపక్షం భేటీ

- **తెలంగాణలో పరిస్థితులపై ఫిర్యాదు**

ఈనాడు, దిల్లీ: తెలంగాణలో అప్రజాస్వామిక విధానాలు సాగుతున్నాయని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు అఖిలపక్ష నేతలు ఫిర్యాదు చేశారు. బుధవారమిక్కడ రాష్ట్రపతిభవన్‌లో నేతలు చాడ వెంకటరెడ్డి, డి.రాజా (సీపీఐ), ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సంపత్ (కాంగ్రెస్), ఎల్.రమణ (తెదేపా), కోదండరాం (తెలంగాణ రాజకీయ ఐకాస) సహా 12 మంది నేతలు రాష్ట్రపతితో భేటీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందంటూ ఆయనకు వివరించారు. నేరెళ్ల ఘటన బాధ్యులపై అట్రాసిటీ కేసులు నమోదుచేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. అనంతరం నేతలు మీడియాతో మాట్లాడారు. నేరెళ్ల ఘటన జరిగి 50 రోజులు దాటుతున్నా చట్టపరమైన చర్యలు తీసుకోలేదని రాష్ట్రపతికి చెప్పామన్నారు. తెలంగాణలో ఆత్మహత్యలు సీఎం కేసీఆర్ నియోజకవర్గంలోనూ, ఇసుక అక్రమదందా మంత్రి కేటీఆర్ నియోజకవర్గంలోనూ ఎక్కువగా ఉన్నట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇసుక మాఫియా ఆగడాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. రాష్ట్రంలో మానవహక్కుల ఉల్లంఘన, దళితుల హక్కులపై జరుగుతున్న దాడులు వంటి సమస్యల పరిష్కారానికి జోక్యం చేసుకోవాలని అభ్యర్థించామన్నారు. దళితులపై ప్రభుత్వానికి చిన్నచూపు ఉందని ఆరోపించారు. నేరెళ్ల బాధితులకు న్యాయం జరగలేదని, దళితులను కొట్టినవారిపై చర్యలు తీసుకోలేదన్నారు. తెలంగాణలో పరిస్థితులు విన్న అనంతరం.. రాష్ట్రపతి వైఖరి తమకు ఎంతో ఉత్సాహానిచ్చిందన్నారు. రాష్ట్రంలోని పరిస్థితులు దిల్లీలో తెలియాలనే జాతీయస్థాయిలో ధర్నా, నిరసనలు చేపట్టామన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై కచ్చితంగా ఒత్తిడి వచ్చి ఉంటుందని నేతలు అభిప్రాయపడ్డారు. కాళేశ్వరంపై ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతున్న సమయంలో ఉప్పాల్ల శ్రీనివాస్‌పై దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు కోదండరాం చెప్పారు.

పన్ను ప్రయోజనం ప్రజలకు అందాల్సిందే

అమలుకు జాతీయ, రాష్ట్ర అథారిటీలు ● తెలంగాణలో 2.6 లక్షల మంది వ్యాపారులకు జీఎస్టీ రిజిస్ట్రేషన్

● దిల్లీలో సెప్టెంబరు 1, 2న రాజస్వ జ్ఞాన సంగమం ● కేంద్ర వస్తు, సేవల పన్ను కమిషనర్ ఎం.శ్రీనివాస్



ఈనాడు - హైదరాబాద్

వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రాకతో నిత్యావసరాలు, వస్తువులపై తగ్గిన పన్ను మేరకు వినియోగదారులకు లబ్ధి కలిగించేందుకు కేంద్ర, రాష్ట్రాలు సంయుక్త కార్యాచరణను రూపొందిస్తున్నాయని కేంద్ర జీఎస్టీ కమిషనర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ధరలను తగ్గించని తయారీ సంస్థలు, వ్యాపారులపై చర్యలు తీసుకుంటామన్నారు. తెలంగాణలో కొత్తగా 60 వేల మంది జీఎస్టీఎన్ రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర అధికారుల సమన్వయంతో రాష్ట్రంలో జీఎస్టీ అమలును ముందుకు తీసుకెళ్తున్నట్లు 'ఈనాడు'కు ఇచ్చిన ముఖాముఖిలో పేర్కొన్నారు.

జీఎస్టీ అమలెలా ఉంది?

తెలంగాణలో గతంలో 2.2 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు ఉండగా, వీరిలో 95% మంది జీఎస్టీలో నమోదయ్యారు. మిగిలినవారు రిజిస్ట్రేషన్ చేసుకోకపోవడానికి... మినహాయింపు పరిధి రూ.20 లక్షల వరకూ పెరగడం తదితర కారణాలను గుర్తిస్తున్నాం. కొత్తగా మరో 60 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. నమోదు చేసుకున్నవారికి పన్ను రిటర్నులు దాఖలుకు ఈనెల 25వరకూ గడువుంది.

కేంద్ర-రాష్ట్ర సమన్వయం ఎలా ఉంది?

జీఎస్టీ అమలులో కేంద్ర జీఎస్టీ, రాష్ట్ర పన్నుల విభాగాలకు సమాన బాధ్యత ఉంది. రెండు శాఖలు సహకరించుకుంటున్నాయి. తగ్గిన పన్ను ప్రయోజనాలు ప్రజలకు అందేలా చూసేందుకు రెండు విభాగాలు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక అథారిటీలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. తెలంగాణ వాణిజ్య పన్నులశాఖ, కేంద్ర జీఎస్టీ ఉన్నతాధికారుల సమన్వయం సమావేశం ఈ నెల 18న జరిగింది. సీజీఎస్టీ ఉన్నతాధికారులు, రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ ముఖ్య కార్యదర్శి సోమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. జీఎస్టీ అమలులో సంయుక్తంగా ముందుకెళ్లే విషయమై చర్చించుకున్నాం. రాష్ట్రస్థాయిలో కేంద్ర, రాష్ట్ర శాఖల మధ్య ప్రతినెలా సమన్వయ సమావేశం ఉంటుంది. జిల్లాస్థాయిలో 15 రోజులకోసారి సమన్వయ కమిటీలు సమావేశమై, తాజా పరిస్థితులు, సమస్యలపై చర్చిస్తాయి.

ధరలు తగ్గాయా? దీనిపై పర్యవేక్షణ ఎలా?

తగ్గిన, రద్దయిన పన్నుల మేరకు ధరలు తగ్గాలని చట్టం విస్పష్టంగా పేర్కొంది. దీన్ని అనుసరించని వారిపై 'జీఎస్టీ చట్టం-సెక్షన్ 171' ప్రకారం యాంటీ ప్రాఫిటింగ్ కింద చర్యలు తీసుకోవచ్చు. దీని పర్యవేక్షణకూ, వినియోగదారులకు ప్రయోజనం కలిగించేందుకు జాతీయ స్థాయిలో యాంటీ ప్రాఫిటింగ్ అథారిటీ ఏర్పాటైంది. రాష్ట్రంలోనూ ఏర్పాటవుతుంది. సీజీఎస్టీ, రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ ఉన్నతాధికారులు ఇందులో సభ్యులుగా ఉంటారు.

ధరల మార్పుపై ఎలాంటి పరిశీలన జరుగుతోంది?

మార్కెట్ పరిస్థితులపై దృష్టి సారించాం. వివిధ వస్తువులపై గతంలో ఎంత పన్ను ఉండేది? ఇప్పుడెంత ఉంది? ఎంత వసూలు చేస్తున్నారు.. మునుపటి, ప్రస్తుత ధరలు ఎలా ఉన్నాయి? బిల్లుల్లో పారదర్శకత, సామాన్యులకు అర్థమయ్యేలా పన్నుల వివరాలు సూచిస్తున్నారా? తదితర అంశాలను నిత్యం పరిశీలిస్తున్నాం. ధరలను పోల్చి జాబితాలను రూపొందిస్తున్నాం.

కొత్త విధానంపై వ్యాపారులకు తోడ్పాటు అందిస్తున్నారా?

వ్యాపారులకు కొత్త పన్ను విధానంపై పూర్తి అవగాహన కలిగించాం. రిజిస్ట్రేషన్‌లో సహకరించాం. వారి సందేహాలను నివృత్తి చేశాం. హెల్ప్‌లైన్లు, సేవా కేంద్రాలు ఇప్పటికే పనిచేస్తున్నాయి. జాతీయస్థాయిలో 11 అంశాలకు సంబంధించి తరచూ ఎదురయ్యే ప్రశ్నలకు సీజీఎస్టీ వెబ్‌సైట్‌లో సమాధానాలను పొందుపరిచాం. జీఎస్టీలోకి మార్పు, రిజిస్ట్రేషన్, ధరల తగ్గింపు, రిటర్న్ దాఖలు, సామర్థ్య నిర్మాణంపై పర్యవేక్షణకు నాలుగు కార్య బృందాలు ఏర్పాటయ్యాయి.

వ్యాపారులపై ఎలాంటి ఒత్తిడి ఉంటోంది?

వ్యాపారులపై ఎలాంటి వేధింపులు, ఆకస్మిక తనిఖీలు ఉండవు. ఎప్పుడు పడితే అప్పుడు అధికారులు తనిఖీలు చేయడానికి జీఎస్టీ చట్టంలో అవకాశం లేదు. నిబంధనల మేరకు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోవచ్చు. అభ్యంతరాలుంటే... సరైన ఆధారాలను ధ్రువీకరించుకుని, ప్రాథమిక సమాచార నివేదికను ఉన్నతాధికారులకు పంపాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ అనంతరం, ఉన్నతాధికారుల అనుమతి ఉంటేనే విచారణ చేపట్టాలి. ఆడిట్‌లో అభ్యంతరాలు వ్యక్తమైతే... వాటిపై వివరణ కోరి, అప్పటికీ సంతృప్తి చెందకపోతేనే సంస్థ వరకూ అధికారులు వెళ్లే అవకాశం ఉంటుంది. ఆడిట్ అభ్యంతరాలపై కూడా ఎంపికచేసిన వాటినే పరిశీలిస్తారు.

రాజస్వ జ్ఞాన సంగమం ఏంటి?

పన్నులకు సంబంధించి దేశంలోనే తొలిసారిగా దిల్లీలో సెప్టెంబరు 1, 2 తేదీల్లో జరుగుతున్న కీలక సమావేశమిది. తొలిరోజు ప్రారంభ కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగిస్తారు. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల అధికారులతోపాటు, రాష్ట్ర పన్నులశాఖల ముఖ్య అధికారులు పాల్గొని, వివిధ అంశాలపై చర్చిస్తారు. వచ్చేనెల 9న హైదరాబాద్‌లో జీఎస్టీ మండలి సమావేశం కానుంది.



బుధవారం దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న కోదండరాం, అద్దంకి దయాకర్, స్వామి అగ్నివేశ్ తదితరులు

దళితులపై దాడులు అప్రజాస్వామికం

- **తెలంగాణ మాలమహానాడు ఆధ్వర్యంలో దిల్లీలో ధర్నా**

ఈనాడు, దిల్లీ: దళితులపై దేశవ్యాప్తంగా జరుగుతున్న దాడులను నిరసిస్తూ తెలంగాణ మాలమహానాడు ఆధ్వర్యంలో బుధవారం దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజకీయ ఐకాస ఛైర్మన్ కోదండరాం మాట్లాడుతూ.. కులం, మతం పేరుతో దాడులు దేశ సమగ్రతను దెబ్బతీస్తాయన్నారు. తెలంగాణలో మంథని, నేరెళ్ల ఘటనలు ప్రభుత్వ తప్పిదమని తెలిపారు. సామాజిక వేత్త స్వామి అగ్నివేశ్, ఏఐసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొప్పుల రాజు మాట్లాడుతూ.. దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులకు కేసీఆర్, మోదీలు బాధ్యత వహించాలన్నారు. దేశంలో దళితులు అభద్రతా వాతావరణంలో జీవిస్తున్నారని అన్నారు. ధర్నాలో భరత్‌భూషణ్, పిల్లి సుధాకర్, అద్దంకి దయాకర్, భైరి రమేశ్, రవీందర్, గోపాల్ శర్మ, అంబటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నవభారత నిర్మాణంలో ముస్లింల భాగస్వామ్యం

భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

ఈనాడు, హైదరాబాద్: కుల, మత, లింగ వివక్షకు తావులేకుండా చేయడంతో పాటు అవినీతి నిర్మూలనకు ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చిన 'నవభారత నిర్మాణం'లో ముస్లింలు కూడా భాగస్వాములయ్యేందుకు ముందుకు వస్తున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. ముమ్మారు తలాక్‌ను ఆరునెలల పాటు నిషేధిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో.. బుధవారం పెద్దసంఖ్యలో ముస్లిం మహిళలు హైదరాబాద్‌లోని భాజపా కార్యాలయానికి వచ్చి లక్ష్మణ్‌ను కలిశారు. పుష్పగుచ్ఛం అందించి ధన్యవాదాలు తెలిపారు. మిఠాయిలు పంచి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.



ముమ్మారు తలాక్‌పై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ లక్ష్మణ్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న ముస్లిం మహిళలు

ట్రంప్ ఓ జుగుప్సాకర వ్యక్తి: హిల్లరీ క్లింటన్

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిజంగా ఓ 'జుగుప్సాకరమైన' వ్యక్తి సుమా! అంటూ హిల్లరీ క్లింటన్‌వ్యాఖ్యానించారు. అధ్యక్ష ఎన్నికల ప్రచారం రోజుల్లో పోటాపోటీగా జరిగిన చర్చా కార్యక్రమాల్లో ఒకసారి ట్రంప్ వ్యవహరించిన తీరుతో తనకు ఒళ్లంతా తేళ్లూ..జెర్రులు పాకినంత కంపరం పుట్టిందని ఆమె అన్నారు. హిల్లరీరాసిన 'వాట్ హ్యాపెండ్' పుస్తకంలో ఈ వ్యాఖ్యలు చేశారు. అందులోని కొన్ని భాగాలను అమెరికా టీవీ నెట్‌వర్క్ ఎంఎస్ఎన్‌బీసీలో చదివి వినిపించారు.

మీడియాపై ట్రంప్ విమర్శలు

వాషింగ్టన్: అమెరికా మీడియాలో అత్యధికులు ఏ మాత్రం నిజాయితీ లేనివారంటూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దుమ్మెత్తిపోశారు. జాతి విద్వేషకులకు ఓ వేదికను ఇస్తున్న లాబీయింగ్ సాధనాలుగా మీడియాను అభివర్ణించారు. మంగళవారం అరిజోనా, ఫీనిక్స్‌లలో జరిగిన ర్యాలీల్లో 'ది న్యూయార్క్‌టైమ్స్', 'ది వాషింగ్టన్‌పోస్ట్', సీఎన్ఎన్‌లపై ట్రంప్ విమర్శలు గుప్పించారు. 'ఫాక్స్ న్యూస్'పై మాత్రం ప్రశంసలు కురిపించారు.

ట్రంప్ ర్యాలీ వద్ద భారీ నిరసనలు: ఫీనిక్స్‌లో టంప్ పాల్గొన్న ఓ భారీ బహిరంగ సభా వేదిక వెలుపల భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు పెప్పర్ స్ప్రేను ప్రయోగించారు.

విజయన్‌కు విముక్తిని సమర్థించిన హైకోర్టు

కొచ్చి: రెండు దశాబ్దాల నాటి అవినీతి కేసులో ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు విముక్తి కల్పిస్తూ.. విచారణ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును కేరళ హైకోర్టు సమర్థించింది. సీబీఐ తప్పుగా ఆయనపై విచారణ చేపట్టిందని వ్యాఖ్యానించింది. ఈ కేసుపై జస్టిస్ పి.ఉబైద్ బుధవారం తీర్పునిచ్చారు. మరో ఇద్దరు నిందితులకూ విచారణ న్యాయస్థానం విముక్తి నివ్వడాన్ని ఆయన సమర్థించారు. 1996 ఫిబ్రవరిలో మూడు జలవిద్యుత్ ప్రాజెక్టుల ఆధునికీకరణపై కెనడా సంస్థ ఎస్ఎన్‌సీ లావాలిన్, కేరళ రాష్ట్ర విద్యుత్ బోర్డు (కేఎస్ఈబీ)ల మధ్య ఒప్పందం కుదిరింది. అయితే అదే ఏడాది మేలో కొలువుదీరిన ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ హయాంలో ఈ ఒప్పందంలో మార్పులు జరిగాయి. ఆనాడు విద్యుత్ మంత్రిగా విజయన్ పనిచేశారు. మార్పుల వల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.374.50 కోట్లు నష్టం వచ్చినట్లు ఆరోపణలు వినిపించాయి. 'ఇది క్యాబినెట్ ఆమోదించిన ప్రాజెక్టు. కేఎస్ఈబీ చేసిన తప్పులకు విద్యుత్ మంత్రివైపు వేలుచూపించి విచారణ చేపట్టడం సరికాదు'అని ఉబైద్ వ్యాఖ్యానించారు.

ప్రకృతి వ్యవసాయంపై మొబైల్ యాప్

హైదరాబాద్, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలంలోని కొర్నెపాడు వ్యవసాయ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంలో పంటల సాగుపై తెలిపేలా మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు రైతు నేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ ఎడ్లపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ రైతులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారునికి లాభసాటి ధరకు అమ్ముకోవడానికి ఈ యాప్ దోహదపడుతుందని చెప్పారు. దీంతో పాటు వివిధ రకాల వ్యవసాయ వార్తలు, రైతుల విజయగాథలు ఎప్పటికప్పుడు ఇందులో పొందుపరచనున్నట్లు వివరించారు. ఆండ్రాయిడ్ మొబైల్‌లోని ప్లేస్టోర్‌లో రైతునేస్తం అని టైప్‌చేసి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 94905 59999లో సంప్రదించాలని సూచించారు.

ముమ్మరంగా తట్టు, రుబెల్లా టీకా

- ఐదు రోజుల్లో 37 శాతం మందికి..
- అమలులో వెనకంజలో హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలు
- టీకాను నిరాకరిస్తున్న కొన్ని కార్పొరేట్ పాఠశాలలు



ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో తట్టు, రుబెల్లా(ఎంఆర్) టీకాల కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ఐదు రోజుల్లో దాదాపు 37 శాతం మంది పిల్లలకు ఎంఆర్ టీకా వేశారు. గడువు (వచ్చే నెల 27) ముగిసేలోగా వంద శాతం లక్ష్యాన్ని చేరుకునే దిశగా వైద్య ఆరోగ్యశాఖ క్షేత్ర స్థాయిలో ప్రణాళికలు అమలు చేస్తోంది. ఇప్పటి వరకూ టీకాల అమలులో రాజన్న సిరిసిల్ల (52.42 శాతం) జిల్లా అగ్రస్థానంలో ఉండగా.. హైదరాబాద్ (18.56 శాతం), మేడ్చల్ మల్కాజిగిరి(14.50శాతం) జిల్లాలు దిగువన ఉన్నాయి. ఇప్పటికి మొత్తం 33,85,260 మందికి టీకాలను అందించారు.

తొలిసారి సార్వత్రిక జాబితాలోకి..: ఒకే టీకాతో ప్రాణాంతక తట్టు(మీజిల్స్), రుబెల్లా వ్యాధుల నుంచి రక్షణ కల్పించేందుకు కేంద్రం జాతీయ సార్వత్రిక టీకా జాబితాలోకి తొలిసారిగా తట్టు, రుబెల్లా(ఎంఆర్) పేరిట సరికొత్త టీకాను ప్రవేశపెట్టింది. కర్ణాటక, తమిళనాడు, గోవా, పుదుచ్చేరి, లక్షద్వీప్‌లలో ఎంఆర్ టీకాను గత ఐదు నెలలుగా విజయవంతంగా అమలుచేస్తోంది. రెండో విడతలో భాగంగా తెలంగాణ, ఏపీ సహా మొత్తం 12 రాష్ట్రాల్లో ఈ నెల 17 నుంచి ప్రారంభించింది. 9 నెలల నుంచి 15 ఏళ్ల మధ్యవయస్కున్న పిల్లలందరూ ఈ టీకా పరిధిలోకి వస్తారు. రాష్ట్ర జనాభాలో 90,01,117 (26శాతం) మంది చిన్నారులకు ఈ టీకాను అందించాలని లక్ష్యంగా నిర్ణయించింది. అయితే, హైదరాబాద్ సహా పరిసర జిల్లాల్లోని కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు తమ విద్యార్థులకు ఈ టీకాలివ్వడానికి నిరాకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయా పాఠశాలలకు ప్రభుత్వం తరఫున తాఖీదులను ఇవ్వనున్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి.

టీకాపై అపోహలొద్దు..: ఎంఆర్ టీకాపై ప్రజల్లో నెలకొన్న అపోహలు తొలగించడానికి వైద్య ఆరోగ్య శాఖ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. "ఇది చాలా సురక్షితమైన, ప్రభావవంతమైన టీకా. 40 ఏళ్లుగా ప్రపంచంలోని పలు దేశాల్లో వినియోగిస్తున్నారు. దీని వల్ల అతి కొందరిలో స్వల్పంగా జ్వరం, దద్దుర్లు, కండరాల నొప్పి ఉంటాయి. అనవసర భయాందోళనలు వదిలేయాలి" అని జాతీయ ఆరోగ్య మిషన్ పథకాల ముఖ్య అధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు.

చక్కెర కొరత సృష్టిస్తే చర్యలు: సీవీ ఆనంద్

ఈనాడు, హైదరాబాద్: చక్కెర కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచేందుకు ప్రయత్నాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. చక్కెర నిల్వల విషయంలో కేంద్ర ప్రభుత్వం గతంలో జారీ చేసిన ఉత్తర్వులను మరో ఆరు నెలలపాటు పొడిగించింది. ముందస్తుగా లైసెన్సులు తీసుకున్న వారు మాత్రమే నిర్ధారిత మొత్తంలో నిల్వలు ఉంచాలి. అంతకు మించి నిల్వ చేస్తే కేసులు నమోదు చేస్తారు. లైసెన్సులు పొందిన వారు హైదరబాద్ మహానగర పాలకసంస్థ పరిధిలో టోకు వ్యాపారులు రెండు వేల క్వింటాళ్లు, చిల్లర వర్తకులు రూ. 50 క్వింటాళ్లు, ఇతర ప్రాంతాల్లోని టోకు వ్యాపారులు వెయ్యి కింటాళు, చిల్లర వర్తకులు 40 క్వింటాళ్లు మాత్రమే నిల్వ చేయాల్సి ఉంటుంది. రాష్ట్రంలో లైసెన్సులు లేని వ్యాపారులు పెద్ద మొత్తంలో చక్కెర విక్రయాలు జరుపుతున్నారని పలువురు వ్యాపారులు పౌరసరఫరాల శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

'సూపర్ స్పెషాలిటీ' వైద్య సీట్లపై నేడు తీర్పు!

- భర్తీ వివాదంపై ముగిసిన వాదనలు

ఈనాడు, హైదరాబాద్: ఎన్టీఆర్, కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయాల పరిధిలో డీఎం, ఎంసీహెచ్ సూపర్ స్పెషాలిటీ కోర్సుల సీట్ల భర్తీ వివాదంపై ఉమ్మడి హైకోర్టులో బుధవారం వాదనలు ముగిశాయి. గురువారం తీర్పును వెలువరిస్తామని ధర్మాసనం వెల్లడించింది. 371-డి అమల్లో ఉండగా... ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పరిధిలోని ఎన్టీఆర్, కాళోజీ వర్సిటీల్లో సూపర్ స్పెషాలిటీ కోర్సుల సీట్ల భర్తీని జాతీయ కౌన్సెలింగ్ ద్వారా చేపట్టాలంటూ కేంద్ర ఆరోగ్యశాఖ మే 4న ఉత్తర్వులిచ్చింది. దీనిని సవాలుచేస్తూ డాక్టర్ బి.సతీష్‌కుమార్, మరో 12 మంది న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇతర రాష్ట్రాల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు 'నీట్' కింద కేటాయించిన సీట్లను తిరస్కరించడాన్ని సవాలుచేస్తూ మరికొన్ని పిటిషన్లు దాఖలయ్యాయి. నీట్ ఆధారంగా తెలుగు రాష్ట్రాల్లో ప్రవేశాలు చేపట్టరాదని ఇటీవల మధ్యంతర ఉత్తర్వులు జారీచేసిన జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ టి.రజనిల ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. సుదీర్ఘ వాదనల అనంతరం తీర్పును వాయిదా వేసింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.సత్యంరెడ్డి వాదనలు వినిపించారు. రాజ్యాంగంలోని అధికరణం 371-డి ప్రకారం తెలంగాణలో 85% సీట్లను స్థానిక అభ్యర్థులతో, మిగిలిన 15% సీట్లను ఆంధ్రప్రదేశ్ అభ్యర్థులతో... ఏపీలో 85% స్థానిక, 15% తెలంగాణ అభ్యర్థులతో సీట్లను భర్తీ చేయాల్సి ఉందన్నారు. రెండు రాష్ట్రాల్లోని సీట్లను జాతీయ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయడానికి వీల్లేదన్నారు. ఇందుకు సంబంధించి తమకు రాజ్యాంగపరమైన రక్షణ ఉందన్నారు.

371–డి కొనసాగింపు సరికాదు...

ఇతర రాష్ట్రాల్లో సీట్ల నిరాకరణకు గురైన పలువురు తెలుగు విద్యార్థుల తరఫున సీనియర్ న్యాయవాదులు ఎస్.రామచంద్రరావు, సి.వి.మోహన్‌రెడ్డి, డి.వి.సీతారాంమూర్తి, ఎల్.రవిచందర్ తదితరులు వాదనలు వినిపించారు. 371-డి ద్వారా 85% సీట్లకే స్థానిక రిజర్వేషన్ వర్తిస్తుందని, మిగిలిన 15% సీట్లను ఎవరితోనైనా భర్తీ చేయవచ్చన్నారు. దీనిని కేవలం తెలుగు రాష్ట్రాలకు పరిమితం చేయడం సరికాదన్నారు. గతంలో వెనుకబడిన రాష్ట్రాలు కావడంతో 371-డిని అమల్లోకి తీసుకొచ్చారనీ, ఇప్పటికీ దీన్ని కొనసాగించాలనడం సరికాదన్నారు. తమిళనాడులో ఎంబీబీఎస్, విజయవాడలో ఎండీ కోర్సులను మేనేజ్‌మెంట్ కోటా కింద పూర్తిచేసిన వారికి 371-డితో సంబంధంలేదని, వీరికి 'నీట్' ద్వారానే ప్రవేశాలు కల్పించాలని కోరారు. వాదనలను విన్న ధర్మాసనం... నీట్ సీట్ల భర్తీ నిబంధనల వ్యవహారంలో సుప్రీంకోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని పరిగణనలోకి తీసుకుని గురువారం తగిన ఉత్తర్వులు వెలువరిస్తామని స్పష్టం చేసింది.

వడపోత పరీక్షపై మల్లగుల్లాలు

- మార్గదర్శకాల్లో ఆ ప్రస్తావన లేదంటున్న ప్రభుత్వం
- సహాయ ఆచార్యుల భర్తీ విధానంపై వారం రోజుల్లో కమిటీ తుది నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: విశ్వవిద్యాలయాల్లో సహాయ ఆచార్యుల భర్తీకి వడపోత పరీక్ష నిర్వహించాలా? వద్దా? అన్న దానిపై ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. రాష్ట్రంలోని 11 విశ్వవిద్యాలయాల్లో 1500 మంది అధ్యాపకుల ఖాళీలు ఉండగా అందులో 1061 ఖాళీల భర్తీకి ముఖ్యమంత్రి మూడు నెలల క్రితమే ఆమోదం తెలిపారు. వందలాది దరఖాస్తులొస్తే వారం దరికీ ముఖాముఖీ నిర్వహించాలంటే తీవ్ర జాప్యం జరుగుతుందని.. అందుకు విశ్వవిద్యాలయాలవారీగా వడపోత పరీక్ష(స్క్రీనింగ్ టెస్టు) జరుపుకోవడం మంచిదని ఉపకులపతులు అభిప్రాయపడుతున్నారు. ఒక్కో ఖాళీకి కొందరిని ఎంపిక చేసి ముఖాముఖీ నిర్వహిస్తే సరిపోతుందని, రాజకీయ ఒత్తిడి కూడా ఉండదని వారు భావిస్తున్నారు. ఈ ఆలోచన బాగానే ఉన్నా.. యూజీసీ మార్గదర్శకాల్లోగానీ, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 14లోగానీ వడపోత పరీక్ష ప్రస్తావన లేదని, చివరకు అది న్యాయపరమైన సమస్యలకు దారితీయొచ్చునేమోనన్న అనుమానాన్ని విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆచార్య వ్యక్తంచేసినట్లు సమాచారం. మరోవైపు ఈ వ్యవహారంపై ముగ్గురు ఉపకులపతులతో కమిటీ నియమించినందున త్వరగా తేల్చాలని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఆదేశించారు. కమిటీ మాత్రం మరో వారం రోజుల్లో తుది నిర్ణయానికి వస్తామని చెబుతోంది. ఉద్యోగ ప్రకటన జారీ చేసిన సమయంలో దరఖాస్తులు ఎక్కువగా ఉంటే వడపోత పరీక్ష నిర్వహిస్తామని ప్రస్తావించి జరుపుకోవచ్చని, విశ్వవిద్యాలయాలకు ఆ స్వేచ్ఛ ఉందని ఓ ఉపకులపతి అభిప్రాయపడ్డారు.

సున్నపురాయి గనుల లీజు గడువు పొడిగింపు

ఈనాడు, హైదరాబాద్: సూర్యాపేట జిల్లా మటంపల్లి మండలం పెదవేడులో 'ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్'కు గతంలో కేటాయించిన సున్నపురాయి గనుల లీజు వ్యవధిని పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. 1996లో పెదవేడులోని సర్వేనంబరు 540లో 105.32 ఎకరాల భూమిని సున్నపురాయి తవ్వకాలకు 20 ఏళ్ల వ్యవధికి లీజుకు ఇచ్చారు. 2016 అక్టోబరు 28కి ఆ గడువు ముగిసింది. లీజు వ్యవధిని 20 ఏళ్ల నుంచి 50 సంవత్సరాలకు పెంచాలని కోరగా ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

1,516 ఎకరాల లీజు పొడిగింపు

వికారాబాద్ జిల్లా తాండూరు మండలంలో ఉన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు కేటాయించిన సున్నపురాయి గనులలీజును 2030 వరకు ప్రభుత్వం పొడిగించింది. సంగం కలాన్, ఒగిపూర్, కరన్‌కోట్ గ్రామాల్లో వేర్వేరు సర్వేనంబర్లలోని భూమిని 1,974, 1,983 సంవత్సరాల్లో రెండువిడతలుగా కలిపి 1,516.07 ఎకరాలను 20 ఏళ్ల వ్యవధికి గనులశాఖ లీజుకు ఇచ్చింది. ఆ తర్వాత మరో పదేళ్లు పొడిగించారు. తాజాగా ఆ కంపెనీ అభ్యర్థన మేరకు 2030 వరకు లీజు వ్యవధిని పొడిగిస్తున్నట్లు పరిశ్రమలశాఖ పేర్కొంది.

అభివృద్ధి పనులపై తెలంగాణ పీఆర్సీ సమీక్ష

ఈనాడు, దిల్లీ: దేశ రాజధానిలోని తెలంగాణ భవన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అరవిందకుమార్ సమీక్షించారు. మౌలికవసతుల కల్పన, స్వచ్ఛత, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బుధవారం ఆయన భవన్‌లోని వివిధ బ్లాకులను తనిఖీ చేశారు. అపరిష్కృత పనులపై సిబ్బందితో సమీక్షించారు. పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు.

రాష్ట్రంలో లక్షన్నర మంది విద్యార్థులకు న్యాస్ పరీక్ష

ఈనాడు, హైదరాబాద్: జాతీయ సాధన సర్వే(న్యాస్)లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో లక్షన్నర మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్‌తోపాటు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కూడా ఈ పరీక్షలు రాయాల్సి ఉంటుంది. విద్యాప్రమాణాలు ఎలా ఉన్నాయో గుర్తించేందుకు 3, 5, 8 తరగతులకు నవంబరు 13న ఈ పరీక్ష జరుపుతారు. పరీక్షల పర్యవేక్షణకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలు నియమిస్తున్నామని, ఎలాంటి చూసిరాతలకు పాల్పడకుండా వార్షిక పరీక్షల తరహాల్లో నిర్వహిస్తామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కిషన్ తెలిపారు.

మరిన్ని క్షిపణులు అభివృద్ధి చేయండి

- ఉత్తర కొరియా శాస్త్రవేత్తలకు అధ్యక్షుడు కిమ్ ఆదేశాలు

సియోల్, టోక్యో: ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు (ఐసీబీఎం), రాకెట్ ఇంజిన్లు మరిన్ని అభివృద్ధి చేయాలని ఉత్తర కొరియా శాస్త్రవేత్తలకు దేశాధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఆ దేశ ప్రభుత్వ మీడియాలో బుధవారం కథనాలు వెలువడ్డాయి. గత నెలలో రెండు బాలిస్టిక్ క్షిపణులను ఉత్తర కొరియా ప్రయోగించిన సంగతి తెలిసిందే. ఇవి అమెరికాపై దాడి చేయగలవని కూడా కిమ్ వ్యాఖ్యానించారు. తాజాగా రక్షణ అకాడమీకి చెందిన కెమికల్ మెటీరియల్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఐ)ను కిమ్ సందర్శించినట్లు కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కేసీఎన్ఏ) తెలిపింది. 'ఘన ఇంధన రాకెట్ ఇంజిన్లు, రాకెట్ వార్‌హెడ్లు మరిన్ని తయారుచేయాలని సీఎంఐను కిమ్ ఆదేశించారు'అని పేర్కొంది.

చిత్రాల్లో కనిపిస్తున్న క్షిపణుల నమూనా: కిమ్ సీఎంఐ పర్యటనపై కేసీఎన్ఏతోపాటు ప్రభుత్వ పత్రిక రోడోంగ్ సిన్మున్‌లో కొన్ని చిత్రాలు ప్రచురితమయ్యాయి. వీటిలో కిమ్ వెనుక రెండు క్షిపణుల నమూనాలు కనిపిస్తున్నాయి. ప్యుక్‌గ్యుక్‌సంగ్ లేదా పొలారిస్ తరగతికి చెందిన అధునాతన 'ప్యుక్‌గ్యుక్‌సంగ్-3' క్షిపణి నమూనా వీటిలో ఒకటిగా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రెండో నమూనా అంతుచిక్కలేదు. దక్షిణ కొరియా, అమెరికా సంయుక్త సైనిక విన్యాసాలు మొదలుపెట్టి రెండు రోజులు కూడా గడవకముందే ఈ చిత్రాలు ప్రచురించడం గమనార్హం.

చైనా రెండో విమాన వాహక నౌకకు పరీక్షలు

బీజింగ్: ప్రతిష్ఠాత్మక రెండో విమాన వాహక నౌకను చైనా త్వరలో పరీక్షించనుంది. దీనికి సంబంధించిన పనులన్నీ అనుకున్న సమయం కంటే ముందుగానే పూర్తవుతున్నాయని నౌకానిర్మాణ పరిశ్రమ కార్పొరేషన్ (సీఎస్ఐసీ) అధిపతి హ్యూ వెన్మింగ్ తెలిపారు. టైప్-001ఏ పిలుస్తున్న ఈ స్వదేశీ నౌకను సీఎస్ఐసీనే అభివృద్ధిచేసింది. అక్టోబరులో జరుగనున్న కమ్యూనిస్టు పార్టీ సమావేశాల్లో దీన్ని కీలక విజయంగా దేశ అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ప్రస్తావించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చైనా అమ్ములపొదిలో లియానింగ్ విమాన వాహక నౌక ఉంది. 2012లో ఇది నావికాదళంలో చేరింది. ప్రతి ఐదేళ్లకోసారి చైనాలో కమ్యూనిస్టు పార్టీ సమావేశాలు జరుగుతాయి. అధ్యక్షుడిగా, పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఐదేళ్లు పూర్తిచేసుకోబోతున్న షీ జిన్‌పింగ్‌కే మళ్లీ అధికారం అప్పగించాలని వీటిలో నిర్ణయించనున్నట్లు సమాచారం.

భార్య అంటే నచ్చి తెచ్చుకునే బాధ్యత... పిల్లలంటే మోయాలనిపించే బరువు. కుటుంబబంధాలని ఎంత అందంగా వర్ణించారు రచయిత! అంత విలువైన బంధాలని కేవలం 'ఒక్క మాట'తో అది కూడా ఓ చిటీ ముక్కమీదో, వాట్సాప్‌లోనో, ఫోన్‌లో చెప్పేసి వదిలించుకోవచ్చా? నడిరోడ్డున పడ్డ ఆ మహిళల జీవితాలు ఏమవ్వాలి? అలా తమకష్టాలని కన్నీళ్లనీ పోరాట ఆయుధాలుగా మలుచుకున్న స్త్రీలు సాధించిన విజయమే తలాక్‌పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు...

వసుంధర

ఆ మాటలు చెల్లవిక!



అందరి ఆడపిల్లలాగే సాయరాబానో కూడా పదిహేనేళ్ల క్రితం ఎన్నెన్నో కలలతో పెళ్లిపీటలెక్కింది. కలలంటే మరీ పెద్దపెద్ద ఆశలేం కావు. మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన అమ్మాయి సాధారణంగా ఆశపడే జీవితాన్నే తనూ కోరుకుంది. భర్త, పిల్లలతో సంతోషంగా జీవితం గడిపితే చాలనుకుంది. అలాని సాయరాకి చదువుసంధ్యలేవీ లేవనుకోకండి. ఉత్తరాఖండ్‌లోని కాశీపుర్‌కు చెందిన సాయరా ఎంఏ సోషియాలజీ, ఎంబీయే చదివింది. భర్త రిజ్వాన్‌అహ్మద్ ప్రాపర్టీ డీలర్‌గా పనిచేసేవాడు. సాయరా జీవితం తాను కోరు కున్నట్టుగా ఉంటే ఇప్పుడు ఆమెకి ఇద్దరు పిల్లలు. ఆ పిల్లల మధ్యలో అత్తమామల బలవంతం వల్ల ఆరు సార్లు గర్భస్రావం చేయించుకుంది సాయరా. ఆ మాటకొస్తే ఆరు సార్లో, ఏడు సార్లో కూడా తనకు లెక్క తెలియదు అంటుంది సాయరా. పెళ్లైన మరుసటి రోజు నుంచే అదనపు కట్నం కోసం వేధింపులు. పుట్టింటికి వెళ్లి తన కష్టాలన్నీ చెప్పుకుంది. వాళ్లు మాత్రం ఏం చేస్తారు? ఇలాంటి కన్నీళ్లు ఆడపిల్లల జీవితాల్లో కొత్తేం కాదుగా అన్నట్టుగా ఊరుకున్నారు. ఇంట్లో ప్రతి రోజూ హింసే. కొన్నిరోజులకు పుట్టింటికి వెళ్లే అవకాశం కూడా కోల్పోయింది సాయరా. కనీసం చెల్లెలితో మాట్లాడే అవకాశం కూడా లేకుండా పోయింది. దాంతో అంతులేని నిరాశ, నిస్పృహల మధ్య తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంది. చివరకు ఓ రోజు రిజ్వాన్ తన ఇద్దరు పిల్లలని, భార్యని కాపురికి పంపించేశాడు. మళ్లీ ఏమనుకున్నాడో తెలియదు కానీ తన పిల్లలని మాత్రం తిరిగి తీసుకెళ్లి పోయి భార్యను వదిలేశాడు. ఎన్ని కష్టాలనైనా భరించింది కానీ... పిల్లలు లేని ఒంటరితనాన్ని మాత్రం సాయరా భరించలేకపోయింది. మనిషి నిట్టనిలువునా కూలిపోయింది. ఫోన్ చేస్తే తీయడు. అతనే ఎప్పుడైనా ఫోన్ చేసేవాడు. అది కూడా మరో మహిళను పెళ్లి చేసుకుంటాను జాగ్రత్త అని బెదిరించడానికే! అలా కన్నీళ్లు... బెదిరింపులతో సాగిపోతున్న ఆమె జీవితంలో మరో షాక్! ఓ రోజు ఆమెకి స్పీడ్‌పోస్ట్ వచ్చింది. అందులో ఏవో కొన్ని కాగితాలు. తెరిచి చూస్తే తలాక్...తలాక్...తలాక్ అంటూ రాసిన విడాకుల పత్రం. దాంతో పాటూ 15000 రూపాయల డబ్బు. అది పెళ్లి సమయంలో తనకిస్తానని ఒప్పుకున్న మెహర్ సొమ్ము. సాయరాకి ఏం చేయాలో పాలుపోలేదు. స్థానిక మతగురువుని అడిగింది. తాను కోరుకున్న సమాధానం రాలేదు. పదిహేనేళ్ల వివాహబంధం కేవలం ఓ స్పీడ్‌పోస్ట్ తుంచేసిందంటే ఆమెకు ఆశ్చర్యం కలిగించింది.

ఇలాంటివారు ఎందరో... ఈ సమస్య సాయరాది మాత్రమే కాదు. మెసేజ్‌ల రూపంలో, వాట్సాప్, ట్విటర్, ఫేస్‌బుక్, స్కైప్‌లలో విడాకులు అందుకుంటున్న మహిళలు తన చుట్టూ ఎందరో! దీనిని ప్రశ్నిస్తూ ఓ పిటిషన్‌ని దాఖలు చేసింది సాయిరా. అప్పటి నుంచి ఆమెకు బెదిరింపులు మొదలయ్యాయి. ఊరు వదిలిపెట్టాల్సి వచ్చింది. అయితేనేం దేశవ్యాప్తంగా ఉన్న యాభైవేలమంది మహిళల మద్దతుని కూడ గట్టుకుంది. ఈ సందర్భంలో మరో పోరాటశీలి గురించి కూడా తలుచుకోవాలి. ఆమే షాబానో. మూడు దశాబ్దాల క్రితం... ఇలానే తలాక్ పద్ధతిలో విడాకులు అందుకున్న షాబానో కోర్టు గుమ్మమెక్కి భరణాన్ని అందుకోవడానికి ప్రయత్నించింది. అలా షాబానోతో మొదలయిన 'తలాక్' పోరు... సాయూరా బానోకు వచ్చేటప్పటికి ఎందరో మహిళలు ఆమెకు తోడుగా నిలిచారు. అఫ్రీన్ రెహ్మాన్.. రాజస్థాన్ జయపురకు చెందిన అఫ్రీన్ ఉన్నత విద్యావంతురాలే. ఓ వివాహవెబ్‌సైట్ చూసిన తనని పెళ్లి చేసుకున్నప్పుడు ఎంతో మురిసిపోయిన అఫ్రీన్‌కు మూడు నెలలకే స్పీడ్‌పోస్ట్‌లో ముమ్మారు తలాక్‌ని అందుకుంది. ఈ తీరుని తీవ్రంగా వ్యతిరేకిస్తూ పోరాటం మొదలుపెట్టింది. పశ్చిమబంగకు చెందిన జహాన్ కయితే ఆమె భర్త ఫోన్‌లో మూడుసార్లు తలాక్ చెప్పి వదిలించుకున్నాడు. కారణం తొలి మూడు కాన్పుల్లో కొడుకు పుట్టకపోవడమేనట. పర్వీన్, సబ్రీలు ఇద్దరూ ఉత్తరప్రదేశ్‌కి చెందిన వారే. ఇందులో ఒకరు స్టాంప్ కాగితాలపై రాసిచ్చే తలాక్‌నామా అందుకుంటే మరొకరు ఓ చిత్తు కాగితంపైన రాసిన ముమ్మారు తలాక్‌తోనే వివాహబంధానికి స్వస్తి చెప్పుకోవాల్సి వచ్చింది. వీరంతా కలిసి నిఖా హలాలా, బహుభార్యత్వం, తలాక్‌లపై పోరాటం మొదలపెట్టారు. తాజాగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో వాళ్లంతా విజయం సాధించినట్టే. వందల సంవత్సరాల నాటి చట్టానికి దీటుగా జవాబిచ్చారు. ఇప్పుడు వాళ్లు డైవోర్సీలు కారు అని ప్రభుత్వం తీర్పునిచ్చింది. 22 ముస్లిం దేశాల్లో ఇప్పటికే నిషేధించిన ఈ చట్టాన్ని మనదేశంలోనూ ఈ మహిళలు గట్టి దెబ్బతీయడం విశేషం. సాయరా తన పోరాటాన్ని ఇంతటితో ఆపేయడం లేదు. తన పిల్లల పోషణ కోసం మళ్లీ పోరాటం మొదలుపెడుతుంది. త్వరలో ఏదో ఒక ఉద్యోగంలో చేరి.. ముస్లిం మహిళల హక్కుల కోసం పోరాడతానంటోంది.

> ఎన్ని కష్టాలనైనా భరించింది కానీ... పిల్లలు లేని ఒంటరితనాన్ని మాత్రం సాయరా భరించలేకపోయింది. మనిషి నిట్టనిలువునా కూలిపోయింది. ఫోన్ చేస్తే తీయడు. అతనే ఎప్పుడైనా ఫోన్ చేసేవాడు. అది కూడా మరో మహిళను పెళ్లి చేసుకుంటాను జాగ్రత్త అని బెదిరించడానికే!

ఆశిష్ బాసి... ఈతలో అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించాడు. రితేష్ కాసియోపై అద్భుతమైన స్వరాలు పలికించగలడు. పర్వీన్ చక్కగా వంట చేస్తుంది! మామూలుగా అయితే ఇవేవీ మరీ అద్భుతమైన విషయాలు కాకపోవచ్చు. కానీ వాళ్లంతా మానసిక వికలాంగులు అని చెప్పినప్పుడు మాత్రం అద్భుతంగానే అనిపిస్తుంది. సంస్కృతీశిఖర్ పేరుతో అలాంటి మానసిక వికలాంగులైన పిల్లల కోసం కొంతమంది మహిళలు ఏర్పాటు చేసిన ఈ పాఠశాల సాధించిన విజయం ఇది!

బంగారు కొండల్లా తీర్చిదిద్దుతారు!







నీతాగాంధీ

వరుసగా, అందంగా అమర్చిన పూలకుండీలు దాటుకుని సంస్కృతీశిఖర్ పాఠశాలలో అడుగుపెడితే గుమ్మంలోనే డిస్‌ప్లే బోర్డుపై అతికించి ఉన్న హ్యాండ్‌మేడ్ పేపర్‌తో చేసిన చిన్నచిన్న బొమ్మలూ, రంగుల చిత్రాలు ముచ్చటగా స్వాగతం పలుకుతాయి. ఒక్కసారైనా చేత్తో తాకి చూడాలనేంత అందంగా ఉంటాయివి. అరల్లో మెటాలిక్ పెయింట్ వేసి అందంగా అమర్చిన పూలవాజులని చూస్తే 'ఎక్కడ కొన్నారో... ఎంత అందంగా చేశారో' అని నోరారా మెచ్చుకోవాలనిపిస్తుంది. ఎడమవైపు హాలులో ఓ వైపు చాలా దీక్షగా లాప్‌టాప్‌లో కంప్యూటర్ కోర్సులు నేర్చుకుంటున్న పిల్లలు కనిపిస్తారు. ఇంకొంచెం ముందుకెళితే ఘుమఘుమలాడే పరోటాలు చేస్తూ మరికొంతమంది పిల్లలు... పై అంతస్తులోకి వెళ్తే.. కుట్టు పనిచేసేవారూ, జిరాక్సులు తీసేవారినీ చూడొచ్చు. పలకరించిన కాసేపటి తర్వాతే తెలుస్తుంది వాళ్లకీ, మామూలు పిల్లలకు ఉన్న తేడా! వాళ్లంతా వివిధ రకాల మానసిక, శారీరక వైకల్యాలతో బాధపడున్నవారు. కానీ మామూలు పిల్లలతో సమానంగా ఉండటం వాళ్ల ప్రత్యేకత. అక్కడున్న ఏ అమ్మాయిని పలకరించినా , ఏ అబ్బాయిని కదిపినా వైకల్యాన్ని జయించి వాళ్లు సాధించిన ఏదో ఒక విజయగాథ మనలో స్ఫూర్తిని నింపుతుంది. 'తెలంగాణా రాజధాని 'హైదరాబాద్' , ఆంధ్రాకి... అమరావతి, సికింద్రాబాద్ నుంచి దిల్లీ వెళ్లే రైలు... సిర్పూర్‌కాగజ్ నగర్, మంచిర్యాల, బెల్లంపల్లి, హజ్రత్‌నిజాముద్దీన్, దిల్లీ!' ఇలా మధ్యలో ఎక్కడా వరుస మర్చిపోకుండా వాళ్లు చెబుతోంటే మనకి ఆశ్చర్యంగా ఉంటుంది. అసలు ఆ పిల్లాడికి ఉన్న వైక్యలం ఏంటా అని. ఇవే కాదు.... వివిధ ప్రాంతాల గురించీ, రైళ్ల గురించి మనకు కూడా తెలియని విషయాలని ఆశిష్ అనే విద్యార్థి టకటకా చెప్పేస్తాడు. టీ, కాఫీలు బాగా చేయడమే కాదు... ఈతలో చేపపిల్లనే తలపిస్తాడు ఆశిష్. అతను గత ఏడాది న్యూకాసిల్‌లో జరిగిన ప్రత్యేక ఒలింపిక్స్‌లో బాసి ఆటలో రెండు బంగారు పతకాలు గెల్చుకోవడం ఆశిష్ మరో ప్రత్యేకత. ఇంతకీ అతనికున్న సమస్య ఏంటంటారా? ఆటిజం. అలాని చెబితేకానీ మనకు తెలియదు. ఎందుకంటే ఆ సమస్య తాలుకూ చాలా లోపాలని అతను అధిగమించాడు మరి.

అలా ప్రారంభమైంది... 'సంస్కృతీ... ఇదో మహిళల క్లబ్. దీన్ని కుముద్దారియా, నీలం కపాడియాలతోపాటూ మరో ఐదుగురు మహిళలు కలిసి ప్రారంభించారు. 150 మంది సభ్యులున్న ఈ క్లబ్ మహిళా సాధికారత కోసం అనేక కార్యక్రమాలు చేస్తుంటుంది. అందులో భాగంగానే మనోవైకల్యంతో బాధపడుతున్న అమ్మాయిల కోసం కూడా ఏదో ఒకటి చేయాలని అనుకున్నారీ సభ్యులు. అలా పదిహేడేళ్ల క్రితం సంస్కృతీశిఖర్ పాఠశాల బాలమ్‌రాయ్‌లో ఓ అద్దె ఇంట్లో ప్రారంభమయ్యింది. మొదట్లో ముగ్గురు అమ్మాయిలతో ఈ పాఠశాల మొదలుపెట్టారు. ఉచిత రవాణా సదుపాయం ఉండేది. పిల్లలని దగ్గరుండి తీసుకొచ్చే బాధ్యత పాఠశాలదే. తర్వాత ఈ పాఠశాల బేగంపేటకు మారింది. ఇక్కడకు చేరే పిల్లలకు స్పీచ్‌థెరపీతో మొదలుపెట్టి, ఫిజియోథెరపీ, ఒకేషనల్ ట్రైనింగ్, కిచెన్ యాక్టివిటీస్, కంప్యూటర్స్, స్పోర్ట్స్‌తోపాటూ ఇంకా అనేక అంశాల్లో శిక్షణ అందుతుంది. ఒకేషనల్ శిక్షణలో భాగంగా... పర్యావరణహిత ప్లేట్ల తయారీ, పేపర్‌బ్యాగులూ, టైలరింగ్, జిరాక్సులు తీయడం వంటివీ నేర్పిస్తారు. 'మా స్కూల్లో ఏ వయసు పిల్లలనయినా చేర్చుకుంటాం. నలభై సంవత్సరాల వయసున్నవారు కూడా చేరుతుంటారు. మామూలు స్కూళ్ల మాదిరిగా ఇక్కడ తరగతులు ఉండవు. ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, వొకేషనల్, ప్రీ వొకేషనల్ అని ఉంటాయి'.. అంటూ వివరించారు ఈ పాఠశాల నిర్వాహకుల్లో ఒకరైన నీతాగాంధీ.

ఆసక్తిని బట్టే శిక్షణ... 'ఆటిజం, వినికిడిలోపం ఉన్నవాళ్లూ, మానసిక సమస్యలున్నవాళ్లూ ఈ బడిలో చేరుతుంటారు. ఒక్కొక్కరిలో ఒక్కో నైపుణ్యం ఉంటుంది. ఒకరికి ఆటలంటే ఇష్టం. ఒకరికి కంప్యూటర్ కోర్సులూ... టెక్నాలజీ వాడకం అంటే ఇష్టం. వాళ్ల వాళ్ల ఆసక్తుల్ని గుర్తించి ఆయా రంగాల్లో వారికి శిక్షణ ఇస్తుంటాం. ప్రియా సన్నిధి అనే అమ్మాయికి పద్దెనిమిదేళ్లు ఉంటాయి. జాతీయ స్థాయిలో అథ్లెట్‌గా రాణించి బంగారు పతకం అందుకుంది. అలాగే రితేష్... అంతర్జాతీయ ప్రత్యేక ఒలిపింక్స్‌లో బంగారు పతకం అందుకున్నాడు. అందరూ ఇలా బంగారు పతకాలు అందుకోకపోవచ్చు. కానీ ఇక్కడున్నవారెవ్వరూ ఎవరికీ తీసిపోరు. పర్వీన్ కాజాలూ, గుండీలూ, చీరలకు ఫాల్స్ కుడుతుంది. పర్వీన్ వాళ్ల నాన్నయితే పంక్చర్లు వేసి జీవితం నెట్టుకొచ్చే వ్యక్తి. పర్వీన్ ఇక్కడ అన్ని పనులూ నేర్చుకుంది. ఆమెకు ఇక్కడ శిక్షణ అంతా ఉచితమే. ఒక్క పర్వీన్ అనే కాదు... ఆమెలా ఫీజులు కట్టుకోలేనివారికి ఇక్కడి సేవలు ఉచితం. మిగిలిన వారు నామమాత్రపు రుసుము చెల్లిస్తే సరిపోతుంది. ఫీజులు చెల్లించలేని వారికోసం మా ట్రస్టు సభ్యులు ఫండ్‌రైజింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తాం. అలా సేకరించిన సొమ్ముని ఈ పిల్లల చదువుకోసం వినియోగిస్తాం' అంటున్నారు మరో ట్రస్టు సభ్యురాలు వీణా సంఘాని.

సొంతంగా దుకాణాన్నే నిర్వహిస్తారు.. 'ఇలాంటి వైకల్యం ఉన్న పిల్లలు దుకాణానికి వెళ్లి కొనుగోలు చేయాలంటే కాస్త ఇబ్బందే! ఈ సమస్యని అధిగమించడానికి సంస్కృతీశిఖర్ స్కూల్ కన్జ్యూమర్ స్టోర్ అనే దుకాణాన్ని ఏర్పాటు చేసింది. ఈ దుకాణంలో వస్తువులు అమ్మేదీ, కొనుగోళ్లు చేసేదీ అందరూ వైకల్యం ఉన్నవారే. అమ్మకాలు చేయడానికి వీలుగా వీళ్లకి ముందుగానే కొలతల్లో శిక్షణ ఇస్తాం. స్కూల్లోని పిల్లలు తమకు కావాల్సిన తినుబండారాలూ, స్టేషనరీ అంతా ఇక్కడే కొనుక్కుంటారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న పిల్లలు బయట సొంతంగా దుకాణాల్లో పనిచేస్తుంటారు. కాస్త పెద్దవాళ్లకు చిన్నచిన్న ఉద్యోగాలూ ఇప్పిస్తుందీ సంస్థ. ఆడపిల్లల్లో కొందరు పెళ్లిళ్లు చేసుకుని హాయిగా జీవితాలు నడుపుతున్నవారు కూడా ఉన్నారు' అని అంటున్నారు పదమూడేళ్లుగా ఈ స్కూల్ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న వందన. హోంసైన్స్ కళాశాలలో డిగ్రీ చదివి.. హైదరాబాద్ ఎన్‌ఐఎమ్‌హెచ్‌లో... మెంటల్లీరిటార్డెడ్ అధ్యయనానికి సంబంధించిన డిగ్రీని చేశారామె. ఆ తర్వాత తిరుచ్చిలో రిహాబిలిటేషన్ సైన్సుని పూర్తిచేశారు. మానసిక సమస్యలున్న పిల్లల్ని ఇంట్లోనే పెట్టుకుని సంరక్షణా బాధ్యతలు తీసుకున్నారు. వాళ్లలో అత్యాచార బాధితులు కూడా ఉండటం విశేషం. ప్రస్తుతం సంస్కృతీశిఖర్ సంస్థని వీణా సంఘానీ, శివానీ ష్రాఫ్, నీతాగాంధీ, విజయ కపాడియా, సిమ్రన్, నీలమ్, హిర్‌పుజాలా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ అరవైమంది పిల్లలు శిక్షణ పొందుతున్నారు. వీలైనంత ఎక్కువమందికి తమవంతు సాయం చేయడమే లక్ష్యం. ఎవరైనా ఇందులో చేరొచ్చు. సంప్రదించాల్సిన నంబరు 040 31925633 అంటారీ నిర్వాహకులు.

– శ్రీసత్యవాణి


సిగ సింగారం

పొడవైన జుట్టు ఉంటే సరిపోదు.. దానిని వినూత్నంగా అల్లుకోవడంలోనే అందం ఉంది. హెయిర్ టూల్‌ను ఉపయోగించి సన్నని పాయలతో అల్లుకుని, జుట్టు వదిలేస్తే ఆ కళే వేరు. మరి ఎలా అల్లాలో చూసేద్దామా!

చాపలా అల్లేద్దాం!



1



◆ జుట్టు రెండు పక్కల నుంచి రెండు పాయలను తీసుకుని మధ్యకు తెచ్చి రబ్బరుబ్యాండు పెట్టాలి. తరువాత ఎడమవైపు నుంచి సన్నని పాయ తీసి రబ్బరుబ్యాండు పెట్టిన చోట కింద నుంచి తెచ్చి ఫొటోలో చూపించిన విధంగా ముడిలా వేయాలి. మొదట తీసిన పాయ అడుగు నుంచి హెయిర్‌టూల్‌ని ఉంచి ముందు ముడిలా వేసిన పాయను ఆ టూల్ నుంచి బయటకు లాగాలి. తరువాత దాని సాయంతో ఆ పాయను కిందకు తీస్తే చక్కని ముడిలా పడుతుంది.

2






◆ ఇదే విధంగా కుడి వైపున కూడా పాయను తీసి టూల్ సాయంతో ముడిలా అల్లాలి. ఫొటోలో చూపించిన విధంగా రెండు వైపులా పాయలను తీస్తూ..ముడి వేసుకుంటూ వెళ్లాలి. అయితే పాయలను తీసేటప్పుడు కొంత జుట్టును వదులుకుంటూ ఉండాలి.

3



◆ ఇలా అటూఇటూ అల్లుకుంటూ వెళ్తే పైభాగమంతా అల్లికలా వచ్చి, మిగిలిన జుట్టు వదిలేసినట్లు ఉంటుంది.



కేతా శోభారాణి
కేశాలంకరణ నిపుణురాలు

ఈ అలంకరణకి సంబంధించిన వీడియోను www.eenadu.netలోని వసుంధర విభాగంలో చూడొచ్చు.

గర్భధారణకు ముందు.. ఇవి!

గర్భం దాల్చాక ఎలాంటి పరీక్షలూ, మాత్రలు వేసుకోవాలని ఆలోచిస్తారు కానీ.. ముందుగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని ఆలోచించరు చాలామంది. కానీ తీసుకోవాలి. అవేంటో చూసేద్దామా...



గర్భం దాల్చేముందు కనీసం మూడు నెలల ముందునుంచీ... ఫోలిక్‌యాసిడ్, ఐరన్ మాత్రల్ని వేసుకోవాలి. దానివల్ల కాబోయే తల్లికి రక్తహీనత సమస్య అదుపులో ఉంటుంది. ఇక, ఫోలిక్ యాసిడ్ వల్ల పుట్టబోయే పాపాయిలో అవకరాల సమస్యలు ఎదురుకాకుండా ఉంటాయి.

◆ ఒక అల్ట్రాసౌండ్ స్కాన్‌ని తప్పనిసరిగా చేయించుకోవాలి. దాంతో పాటూ రక్తపరీక్ష, బ్లడ్‌షుగర్, థైరాయిడ్ పరీక్షలూ తప్పనిసరే. వీటివల్ల సమస్యలేవయినా ఉంటే తెలుస్తుంది. హీమోగ్లోబిన్ శాతాన్నీ వైద్యులు అంచనా వేస్తారు. అవసరమైన జాగ్రత్తలూ సూచిస్తారు.

◆ అధిక బరువున్నారేమో గమనించుకోవాలి. అలా ఉంటే గనుక తగ్గేందుకు ప్రయత్నించాలి. అవసరం అనుకుంటే వ్యాయామం, నడక.. ఇలా ఏదో ఒకటి తప్పనిసరిగా చేయడం మొదలుపెట్టాలి. మీకు ముందే మధుమేహం, ఇన్‌ఫెక్షన్ల లాంటివి ఉంటే.. వాటిని వైద్యులతో చర్చించాలి. అలాగే అంతవరకూ తీసుకుంటోన్న మందులేవయినా ఉంటే తప్పనిసరిగా తెలియజేయాలి.

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది


నా ఇంట్లో.. ఆమెతో పాటూ ఉంటున్నాడు!

? పద్నాలుగు సంవత్సరాలకిందట నాకు పెళ్లైంది. ఇద్దరు పిల్లలు. ఓ పాప వికలాంగురాలు. నా భర్తకి లేని దురలవాట్లు లేవు. ఊరంతా అప్పులే. ఆ ఒత్తిడి తట్టుకోలేక నన్నూ, నా పిల్లల్ని హింసిస్తుండేవాడు. అది భరించలేక ఏడాదికిందట పిల్లల్ని తీసుకుని మా పుట్టింటికి వచ్చేశాను. నాలుగు నెలల కిందట విడాకులు కావాలంటూ నా భర్త న్యాయస్థానంలో దావా వేశాడు. పదేళ్లకిందట మా తండ్రిగారిచ్చిన కట్నం డబ్బూ, నాపేరుతో తీసుకున్న అప్పుతో ఓ ఇల్లు కొన్నాం. బ్యాంకుకి ఇంకా కొంత బాకీ ఉన్నాం. మేం అందులోనే ఉండేవాళ్లం. ఆ ఇల్లూ, ఇంటి పన్నూ, కరెంటు బిల్లు అన్నీ నా పేరునే ఉన్నాయి. కానీ నేను అక్కడి నుంచి బయటకొచ్చాక మా ఆయన మరో స్త్రీతో అదే ఇంట్లో కాపురం పెట్టాడు. వాళ్లని ఖాళీ చేయించి ఆ ఇంట్లో, నేనూ నా పిల్లలూ ఉండాలనుకుంటున్నాం. ఇందుకు చట్టపరంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

- ఓ సోదరి

✓ భార్యాపిల్లల్ని హింసించి, ఊరంతా అప్పులు చేసి, భార్య తెచ్చిన డబ్బుతో కొన్న ఇంట్లో వేరొక అమ్మాయితో ఉంటున్నాడంటే.. మీ భర్త నిస్సిగ్గుగా అన్నింటికీ తెగించాడు అనిపిస్తోంది. అతడిపై ఎలాంటి కేసులు వేయొచ్చో చెప్పేముందు.. ఆ ఇల్లు మీ చేతికెలా రావాలో చూద్దాం. మీభర్త న్యాయస్థానంలో పిటిషన్ వేశాడు కదా.. దానిపై కోర్టు మధ్యవర్తుల్ని నియమించి ఇద్దర్నీ మాట్లాడుకోమంటుంది. మీకు అతడితో జీవించడం ఇష్టం లేకపోతే వాళ్లతో మీకున్న సమస్యలన్నీ వివరించండి. ఇల్లు స్వాధీనం చేస్తేనే విడాకులకి ఒప్పుకుంటానని స్పష్టం చేయండి. మీ భర్త అందుకు అంగీకరిస్తే దానిపై ఇద్దరూ కలిసి ఓ మధ్యవర్తిత్వ ఒప్పందం (ఎంఓయూ) రాసుకోండి. ఆ తర్వాత ఇద్దరూ పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకోవచ్చు. ఒకవేళ విడాకులపై స్పష్టత వచ్చినా.. ఇంటి విషయం తేలకపోతే అతడిని ఇంటి నుంచి సాగనంపాలని కోరుతూ 'స్యూట్ ఫర్ పొసెషన్' దావా వేయొచ్చు. అందులో మీకు సానుకూలంగా తీర్పు వస్తే పోలీసుల సాయంతో ఇంటి నుంచి అతడిని సాగనంపి దాన్ని మీ సొంతం చేసుకోవచ్చు. కాకపోతే ఆ ఇల్లు మీ అమ్మగారు ఇచ్చిన స్త్రీ ధనంతో కొన్న ఇల్లుగా నిరూపించాల్సి ఉంటుంది. ఒకవేళ, ప్రస్తుతం మీరు విడాకులకి సుముఖంగా లేరు అని అనుకుందాం. అలాంటప్పుడు ఈ డైవర్స్ కేసు న్యాయస్థానంలో నడుస్తున్నంతకాలం, అంటే పిటిషన్ పెండింగ్‌లో ఉన్నంత కాలం అతడిని మీరు ఆ ఇంటి నుంచి బయటకు పంపడం సాధ్యం కాదు. కానీ, మీరూ అతడితోపాటూ ఆ ఇంట్లోని ఒక పోర్షన్‌లో ఉండటానికి డైవర్స్ పిటిషన్ వేసిన న్యాయస్థానంలో అనుమతి కోరవచ్చు. మీ భర్త మిమ్మల్ని హింసించడంపై గృహహింస చట్టం కింద కేసు పెట్టి.. కూడా మీరు ఆ ఇంట్లో ఉండొచ్చు. అతడు మీపై మళ్లీ దాడిచేయకుండా కోర్టు ద్వారా రక్షణ కూడా పొందే అవకాశం ఉంటుంది. అంతేకాదు, విడాకుల పిటిషన్ కింద మీకూ, మీ పిల్లలకి మధ్యంతర భృతి కింద కూడా ఆ ఇల్లు కావాలని కోరవచ్చు. ఆ ఇంటికి తీసిన అప్పులో సగం మీ భర్తా కట్టేలా చేయొచ్చు. అలా చేయాలంటే ఒకటి.. ఇందాకే చెప్పినట్టు అది మీ స్త్రీధనంతో వచ్చిందని నిరూపించాలి. రెండు.. మీకు ఇల్లు ఇచ్చేందుకూ, ఇంటిరుణంలో సగం ఇవ్వగలిగేందుకూ తగ్గ స్థోమత అతడికి ఉందని రుజువు చేయాలి. వీటన్నింటితోపాటూ, మీ భర్త మరొక స్త్రీతో కాపురం చేయడంపై అడల్ట్రీ కేసు పెట్టొచ్చు. ఒకవేళ రెండోపెళ్లి చేసుకుంటే బైగామీ కింద క్రిమినల్ కేసు వేయొచ్చు. డైవర్స్ వచ్చాక, ఇక అతడు మళ్లీ మీ జీవితంలోకి రాకుండా, మీ జోలికి రాకుండా ఉండటానికి ఇంజక్షన్ సూట్ కూడా వేసే అవకాశం మీకు ఉంటుంది.

బంగారం వెండి



23న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	-------	-------	29,900	29,950
ఆర్నమెంట్	-------	-------	27,750	27,750
వెండి (కిలో)	-------	-------	40,200	40,200
	ప్రొద్దుటూరు		**రాజమండ్రి**	
బంగారం(24క్యా)	29,900	29,830	29,630	29,650
ఆర్నమెంట్	27,680	27,710	27,700	27,720
వెండి (కిలో)	40,000	39,900	39,300	39,200
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	29,990	29,990	-------	-------
ఆర్నమెంట్	27,590	27,590	2,770	2,772 గ్రా
వెండి (కిలో)	40,500	40,500	42.00	41.90 గ్రా

సోయాతో సన్నగా!

కొన్నిరకాల పదార్థాలు తింటే బరువు పెరుగుతామని మనకి తెలుసు. అదే బరువుని అదుపులో ఉంచే ఆహార పదార్థాలూ కూడా ఉన్నాయని తెలుసా! అదెలా అంటారా?




● **సోయా:** ఈ ఉత్పత్తుల్లో సంతృప్తికర కొవ్వు తక్కువగా ఉంటుంది. ఈ గింజల్లోని మాంసకృత్తులు శరీరంలోని కొలెస్ట్రాల్‌ని తగ్గిస్తాయి. రోజూ ఏదో ఒక విధంగా సోయా ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం వల్ల సగటున ఆరుశాతం కొలెస్ట్రాల్‌ని అదుపులో ఉంచుకోవచ్చు. అంతేనా! పాలూ, పెరుగూ తినని వారు ప్రత్యామ్నాయంగా దీన్ని ఎంచుకోవచ్చు.



● **నట్స్:** అన్ని రకాల్లోనూ వెజిటబుల్ ప్రొటీన్ శాతం ఎక్కువగా ఉంటుంది. పీచూ, గుండెకు మేలు చేసే అసంతృప్త కొవ్వులు, విటమిన్ ఇ, మెగ్నీషియం, పొటాషియం, సహజంగా మొక్కల నుంచి అందే స్టీరోల్స్ వంటివన్నీ వీటి నుంచి లభిస్తాయి. అందుకే రోజూ కొద్దిగా నట్స్‌ని ఎంచుకోవాలి. దీనివల్ల పొట్ట నిండినట్లు అనిపిస్తుంది.

● **పండ్లూ-కూరగాయలు:** ఆకుకూరలూ, కూరగాయల్లో సంతృప్తకొవ్వులు తక్కువగా ఉంటాయి. వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల అదనపు కొవ్వు శరీరంలో పేరుకోకుండా ఉంటుంది. అందుకే రోజూ తినే ఆహారంలో బీన్స్, గింజలూ, తృణధాన్యాల వంటి వాటిల్లో కనీసం ఏదో ఒకదాన్ని తీసుకోవాలి. పండ్లు ముఖ్యంగా సీ విటమిన్ ఉన్న రకాలను వీలైనంత ఎక్కువగా తీసుకోగలిగితే మంచిది.



సెన్సెక్స్ ▲ 276
31568

నిఫ్టీ ▲ 87
9853

రూపాయి 64.12 ▼ 02 పైసలు
(ఒక అమెరికా డాలరుకు)

బంగారం 29,150 ▲ రూ.లలో 70
(ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత)

వెండి 39,035 ▲ రూ.లలో 165
ముంబయిలో కిలో

ముడి చమురు 53 ▲
(బ్రెంట్ ధర డాలర్లలో)



ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	21,818	−82
నాస్‌డాక్	6,269	−28
నిక్కీ 225 (జపాన్)	19,435	+51
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,260	−04
షాంఘై(చైనా)	3,288	−03
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,383	+01
డాక్స్ (జర్మనీ)	12,174	−55

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.29	67.59
పౌండ్ స్టెర్లింగ్	74.74	86.67
యూరో	68.55	79.52
జపనీస్ యెన్/100	53.26	61.77
ఆస్ట్రేలియా డాలరు	45.99	53.24
సింగపూర్ డాలరు	42.78	50.68
థాయ్ బాత్/100	175.33	209.69
బహ్రెయిన్ దీనార్	157.95	180.91
కువైట్ దీనార్	175.46	218.49
సౌదీ రియాల్	15.50	18.37
యూఏఈ దిర్హమ్	15.86	18.54
మలేషియా రింగిట్	13.32	16.38
చైనీస్ యువాన్	6.81	11.04

బుధవారం నిఫ్టీ కదలికలు



నోట్ల రద్దుతో దీర్ఘకాలంలో మేలు

ఆర్‌బీఐ మాజీ గవర్నర్ సుబ్బారావు

కోల్‌కతా: పెద్ద నోట్ల రద్దుతో దీర్ఘకాలంలో ప్రయోజనం చేకూరుతుందని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు తెలిపారు. 'నోట్ల రద్దుతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. అవి స్వల్పకాలమే. దీర్ఘకాలంలో లాభం ఉంటుందని' బంధన్ బ్యాంక్ రెండో వార్షికోత్సవంలో మాట్లాడుతూ సుబ్బారావు చెప్పారు. '8 నెలలుగా నోట్ల రద్దు ఇబ్బందులను భరిస్తున్నాం. వేల సంఖ్యలో ఉద్యోగాలు పోయాయి. కొన్నిసార్లు రోగులకు చికిత్స అందలేదు. నగదు మార్చుకునేందుకు పెద్ద వరుసల్లో ప్రజలు నిలబడాల్సి వచ్చింది' అని గుర్తుచేశారు. ఈ ప్రభావం గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం జీడీపీపై కనిపించిందని తెలిపారు. 'ఆశయం నెరవేరడంపైనే ప్రయోజనాలు ఆధారపడి ఉంటాయి. నల్లధన నియంత్రణ, డిజటలీకరణ, నకిలీ నోట్ల నాశనం లాంటి ఆశయాలను ఇది తప్పక నెరవేర్చాల'ని సుబ్బారావు ఆకాంక్షించారు. డిజిటలీకరణ లక్ష్యాన్ని సాధించేందుకు పెద్ద నోట్ల రద్దే అవసరం లేదని, అలా చేయకుండా కూడా నెరవేర్చుకోవచ్చని ఆయన అన్నారు. జీడీపీలో ఆదాయపు పన్ను వాటా పెంచుకోవడం ద్వారా వ్యవస్థకు మేలు జరుగుతుందని తెలిపారు.

బ్యాంక్ షేర్ల దూకుడు

- కలిసొచ్చిన మంత్రివర్గ నిర్ణయాలు • సెన్సెక్స్‌కు 276 పాయింట్ల లాభం • 9800 ఎగువకు నిఫ్టీ

ట్రేడింగ్ చివరి గంటలో బ్యాంకింగ్ షేర్లు దూసుకెళ్లడంతో సూచీలు లాభాల్లో ముగిశాయి. ప్రభుత్వరంగ బ్యాంకుల స్థిరీకరణ దిశగా కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలు మదుపర్లలో ఉత్సాహం నింపాయి. సానుకూల అంతర్జాతీయ సంకేతాలు ఇందుకు తోడవ్వడంతో నిఫ్టీ మళ్లీ 9800 పాయింట్ల ఎగువకు చేరింది. షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు సైతం దోహదపడ్డాయి. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా షేర్లు డీలాపడ్డాయి.

ఆద్యంతం లాభాల్లోనే: సెన్సెక్స్ ఉదయం 31,407.47 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. మధ్యాహ్నం వరకు మోస్తారు లాభాల్లో కదలాడిన సూచీ.. చివరి గంటలో విజృంభించింది. 31,593.39 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకి.. చివరకు 276.16 పాయింట్ల లాభంతో 31,568.01 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 86.95 పాయింట్లు పెరిగి 9,852.50 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 9,786.75- 9,857.90 పాయింట్ల మధ్య కదలాడింది.

వెలుగులోకి బ్యాంకింగ్ షేర్లు: ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల స్థిరీకరణ ప్రతిపాదనలను పర్యవేక్షించడానికి ప్రత్యామ్నాయ వ్యవస్థను తీసుకురానున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో బ్యాంకింగ్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. పీఎన్‌బీ 3.26%, ఇండస్ఇండ్ బ్యాంక్ 2.21%, ఎస్‌బీఐ 1.70%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.67%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.29%, ఫెడరల్ బ్యాంక్ 1.19%, కోటక్ బ్యాంక్ 1.08%, బ్యాంక్ ఆఫ్ బరోడా 1.08% చొప్పున లాభాలను నమోదు చేశాయి. అలహాబాద్ బ్యాంక్ 4.21%, బ్యాంక్ ఆఫ్ ఇండియా 3.12% మేర రాణించాయి.



- ఇక అనుబంధ సంస్థలో వాటాను జీపీసీకి విక్రయించనున్న నేపథ్యంలో డీఎల్‌ఎఫ్ షేరు 6.10 శాతం లాభంతో రూ.186 దగ్గర స్థిరపడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 24 లాభాలతో ముగిశాయి. అదానీ పోర్ట్స్ 2.82%, భారతీ ఎయిర్‌టెల్ 2.41%, టాటా స్టీల్ 2.28%, డాక్టర్ రెడ్డీస్ 2.25%, ఇన్ఫోసిస్ 1.98%, టాటా మోటార్స్ 1.81%, ఎస్‌బీఐ 1.70%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.67%, ఎన్‌టీపీసీ 1.37%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.29%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.15%లు రాణించిన వాటిలో ఉన్నాయి. హిందుస్థాన్ యునిలీవర్ అత్యధికంగా 1.10% నష్టపోయింది. సన్‌ఫార్మా (0.45%), ఐటీసీ (0.28%) చొప్పున నష్టాలను చవిచూశాయి. రంగాల వారీగా చూస్తే స్థిరాస్తి 3.48% పెరిగింది. లోహ, బ్యాంకింగ్ రంగాలు సైతం అదే బాటలో నడిచాయి.

గతి లాభం రూ.18 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి లాజిస్టిక్స్ సేవల కంపెనీ గతి, ఏకీకృత ప్రాతిపదికన రూ.18.31 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాల నికర లాభం రూ.5.11 కోట్లతో పోలిస్తే 250 శాతానికి పైగా పెరిగింది. సమీక్ష త్రైమాసికానికి ఏకీకృత ఆదాయం రూ.426.69 కోట్లుగా నమోదైంది. ఏడాది క్రితం కూడా దాదాపు ఇదే స్థాయిలో రూ.425.54 కోట్ల వద్ద ఉందని కంపెనీ వెల్లడించింది. కంపెనీ ప్రధాన వ్యాపారమైన ఉపరితల ఎక్స్‌ప్రెస్ సేవల్లోని బీ2బీ విభాగంలో పరిమాణ పరంగా 5.6 శాతం వృద్ధి నమోదైంది. రిటైల్ విభాగంలో 19 శాతం పెరుగుదల ఇందుకు దోహదం చేసింది.

బీఎస్ఈలో షేరు ధర 5.61 శాతం పెరిగి రూ.113.90 వద్ద ముగిసింది.

ఎస్‌ఎంఎస్ ఫార్మా యూనిట్‌కు పీఎండీఏ ఆమోదం

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు సమీపంలోని బాచుపల్లి వద్ద ఉన్న ఎస్‌ఎంఎస్ ఫార్మాస్యూటికల్ తయారీ యూనిట్‌కు జపాన్ ఔషధ నియంత్రణ సంస్థ- ఫార్మాస్యూటికల్స్ అండ్ మెడికల్ డివైసెస్ ఏజెన్సీ (పీఎండీఏ) పచ్చజెండా ఊపింది. జులై 25-27 తేదీల్లో తనిఖీలు నిర్వహించి, లోపాలేమీ లేనట్లు తెలిపిందని ఎస్‌ఎంఎస్ ఫార్మా వెల్లడించింది. సాధారణ జీఎంపీ (గుడ్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాక్టీసెస్) ప్రమాణాలపై జపాన్ సంస్థ తనిఖీలు నిర్వహించింది.

ఎస్సార్ స్టీల్‌పై టాటా స్టీల్ ఆసక్తి!

ముంబయి: రుణాల ఊబిలో కూరుకుపోయిన ఎస్సార్ స్టీల్, దాని ఆస్తుల కొనుగోలుకు టాటా స్టీల్ ఆసక్తి కనబరుస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు వార్తలు వెలువడటంతో బుధవారం టాటా స్టీల్ షేర్లు రాణించాయి. వృద్ధి వ్యూహంలో భాగంగా సంస్థల కొనుగోళ్లపై టాటా గ్రూప్ చూస్తోంది. దేశీయ సామర్థ్యం పెంపుపై దృష్టి పెట్టినట్లు ఇటీవల జరిగిన కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఎస్సార్ స్టీల్ కొనుగోలుకు తాము సిద్ధంగానే ఉన్నామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కొనుగోలు ద్వారా పశ్చిమ భారతంలో టాటా స్టీల్ బలంగా విస్తరించేందుకు అవకాశం ఉంది. రూ.36,000 కోట్ల రుణాలున్న ఎస్సార్ స్టీల్‌ను కొనుగోలు చేసేందుకు పోస్కో కూడా ఆసక్తిగానే ఉందని సమాచారం. భారత్, పశ్చిమాసియా, ఆఫ్రికా దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తోన్న ఎస్సార్ స్టీల్‌కు 10 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యం ఉంది. అయితే ఎస్సార్ స్టీల్‌పై నియంత్రణ వదులుకునేందుకు సిద్ధంగా లేమని ఈ వారం ప్రారంభంలో ఎస్సార్ గ్రూప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ వద్ద ఎస్సార్ స్టీల్ దివాలా ప్రక్రియ నడుస్తోంది.

మార్కెట్ కబుర్లు

- తన పెట్రో రసాయనాల ప్లాంట్ల కోసం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1.6 మిలియన్ టన్నుల ఈథేన్‌ను **రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్)** అమెరికా నుంచి దిగుమతి చేసుకోనుంది. ఇందువల్ల సహజవాయువు, నాఫ్తా వినియోగం తగ్గుతుందని, ఫలితంగా ఖర్చు 30 శాతం (300 మిలియన్ డాలర్లు) దిగివస్తుందని సంస్థ వెల్లడించింది.
- డీఎల్‌ఎఫ్ సైబర్ సిటీ డెవలపర్స్‌లో ప్రమోటర్లకున్న మొత్తం 40 శాతం వాటాను జీపీసీకి రూ.13,000 కోట్లకు విక్రయించే అంశంపై నిర్ణయం తీసుకోవడానికి **డీఎల్‌ఎఫ్** బోర్డు రేపు సమావేశం కానుంది.
- **అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్** పబ్లిక్ ఇష్యూకు రెండో రోజైన బుధవారం 1.46 రెట్ల స్పందన లభించింది. రూ.152 కోట్ల సమీకరణ నిమిత్తం 62,10,000 షేర్లను ఆఫర్ చేయగా.. 90,72,080 షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి. రిటైల్ మదుపర్ల నుంచి 2.9 రెట్ల స్పందన వచ్చింది.
- జీఈ సౌత్ ఏషియా అధ్యక్షుడు, సీఈఓ బన్మాలీ అగ్రావాలాను తమ మౌలిక, రక్షణ, ఏరోస్పేస్ వ్యాపారాలకు ప్రెసిడెంట్‌గా నియమించినట్లు **టాటా సన్స్** ప్రకటించింది.
- సత్యం వ్యవస్థాపకుడు బి. రామలింగ రాజు, ఆయన సోదరుడు బి. రామ రాజులకు విధించే శిక్ష పరిమాణంపై తాజా ఆదేశాలను వెలువరించడానికి సెబీకి మరింత సమయాన్ని ఇస్తున్నట్లు **సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రైబ్యునల్(శాట్)** ప్రకటించింది. ఆగస్టు 11, 2017 నుంచి నాలుగు నెలలకు ఆ గడువును పొడిగించింది.
- తన అనుబంధ సంస్థ భారత్ రోడ్ నెట్‌వర్క్‌కు చెందిన పబ్లిక్ ఇష్యూ సెప్టెంబరు 6న ప్రారంభమై 8న ముగుస్తుందని **శ్రేయీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్** తెలిపింది. ఇష్యూ ధరను ఇంకా నిర్ణయించలేదు.

వృద్ధి పుంజుకోవడం సులభం కాదు

- భారత్‌పై డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్

దిల్లీ: భారత వృద్ధి పుంజుకోవడంపై ఇంకా ఆందోళనకర స్థితి కొనసాగుతోందని డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ అభిప్రాయపడింది. వినియోగంలో స్తబ్దత, పెట్టుబడులు పుంజుకోకపోవడం, జీఎస్‌టీ అమలు అనంతర పరిస్థితులు ఇందుకు కారణమని తన నివేదికలో పేర్కొంది. మొండి బకాయిలు పేరుకుపోవడం, కార్పొరేట్ కంపెనీల బ్యాలెన్స్ షీట్లలో బలహీనత, రైతుల రుణ మాఫీ లాంటివీ వృద్ధిపై ప్రభావం చూపించొచ్చని పేర్కొంది. అన్ని ప్రాంతాలకు సమానంగా రుతుపవనాలు విస్తరించకపోవడం వల్ల గ్రామీణ ప్రాంత గిరాకీపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపింది. 'జీఎస్‌టీ అమలుతో స్వల్పకాలంలో అమ్మకాలపై ప్రభావం పడొచ్చు. అయితే మధ్యకాలంలో వ్యాపారులకు ప్రయోజనం ఉంటుంద'ని పేర్కొంది. జులైలో పారిశ్రామికోత్పత్తి మరింత డీలా పడి 2.2- 2.4 శాతంగా నమోదుకావచ్చని తెలిపింది. ఆగస్టులో రిటైల్ ద్రవ్యోల్బణం (సీపీఐ) 2.4- 2.6% మధ్య, టోకు ధరల సూచీ ద్రవ్యోల్బణం 2- 2.2% మధ్య ఉండొచ్చని అంచనా వేస్తున్నామని పేర్కొంది. బ్యాంకింగ్ వ్యవస్థలో అధిక ద్రవ్యలభ్యత, ఇంటి అద్దె భత్యం పెంపు లాంటివి ధరలు పెరగడానికి దోహదం చేయొచ్చని తెలిపింది. 'అన్ని ప్రాంతాలకు రుతుపవనాలు సమానంగా విస్తరించనందున, వర్షపాతం అంతంతమాత్రంగానే ఉంది. కొన్ని రాష్ట్రాల్లో వరదలూ సంభవించాయి. ఈ పరిణామాలు ద్రవ్యోల్బణ అంచనాలపై ప్రభావం చూపించే అవకాశం ఉంద'ని వివరించింది. ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉండటంతో వడ్డీ రేట్ల కోతకు అవకాశాలు తక్కువేనని చెప్పొచ్చు. గిరాకీ పరిస్థితులు స్తబ్దుగా ఉన్నందున ఆర్‌బీఐ రేట్లు తగ్గించినా పెద్దగా ప్రయోజనం ఉండకపోవచ్చని వివరించింది.

గూగుల్‌తో వాల్‌మార్ట్ జట్టు

శాన్‌ఫ్రాన్సిస్కో: ఇ-కామర్స్ విక్రయాల కోసం గూగుల్‌తో వాల్‌మార్ట్ జతకట్టింది. గూగుల్ వేదికగా అంతర్జాలంలో తమ ఉత్పత్తులు విక్రయించేందుకు ఇరు సంస్థల మధ్య ఒప్పందం కుదిరిందని వాల్‌మార్ట్ పేర్కొంది. సెప్టెంబరు చివరి నుంచి గూగుల్ ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫాంపై వినియోగదారులకు తమ ఉత్పత్తులు భారీసంఖ్యలో అందుబాటులోకి రానున్నాయని వాల్‌మార్ట్ ఇ కామర్స్ విభాగాధిపతి మార్క్ లూర్ తెలిపారు. ఇప్పటికే కాస్ట్‌కో, వాల్‌గ్రీన్ ఫార్మసీ లాంటి సంస్థలు తమ ఉత్పత్తులను గూగుల్ ద్వారా విక్రయిస్తున్నాయి.

జీఎస్‌టీ రిటర్న్‌లు.. 20 లక్షలు

- మరో 30 లక్షలు వస్తాయ్ • జీఎస్‌టీఎన్ ఛైర్మన్ నవీన్ కుమార్

దిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) విధానంలో ఇప్పటివరకు 20 లక్షల మంది వ్యాపారులు రిటర్నులు సమర్పించి, ఆన్‌లైన్ ద్వారా పన్ను చెల్లించారు. గడువు రోజు అయిన శుక్రవారం (25న) నాటికి మరో 30 లక్షల మంది పన్ను చెల్లించే అవకాశం ఉందని జీఎస్‌టీఎన్ ఛైర్మన్ నవీన్ కుమార్ తెలిపారు. వాస్తవానికి రిటర్న్‌ల దాఖలు, పన్ను చెల్లింపులకు ఆగస్టు 20 ఆఖరు తేదీ. అయితే అదేరోజు అత్యధికులు రిటర్న్‌ల దాఖలుకు సిద్ధమవడంతో పోర్టల్‌లో గంట పాటు సాంకేతికత సమస్య చోటు చేసుకుంది. దీంతో గడువు తేదీని ఈ నెల 25కి ప్రభుత్వం పొడిగించింది. 'దాదాపు 28 లక్షల మంది పన్ను చెల్లింపుదార్లు పోర్టల్‌లో తమ అమ్మకాల విక్రయాల వివరాలను నిక్షిప్తం చేసుకున్నారు. వీరిలో 20 లక్షల మంది రిటర్న్‌లను ఫైల్ చేసి, పన్నులు చెల్లించార'ని నవీన్ కుమార్ వెల్లడించారు. కాగా. ఆగస్టు 21 వరకు 10 లక్షల మంది వ్యాపారులు రిటర్న్‌లు దాఖలు చేయగా, రూ.42,000 కోట్ల వరకు ప్రభుత్వానికి పన్ను ఆదాయం వచ్చింది.

నేటి మార్కెట్

నేడూ సూచీల లాభాలు కొనసాగొచ్చు. ఇటీవల దిద్దుబాటుకు గురైన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇన్ఫోసిస్ సీఈఓగా విశాల్ సిక్కా వైదొలగిన అనంతరం, ఆ కంపెనీ షేరుతో పాటు మార్కెట్లు దిద్దుబాటుకు లోనయ్యాయని, అయితే పాత స్థాయి కంటే ఎగువనే సూచీల స్థిరీకరణకు ఆస్కారం ఉందని డీలర్లు అభిప్రాయపడుతున్నారు. శుక్రవారం జరగనున్న అంతర్జాతీయ కేంద్ర బ్యాంకర్ల సదస్సు నిర్ణయాలు వెలువడితే మినహా.. మార్కెట్లు భారీ లాభాలు నమోదు చేయకపోవచ్చని అంటున్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ అధిపతి జానెట్ యెలెన్, ఐరోపా కేంద్ర బ్యాంక్ అధ్యక్షుడు మరియో డ్రాఘీ వ్యాఖ్యల నుంచి మదుపర్లు సంకేతాలు అందిపుచ్చుకునే అవకాశం ఉంది. నేడు నిఫ్టీ 9800- 9935 పాయింట్ల శ్రేణిలో కదలాడొచ్చని సాంకేతిక విశ్లేషకులు భావిస్తున్నారు.

ఇండియాబుల్స్ హౌసింగ్



రూ.1177.45 వద్ద ప్రారంభమై రూ.1156- 1231.55 మధ్య కదలాడి, క్రితం ముగింపు రూ.1176.35తో పోలిస్తే రూ.45.40 (3.86%) లాభంతో రూ.1221.75 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 12,75,205.

టెక్ మహీంద్రా



రూ.440 వద్ద మొదలై రూ.427.50- 444.25 మధ్య చలించి, క్రితం ముగింపు రూ.439.35తో పోలిస్తే రూ.9.15 (2.08%) నష్టంతో రూ.430.20 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 15,76,891 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)		52 వారాల కనిష్ఠం (రూ.లలో)	
కంటైనర్ కార్పొరేషన్	1304.50	సనోఫి ఇండియా	3940.00
అవెన్యూ సూపర్‌మార్ట్స్	999.00	గోవా కార్బన్	277.40
బాటా ఇండియా	693.60	షాలిమార్ పెయింట్స్	200.05
ఫ్యూచర్ రిటైల్	512.00	మంధన రిటైల్	142.10
హెచ్‌పీసీఎల్	462.60	జీటీపీఎల్ హాత్‌వే	127.00
భారతీ ఎయిర్‌టెల్	434.00	ద్వారికేశ్ షుగర్	60.10

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు)			దేశీయ మదుపర్లు (డీఐఐలు)		
తేదీ	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
23/08	3,415	4,244	−829	2,843	2,408	435
22/08	3,415	4,244	−829	2,843	2,408	435
17/08	3,453	4,434	−981	2,765	1,936	829
16/08	5,400	6,490	−1,090	3,570	2,233	1,337
14/08	3,231	4,870	−1,639	3,653	2,033	1,619

23వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు

హైదరాబాద్	355	వరంగల్	357
చిల్లరగా(ఒక గుడ్డు)	4.15	విశాఖపట్నం	362
బెంగళూరు	382	చెన్నై	397
24న		చిత్తూరు	390
విజయవాడ/గోదావరి	359	నమక్కల్	387

ఎన్ఎస్ఈ

బుధవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ACC 1801.90 (1789.30) 220709
ADANI PORT & 385.00 (375.65) 3003871
AMBUJA CEMEN 276.65 (273.15) 1018756
ASIAN PAINTS 1141.30 (1129.45) 513036
AUROBIND PHA 698.65 (695.70) 1618248
AXIS BANK LT 502.65 (499.20) 3288488
BAJAJ AUTO L 2754.65 (2740.55) 117188
BANK OFBAROD 140.95 (139.35) 18892523
BHARTI AIRTE 431.90 (422.10) 4285266
BHARTI INFRA 382.80 (387.85) 1201788
BOSCH LTD 21882.40 (21898.60) 6174
BPCL 509.70 (510.35) 3071333
CIPLA 559.15 (559.25) 848822
COAL INDIA L 241.10 (240.55) 3693013
DR. REDDYS 2030.95 (1984.15) 809996
EICHER MOTOR 30648.25 (30977.15) 37637
GAIL 385.45 (377.75) 3267018
HCL TECH 880.00 (875.85) 754889
HDFC 1765.25 (1750.40) 2858972
HDFC BANK 1772.45 (1747.00) 840131
HERO MOTOCOR 3888.90 (3888.05) 407757
HINDALCO IND 230.90 (228.90) 7189281
HINDUSTAN UN 1188.15 (1199.60) 831796
ICICI BANK 298.60 (293.95) 9142592
INDIABULLS H 1221.75 (1176.35) 1275205
INDIAN OIL 426.85 (423.20) 2656918
INDUSINDBANK 1660.90 (1626.30) 1091055
INFOSYS LTD 892.80 (875.40) 30642095
ITC 282.55 (282.90) 8747634
KOTAK MAHIND 980.10 (970.80) 2354519
LARSEN & TOU 1124.15 (1117.70) 1710949
LUPIN 955.85 (944.40) 1452649
M&M 1374.20 (1374.65) 789242
MARUTI SUZIK 7573.05 (7496.10) 258051
NTPC LTD 170.25 (167.70) 4180417
ONGC 159.70 (159.45) 2344934
POWER GRID C 219.75 (219.50) 2988440
RELIANCE IND 1582.05 (1560.05) 1901824
SBI 279.00 (273.90) 11317821
SUN PHARMA 469.20 (470.45) 3682870
TATA CONSULT 2489.45 (2497.55) 781136
TATA MOT DVR 226.55 (224.00) 991510
TATA MOTORS 379.95 (373.60) 4448871
TATA POWER 78.75 (80.05) 2065914
TATA STEEL L 634.60 (619.60) 3918843
TECH MAHINDR 430.20 (439.35) 1576891
ULTRATECH 3951.55 (3975.25) 142515
VEDANTA LIMI 299.60 (293.05) 8674950
WIPRO 290.00 (290.25) 2333779
YES BANK LTD 1723.25 (1712.90) 2243348
ZEE ENTERTAI 514.90 (516.45) 1323845

నిఫ్టీ నెక్ట్స్ 50

ABB 1349.85 (1357.40) 44354
ASHOK LEYLAN 102.70 (100.35) 6311204
BAJAJ FINANC 1779.30 (1682.90) 1825088
BAJAJ FINSER 5351.30 (5234.60) 194647
BEL 183.05 (178.20) 3096596
BHEL 127.55 (125.65) 2932872
BRITANNIA 4247.15 (4198.85) 118712
CADILA HEALT 462.65 (468.50) 630195
COLGATE PALM 1087.15 (1084.75) 140835
CONTAINER 1258.00 (1276.40) 1286392
CUMMINS INDI 880.75 (898.55) 242557
DABUR INDIA 298.85 (301.10) 1160867
DIVIS LAB 638.40 (629.20) 743570
DLF LIMITED 185.95 (175.30) 28066784
EMAMI LIMITE 1087.60 (1103.05) 119764
GLAXOSMI CON 5347.55 (5383.50) 4769
GLAXOSMI PHA 2390.60 (2365.35) 9525
GLENMARK PHA 599.85 (601.00) 828019
GODREJ CONSU 904.95 (886.20) 2069849
HAVELLS INDI 475.45 (473.05) 533946
HINDUSTAN ZI 286.50 (287.05) 2253675
HPCL 457.90 (449.70) 3816123
ICICI PRU LI 422.15 (418.95) 386270
IDEA CELLULR 90.50 (87.95) 7306222
INTERGLOBE A 1216.45 (1228.70) 514825
JSW STEEL LT 239.75 (231.95) 4271359
LIC HOUS.FIN 659.70 (636.10) 1601746
MARICO LIMIT 314.95 (315.10) 1265870
MCDOWELL 2469.45 (2492.60) 192428
MOTHERSON 314.25 (310.65) 2633305
NHPC LTD 29.70 (29.40) 4090092
NMDC LTD 123.10 (121.90) 2241150
OIL INDIA 278.80 (276.10) 251186
ORACLE FIN S 3435.10 (3420.25) 15457
P&G HYG&HEAL 8118.35 (8114.90) 2418
PETRONET LNG 230.95 (229.10) 1711704
PIDILITE IND 815.85 (819.45) 397771
PIRAMAL ENTE 2625.20 (2579.35) 133168
PNB 142.65 (138.00) 9488136
POWER FIN CO 120.65 (116.75) 3782929
RURAL ELEC C 157.20 (152.90) 6032661
SAIL 60.70 (58.80) 4200968
SHREE CEMENT 17166.20 (17181.10) 10735
SHRIRAM TRAN 971.30 (958.40) 438638
SIEMENS 1255.65 (1262.50) 113740
SUN TV LTD 714.65 (698.15) 1148207
TITAN IND 607.50 (615.10) 2030608
TORRENT PHAR 1207.50 (1222.15) 83377
UNITED BREWE 804.85 (805.45) 181656
UPL LIMITED 814.10 (796.55) 772199

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 173.75 (172.65) 923171
ADANI ENTERP 110.05 (106.30) 4677977
ADANI POWER 28.35 (27.75) 7906237
ALL BANK 67.10 (64.10) 6238152
AMARA RAJA 767.30 (758.40) 796297
ANANT RAJIND 55.90 (54.80) 562676
ANDHRA BANK 51.45 (49.90) 3240503
APOLLO HOSPI 1092.60 (1098.50) 1081455
APOLLO TYRES 259.80 (259.65) 3009326
APTECH 276.50 (256.30) 5876997
BAJAJ ELECT. 339.50 (333.30) 375455
BAJAJ HIND 14.45 (14.50) 1752445
BAJAJ HOLDIN 2634.85 (2609.90) 9423
BALAJI TELE 163.05 (154.30) 700000
BALLARPUR IN 13.65 (13.30) 593863
BALRAMPUR CH 164.90 (164.60) 869286
BANK OF MAHA 27.20 (26.70) 117613
BANK OFINDIA 143.80 (139.15) 6957028
BATA INDIA 678.15 (683.20) 878071
BGR ENERGY S 137.20 (128.35) 561848
BHARAT FORGE 1165.95 (1136.65) 513781
BHUSHAN STEE 70.10 (68.50) 561253
BIOCON LTD 330.10 (328.40) 1393830
BOMBAY DYE 79.30 (74.00) 2964994
CANARA BANK 336.15 (326.70) 2203164
CEAT LIMITED 1671.80 (1628.80) 720484
CENTRAL BANK 73.80 (73.30) 466294
CHAMBAL FERT 144.10 (141.50) 1443900
CHENNAI PETR 405.50 (403.25) 464561
CITY UNIBANK 158.40 (156.55) 226893
CORPO BANK 45.45 (44.45) 197297
COX & KINGS 262.15 (261.45) 232039
D B REALTY L 36.05 (35.10) 308986
DELTA CORP L 182.25 (173.20) 7502832
DENA BANK 31.35 (30.40) 1229236
DHANALAKBANK 32.90 (33.15) 839050
EDELWEISS CA 242.40 (241.00) 2077374
EDUCOMP SOLU 7.85 (7.95) 182465
EID PARRY 322.95 (319.90) 87147
EIH 132.15 (133.50) 91997
ESSAR SHIPPI 25.95 (27.00) 191337
ESTER INDUST 32.10 (32.50) 14888
EXIDE INDUST 198.85 (197.15) 2358101
FEDERAL BANK 106.65 (105.30) 5236293
FINOLEX CABL 531.85 (531.25) 24677
G E SHIP LTD 388.90 (389.90) 36748
GAMMON INDIA 8.40 (8.45) 396322
GAMMON INFRA 3.80 (3.90) 921049
GATI LIMITED 114.15 (107.90) 2088802
GAYATRI PROJ 171.50 (162.55) 216643
GITANJALIGEM 60.80 (60.60) 147615
GMR INFRASTR 17.20 (17.00) 19674455
GODREJ IND 600.30 (577.65) 454889
GRASIM IND 1119.05 (1114.25) 535864
GUJ ALK&CHEM 409.20 (409.50) 28014
HCL INFOSYS 45.15 (47.00) 3632337
HDFC BANK 1781.00 (1760.00) 458879
HEXA TECH 269.00 (265.10) 960961
HIMACHAL FUT 16.40 (15.70) 3366082
HINDU MOTORS 8.20 (8.15) 228844
HOUSING DEV 61.75 (59.55) 23504923
IDBI 54.65 (53.70) 1998246
IDFC 54.85 (53.85) 1686106
IFCI 23.15 (22.75) 2288655
IL&FS TRANS 77.15 (76.40) 124663
IND SWIFTLAB 33.55 (33.30) 3998
INDBULLS REL 233.25 (219.10) 13403057
INDIA CEM 178.15 (174.20) 3580978
INDIAN BANK 298.40 (290.15) 1245249
INDO RAMA SY 27.50 (26.60) 44430
INDRAPRASTHA 1268.25 (1259.30) 201675
IND-SWIFTLTD 7.70 (7.55) 10421
INGERSOLL-R 803.60 (778.85) 8489
IOB 23.10 (22.45) 1211758
IPCA LAB 412.20 (408.80) 29633
IRB INFRA DE 212.60 (209.85) 928285
J&K BANK 80.70 (79.75) 252637
JAI CORP 78.25 (76.50) 469034
JAIN IRRIGAT 94.80 (93.25) 3970578
JAYPEE INFRA 14.20 (14.70) 6977680
JAYSHREE TEA 99.75 (99.65) 40171
JET AIRWAYS 574.40 (556.75) 1461328
JINDAL SAW 90.75 (90.35) 488801
JINDAL STEEL 133.10 (129.00) 6241441
JK LAKSHMI C 416.85 (412.45) 176379
JK PAPER LIM 97.05 (93.25) 876328
JM FINANCIAL 127.25 (124.50) 1524051
JP ASSOCIATS 21.50 (21.00) 71932896
JSW ENERGY L 61.15 (61.00) 5049528
JUBILANT FOO 1380.30 (1357.10) 665029
JUBILANT ORG 719.45 (708.40) 235496
JYOTHY LABS 374.40 (375.05) 23839

ఘనం (+)

నిఫ్టీ	23న	మార్పు %
INDIABULLS HSG	1221.75	3.86
ADANI PORT	385.00	2.49
TATA STEEL	634.60	2.42
DR. REDDYS LAB	2030.95	2.36
BHARTI AIRTEL	431.90	2.32
VEDANTA	299.60	2.24
INDUSIND BANK	1660.90	2.13

గ్రహణం (-)

నిఫ్టీ	23న	మార్పు %
TECH MAHINDRA	430.20	-2.08
TATA POWER	78.75	-1.62
BHARTI INFRATEL	382.80	-1.30
EICHER MOTORS	30648.25	-1.06
HUL	1188.15	-0.95
ULTRATECH CEM	3951.55	-0.60
TCS	2489.45	-0.32

KARNATA BANK 144.40 (140.95) 1287326
KEC INTL LTD 299.70 (297.30) 159019
KOLTE PATIL 158.15 (161.15) 90362
KPIT CUMMINS 113.70 (110.00) 623487
L&TFIN.HOLD 173.35 (169.45) 3368752
LAK VIL BANK 175.65 (177.90) 1092869
M & M FINANC 410.50 (404.75) 1171918
MANAPPURAM G 92.90 (91.60) 6140440
MMTC LIMITED 55.45 (55.15) 339382
MOSER-BEAR 4.55 (4.55) 170343
MPHASIS LTD 591.80 (592.80) 34396
MRPL 125.55 (123.45) 1889286
MTNL 17.40 (17.25) 511517
NAGARJUNA OI 3.65 (3.55) 146281
NCC LIMITED 86.20 (84.15) 1405104
NETWORK18 FI 50.35 (49.05) 180881
NEULAND LAB 1217.90 (1242.45) 8692
NIIT LTD 93.25 (91.80) 785029
NIIT TECHNOL 495.95 (484.20) 266265
OMAXE LTD 205.05 (200.60) 738030
ONMOBILE GLO 54.80 (55.40) 212110
ORIENT PAPER 96.60 (94.75) 202427
ORIENTALBANK 123.50 (119.65) 2483489
PATEL ENGG 70.00 (68.65) 86371
PFIZER 1808.35 (1763.30) 34902
POLARIS SOFT 241.10 (240.05) 34668
POWERTRADING 113.45 (110.20) 2498204
PRAJ IND 66.90 (66.50) 221008
PRISM CEMENT 111.00 (107.55) 64258
PROVOGUE (IN 4.00 (4.00) 134492
PUNJ LLOYD 19.05 (18.80) 493540
PUNJAB & SIN 48.45 (47.40) 111238
PURAVANKARA 72.15 (70.20) 122385
PVP VENTURES 5.00 (4.75) 146652
PVR LIMITED 1255.45 (1272.35) 173261
RADICO KHAIT 161.65 (162.65) 473860
RAJ OIL MILL 1.35 (1.35) 6950
RAJESH EXPOR 719.30 (719.15) 821371
RALLIS INDIA 232.40 (227.75) 248433
RAMCO IND 239.85 (236.70) 86152
RAMCO SYS 357.95 (363.80) 57097
RAMKY INFRA 80.65 (80.05) 35528
RAYMOND 737.00 (731.35) 387815
RELIANCE CAP 767.30 (744.45) 4754311
RELIANCE COM 23.05 (22.90) 13907376
RELIANCE INF 474.80 (465.65) 1655184
RELIANCE POW 39.20 (38.50) 1636816
ROLTA INDIA 52.95 (52.70) 183277
SAGAR CEMENT 829.20 (809.35) 1919
SAREGAMA 396.55 (390.30) 43155
SHANTHI GEAR 132.95 (132.00) 15492
SHIPPNG CORP 93.65 (90.00) 1882505
SHREE RENUKA 17.40 (17.30) 1912575
SINTEX IND 30.30 (29.85) 24314395
SOBHA DEVELO 391.70 (387.55) 204184
SOUTHINDBANK 27.20 (26.55) 9317669
SRS LIMITED 2.80 (2.80) 214841
STERLITE TEC 215.75 (213.70) 1024285
SUJANA METAL 1.55 (1.60) 72509
SUN PHARMA 425.05 (416.85) 1076417
SUND FASTNER 385.95 (386.25) 56360
SUZLON ENERG 16.35 (16.05) 20574467
SYND. BANK 64.60 (62.75) 2810177
TATA CHEM 588.10 (582.80) 513770
TATA COFFEE 134.15 (132.90) 380574
TATA COMMUN 637.55 (615.25) 388436
TATA GLOBAL 196.55 (189.85) 7522673
TATA METALIK 637.40 (628.00) 94654
TATA TELESER 6.75 (6.70) 871173
THE INDIAN H 111.65 (111.45) 1274615
TORRENT POWE 209.35 (208.55) 782745
TRIVENI ENGG 89.65 (89.05) 836553
TTK PRESTIGE 6360.85 (6365.60) 1533
TV TODAY NET 245.50 (242.05) 82246
TV18 BROADCA 36.40 (35.50) 1751349
TVS MOTOR 584.60 (582.60) 905000
UCO BANK 30.75 (30.00) 732314
UNION BANK 134.20 (128.95) 3664065
UNITECH 7.30 (7.15) 20909202
UNITED BANK 18.25 (17.95) 489275
USHA MARTIN 19.05 (19.05) 299217
VADILAL INDU 856.95 (852.85) 22390
VENKYS 2078.30 (1964.10) 288019
V-GUARD IND 183.00 (180.55) 1157902
VIJAYA BANK 64.50 (63.70) 2020756
VIP 206.80 (208.30) 434197
VOLTAS 522.00 (524.90) 838053
ZEE LEARN LI 42.20 (41.20) 103197
ZUARI GLOBAL 116.80 (116.50) 6888
ZYDUS WELLNE 865.40 (865.50) 6460

AISHWARYA TE 4.60 (4.40) 7250
ALPHAGEO 760.55 (755.55) 1393
AMAR RAJA BA 765.40 (758.55) 21233
ANDHRA BANK 51.40 (49.85) 315348
ANDHRA CEMEN 8.66 (8.57) 8388
ANDHRA PAPER 293.05 (294.75) 1083
ANDHRA PETRO 31.75 (30.30) 247719
ANDHRA SUGAR 337.60 (340.30) 1910
ASTRA MICROW 123.90 (121.90) 26618
AUROBINDO PH 698.50 (695.45) 97759
AVANTEL SOFT 237 (239.25) 1632
AVANTI FEEDS 1946.75 (1923.35) 15109
AVON ORG 5.07 (4.45) 16252
BALAJI AMIN 310.70 (310.55) 1973
BARTRONICS 14 (13.85) 21278
BHAGIRA CHEM 205.60 (194.95) 39082
BHAGYA NAG 21.50 (21.40) 1038
CAMBRIDGE TE 74.95 (73.50) 2007
CIL SECURI 28.05 (28.35) 5503
CONT COFFEE 276.20 (274.80) 568
COROMAN FERT 422.65 (421.75) 8341
CYIENT LIMIT 519.45 (513.55) 1224
DECCAN CEMEN 1121.95 (1115.15) 4301
DIVI'S LAB 638.95 (630.25) 55759
DR REDDY 2029.50 (1984.85) 54946
GATI CORPN 113.90 (107.85) 365013
GAYATRI PROJ 170.90 (161.70) 20510
GMR INFRASTR 17.15 (17.05) 1039827
GOLDST INFRA 130.55 (130.05) 102727
GRANULES (I) 127.90 (127.20) 92459

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

GVK POWER 11.75 (12.36) 1303668
HBL NIFE POW 44.50 (43.70) 20272
HERITAGE FOO 1315.35 (1299.25) 1627
HYD INDUS 1110.20 (1092.10) 5187
IDL INDUSTRS 525.10 (521.30) 1661
IVRCL INFRAS 4.89 (4.94) 133954
KAKATIYA CEM 343.60 (337.40) 4559
KALLAM SPG 31.90 (32.60) 128076
KAVERI SEED 543.55 (531.05) 80380
KNR CONSTRUC 216.20 (213.85) 2334
LANCO INDUS 366.15 (361.50) 6603
LANCO INFRAT 0.89 (0.86) 1736279
LAURUS LABS 524.95 (519.25) 8029
MADHUCON PRO 29.35 (28.85) 19872
MIC ELECTRON 7.76 (7.85) 44291
MOLD-TEK.TEC 49.75 (49.75) 11750
MOLDTK PLA 291.55 (298.10) 4074
MSR INDIA LT 36.30 (38.20) 9452
NAGARJAGRICH 33.90 (34.10) 10100
NATCO PHARMA 726.20 (733.05) 29819
NAVA BH VENT 122.30 (120.25) 8783
NCC 86.20 (84.15) 209370
NCL IND 230.30 (232.50) 23231
NEHA INTER 5.13 (4.70) 55873
NEULAND LAB 1227.70 (1250.70) 1031
NILE 602.40 (589.60) 6406
OIL COUNTRY 45 (42.95) 8945
PENNER IND 59.70 (55.85) 192826
PIONEER DIST 197.95 (190) 6775
PITTI LAMIN 58.85 (58.75) 10017
PREMIER EXPL 450.95 (441.50) 870
PRISM CEMENT 110.85 (107.85) 17974
PRUDENTL PHA 3.94 (3.98) 81829
RAIN INDUSTR 144.70 (137.40) 380965
SAMKRG PIST 255.50 (259.70) 4500
SATVAH. ISPA 34.55 (35.55) 25935
SMS PHARMA 82.60 (73) 205292
SPHERE GLOBA 44.05 (44.80) 33297
SREE RAYAL A 28.45 (27.10) 402011
STEEL EXCHAN 83.15 (83.80) 118551
SUJANA METAL 1.55 (1.54) 20750
SUJANA TOWER 4.03 (4.02) 6500
SUJANA UNIVE 0.97 (0.96) 37739
SURYALAKSH.C 97.55 (96.05) 4966
SURYALATA SP 136.55 (127.20) 1027
SUVEN PHARMA 162.45 (161.45) 12287
TAJ GVK HOTE 155.80 (153.60) 14998
TANLA 32.60 (32.65) 27911
TERA SOFTWAR 61.30 (60.20) 2008
VICEROY HOTE 17.25 (16.70) 14948
VIJAY TEXTIL 62.15 (59.40) 32788
VIMTA LABS 130.25 (129.80) 2361
VISAKA IND 537.20 (515.15) 27054
VISTA PHARMA 33.05 (34.05) 22031
VIVIMED LABS 103.60 (100.30) 103932
YBRANT DIGIT 6.86 (6.35) 5580872
ZENTECH 51.90 (51.45) 25573

అవకాశం

జియో ఫోన్ ప్రీ బుకింగ్ నేటి నుంచి



హైదరాబాద్: రిలయన్స్ జియో చౌక 4జీ ఫోన్ 'జియోఫోన్' కొనుగోలు చేసుకునేందుకు నేటినుంచి ప్రీ బుకింగ్ చేసుకోవచ్చు. అన్ని రిలయన్స్ రిటైల్ విక్రయశాలలు, సంస్థ వెబ్‌సైట్, జియో యాప్ ద్వారా గురువారం సాయంత్రం 5 గంటల నుంచి బుక్ చేసుకోవచ్చని, ఇందుకు రూ.500 చెల్లిస్తే సరిపోతుందని రిలయన్స్ జియో వెల్లడించింది. సెప్టెంబరులో ఫోన్ డెలివరీ సమయంలో రూ.1,000 చెల్లించాల్సి ఉంటుంది. 36 నెలల అనంతరం ఫోన్‌ను వాపసు ఇస్తే, రూ.1500 తిరిగి పొందవచ్చని రిలయన్స్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ వెల్లడించిన సంగతి విదితమే.




విడుదల

రాజన్ పుస్తకం 4న మార్కెట్లోకి

దిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పూర్వ గవర్నర్ రఘురామ్ రాజన్ పెన్ను విదల్చనున్నారు. అంతక్రితమూ పలు వ్యాసాలు, పుస్తకాలు రాసినప్పటికీ.. ఈ సారి ఆర్‌బీఐపై రాయనుండడమే విశేషం. ముక్కుసూటిగా మాట్లాడే రాజన్ తన పుస్తకంలో ఏం వెల్లడిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. తన కొత్త పుస్తకంలో అసహనం, రాజకీయ స్వేచ్ఛ, ఆర్థిక విషయాలు, ఇతరత్రా అంశాల గురించి ప్రస్తావించారని తెలుస్తోంది. అదే సమయంలో తాను ఆర్‌బీఐ అధిపతిగా చేసిన ప్రసంగాలనూ అందులో పొందుపరచనున్నారు. రాజన్ వ్యాఖ్యలు, ప్రసంగాలతో కూడిన 'ఐ డూ వాట్ ఐ డూ: ఆన్ రిఫామ్, రెటొరిక్ అండ్ రిసాల్వ్' పుస్తకం సెప్టెంబరు 4 నుంచి మార్కెట్లో లభించనుంది.

విలీనం వడివడిగా..

- మంత్రుల కమిటీ పర్యవేక్షణలో పీఎస్‌బీల ఏకీకరణ
- ప్రత్యామ్నాయ వ్యవస్థ ఏర్పాటు
- కేంద్ర మంత్రివర్గం సూత్రప్రాయ అనుమతులు



దిల్లీ

ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) విలీన ప్రక్రియను వేగవంతం చేసే దిశగా ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. విలీన ప్రతిపాదనల పరిశీలన నిమిత్తం ప్రత్యామ్నాయ వ్యవస్థ (ఏఎం) పేరుతో మంత్రుల కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. వృద్ధి బాటలో పయనిస్తోన్న దేశ ఆర్థిక వ్యవస్థ నిధుల అవసరాలు తీర్చేందుకు, ప్రభుత్వ ఖజానాపై ఆధారపడకుండా పీఎస్‌బీల నిధుల సమీకరణ సామర్థ్యాన్ని బలోపేతం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రత్యామ్నాయ వ్యవస్థ ద్వారా పీఎస్‌బీల విలీనానికి కేంద్ర మంత్రివర్గం (కేబినెట్) సూత్రప్రాయ అనుమతులు ఇచ్చిందని ఆర్థిక శాఖ తెలిపింది. బలమైన, మరింత పోటీసామర్థ్యంతో కూడిన బ్యాంకులుగా తీర్చిదిద్దేందుకు తాజా నిర్ణయం దోహదం చేస్తుందని పేర్కొంది.

సభ్యుల నియామకం ప్రధాని చేతిలో

ప్రత్యామ్నాయ వ్యవస్థలో (మంత్రుల కమిటీ) ఉండే సభ్యులను ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయిస్తారని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. విలీన ప్రక్రియ నిమిత్తం పీఎస్‌బీ బోర్డుల నుంచి వచ్చే ప్రతిపాదనలను కమిటీ పరిశీలిస్తుందని పేర్కొన్నారు. 'ప్రభుత్వ రంగంలో చాలా బ్యాంకులున్నాయి. వాటిని బలమైన బ్యాంకులుగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం. ఇప్పటివరకు విలీన అనుభవం సత్ఫలితాన్ని ఇచ్చింద'ని అన్నారు. ప్రత్యామ్నాయ వ్యవస్థ వల్ల విలీన ప్రక్రియ వేగవంతం అవుతుందని అన్నారు. కేవలం వ్యాపారపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకొనే పటిష్ఠ, పోటీ సామర్థ్య బలమైన బ్యాంకుల ఏర్పాటు నిర్ణయానికి వచ్చినట్లు జైట్లీ అన్నారు. విలీనాలకు సంబంధించి ప్రతిపాదనలను బ్యాంకుల బోర్డుల నుంచే తప్పనిసరిగా రావాలని తెలిపారు. విలీనాల వల్ల దేశీయ, అంతర్జాతీయంగా ప్రతికూల పరిణామాల ప్రభావాన్ని తట్టుకునే సామర్థ్యం కూడా బ్యాంకులకు పెరుగుతుందని అన్నారు.

2017-18లోనే ప్రక్రియ కొంత ముందుకు

బ్యాంకుల జాతీయీకరణ చట్టం మార్గదర్శకాలకు అనుగుణంగా విలీన ప్రక్రియ ఉంటుందని ఆర్థిక శాఖ వర్గాలు వెల్లడించాయి. ఏఎం నుంచి సూత్రప్రాయ అనుమతులు లభించాక వివిధ నియంత్రణ పరమైన అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నాయి. ఆ తర్వాత షేర్ల నిష్పత్తిని కూడా నిర్ణయిస్తారని తెలిపాయి. అన్ని అనుమతులు లభించాక, కేంద్ర మంత్రివర్గం తుది అనుమతులు ఇస్తుందని వెల్లడించాయి. ఈ ఆర్థిక సంవత్సరంలోనే బ్యాంకుల విలీన ప్రక్రియ కొంత మేర ముందుకెళ్లే అవకాశం ఉందని ఆర్థిక శాఖ వర్గాలు తెలిపాయి. అయితే సిబ్బంది తొలగింపు ఉండకపోవచ్చని వెల్లడించాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీన ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ మంగళవారం దేశవ్యాప్తంగా బ్యాంకుల ఉద్యోగులు సమ్మె నిర్వహించిన సంగతి తెలిసిందే.

కంపెనీలు వాస్తవాలు దాస్తున్నాయ్

ఆరోపణ

- అందుకే కొత్త రుణాలివ్వడం కష్టమవుతోంది
- ఎస్‌బీఐ ఛైర్‌పర్సన్ అరుంధతీ భట్టాచార్య



ముంబయి: నియంత్రణ సంస్థల పరిశీలన తీవ్రతరం కావడం, కార్పొరేట్ సంస్థలకు ఇచ్చిన రుణాల్లో అధిక మొత్తాలు పారు బకాయిలుగా మిగలడం వల్ల, కొత్తగా రుణాలివ్వడం కష్టంగా మారిందని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఛైర్‌పర్సన్ అరుంధతీ భట్టాచార్య పేర్కొన్నారు. కంపెనీలు వెల్లడిస్తున్న సమాచారంలో పారదర్శకత లోపిస్తోందని, ముఖ్యంగా ఉక్కు రంగంలో ఇది ఎక్కువగా ఉందని ఆమె తెలిపారు. 'మీరంతా బ్యాంకర్లను విశ్వసించడం లేదని నాకు తెలుసు. బ్యాంకర్లు కూడా పరిశ్రమను నమ్మడం మానివేశారు. ఇది మంచి పరిణామం కాకున్నా, వాస్తవం ఇదే' అని ఇక్కడ జరిగిన కార్యక్రమంలో ఎస్‌బీఐ ఛైర్‌పర్సన్ పేర్కొన్నారు. కంపెనీలు తాము సమర్పిస్తున్న గణాంకాలు వాస్తవమే అని భరోసా కల్పించడానికి, అవి తగినంత వాటా కలిగి ఉండాలని, మార్జిన్లు కూడా అవసరమేనని, అప్పుడే పరిశోధన-అభివృద్ధికి వెచ్చించ గలుగుతాయని పేర్కొన్నారు. ఇవన్నీ చూసేవరకు, బ్యాంకులు కూడా కంపెనీలకు పూర్తిగా సహకారం అందించలేవనే భావనను అరుంధతీ భట్టాచార్య వ్యక్తం చేశారు. ఉక్కు రంగం పునరుత్తేజానికి అవకాశాలు వివరిస్తూ, మౌలిక రంగం తరహా హోదా సాధిస్తే కనుక, దీర్ఘకాల ప్రాతిపదికపై బ్యాంకులు ఈ రంగ కంపెనీలకు రుణాలిచ్చే వీలుంటుందని వివరించారు.

నిరర్థక ఆస్తులు తగ్గుతాయ్: నిరర్థక ఆస్తులు తగ్గించేందుకు చేపట్టిన కార్యక్రమాల వల్ల ఫలితం ఉంటుందని ఎస్‌బీఐ ఛైర్‌పర్సన్ పేర్కొన్నారు. ప్రభుత్వం, బ్యాంకులు కూడా దీనిపై దృష్టి సారించినందున, గడువులోగా ఫలితాలు లభిస్తాయనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. మొండి బకాయిల పరిష్కారానికి తగినంత మూలధనం బ్యాంకుల వద్ద లేదు కదా అన్న ప్రశ్నకు, ఎస్‌బీఐ తగిన స్థాయిలోనే ఉందని బదులిచ్చారు.

మూలధనం కోసమే విలీనం సరి కాదు: ప్రభుత్వరంగ బ్యాంకుల ఏకీకరణకు మూలధనమే ప్రధాన హేతువు కాకూడదని, కొత్తగా ఏర్పడే బ్యాంక్ పెద్దగా, పటిష్టంగా, మరింత సామర్థ్యంతో పనిచేసేలా ఉండేలా చూడాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం కూడా ఈ విషయంలో స్పష్టతతోనే ఉందని ఆమె వివరించారు.

ఆవిష్కరణ

శామ్‌సంగ్ గెలాక్సీ నోట్ 8



న్యూయార్క్: స్మార్ట్‌ఫోన్ ప్రేమికుల నిరీక్షణకు తెరదించుతూ 'గెలాక్సీ నోట్ 8' ఫ్యాబ్లెట్‌ను శామ్‌సంగ్ ఇక్కడ ఆవిష్కరించింది. 6.3 అంగుళాల క్వాడ్ హెచ్‌డీ సూపర్‌అమోల్డ్ తెర, వెడల్పుగా సెల్ఫీ తీసుకునేందుకు అనువైన ముందు కెమేరా, వెనుకాల 4కే స్పష్టతతో వీడియోలు తీయగల రెండు అత్యాధునిక కెమేరాలు, 2.3 గిగాహెర్ట్జ్ ఆక్టాకోర్ ప్రాసెసర్, 6జీబీ ర్యామ్, 64-256 జీబీ మెమొరీ, మెమొరీకార్డుతో మరో 256 జీబీ వరకు పెంచుకునే అవకాశం, 3300 ఎంఏహెచ్ బ్యాటరీ లాంటి ప్రత్యేకతలున్న ఈ స్మార్ట్‌ఫోన్ ఆండ్రాయిడ్ నౌగట్ ఆపరేటింగ్ సిస్టమ్‌తో పనిచేస్తుంది. వైరుతో పాటు వైర్ లేకుండానూ ఛార్జింగ్ చేసుకోగలగడం ఈ ఫోన్ ప్రత్యేకత. సెప్టెంబరు 15 నుంచి అమెరికా విపణిలో అందుబాటులోకి వస్తుందని సంస్థ తెలిపింది.

నందన్ నీలేకనే ఛైర్మన్ కావాలి

ఇన్ఫీ సంస్థాగత మదుపర్లు,బాలకృష్ణన్ కోరిక



బెంగళూరు

నందన్ నీలేకనిని ఛైర్మన్‌గా నియమించాలని ఇన్ఫోసిస్ మాజీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ వి. బాలకృష్ణన్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఖాతాదార్లను అర్థం చేసుకోవడానికి నీలేకని అనుభవం తోడ్పడుతుందని.. కంపెనీని నడిపించే 'మంచి వ్యక్తి' ఆయన కాగలరని అభిప్రాయపడ్డారు. అదే సమయంలో ప్రస్తుత ఛైర్మన్ (ఆర్. శేషశాయి), సహ ఛైర్మన్ (రవి వెంకటేశన్)లను తొలగించాలని ఆయన పీటీఐతో అన్నారు. 'నీలేకని ఛైర్మన్‌గా వచ్చి.. సీఈఓగా కాదగ్గ వ్యక్తిని ఎంపిక చేయడం ప్రస్తుత పరిస్థితులకు చాలా అవసరమ'ని బాల అభిప్రాయపడ్డారు. నీలేకని కంపెనీలో ఉన్న సమయంలో చాలా బాగా పని చేశారని.. ఖాతాదార్లతో మంచి సంబంధాలు కలిగి ఉండే వారని గుర్తు చేశారు. 'అదీకాక నీలేకనికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు, గౌరవం ఉన్నాయి. చాలా ప్రభుత్వ ప్రాజెక్టుల్లోనూ ఆయన పనిచేశారు. ముఖ్యంగా చెప్పుకోవాల్సింది ఆధార్ ప్రాజెక్ట్. అందుకే బోర్డులోకి రావడానికి ఆయనకు అన్ని విధాలా అర్హత ఉంద'ని బాల వివరించారు. విశాల్ సిక్కా గత వారం సీఈఓగా రాజీనామా చేయడంతో తాత్కాలిక సీఈఓ (మార్చి 31, 2018 దాకా)గా యు.బి. ప్రవీణ్ రావును నియమించిన సంగతి తెలిసిందే. కాగా, బాలకృష్ణన్ అభిప్రాయపడ్డట్లు.. ఇన్‌స్టిట్యూషనల్ అడ్వైజరీ సర్వీసెస్(ఐఏఎస్) కూడా నీలేకనిని నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా బోర్డులోకి తీసుకురావడం మంచిదని సిక్కా రాజీనామా చేసిన రోజునే(ఆగస్టు 18) తన నివేదికలో పేర్కొనడం గమనార్హం.

వీరి మద్దతూ నీలేకనికే: ఇన్ఫోసిస్‌లో సంస్థాగత మదుపర్లుగా ఉన్న దాదాపు 12 ఫండ్ మేనేజర్లు సైతం సహ వ్యవస్థాపకుడు, మాజీ సీఈఓ అయిన నందన్ నీలేకనిని తిరిగి బోర్డులోకి తీసుకురావాలని కోరుకుంటున్నారు. తద్వారా కంపెనీ వాటాదార్లలో తిరిగి విశ్వాసాన్ని నింపవచ్చని ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎమ్‌సీ, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్, హెచ్‌డీఎఫ్‌సీ ఎమ్ఎఫ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, రిలయన్స్ నిప్పన్ లైఫ్, ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌లకు చెందిన మేనేజర్లు కంపెనీకి రాసిన సంయుక్త లేఖలో పేర్కొనడం గమనార్హం. తాము ఆశించినట్లు కంపెనీ నిర్ణయాన్ని ప్రకటిస్తుందని అందులో ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇన్ఫీ షేర్ల లాభాల వెనక: నీలేకని తిరిగి బోర్డులోకి అడుగుపెడతారన్న అంచనాలు, వార్తల నేపథ్యంలో బుధవారం బీఎస్ఈలో ఇన్ఫోసిస్ షేర్లు 3 శాతం దాకా పెరగడం విశేషం.

మూర్తి 29న మాట్లాడతారు

కంపెనీలోని పెద్ద స్థాయి వాటాదార్లతో బుధవారం జరగాల్సిన నారాయణమూర్తి సమావేశం (కాన్ఫరెన్స్ కాల్) వాయిదా పడింది. ఆయనకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో చివరి నిమిషంలో రద్దయింది. ఇది ఈనెల 29న జరగొచ్చని, ఈ పరిణామాలతో దగ్గరి సంబంధమున్న ఇద్దరు వ్యక్తులు పేర్కొన్నారు. ఈ కాన్ఫరెన్స్ కాల్‌ను బ్రోకరేజీ సంస్థ ఇన్వెస్టెక్ ఇండియా నిర్వహించనుంది. మూర్తి ఏం చెబుతారన్నది వినడానికి అంతర్జాతీయ మదుపర్లు సైతం ఇందులో పాల్గొనడానికి ఆసక్తిగా ఉన్నారని సమాచారం. సిక్కా రాజీనామాకు కారణం మూర్తేనని ఇన్ఫీ బోర్డు ఆరోపించిన సంగతి తెలిసిందే. తనకు ఎదురవుతున్న వ్యక్తిగత దూషణలను తట్టుకోలేకే రాజీనామా చేస్తున్నట్లు, ఎవరి పేరును వెల్లడించకుండా సిక్కా పేర్కొన్న విషయమూ విదితమే.

ప్రమోటర్లందరికీ అది వర్తించదు

ఇన్ఫీ యాజమాన్యాన్ని మూర్తి విమర్శించినంత మాత్రాన.. దాన్ని మొత్తం ప్రమోటరు గ్రూపు విమర్శించినట్లుగా చూడకూడదని ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ అడ్వైజరీ సర్వీసెస్(ఐఏఏస్) పేర్కొంది. గత మూడేళ్లలో కంపెనీ ప్రతిపాదనలపై ప్రమోటర్ల ఓటింగ్ తీరును పరిశీలించాక ఐఏఎస్ ఈ వ్యాఖ్యలు చేసింది. వ్యవస్థాపకులు ఏ ప్రతిపాదనకూ వ్యతిరేకంగా ఓటు వేయలేదని గుర్తు చేసింది. మొత్తం అందరు వ్యవస్థాపకులు ఒక మాటపై ఏమీ లేరని తెలిపింది. కాబట్టి మూర్తికి ప్రమోటర్లందరూ మద్దతు ఇచ్చినట్లుగా కూడా కాదని పేర్కొంది.

మేం పట్టించుకోం: ఇన్ఫీ వాటాదారు

ఇన్ఫోసిస్‌లో సంస్థాగత వాటాదారు అయిన ఒపెన్‌హీమర్ ఫండ్స్ తాజా పరిణామాలపై స్పందించింది. సిక్కా నిష్క్రమణ తమపై ప్రభావం చూపదని ఆ ఫండ్ ప్రతినిధి కింబర్లీ వీన్‌రిక్ పేర్కొన్నారు. ఈ ఫండ్‌కు కంపెనీలో 2.16% వాటా(4.96 కోట్ల షేర్లు) ఉంది.

ఈ సంక్షోభం దురదృష్టకరం కర్ణాటక మంత్రి

ఇన్ఫోసిస్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు దురదృష్టకరమని కర్ణాటక పరిశ్రమల మంత్రి ఆర్.వి. దేశ్‌పాండే పేర్కొన్నారు. ఇన్ఫీలో ఇలా జరిగి ఉండాల్సింది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. 'పారదర్శకత లేనప్పుడు నిజాన్ని నిర్ధరించుకోవడానికి దారులు వెతుక్కోవాలి. దురదృష్టవశాత్తు మదుపర్లు, వాటాదార్ల విశ్వాసం దెబ్బతింద'ని ఆయన అన్నారు. 'ఇన్ఫీ అంటే దేశంలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. ఇన్ఫోసిస్‌ను చూసి మేమంతా గర్విస్తున్నాం. అయితే ఇలాంటి సంఘటనలు దురదృష్టకరమ'ని ఆయన పేర్కొన్నారు.

ఔషధ సంస్థలకు జీవనకాల లైసెన్స్!

- ప్రతి అయిదేళ్లకు పునరుద్ధరణ అవసరం లేదు
- ప్రతి మూడేళ్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తనిఖీలుంటాయ్
- ప్రమాణాలకు విరుద్ధంగా ఉంటే లైసెన్స్ రద్దు
- సీడీఎస్‌సీఓ ప్రతిపాదనకు వైద్యశాఖ మంత్రి ఆమోదం



అనుమతి

ఈనాడు, దిల్లీ: ఔషధ తయారీ (ఫార్మా) సంస్థలు ప్రస్తుతం ప్రతి అయిదేళ్లకు తమ లైసెన్స్‌ను పునరుద్ధరించుకుంటున్నాయి. ఇకపై ఈ అవసరం ఉండదు. ఒకసారి లైసెన్స్ తీసుకుంటే, జీవనకాలం (లైఫ్‌టైమ్) కొనసాగే విధానాన్ని అమల్లోకి తేవాలని కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ) నిర్ణయించింది. కంపెనీ ఉత్తమ తయారీ విధానాలు (జీఎంపీ) పాటించినంత వరకు, ఔషధ అనుమతులు కొనసాగుతాయి. అయితే జీవనకాల లైసెన్స్‌కు కొన్ని షరతులను సీడీఎస్‌సీఓ ప్రతిపాదించింది. ప్రతి మూడేళ్లకు ఒకసారి ఔషధ తయారీ సంస్థలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఇన్‌స్పెక్టర్లు తనిఖీ చేయాలని పేర్కొంది. లైసెన్స్ నిబంధనలను ఔషధ సంస్థలు పాటిస్తున్నాయా, ఔషధాలు-కాస్మెటిక్స్ 2940 చట్టాన్ని అమలు చేస్తున్నాయా అనేది పరిశీలించాల్సి ఉంటుంది. ఒకవేళ కంపెనీ కనుక తయారీ విధానంలో మార్పులు చేస్తే, నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం కోసం సీడీఎస్‌సీఓకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రతిపాదనకు వైద్యశాఖ మంత్రి జేపీ నడ్డా ఇప్పటికే ఆమోదం తెలిపారు. త్వరలోనే న్యాయశాఖ పరిశీలనకు పంపుతారని, అక్కడ ఆమోదం పొందితే, నోటిఫై చేస్తారని సమాచారం.

నిబంధనలు పాటించేవారికి అనుకూలం: 'నిబంధనలు పాటించే ఔషధ తయారీ సంస్థలకు ఇది ఉపకరిస్తుంది. ఔషధాల తయారీ, విక్రయాలు, పంపిణీకి సంబంధించి, అయిదేళ్లకోసారి లైసెన్స్ పునరుద్ధరించుకునే ప్రక్రియ నుంచి వారికి విరామం దొరుకుతుంది. దేశీయంగా వ్యాపార నిర్వహణను సులభతరం చేసే ప్రక్రియలో ఇది కూడా భాగమే' అని ఒక అధికారి వివరించారు.

భిన్నాభిప్రాయాలు: ఈ ప్రతిపాదనపై సీడీఎస్‌సీఓ ఔషధ సంస్థల నిర్వాహకులను సంప్రదించినపుడు, భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. వారిలో అత్యధికులు కేంద్ర, రాష్ట్ర ఇన్‌స్పెక్టర్ల సంయుక్త తనిఖీలను వ్యతిరేకించారు. ఇందువల్ల లైసెన్సు ప్రక్రియ ఆలస్యం అవుతుందనే సందేహాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యంగా చిన్న, మధ్యస్థాయి సంస్థలకు కష్టాలు ఎదురవుతాయన్నది వారి ఆలోచన. అయినా కూడా సంయుక్తంగానే తనిఖీలు జరపాలని సీడీఎస్‌సీఓ నిర్ణయించింది. అయితే ఇవి ఏటా కాకుండా మూడేళ్లకు ఒకసారి మాత్రమే నిర్వహింప చేయాలని ప్రతిపాదించింది.

సీటీ 100 కొత్త బైక్

విడుదల



ముంబయి: ఎలక్ట్రిక్ స్టార్ట్‌తో కూడిన సీటీ 100 మోటార్‌సైకిల్‌ను బజాజ్ ఆటో విపణిలోకి విడుదల చేసింది. దీని ధర రూ. 38,806(ఎక్స్‌షోరూమ్, మహరాష్ట్ర), రూ. 41,997(ఎక్స్‌షోరూమ్, దిల్లీ)గా కంపెనీ నిర్ణయించింది. ఈ ధరలు స్వల్పకాలం పాటే అమల్లో ఉంటాయని కంపెనీ పేర్కొంది. డిజైన్, సైడ్ ఇండికేటర్స్, ఫ్యూయల్ గాజ్‌లలో కొద్ది పాటి మార్పులతో ఈ కొత్త మోడల్‌ను తీసుకొచ్చామని కంపెనీ తెలిపింది.

హైదరాబాద్‌లో లలితా జువెలరీ కేంద్రం



- కంపెనీకి 15వ షోరూమ్
- త్వరలో విజయవాడ, రాజమహేంద్రవరంలోనూ

ఈనాడు, హైదరాబాద్: లలితా జువెలరీ హైదరాబాద్‌లోని సోమాజిగూడలో అతిపెద్ద నగల విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తోంది. కంపెనీకి ఇది 15వ విక్రయ కేంద్రం అవుతుంది. వివిధ అంతస్తుల్లో, 1.3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నెలకొల్పిన ఈ విక్రయశాల, ప్రపంచంలోనే అతిపెద్ద నగల విక్రయ కేంద్రాల్లో ఒకటని, దీని ద్వారా తెలంగాణలోకి అడుగు పెడుతున్నామని లలితా జువెలరీ తెలిపింది. బంగారు, వజ్రాభరణాలతో పాటు ప్లాటినమ్, వెండి వస్తువులు, ఆభరణాలు కూడా ఈ షోరూమ్‌లో విక్రయిస్తారు. తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కె.తారక రామారావు సతీ సమేతంగా ఈనెల 27న ఈ విక్రయశాలను ప్రారంభించనున్నారు. వజ్రాభరణాల విభాగాన్ని లైకా గ్రూప్ ఛైర్మన్ ఎ.సుభాస్కరణ్, ఆయన సతీమణి ప్రారంభిస్తారు. చెన్నైలో ఒక విక్రయ కేంద్రంతో ప్రస్థానం ప్రారంభించిన లలితా జువెలరీకి ప్రస్తుతం మధురై, తిరుచ్చి, పుదుచ్చేరి, కుంభకోణం, కోయంబత్తూరు, తిరుపతి తదితర పట్టణాల్లో 14 విక్రయశాలలున్నాయి. కంపెనీ వార్షిక విక్రయాలు రూ.10,700 కోట్లకు చేరాయి. త్వరలోనే విజయవాడ, రాజమహేంద్రవరంలలో విక్రయశాలలు ప్రారంభించనున్నట్లు పేర్కొంది.

ప్రారంభోత్సవ రాయితీలు..: హైదరాబాద్ షోరూమ్ ప్రారంభోత్సవం సందర్భంగా పలు రాయితీలు ప్రకటించారు. అన్ని వజ్రాభరణాలపై క్యారెట్‌కు రూ. 2,000 మేరకు తగ్గిస్తున్నట్లు లలితా జువెలరీ తెలిపింది. బంగారు నగలకు తరుగులో ఒక శాతం రాయితీ ఇవ్వనుంది.

వెండి వస్తువులకు ఏ మాత్రం తరుగు ఉండదు. 'ఎస్టిమేట్ స్లిప్' సవాలు పేరుతో నాలుగైదు విక్రయ కేంద్రాల్లో ధరను పోల్చుకున్న తరవాతే, బంగారు నగను కొనుగోలు చేసే వెసులుబాటును కొనుగోలుదారుకు కల్పిస్తోంది. వినియోగదారుడు ఆభరణం ఎస్టిమేట్ చీటీని, మొబైల్ ఫోన్ ద్వారా ఫోటో తీసుకుని, ఇతర దుకాణాల్లో కూడా విచారించుకోవచ్చని, ఎక్కడ తక్కువ ధర ఉంటే అక్కడే ఆ నగ కొనుగోలు చేయొచ్చని, తొలిసారిగా తామే ఈ సవాలు తీసుకువచ్చామని లలితా జువెలర్స్ ఛైర్మన్, ఎండీ కిరణ్‌కుమార్ వివరించారు. 1-9 శాతం తరుగుతోనే హైదరాబాద్‌లో తొలిసారిగా ఆభరణాలు లభ్యమవుతున్నాయని చెప్పారు. అయితే.. కొన్ని ప్రత్యేక బంగారు ఆభరణాలపై 10-16 శాతం తరుగు ఉంటుంది. బంగారు నగలకు బీఐఎస్ 916 హాల్‌మార్క్, వజ్రాభరణాలకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు ధ్రువీకరణ ఉంటాయి. నగలు కొనుగోలుపై వినియోగదారుల్లో అవగాహన కల్పించడానికి ఆభరణాల కొనుగోలుపై పుస్తకాన్ని ఉచితంగా ఇస్తున్నారు. ప్రాచీన అందాలను చాటే ఆభరణాలతో పాటు, నేటి యువత అభిరుచులకు అనుగుణమైన ఆభరణాలు కూడా కొత్తగా ప్రారంభించిన షోరూమ్‌లో లభ్యమవుతాయి.

వజ్రాభరణాలు కొంటున్నారా?

వజ్రాభరణాలు కొనుగోలు చేసేటప్పుడు షోరూమ్ ఇచ్చే ధ్రువీకరణ కన్నా.. అంతర్జాతీయ సంస్థ ఇచ్చే ధ్రువీకరణ పొందడం వినియోగదారుడికి చాలా ముఖ్యమని లలితా జువెలరీ సూచిస్తోంది. హైదరాబాద్‌లోనే తొలిసారిగా రూ. 48,000కే క్యారెట్‌ను తాము అందుబాటులోకి తీసుకు వస్తున్నామని, తరుగు రూ.975 ఉంటుందని పేర్కొంది. వజ్రం విలువ దాని పరిమాణంపై ఆధారపడి ఉంటుందని, రంగు రహిత వజ్రాలు శ్రేష్ఠమైనవని వివరించింది.



హెరిటేజ్ ఫుడ్స్ రజతోత్సవాల ముగింపు కార్యక్రమంలో కంపెనీ ఛైర్‌పర్సన్ దేవినేని సీతారామయ్య (ఎడమ నుంచి అయిదో వ్యక్తి), నందమూరి బాలకృష్ణ, నారా లోకేశ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హెరిటేజ్ వైస్ ఛైర్‌పర్సన్, ఎండీ నారా భువనేశ్వరి తదితరులు

జాతీయ కంపెనీగా హెరిటేజ్ ఫుడ్స్

ముగిసిన రజతోత్సవాలు

ఈనాడు, హైదరాబాద్: పశ్చిమ మార్కెట్లలోకి అడుగు పెట్టడంతో పాటు రిలయన్స్ డెయిరీ వ్యాపారాన్ని కొనుగోలు చేయడం ద్వారా కంపెనీ జాతీయ స్థాయి డెయిరీ కంపెనీగా ఆవిర్భవించిందని హెరిటేజ్ ఫుడ్స్ వెల్లడించింది. కంపెనీ రజతోత్సవ ముగింపు కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో హెరిటేజ్ ఫుడ్స్ నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, పంచాయితీ రాజ్ శాఖ మంత్రి నారా లోకేశ్, సినీ హీరో, హిందుపూర్ ఎంఎల్ఏ నందమూరి బాలకృష్ణ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. గత 25 సంవత్సరాలుగా హెరిటేజ్ అభివృద్ధిలో భాగస్వాములుగా ఉన్న అందరూ ఈ కార్యక్రమానికి విచ్చేశారు. కంపెనీ వ్యవస్థాపకుడు చంద్రబాబు నాయుడు నిర్దేశించిన ప్రమాణాలు, విలువల్లో రాజీ లేకుండా కంపెనీ 25 ఏళ్ల ప్రయాణాన్ని కొనసాగించిందని, రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళుతోందని హెరిటేజ్ ఫుడ్స్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రజతోత్సవాలను హైదరాబాద్‌లోనే ప్రారంభించారు. ఆ తర్వాత దిల్లీ, చెన్నై మొదలైన నగరాల్లో వీటిని నిర్వహించారు. రజతోత్సవ సమయంలో కంపెనీకి కొత్త రూపు (బ్రాండింగ్) ఇచ్చారు. కొత్త లోగో ఆవిష్కరించారు. ఉత్పత్తుల ప్యాకింగ్‌ను నవీకరించారు. 2022 నాటికి రూ.6,000 కోట్ల టర్నోవరు చేరుకోవాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. ఆదాయంలో విలువ చేర్చిన ఉత్పత్తుల వాటాను ప్రస్తుతమున్న 24 శాతం నుంచి 40 శాతానికి పెంచుకోవాలని నిర్ణయించినట్లు అప్పట్లో హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి తెలిపారు. రీబ్రాండింగ్ కార్యక్రమం, రిలయన్స్ డెయిరీ కొనుగోలు, ఇతర మార్కెటింగ్ చర్యల మద్దతుతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కంపెనీ ఆదాయం 32 శాతం వృద్ధిని నమోదు చేసింది.

బాలీవుడ్ యువ నాయకానాయికలు సిద్ధార్థ్ మల్హోత్రా, జాక్వెలైన్ ఫెర్నాండెజ్ జంటగా నటించిన చిత్రం 'ఎ జెంటిల్మన్: సుందర్ సుశీల్ రిస్కీ'. వీరిద్దరూ జోడీగా నటించిన తొలి చిత్రమిదే. సీనియర్ కథానాయకుడు సునీల్ శెట్టి కీలక పాత్రలో నటించారు. సైఫ్ అలీఖాన్‌తో 'గో గోవా గాన్', 'హ్యాపీ ఎండింగ్' చిత్రాలను తెరకెక్కించిన తెలుగు దర్శక ద్వయం రాజ్, డి.కె. ఈ సినిమాను తెరకెక్కించారు. హాలీవుడ్ నిర్మాణ సంస్థ ఫాక్స్‌స్టార్ స్టూడియోస్ నిర్మించింది. ఈ చిత్రం ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ఆ చిత్ర విశేషాలివీ.

'జంటిల్మన్' వద్దు... రిస్కీ రిషి ముద్దు!

సిద్ధార్థ్ మల్హోత్రా నటించిన గత చిత్రం 'బార్ బార్ దేఖో'కు పెద్దగా ఆదరణ దక్కలేదు. జాక్వెలైన్ గత చిత్రాలు 'ఫ్లైయింగ్ జాట్', 'డిషూమ్' ఫర్వాలేదనిపించాయి. దీంతో ఆ ఇద్దరూ తమ తాజా చిత్రం 'ఎ జెంటిల్మన్'తో మంచి విజయం అందుకోవాలని ఆశిస్తున్నారు. గతంలో వీరిద్దరూ 'బ్రదర్స్'లో తొలిసారి తెరను పంచుకున్నా, తొలిసారి నాయకానాయికలుగా నటించింది మాత్రం 'ఎ జంటిల్మన్'లోనే. 'షోర్ ఇన్ ది సిటీ'తో ప్రతిభ గల దర్శకులుగా పేరుతెచ్చుకున్న తెలుగు దర్శకద్వయం రాజ్, డి. కె. బాలీవుడ్‌లో తెరకెక్కించిన ఐదో చిత్రమిది.



'ఎ జెంటిల్మన్: సుందర్ సుశీల్ రిస్కీ'లో జాక్వెలైన్ ఫెర్నాండెజ్, సిద్ధార్థ్ మల్హోత్రా

మరో 'బ్యాంగ్ బ్యాంగ్' కాదు

ఘనవిజయం సాధించిన హృతిక్ రోషన్ చిత్రం 'బ్యాంగ్ బ్యాంగ్'కు సీక్వెల్‌గా ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు తొలుత వార్తలొచ్చాయి. 'బ్యాంగ్ బ్యాంగ్'ను నిర్మించిన ఫాక్స్‌స్టార్ స్టూడియో సంస్థ లోనే ఈ చిత్రం రూపొందడం అందుకు కారణం. అయితే 'బ్యాంగ్ బ్యాంగ్'కు, ఈ చిత్రానికీ ఎలాంటి సంబంధం లేదని, ఇది పూర్తిగా కొత్త కథతో తెరకెక్కిన చిత్రమని చిత్రబృందం స్పష్టం చేసింది.

కథేంటి

గౌరవ్ (సిద్ధార్థ్ మల్హోత్రా) అందగాడు, బుద్ధిమంతుడు. ఉద్యోగం చేసుకుంటూ ప్రశాంతంగా జీవిస్తుంటాడు. అతనికి కావ్య (జాక్వెలైన్ ఫెర్నాండెజ్) అనే చలాకీ అమ్మాయితో పరిచయమవుతుంది. కావ్యను ఇష్టపడిన గౌరవ్ ఆమెను పెళ్లి చేసుకోవాలనుకుంటాడు. అయితే కావ్యకు గౌరవ్‌లాంటి జంటిల్మన్‌ను కాకుండా రిస్కీగా సాహసాలు చేసే కుర్రాణ్ని పెళ్లిచేసుకోవాలని కోరిక. అది తెలుసుకున్న గౌరవ్, కావ్య మెప్పు కోసం ఓ అనూహ్య నిర్ణయం తీసుకుంటాడు. దాంతో అతని జీవితం ఊహించని మలుపు తిరుగుతుంది. అతణ్ని రిషి అని పిలుస్తూ కొందరు చంపడానికి వెంటాడుతుంటారు. ఇంతకీ రిషి ఎవరు? అతనికి, విలన్లకు ఏంటి సంబంధం? కావ్య, గౌరవ్‌ను పెళ్లి చేసుకుంటుందా? లేక తను కోరుకునే లక్షణాలున్న రిషినా? ఈ విషయాలు తెరపై చూడాలి.

ఆ చిత్రం స్ఫూర్తితో?

1998లో వచ్చిన అమెరికన్ యాక్షన్ కామెడీ చిత్రం 'ది బిగ్ హిట్'. హాంగ్‌కాంగ్ దర్శకుడు చె కిర్క్ వాంగ్ తెరకెక్కించిన ఈ చిత్రం ప్రేక్షకులను మెప్పించింది. ఇప్పుడు ఆ చిత్ర కథను స్ఫూర్తిగా తీసుకుని 'ఎ జంటిల్మన్'ను రూపొందించినట్లు వినిపిస్తోంది. అయితే దీనిపై చిత్రబృందం స్పందించలేదు.

ఈనాడు సినిమా

చిరు కోసం హాలీవుడ్ నుంచి



చిరంజీవి

చిరంజీవి 151వ చిత్రం 'సైరా నరసింహారెడ్డి' సందడి మొదలైపోయింది. చిరు పుట్టిన రోజు సందర్భంగా మోషన్ పోస్టర్ విడుదల చేశారు. మరోవైపు నటీనటులు, సాంకేతిక నిపుణులెవరన్నది తేలిపోయింది. ఇప్పుడు ఆ జాబితాలో మరో పేరు చేరింది. ఆయనే.. టోనీ చింగ్. హాంకాంగ్‌లో యాక్షన్ కొరియోగ్రాఫర్‌గా టోనీకి మంచి పేరుంది. హాలీవుడ్‌లో పలు చిత్రాలకు పనిచేశారాయన. బాలీవుడ్‌లో 'క్రిష్ 3'కి పోరాటాలు కంపోజ్ చేశారు. ఇప్పుడు 'సైరా' కోసం టాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు. 'సైరా నరసింహారెడ్డి'లో పోరాట ఘట్టాలకు అందులోనూ యుద్ధ సన్నివేశాలకు ప్రాధాన్యం ఉంది. వాటిని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలని చిత్రబృందం భావిస్తోంది.



తమన్నా

నాలోని నటినే కోరుకోవాలి!

స్టార్ హోదాతో కొనసాగుతున్న తారలతో సినిమా అంటే చాలా లెక్కలుంటాయి. వాళ్ల స్థాయికి, ఇమేజ్‌కి తగ్గ పాత్రల్ని సిద్ధం చేసుకోవల్సిందే. లేదంటే మరో మాట లేకుండా దర్శకులకు 'నో' చెప్పేస్తుంటారు తారలు. స్టార్ హోదాకి ఉన్న విలువే అది. తమన్నా మాత్రం అలాంటి లెక్కలతో రూపుదిద్దుకొనే పాత్రల్ని చేయడం అస్సలు ఇష్టం ఉండదంటోంది. "ఏ పాత్ర అయినా నాలోని నటిని కోరుకొని నా దగ్గరికి రావాలనుకొంటాను తప్ప, స్టార్‌గా నాకున్న విలువని చూసి కాదు. అలాంటప్పుడు స్టార్ అనే గుర్తింపు ఎందుకని అంటారేమో. ఆ గుర్తింపు ప్రత్యేకంగా నన్ను దృష్టిలో ఉంచుకొని దర్శకులు, రచయితలు మరిన్ని పాత్రలు సిద్ధం చేయడానికి దోహదం చేస్తుంద"ని చెప్పుకొచ్చింది తమన్నా. మొదట దక్షిణాదిలో గుర్తింపు తెచ్చుకొన్న తమన్నా, ఆ తర్వాత హిందీలో పాగా వేసింది. అక్కడికెళ్లాక మీలో వచ్చిన మార్పులేమిటి? అని అడిగితే... "నటన పరంగా కాదు కానీ, ఫ్యాషన్ పరంగా మాత్రం పరిణతి సాధించా. ఎవ్వరైనా ఒకర్ని చూసి మరొకరు నేర్చుకోవల్సిందే. అలా నేను కూడా హిందీకి వెళ్లాక అక్కడి పరిస్థితుల్ని చూసి కొంత నేర్చుకొన్నా" అంది తమన్నా.



ధనుష్

మామకు తగ్గ అల్లుడు అనిపించుకొంటున్నాడు ధనుష్. మామ రజనీకాంత్‌లాగే అంత ర్జాతీయ స్థాయిలో గుర్తింపుని తెచ్చుకొన్నాడు. ఇప్పుడు హాలీవుడ్‌లోనూ నటిస్తున్నాడు. దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ చిత్రాలు చేస్తూ విజయాల్ని సొంతం చేసుకొంటున్న ఆయన ఇటీవల 'రఘువరన్ బీటెక్'కి కొనసాగింపుగా తెరకెక్కిన 'వి.ఐ.పి 2'లో నటించారు. ధనుష్ రాసిన కథతో, ఆయన మరదలు సౌందర్య రజనీకాంత్ తెరకెక్కించిన ఆ చిత్రం 25న తెలుగు ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ధనుష్, సౌందర్య హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విషయాలివీ...

తెలుగులోనూ చిత్రాల్ని నిర్మిస్తా

'రఘువరన్ బీటెక్'కి కొనసాగింపు చిత్రం చేయాలనే ఆలోచన మీకెప్పుడు కలిగింది?

రఘువరన్ ప్రపంచాన్ని తెరపై చూసుకొన్న వెంటనే కలిగింది. నేరుగా తెలుగులో సినిమా చేయాలని ఎప్పట్నుంచో అనుకొంటున్నా. 'వి.ఐ.పి 2' కథ రాసుకొంటున్నప్పుడు తెలుగులో చేయడానికి సరైన కథ ఇదే అనిపించింది. ఇందులో కనిపించే కొత్త పాత్రంటే కాజోల్ మేడమ్ చేసిన వసుంధర పాత్రే. ఆ పాత్ర స్టైలిష్‌గా కనిపిస్తూ వినోదాన్ని పంచుతుంది.

సౌందర్య దర్శకత్వం వహిస్తారని కథ రాస్తున్నప్పుడే మీకు తెలుసా?

దర్శకత్వం గురించి స్క్రిప్టు దశలో అసలు ఆలోచించలేదు. సౌందర్య విజన్, నాకు బాగా తెలుసు. 'వి.ఐ.పి 2' కథకి, ఇందులో కాజోల్ పోషించిన వసుంధర పాత్రలోని స్టైల్‌కి సౌందర్య తరహా పనితీరు అవసరం అనిపించింది. స్క్రిప్టు చదివాక ఆమె కూడా ఈ సినిమా చేయడానికి ముందుకొచ్చింది.

సొంతంగా కథలు సిద్ధం చేసుకొంటా: సౌందర్య

"ఇప్పటిదాకా నేను తీసిన రెండు చిత్రాల కథలూ వేరొకరు రాసినవే. దర్శకురాలిగా నా పనితీరు నాకు సంతృప్తినిచ్చింది. సొంత కథలతోనూ సినిమాలు చేసే ఆలోచన ఉంది. 'రఘువరన్ బీటెక్' చిత్రంలో కథానాయకుడు ఓ నిరుద్యోగి. కానీ రెండో సినిమాకి వచ్చేసరికి రఘువరన్ ఓ ఉద్యోగి కావడంతో పాటు, పెళ్లి కూడా అయ్యుంటుంది. అతడి కొత్త ప్రపంచాన్ని ఊహిస్తూ సినిమా చేశా".

తమిళంలోనూ, తెలుగులోనూ ఒకేరోజు విడుదల చేయలేకపోయారు. కారణం?

తమిళంలో 'వి.ఐ.పి 2' విడుదలైన రోజు తెలుగులో మూడు చిత్రాలు ప్రేక్షకుల ముందుకొచ్చాయి. దాంతో ఇక్కడ చిత్రాన్ని ఆలస్యంగా విడుదల చేయాల్సి వస్తోంది.

తమిళంలో సినిమాకి లభిస్తున్న స్పందన సంతృప్తినిచ్చిందా?

యువతరంతో పాటు, కుటుంబ ప్రేక్షకులూ సినిమాని చూసి ఆస్వాదిస్తున్నారు. వసూళ్ల విషయంలో సంతృప్తిగా ఉన్నాం.

ఇక నుంచి తెలుగులోనూ సినిమాలు నిర్మిస్తారా?


తప్పకుండా. ముందుగా ఇక్కడ ప్రేక్షకుల అభిరుచుల్ని మరింత బాగా అర్థం చేసుకోవల్సి ఉంది. ప్రస్తుతం చేస్తున్న 'వడ చెన్నై'ని తెలుగులో అనువదిస్తామంతే. 'మారి 2'ని తమిళంతో పాటుగా తెలుగులోనూ రూపొందిస్తాం.

హాలీవుడ్‌లోనూ సినిమా చేస్తున్నారు. అక్కడికీ, దక్షిణాది చిత్ర పరిశ్రమకీ మధ్య మీరు గమనించిన తేడాలేమిటి?


హాలీవుడ్‌లో ఒక సినిమాని సెట్స్‌పైకి తీసుకెళ్లడానికి ముందు జరిగే కసరత్తులు, ప్రణాళికలు నాకు స్ఫూర్తినిచ్చాయి. ఎన్ని రోజులు తీయబోతున్నాం? ఎంత ఖర్చవుతుంది? అనే విషయాలపై స్పష్టతతో ఉంటారు. అలాంటి ప్రణాళికలతో సినిమా చేస్తే నిర్మాణ వ్యయం, సమయం కలిసొస్తాయి.

మీ భార్య ఐశ్వర్య దర్శకత్వంలో ఇదివరకు '3' చేశారు. ఇప్పుడు సౌందర్య దర్శకత్వంలో నటించారు. ఇద్దరి పనితీరులో మార్పులేమైనా ఉన్నాయా?

ఇద్దరూ కుటుంబ సభ్యులే. ఇద్దరితో సినిమా చేయడం ఒకలాగే అనిపించింది. ఐశ్వర్య ప్రస్తుతం కొన్ని కథల్ని సిద్ధం చేసుకొంటోంది. త్వరలోనే తను కూడా ఓ చిత్రం తెరకెక్కించబోతోంది.



షారుఖ్ ఖాన్



సల్మాన్ ఖాన్



అక్షయ్ కుమార్

సంపాదనలో ముగ్గురు మొనగాళ్లు

భారతీయ నటులు మరోసారి సత్తా చాటారు. బాలీవుడ్ చిత్రాల ద్వారా మన దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది అభిమానాన్ని సంపాదించుకున్న మన కథానాయకులు, సంపాదనలోనూ అదే స్థాయిలో తిరుగులేని జోరు చూపించారు. 2017లో అత్యధిక ఆదాయాన్ని ఆర్జించిన 20 మంది నటులతో ఫోర్బ్స్ విడుదల చేసిన జాబితాలో షారుఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, అక్షయ్ కుమార్ వరుసగా 8, 9, 10 స్థానాలు దక్కించుకుని ముగ్గురు మొనగాళ్లుగా నిలిచారు. తొలి మూడుస్థానాలు వరుసగా మార్క్ వాల్‌బర్గ్, డ్వేన్ జాన్సన్, విన్ డీసిల్ దక్కించుకున్నారు. ఆడమ్ శాండ్లర్(4), జాకీచాన్(5), రాబర్ట్ డౌనీ జూనియర్(6), టామ్‌క్రూజ్(7) స్థానాల్లో నిలిచారు.

షారుఖ్ ఖాన్: గతేడాది ఫోర్బ్స్ జాబితాలో షారుఖ్ ఖాన్ 8వ స్థానంలో నిలిచారు. ఈ ఏడాదీ అదే స్థానాన్ని దక్కించుకున్నారు. అయితే గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆయన ఆదాయం పెరగడం గమనార్హం. 2016లో షారుఖ్ ఆదాయం 33 మిలియన్ డాలర్లు కాగా ఈ ఏడాదిలో 38 మిలియన్ డాలర్లు (రూ.243 కోట్లు) ఆర్జించారు. ఈ ఏడాది ఆయన 'రయీస్', 'జబ్ హ్యారీ మెట్ సెజల్' చిత్రాల్లో నటించారు. మరో వైపు పలు వాణిజ్య ఉత్పత్తులకు ప్రచారకర్తగా ఉన్న షారుఖ్ రెండు చేతులా కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నారు.

సల్మాన్ ఖాన్: గతేడాది 14వ స్థానంలో నిలిచిన సల్మాన్ ఖాన్ ఈ ఏడాది 9వ స్థానానికి చేరుకోవడం విశేషం. ఈ ఏడాది ఆయన నటించిన 'ట్యూబ్‌లైట్' పరాజయం చెందినప్పటికీ అతని ఆదాయం మాత్రం బాగా పెరిగింది. 2016లో 28.5 మిలియన్ డాలర్లు సంపాదించిన సల్మాన్, 2017లో 37 మిలియన్ డాలర్లు (రూ.237 కోట్లు) ఆర్జించారు. హిందీలో బిగ్‌బాస్ రియాలిటీ షో అన్ని సీజన్లకూ సల్మాన్ ప్రయోక్తగా వ్యవహరించిన విషయం తెలిసిందే. సల్మాన్‌కున్న ప్రధాన ఆదాయ వనరుల్లో బిగ్‌బాస్ ఒకటని ఫోర్బ్స్ తెలిపింది.

అక్షయ్ కుమార్: గతేడాది 10వ స్థానంలో నిలిచిన అక్షయ్ కుమార్ ఈ ఏడాదీ అదే స్థానాన్ని చేజిక్కించుకున్నారు. దాంతో పాటు తన ఆదాయం పెంచుకున్నారు. 2016లో 31.5 మిలియన్ డాలర్లు ఆర్జించిన అక్షయ్, 2017లో 35.5 మిలియన్ డాలర్లు (రూ.227 కోట్లు) సంపాదించారు. వేగంగా సినిమాలు చేసే అక్షయ్ ఈ ఏడాది 'జాలీ ఎల్ఎల్‌బీ 2', 'టాయిలెట్: ఏక్ ప్రేమ్‌కథ' చిత్రాల్లో నటించారు. అవి రెండూ విజయవంతమయ్యాయి. అక్షయ్‌ని బాలీవుడ్ బాక్సాఫీసుకు రారాజుగా ఫోర్బ్స్ అభివర్ణించింది.



"మా సినిమాలోని ముద్దు సన్నివేశం గురించి అందరూ మాట్లాడుకొంటున్నారు. ప్రేమలో గాఢతని, నిజాయతీని తెలియజేసేది ముద్దు. ప్రచార చిత్రాల్లో కనిపిస్తున్న ముద్దులో ఆకర్షణ లేదు..ప్రేమ మాత్రమే ఉంది" అంటున్నారు సందీప్ వంగ. ఆయన తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ రెడ్డి'. విజయ్ దేవరకొండ, షాలిని జంటగా నటించారు. శుక్రవారం ఈ చిత్రం విడుదలవుతోంది. ప్రచార చిత్రాల్లోని ముద్దు సన్నివేశం వివాదంపై సందీప్ వంగ వివరణ ఇస్తూ "కొంతమంది కోరికపై వెంటనే ఆ పోస్టర్లని తొలగించామ"న్నారు. 'అర్జున్ రెడ్డి' గురించి ఆయన ఏం చెప్పారంటే..

ఆ ముద్దులో ఉన్నది ప్రేమ మాత్రమే

"ఇది ఓ ప్రేమికుడి జీవితంలో దొర్లిన అనూహ్య పరిణామాల నేపథ్యంలో సాగే కథ. కథలోనే కావల్సినంత వినోదం ఉంది. తెలుగు సినిమాకి ఇంగ్లిషు అక్షరాలతో టైటిల్ ఏంటి? అని చాలామంది అడిగారు. దాన్నీ మార్చాం. సంభాషణలు హైదరాబాదీ యాసలోనే వినిపిస్తాయి"

● 'పెళ్లిచూపులు' క్రేజ్‌తో విజయ్ దేవరకొండని ఎంచుకోలేదు. అంతకు ముందే విజయ్‌ని ఓ వర్క్‌షాపులో కలిశా. అప్పుడే ఈ కథ చెప్పా. లొకేషన్లను అన్వేషించడానికి సమయం పట్టింది. ఏ రచయితా, దర్శకుడైనా అనుభవాలు, తాను గమనించిన విషయాల్లోంచే కథని రాసుకుంటాడు. ఎంతోకొంత సామాజిక మార్పుని తీసుకురావాలని ప్రయత్నిస్తారు. నేనూ ఆ కోణంలోనే ఈ చిత్రాన్ని మలిచా"

● "సినిమాలపై ఆసక్తితో ఆస్ట్రేలియాలో దర్శకత్వంలో పీజీ చేశా. నాగార్జునగారి 'కేడీ'కి సహాయ దర్శకుడిగా చేశా. 'మళ్లీ మళ్లీ ఇది రాని రోజు' రచనలో క్రాంతిమాధవ్‌కి తోడ్పాటుని అందించా. అప్పుడే శర్వానంద్‌తో పరిచయం ఏర్పడింది. తనతో త్వరలో సినిమా చేయాలనుకుంటున్నాను. రెండు మూడు కథలున్నాయి"

తరాలు మారినా అనుబంధాలు మారవు



రవీందర్ రెడ్డి, బోయపాటి శ్రీను, రకుల్‌ప్రీత్ సింగ్, శ్రీనివాస్

"ఎన్ని తరాలు మారినా మానవ సంబంధాలు, అనుబంధాలు మారవు. అవి ఎప్పటికీ నిలిచే ఉంటాయి. ఈ కథతో ఎన్ని సినిమాలు చేసినా విజయం సాధిస్తాయి. దానికి తాజా ఉదాహరణ జయ జానకి నాయక" అన్నారు బోయపాటి శ్రీను. ఆయన దర్శకత్వం వహించిన చిత్రమిది. బెల్లంకొండ శ్రీనివాస్, రకుల్ ప్రీత్ సింగ్ జంటగా నటించారు. మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మాత. బుధవారం హైదరాబాద్‌లో విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బోయపాటి మాట్లాడుతూ "కథని నమ్మి తీసిన సినిమా ఇది. ఇలాంటి కథల్ని నమ్మే రవీందర్‌రెడ్డి లాంటి నిర్మాతలు పరిశ్రమకి అవసరం. ఆయనతో మళ్లీ మళ్లీ సినిమాలు చేస్తూనే ఉంటా" అన్నారు. "ఈ చిత్రంతో మా సంస్థ నిలబడిపోయింది. రెండోవారంలోనూ థియేటర్లు పెరిగాయి. అదే మా విజయ సూచిక" అన్నారు నిర్మాత. "హృదయాన్ని హత్తుకొనే సినిమా అవుతుందన్న నా నమ్మకం నిజమైంద"న్నారు బెల్లంకొండ శ్రీనివాస్. రకుల్ మాట్లాడుతూ "ఇన్ని పాత్రలు చేసినా జానకి పాత్రకొచ్చినంత గుర్తింపు మరి దేనికీ రాలేదు. కమర్షియల్ సినిమాలో ఓ మంచి సందేశాన్ని అందించారు దర్శకుడ"న్నారు. ఈ కార్యక్రమంలో నందు, శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అతనెవరో తెలిసిందా?



తాతినేని సత్య, సచిన్ జోషి, సి.కల్యాణ్, శివ ప్రసాద్

సచిన్ జోషి, ఇషా గుప్తా జంటగా నటించిన చిత్రం 'వీడెవడు'. తాతినేని సత్య దర్శకుడు. రైనా జోషి నిర్మాత. సెప్టెంబరు 8న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా సచిన్ మాట్లాడుతూ "ఇదో థ్రిల్లర్. నా పాత్రలో పాజిటివ్, నెగిటివ్ కోణాలు రెండూ ఉంటాయి. స్క్రీన్‌ప్లే కూడా కొత్తగా ఉంటుంది" అన్నారు. "టైటిల్ ఆసక్తిని రేపుతోంది. కొత్త తరహా కథాంశంతో వస్తున్న చిత్రమిది. విజయం సాధించడం ఖాయం" అని ఆశాభావం వ్యక్తం చేశారు సి.కల్యాణ్. "ఇది నా నాలుగో చిత్రం. నేరుగా తెలుగులో తీసిన సినిమా ఇదే. తమిళంలోనూ విడుదల చేస్తున్నాం. సాంకేతికంగా ఉన్నతంగా ఉంటుంది. తమన్ బాణీలు ఆకట్టుకొంటాయ"న్నారు దర్శకుడు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ నిర్మాత శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ముస్తఫారాజ్, ప్రియమణి

ప్రియమణి పెళ్లి

ప్రముఖ కథానాయిక ప్రియమణి పెళ్లి చేసుకొంది. ముంబయికి చెందిన పారిశ్రామికవేత్త ముస్తఫారాజ్‌తో ప్రియమణి వివాహం బుధవారం బెంగళూరు బనశంకరిలో జరిగింది. ప్రియమణి- ముస్తఫారాజ్ స్నేహితులు. గత ఏడాది వీరి నిశ్చితార్థం జరిగింది. తమ వివాహాన్ని రిజిస్టర్ చేసుకునేందుకు గత జులైలో జయనగర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. గురువారం జేపీనగరలో వివాహ విందు ఇవ్వబోతున్నట్టు ప్రియమణి కుటుంబ సభ్యులు వెల్లడించారు. తమ వివాహానికి అభిమానులను ఆహ్వానించలేకపోతున్నానని, వివాహానంతరమూ తాను సినిమాలు చేస్తానని ప్రియమణి గతంలోనే వెల్లడించారు. బెంగళూరులో స్థిరపడిన మలయాళీ కుటుంబానికి చెందిన ప్రియమణి 'ఎవరే అతగాడు' చిత్రం ద్వారా తెలుగు చిత్రసీమకు పరిచయం అయ్యారు. 'పెళ్లైన కొత్తలో'తో విజయవంతమైన కథానాయికల జాబితాలో చేరారు. నాగార్జున, బాలకృష్ణ, ఎన్టీఆర్ తదితర అగ్ర కథానాయకుల చిత్రాల్లో నటించింది ప్రియమణి. తమిళం, మళయాళం, కన్నడ, హిందీ చిత్రాల్లో నటించింది.

- న్యూస్‌టుడే, బెంగళూరు (మల్లేశ్వరం),

రైలు ప్రయాణం ఎంత భద్రం?

భారతీయ రైల్వే.. ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో.. సరకు తరలింపులో.. ఉద్యోగాల కల్పనలోనూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజారవాణా వ్యవస్థల్లో ఒకటి. ఆ మేరకు ఉద్యోగుల సంఖ్య పెరగడంలేదు. ఏటికేడాది సిబ్బంది తగ్గిపోతున్నారు. దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ జోన్‌లోనే ఉద్యోగ ఖాళీల సంఖ్య 15 వేల పైచిలుకు ఉన్నాయి.

- అరకొర సిబ్బందితో నిత్యం ఇబ్బందులే
- ద.మ. రైల్వేలో భర్తీ చేయాల్సిన పోస్టులు 15,490
- దేశవ్యాప్తంగా అన్ని జోన్లలో 2.5 లక్షల ఖాళీలు!
- ట్రాక్ సామర్థ్యానికి మించి నడుస్తున్న రైళ్లు
- హడావిడి నిర్వహణ, మరమ్మతులు
- ప్రమాదాలకు ప్రధాన కారణాలివే అంటున్న నిపుణులు
- ఉన్న ఉద్యోగులపై పనిభారం పెరుగుతోందంటున్న కార్మిక సంఘాలు



ఈనాడు, హైదరాబాద్

దేశవ్యాప్తంగా 2.5 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఇందులో భద్రతావిభాగం ఉద్యోగుల ఖాళీలు 63 శాతం. మొత్తం రైల్వేలో 436 విభాగాలు.. 13.16 లక్షల మంది ఉద్యోగులు. నిత్యం 21 వేల రైళ్ల రాకపోకలు.. ఏడాదికి 1,140 మిలియన్ టన్నుల సరకు రవాణా.. ప్రతిరోజూ ప్రయాణం చేసేవారు 2.20 కోట్ల ప్రయాణికులు.. ఇందరిని క్షేమంగా గమ్యస్థానానికి చేర్చాలంటే.. రైలు ప్రయాణంలో భద్రత నిరంతర ప్రక్రియగా ఉండాలి. వివిధ శాఖల మధ్య సమన్వయం అవసరం. సమన్వయలోపం కారణంగా ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ట్రాక్ మరమ్మతుకు సాంకేతిక కారణాలతో సమయం ఇవ్వకపోవడం, ప్రమాదం జరుగుతుందన్న ఉద్దేశంతో అనుమతి లేకుండా మరమ్మతులు చేపట్టడం, ఈలోగా రైలు రావడంతో ప్రమాదానికి కారణమైందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

- భద్రత విభాగంలో ఆపరేటింగ్‌కు సంబంధించి స్టేషన్‌మాస్టర్లు, కంట్రోలర్లు, గార్డులు, పాయింట్‌మెన్ ఉంటారు. వీటిలో 1,631 ఖాళీలు.
- ఇంజినీరింగ్ విభాగంలో గ్యాంగ్‌మెన్ (ట్రాక్ మెయింటెనర్), ట్రాక్ సూపర్‌వైజర్లు, వంతెనల వద్ద పనిచేసే సూపర్‌వైజర్లు (బ్రిడ్జి) ఖాళీలు 3,909.
- ఓ రైలు స్టేషన్‌లోకి రావాలన్నా, బయటకు వెళ్లాలన్నా.. సిగ్నల్స్ ఉండాలి. ఎలక్ట్రిక్ సిగ్నల్ మెయింటెయినర్ పోస్టులు 376 ఖాళీగా ఉన్నాయి.
- బోగీలను తనిఖీచేసే, బాగుచేసే మెకానికల్ సిబ్బంది, బండినడిపే లోకోపైలెట్, అసిస్టెంట్ లోకోపైలెట్లు.. దమ రైల్వేజోన్‌లో ఖాళీలు 2,791. డ్రైవర్ (లోకోపైలెట్) పోస్టులు 1,636 భర్తీ కావాల్సి ఉంది.
- విద్యుత్తు విభాగంలో లైన్ల విద్యుదీకరణ, బోగీలు, లైట్లు, ఏసీలను నిర్వహించేవారు, మరమ్మతులు చేసే వారి ఖాళీలు 985. మొత్తం 5,620కి 4,635 మంది ఉన్నారు.
- రైలు ప్రమాదాల నివారణకు అనిల్ కకోద్కర్, శ్యామ్‌పిట్రోడా కమిటీలు రైల్వేల భద్రత, ఆధునికీకరణకు అయిదేళ్లలో రైల్వేల భద్రతకు రూ.లక్ష కోట్లు ఖర్చు చేయాలని సూచించాయి. ఆ నివేదికలపై చర్యల్లేవు. అమలు చేయాలంటే నిధులు కావాలి. అంతకుమించి ఖాళీల భర్తీ జరగాలి. మూడేళ్లుగా నియామకాలు లేవు.

దక్షిణ మధ్య రైల్వే భద్రత ఖాళీలు

మొత్తం పోస్టులు:	98,870
ప్రస్తుత ఉద్యోగులు:	83,380
ఖాళీల సంఖ్య:	15,490
ఖాళీల శాతం:	15.66

దేశవ్యాప్తంగా జోన్ల వారీగా భద్రత సిబ్బంది ఖాళీలు

2016 నాటికి అన్ని దేశవ్యాప్తంగా అన్ని జోన్లలో కలిపి 2.17 లక్షల ఖాళీలున్నాయి. తాజాగా ఈసంఖ్య 2.5 లక్షలకు చేరిందని సంఘాలు చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా మొత్తం 13.16 లక్షల మంది ఉద్యోగుల్లో 7.60 లక్షల మంది సేఫ్టీ విభాగం వారే. ఇందులో పట్టాలను పర్యవేక్షించేవారు 2.5 లక్షల మంది.

రైల్వేజోన్	భద్రత విభాగం	నాన్‌సేఫ్టీ	ఖాళీలు
నార్తర్న్	14,442	10,953	25,395
ఈస్ట్‌సెంట్రల్	10,034	6,648	16,682
సౌత్‌ఈస్టర్న్	9,967	6,268	16,235
సెంట్రల్	9,910	11,668	21,578
నార్త్ సెంట్రల్	9,223	4,346	13,569
జోన్లు, విభాగాలు	69,187	54,723	123910
మొత్తం	1,22,763	94,606	2,17,369

సామర్థ్యానికి మించి రైళ్ల రాకపోకలు

దక్షిణ మధ్య రైల్వే సహా పలు జోన్లలో ట్రాక్ సామర్థ్యానికి మించి రైళ్లు నడుస్తున్నాయి. ఫలితంగా ట్రాక్ నిర్వహించేవారికి, సిగ్నళ్లు ఇచ్చేవారికి, ఎలక్ట్రికల్ పనులు చేసేవారికి తగిన సమయం దొరకడం లేదని ఉద్యోగులు, కార్మిక సంఘాలు చెబుతున్నాయి.

కొత్త స్టేషన్లకు, మార్గాలకు అరకొర

మూడు, నాలుగేళ్లుగా అనేక కొత్త రైళ్లు వచ్చాయి. కొత్త మార్గాలు పూర్తయ్యాయి. ఇప్పటికే ఉన్నచోట రెండోలైను, మూడోలైను విస్తరణ జరుగుతోంది. సికింద్రాబాద్ డివిజన్‌లో దాదాపు 13 కొత్త స్టేషన్లను ప్రారంభించారు. అయినా అవసరమైన అదనపు పోస్టుల భర్తీ జరగడం లేదని కార్మిక సంఘాలంటున్నాయి. పాత సిబ్బందినే సర్దుబాటు చేస్తున్నారని విమర్శ ఉంది. కొత్త మార్గాలు, స్టేషన్ల నిర్వహణకు అవసరమైన సిబ్బంది లేకపోవడంతో కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ అనుమతులిచ్చేందుకు అభ్యంతరం చెప్పినట్లు సమాచారం.

కాపలాలేని క్రాసింగ్‌లు తొలగించాలి

ఖాళీల కారణంగా ఉద్యోగులపై ఏర్పడుతున్న పని ఒత్తిడిని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి. రైలు ప్రమాదాల్లో 40శాతం వరకూ కాపలా లేని క్రాసింగ్‌ల వద్ద జరుగుతున్నాయి. ఇలాంటి క్రాసింగ్‌లను 2019లోగా తొలగించాలి. రైలు ప్రయాణంలో భద్రత పెంచేందుకు అనిల్ కకోద్కర్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలి. సంప్రదాయ ఐసీఎఫ్ బోగీల ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేయాలి. ఈ బోగీలతో నడుస్తున్న రైళ్లకు వీటిస్థానంలో ఎల్‌హెచ్‌బీ బోగీలను ఏర్పాటు చేయాలి.

– అంబటి సన్నీబాబు, రైల్వే నిపుణుడు

ద.మ.రై. జోన్ భద్రత(సేఫ్టీ) విభాగంలో ఖాళీలు(ఆగస్టు 1, 2017 నాటికి)

విభాగం	పోస్టులసంఖ్య	ఉన్న ఉద్యోగులు	ఖాళీలు	ఖాళీలశాతం
ఆపరేటింగ్	11,538	9,907	1,631	14.1
ఇంజినీరింగ్	22,102	18,913	3,909	17.7
మెకానికల్	17,239	14,448	2,791	16.2
సిగ్నల్	2,331	1955	376	16.1
ఎలక్ట్రికల్	5,626	4,635	991	17.6
మొత్తం	58,836	49,138	9,698	16.5

ఖాళీలతో ప్రమాదాలు, నష్టాలు ఎక్కువ



దేశవ్యాప్తంగా 2.50 లక్షలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫలితంగా మిగిలిన ఉద్యోగులపై పనిభారం పెరుగుతోంది. భద్రత ప్రమాణాలు దిగజారుతున్నాయి. నంద్యాల-ఎర్రగుంట్ల వంటి కొత్త మార్గాల్లో పోస్టులు మంజూరు చేయలేదు. రైల్వే శాఖను ఇతర శాఖలతో పోల్చలేమని, భిన్నమైనదన్న పే కమిషన్ నివేదికను రైల్వే అంగీకరిస్తున్నా ఆచరించడం లేదు. వేతన సవరణతో పెరిగిన ఖర్చును తగ్గించుకోవడానికి ఖాళీలు భర్తీ చేయకుండా దొడ్డిదారిన వ్యవహరిస్తున్నారు. ఖాళీలు పెరిగితే జరిగే ప్రమాదాలు, వాటిమూలంగా అంతకంటే ఎక్కువ నష్టమన్న సంగతి రైల్వేశాఖ గుర్తించాలి. ఒక్కో ట్రాక్‌మెన్ 23 కిలోల సామగ్రితో వివిధ వాతావరణ పరిస్థితుల్లో పనిచేయాలి. అతను భద్రంగా ఉన్నాడా లేదా అన్నది చూడాలి. సాధారణం కంటే ఇంజిన్‌లో 4, 5 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలతో లోకోపైలెట్, అసిస్టెంట్ లోకోపైలెట్ బండి నడుపుతున్నారు.

– మర్రి రాఘవయ్య, ప్రధాన కార్యదర్శి, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్

రైల్వేశాఖ వైఫల్యం



ఒక బోగీని 8 గంటల పాటు క్షుణ్నంగా తనిఖీ, నిర్వహణ చేయాలి. సరిపడా సిబ్బంది లేరు. ఉన్నవారితో 2, 3 గంటల్లో కాని చేస్తున్నారు. వ్యవస్థలో లోపాలు సవరించాలి. లేదంటే ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతుంది. వెంటనే ఖాళీలను భర్తీ చేయాలి. రైల్వేబడ్జెట్‌ను సాధారణ బడ్జెట్‌లో విలీనం చేశాక కొత్త సమస్య ఏర్పడింది. ఆర్థికశాఖను ఒప్పించి నిధులు సాధించడంలో రైల్వేశాఖ విఫలమవుతోంది. ప్రయాణ భద్రతకు.. నిపుణులతో, ప్రయాణికుల సంఘాలతో, కార్మిక సంఘాలతో చర్చించి సమగ్ర విధానం తీసుకురావాలి. భద్రత కోసం తక్షణం ఖాళీలను భర్తీ చేయాలి. నియామక ప్రక్రియ సులభతరం, వేగవంతంగా చేయాలి.

–శంకర్‌రావు, సహాయ ప్రధాన కార్యదర్శి, ఆలిండియా రైల్వేమెన్ ఫెడరేషన్.

రైల్వే మంత్రిగా గడ్కరీ!

- 12 మంది మంత్రుల శాఖల్లో మార్పు
- సెప్టెంబరు 2 లోగా కేబినెట్ విస్తరణ

ఈనాడు, దిల్లీ: రైలు ప్రమాదాలకు నైతిక బాధ్యత వహిస్తూ రైల్వేశాఖ మంత్రి సురేశ్ ప్రభు చేసిన రాజీనామాను ప్రధాని మోదీ ఆమోదించే అవకాశాలున్నాయి. మరికొద్ది రోజుల్లో కేంద్ర మంత్రిమండలి పునర్వ్యవస్థీకరణ, విస్తరణ జరగనుండడంతో ఆ సమయంలో ఈ శాఖను భర్తీ చేయనున్నారు. దానికి వీలుగా విస్తరణకు ముందే ప్రభు రాజీనామాను ప్రధాని ఆమోదించనున్నారు. కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి రైల్వే శాఖ పగ్గాలు అప్పగించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ నెల 25 నుంచి సెప్టెంబరు రెండో తేదీ మధ్య ఎప్పుడైనా కేబినెట్ విస్తరణ జరిగేందుకు అవకాశం ఉంది. మొత్తం 12 మంది మంత్రుల శాఖల్లో మార్పులు చోటు చేసుకోవచ్చని తెలుస్తోంది. రాజీవ్ ప్రతాప్‌రూడీ, చౌధరి బీరేంద్రసింగ్‌ల శాఖలను మార్చవచ్చనే సంకేతాలు వెలువడ్డాయి. ఉపేంద్ర కుష్వాహను కేబినెట్ నుంచి తప్పించవచ్చని కూడా తెలుస్తోంది. ప్రస్తుతం రక్షణ, పట్టణాభివృద్ధి, అటవీ-పర్యావరణ మంత్రిత్వ శాఖలను ఇతర మంత్రులు అదనపు బాధ్యత కింద చూస్తున్నారు. విస్తరణలో వీటికి పూర్తికాలపు మంత్రుల్ని నియమించనున్నారు. జేడీ(యు), ఏఐఏడీఎంకేలు ఇటీవలే ఎన్డీఏలో చేరిన దృష్ట్యా వాటికి ఒక్కో కేబినెట్ పదవి, ఒక్కో సహాయ మంత్రి పదవి అప్పగిస్తారని తెలిసింది. కర్ణాటక, మహారాష్ట్రల నుంచి కొందరు భాజపా ఎంపీలను కేబినెట్‌లో తీసుకోవచ్చు.

ఎయిరిండియాను గట్టెక్కించిన చేతులకే రైల్వే పగ్గాలు

దిల్లీ: రైల్వేబోర్డు సారథిగా పగ్గాలు చేపట్టడానికి బోర్డులోనే ముగ్గురు సీనియర్ అధికారులు ఉన్నా వారెవరూ కాకుండా ఎయిరిండియా సీఎండీ అశ్వనీ లోహానీని కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేయడం రెండు సంస్థల్లోనూ చర్చనీయాంశంగా మారింది. లోహానీకి గతంలో రైల్వేలో పనిచేసిన నేపథ్యం ఉంది. దాంతో పాటు ఎయిరిండియాకు 'నిర్వహణపరమైన లాభాలు' తీసుకురావడంలో ఆయన వేసిన ముద్ర కూడా ప్రభుత్వ ఎంపికకు ప్రధానకారణంగా భావిస్తున్నారు. ఎయిరిండియా వర్గాలు మాత్రం ఈ వార్త తమను ఏమాత్రం రుచించలేదని అంటున్నాయి. మృదుభాషిగా ఉంటూనే కఠిన చర్యలు తీసుకోవడంలో లోహానీ మహా దిట్ట. నైతిక స్థైర్యం దిగజారిపోయిన ఉద్యోగుల్లో ఆయన కొత్త ఊపిరిలూదారని ఎయిరిండియా సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. ప్రతి ఉద్యోగితో కరచాలనం చేసిన ఏకైక ఛైర్మన్ ఆయనేనన్నారు. ఈ నెలాఖరుకు ఆయన అక్కడ పగ్గాలు చేపట్టి రెండేళ్లు పూర్తవుతుంది. సంస్థలో ఖర్చుల్ని క్రమబద్ధం చేయడంలో కృతకృత్యులయ్యారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.300 కోట్ల నిర్వహణపరమైన లాభాలను ఆర్జించడంలో, మొత్తం ఆదాయాన్ని రూ.22,146 కోట్లకు చేర్చడంలో లోహానీది కీలక పాత్ర. నికర నష్టాలూ రూ.3643 కోట్లకు తగ్గాయి. రైల్వే అధికారిగా నియమితుడై, ఇంజినీర్ నుంచి ఉన్నతాధికారిగా మారిన ఘనతా ఆయనదే. కీలక సమయంలో రైల్వేపగ్గాలను ఆయన చేపడుతున్నారు.

పట్టాల్ని కదిపిన రైలు

- యూపీలో మరో ప్రమాదం... 100 మందికి గాయాలు
- పూర్తి నైతిక బాధ్యత నాదే: రైల్వే మంత్రి
- రాజీనామా చేస్తానని ప్రధానికి చెప్పిన సురేశ్ ప్రభు
- రైల్వేబోర్డు ఛైర్మన్ రాజీనామా ఆమోదం



బుధవారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆరాలియా జిల్లా అచల్దా వద్ద పట్టాలు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లిన కైఫియత్ ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలు

దిల్లీ, లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్‌లో ఇంకో రైలు ప్రమాదం. ముజఫర్‌నగర్ సమీపంలో కళింగ ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ ఘోర ప్రమాదానికి గురై నాలుగు రోజులు గడిచాయో లేదో బుధవారం తెల్లవారుజామున యూపీలోనే ఔరైయా జిల్లాలో అజాంగఢ్-దిల్లీ కైఫియత్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. 10 పెట్టెలు పట్టాలు తప్పగా వీటిలో ఒకటి పూర్తిగా పల్టీ కొట్టింది. పక్కనే ఉన్న రహదారిపై డంపర్ వాహనం బోల్తాపడి, పట్టాలపైకి వచ్చిందనీ, దాని భాగాలనే రైలు ఢీకొందనీ అధికారులు చెబుతున్నారు. ప్రాథమికంగా చూస్తే తప్పు డంపర్ డ్రైవర్‌దేననీ, ప్రమాదం జరిగాక అతడు పరారయ్యాడనీ వారు తెలిపారు. ఈ ప్రమాదంలో దాదాపు 100 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వీరిలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపాలైనవారు 25 మందేనని రైల్వే ప్రకటించింది. ఈ ప్రమాదంతో కొన్ని రైళ్లు రద్దు కాగా, మరికొన్నింటిని దారి మళ్లించి పంపించారు. తమిళనాడులోని విల్లుపురం వద్ద కాపలాదారుడు లేని గేటు వద్ద లారీని మరో రైలు ఢీకొంది. దీంతో వరస ప్రమాదాల తీవ్రత రైల్వే మంత్రిత్వశాఖకు తగులుకొంది. ప్రమాదాలకు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేస్తానని రైల్వేశాఖ మంత్రి సురేశ్‌ప్రభు బుధవారం మంత్రిమండలి సమావేశానంతరం ప్రధాని నరేంద్రమోదీని విడిగా కలిసి చెప్పారు. ఆ తర్వాత దిల్లీ నుంచి వెళ్లిపోయారు. ప్రమాదాలకు పూర్తి నైతిక బాధ్యత తాను తీసుకుంటున్నాననీ, రాజీనామాకు సిద్ధపడగా నిరీక్షించాల్సిందిగా ప్రధాని సూచించారనీ ఆయన ట్వీట్ చేశారు. యూపీలో జరిగిన రెండు ప్రమాదాలూ తనకు అత్యంత బాధ కలిగించాయంటూ కూడా ఆయన ట్వీట్ చేశారు.

మూడేళ్లలో చెమటను ధారపోశాను: ప్రభు

'రైల్వేమంత్రిగా ఉన్న సుమారు మూడేళ్లలో ఈ శాఖను మెరుగుపరచడానికి చెమటను ధారపోశాను. దశాబ్దాలుగా నెలకొన్న నిర్లక్ష్యాన్ని అధిగమించడానికి ప్రధాని నాయకత్వంలో పాటుపడ్డాను. అన్ని రంగాల్లో క్రమానుగత సంస్కరణలు తీసుకురావడం వల్ల పెట్టుబడులు అనూహ్యంగా పెరిగాయి, మైలురాళ్లుగా నిలిచాయి' అని ప్రభు ఉద్వేగంతో పేర్కొన్నారు. 'ప్రధాని కలలుగంటున్న నవభారతాన్ని ఆవిష్కరించడానికి సమర్థ, అధునాతన రైల్వేలు ఉండాలి. ఇప్పుడు రైల్వేలు ఆ దిశగానే పురోగమిస్తున్నాయి. దురదృష్టకర రైలు ప్రమాదాల్లో వాటిల్లిన ప్రాణ నష్టం, ప్రయాణికులకు కలిగిన గాయాలు నన్నెంతో బాధించాయి. అవి నాకు తీరని వేదనను మిగిల్చాయి' అని చెప్పారు. 'ప్రభుత్వంలో జవాబుదారీతనం మంచి వ్యవస్థ. రైల్వే మంత్రి చేసిన అభ్యర్థనపై ప్రధాని ఒక నిర్ణయం తీసుకుంటారు.' అని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ విలేకరులకు చెప్పారు. సురేశ్‌ప్రభులో అణువంత నైతికత ఉన్నా పదవి నుంచి వైదొలగాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఆయనపై ప్రధాని తక్షణం వేటు వేసి, బాధ్యతాయుతమైన వ్యక్తిని నియమించాలని విజ్ఞప్తి చేసింది. బులెట్ రైలుకు రూ.లక్ష కోట్లు కేటాయించగా లేనిది రైల్వేల భద్రతకు రూ.40వేల కోట్లు ఎందుకు కేటాయించరని పార్టీ ప్రతినిధులు మనీశ్ తివారీ, రణదీప్ సూర్జేవాలా ప్రశ్నించారు.

రైల్వేబోర్డు నూతన సారథిగా లోహానీ

మరోపక్క ఘోర ప్రమాదాల నేపథ్యంలో రైల్వే బోర్డు ఛైర్మన్ ఎ.కె.మిత్తల్ మంగళవారం రాత్రి చేసిన రాజీనామాను కేంద్రం బుధవారం ఉదయం ఆమోదించింది. ఆ వెంటనే ఎయిరిండియా ఛైర్మన్-మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) అశ్వనీ లోహానీని రైల్వే బోర్డు నూతన ఛైర్మన్‌గా నియమించింది. ఆయన నియామకానికి కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. 22 మంది మృతికి కారణమైన ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదంపై రైల్వే బోర్డు సభ్యుడు సహా ఏడుగురిపై రైల్వేశాఖ వేటు వేసిన విషయం తెలిసిందే. నూతన ఛైర్మన్ లోహానీ రైల్వే మెకానికల్ సర్వీస్ అధికారి. గతంలో దిల్లీ డివిజనల్ రైల్వే మేనేజర్‌గా పనిచేశారు. ఐటీడీసీ ఛైర్మన్‌గా, రైల్వే మ్యూజియం డైరెక్టర్‌గానూ కొనసాగారు. రాజీనామా చేసిన మిత్తల్ వాస్తవిక పదవీ కాలం 2016లోనే ముగిసింది. పదవీ విరమణకు రెండ్రోజుల ముందు ఆయనకు రెండేళ్ల పొడిగింపును ఇచ్చారు. వచ్చే ఏడాది వరకు ఆయన కొనసాగి ఉంటే అత్యంత ఎక్కువకాలం రైల్వేబోర్డు ఛైర్మన్‌గా ఉన్న అధికారి అయిఉండేవారు. ఉత్కళ్ ప్రమాదంలో రైల్వే మంత్రిత్వ శాఖలో సీనియర్ అధికారులపై వేటు వేయడం వల్ల సీనియర్ల నైతికత దెబ్బతిందని మిత్తల్ అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. ఆయన రాజీనామాను ఉపసంహరింపజేయడానికి బోర్డు సభ్యులు ప్రయత్నించారు. వారు రైల్వే మంత్రినీ కలిశారు. ఘోర వైఫల్యాలకు సీనియర్లూ బాధ్యత వహించాలని ప్రధాని సయితం స్పష్టం చేయడంతో రాజీనామాకే మిత్తల్ కట్టుబడ్డారు. ప్రభు, ఇతర సీనియర్ అధికారులతో మోదీ మంగళవారం మధ్యాహ్నం భేటీ అయ్యారు.



హైదరాబాద్‌లోని బాపూజీ నివాసంలో అనిశా అధికారులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, వస్తువులు, నగదు

★ ఆహారనియంత్రణాధికారి బాపూజీ

ఆదాయానికి మించి ఆస్తుల గుర్తింపు

- ఆదిలాబాద్ ఆహార నియంత్రణాధికారి ఇళ్లపై ఏసీబీ దాడులు

ఆదిలాబాద్ నేరవిభాగం, సోమాజిగూడ : ఆదాయానికి మించి ఆస్తులున్నాయన్న ఆరోపణలతో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆదిలాబాద్ జిల్లా ఆహారనియంత్రణాధికారి (గజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్) ఈడెమ్ బాపూజీ నివాసాలపై ఏకకాలంలో దాడులు నిర్వహించారు. బుధవారం ఉదయం ఆరు గంటలకే సోమాజిగూడలోని క్రాంతి శిఖర అపార్టుమెంట్‌లోని ఆయన నివాసంలో సోదాలు చేశారు. అనిశా వరంగల్ డీఎస్పీ సాయిబాబా నేతృత్వంలో ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, రంగారెడ్డి ఇన్‌స్పెక్టర్లు వేణుగోపాల్, రాఘవేందర్‌రావు, వెంకటేశ్వర్లు, రమణమూర్తి, లక్ష్మి, హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ సిబ్బందితో తనిఖీలు చేశారు. బాపూజీ భార్య విజయలక్ష్మి మేడ్చల్ జిల్లాలో సబ్ ట్రెజరీ అధికారిణిగా పనిచేస్తున్నారు. ఆదిలాబాద్‌లోని బాపూజీ కార్యాలయం, నివాస గది, మేడ్చల్‌లో విజయలక్ష్మి బీరువా, టేబుల్, సోమాజిగూడలోని వారి నివాసాల్లో రాత్రి వరకు సోదాలు సాగుతున్నట్లు అధికారులు తెలిపారు. బండ్లగూడలో మ్యాపిల్ టౌన్‌లో రూ.2 కోట్ల విలువైన విల్లా, హయత్‌నగర్‌లో రెండు ప్లాట్లు, క్రాంతి శిఖరలో 2006లో కొనుగోలు చేసిన ఇల్లు, ఓ ద్విచక్ర వాహనం, కారు, రూ.2 లక్షల నగదు, 160 గ్రాముల బంగారు ఆభరణాలు, వంద బంగారు నాణేలు, అరకిలోకు పైగా వెండి పాత్రలు అధికారులు గుర్తించారు. ఇవి కాకుండా బాపూజీ ఖాతాలో రూ.10 లక్షల నగదు ఉంది. వీరికి ఆరు బ్యాంకు ఖాతాలు, ఓ లాకర్ ఉన్నాయి. లాకర్‌లో మరిన్ని పత్రాలు, బంగారు ఆభరణాలు లభించే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్‌లో సోదాల అనంతరం బాపూజీని సోమాజిగూడకు తీసుకువచ్చారు. ఆయనపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో విచారించగా ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు తేలిందని, న్యాయస్థానం అనుమతితో సోదాలు చేపట్టినట్లు డీఎస్పీ వివరించారు.

'13.38 లక్షల గొర్రెల పంపిణీ'

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని యాదవులకు బుధవారం వరకు 13.38 లక్షల గొర్రెలను పంపిణీ చేసినట్లు రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సంఘం అధ్యక్షుడు రాజయ్యయాదవ్ తెలిపారు. 63,736 కుటుంబాలు వీటి ద్వారా లబ్ధి పొందాయన్నారు. బుధవారం తెలంగాణభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మిగిలిన లబ్ధిదారులకు త్వరలోనే గొర్రెలను పంపిణీ చేస్తామన్నారు.

టీఆర్ఎస్వీ సభ్యత్వ నమోదులో గోషామహల్ ప్రథమం

తెరాస విద్యార్థి విభాగం సభ్యత్వ నమోదులో హైదరాబాద్‌లోని గోషామహల్ నియోజకవర్గం రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిచింది. బుధవారం వరకు ఇక్కడ 53,020మంది విద్యార్థులు టీఆర్ఎస్వీ సభ్యత్వం తీసుకున్నారని తెరాస రాష్ట్ర నాయకుడు నందకిశోర్‌వ్యాస్ బిలాల్, టీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతికిరణ్‌లు తెలిపారు.

రూ.50 కోట్ల బియ్యం గల్లంతేనా..?

- కస్టం మిల్లింగ్‌లో మరో రూ. 65 కోట్ల విలువ చేసే బియ్యం వచ్చే అవకాశం
- ఆచూకీ లేని 40 మంది మిల్లర్లు

ఈనాడు, హైదరాబాద్: ఆ బియ్యంపై ఆశలు వదులుకున్నట్లే. పలువురు మిల్లర్లు బిచాణా ఎత్తివేయడంతో ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.50 కోట్లు కన్నం పడినట్లే. తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని బియ్యంగా మార్చేందుకు కస్టం మిల్లింగ్ విధానం కింద మిల్లర్లకు అప్పగిస్తుంది. ధాన్యం ఇచ్చిన 45 రోజుల్లోగా వారు బియ్యాన్ని ఇవ్వాలన్నది నిబంధన. కానీ అధికారులు పట్టించుకోకపోవంతో 2010 నుంచి 2015 సంవత్సరాల మధ్య 115 మంది మిల్లర్లు రూ.139 కోట్ల విలువ చేసే బియ్యాన్ని మింగేశారు. వ్యాపారులతో పలువురు అధికారులుకూడా కుమ్మక్కయినట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. మిల్లర్ల నుంచి బియ్యాన్ని రాబట్టిన తర్వాత నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై దృష్టి సారించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. గల్లంతయిన బియ్యాన్ని రాట్టేందుకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ ఏడాదిగా ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో 24మంది మిల్లర్లు వారివ్వాల్సిన బియ్యాన్ని ఇచ్చేశారు. దాని విలువ రూ.24 కోట్లు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మిగిలిన 91 మంది మిల్లర్లకు నోటీసులు జారీ చేశారు. వారి నుంచి 48,742 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉంది. వాటి విలువ రూ.117 కోట్లవరకు ఉంటుంది. నోటీసులకు స్పందించిన 51 మంది మిల్లర్లు అధికారులు నిర్వహించిన సమావేశానికి హాజరై ఇవ్వాల్సిన బియ్యాన్ని ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఇలా వచ్చే బియ్యం విలువ రూ.65 కోట్ల వరకు ఉంటుందన్నది అంచనా. కాగా 40 మంది మిల్లర్ల ఆచూకీ దొరకడం లేదు. కొన్ని మిల్లులు సీజ్ చేసి ఉండగా మరికొన్ని ఉనికిలో లేనట్లు గుర్తించారు. ఆయా మిల్లర్ల నుంచి సుమారు రూ.50 కోట్ల విలువచేసే బియ్యం రావాల్సి ఉంటుంది. అధికారుల ప్రాథమిక అంచనా మేరకు వారి నుంచి చిల్లిగవ్వ కూడా రాకపోవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పోలీసు తరహాలో అధికారులు కూపీలాగితే నోటీసులకు స్పందించని ఆ మిల్లర్ల ఆచూకీ గుర్తించటం కష్టమేమీ కాదని తెలుస్తోంది. అధికారులు ఏ తీరుగా స్పందిస్తారన్నది వేచి చూడాలి.

రోజుకు కోటికిపైగా నాటితేనే..

- 40 కోట్ల మొక్కల లక్ష్యంపై అటవీశాఖ అంచనా

ఈనాడు, హైదరాబాద్: మూడోవిడత హరితహారంలో భాగంగా 40 కోట్ల మొక్కల లక్ష్యంలో సగానికి పైగా నాటినట్లు లెక్కలువేసిన అటవీశాఖ మిగతా లక్ష్యాన్ని చేరడంపై దృష్టిపెట్టింది. వర్షాకాలం ఇంకా నాలుగైదు వారాలే ఉండటంతో మిగిలినరోజుల్లో సగటున రోజుకు కోటికిపైగా మొక్కలు నాటాల్సి ఉంటుందని అటవీశాఖ వర్గాలు ఓ అంచనాకు వచ్చాయి. ఈ మేరకు జిల్లాలవారీగా మొక్కలను సిద్ధం చేసి పెట్టుకోవాలని, వర్షాలను బట్టి పెద్ద సంఖ్యలో నాటాలని ఆ శాఖ సూచించింది. ఇప్పటివరకు 23 కోట్ల మొక్కలను తెలంగాణ వ్యాప్తంగా నాటినట్లు అటవీశాఖ లెక్కలు వేసింది. ఈ లెక్కన ఇంకా 17 కోట్లు నాటాల్సి ఉంది. వర్షకాలం మరో నెలరోజులపాటు ఉన్నప్పటికీ వర్షాలు కురిసే రోజులు 15కు మించి ఉండకపోవచ్చని అటవీశాఖ భావిస్తోంది.

అన్నిశాఖలతో సమావేశం: హరితహారంలో ప్రధానంగా అటవీ, గ్రామీణాభివృద్ధిశాఖలతో పాటు ఇతర ప్రభుత్వశాఖలు, హెచ్ఎండీఏ, సింగరేణి వంటి సంస్థలు భాగస్వామ్యం అవుతున్నాయి. 2 వారాల పాటు వర్షవిరామం, రాష్ట్ర, జిల్లా స్థాయిలో శాఖల మధ్య సమన్వయం లేకపోవడం సమస్యగా మారిందని అటవీశాఖ భావిస్తోంది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఈనెల 26న ప్రత్యేకసమావేశం ఏర్పాటుచేశారు. ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నిర్వహించే ఈ సమావేశానికి వివిధ శాఖల ముఖ్యకార్యదర్శులు హాజరుకానున్నారు.

ఉపవర్గీకరణతో ఉపకారమే!

వెనుకబడిన కులాల వర్గీకరణకు కేంద్రం తీసుకున్న నిర్ణయం దేశంలో సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎన్నో మార్పులకు వీలు కల్పించనుంది. 1990లో వీపీసింగ్ ప్రభుత్వం మండల్ కమిషన్ నివేదికను ఆమోదించటంతో కేంద్రంలో 27 శాతం ఓబీసీ రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాయి. కానీ అందులో ఉపవర్గీకరణ లేదు. దీనికంటే ఎంతో ముందు నుంచే రాష్ట్రాల్లో బీసీ రిజర్వేషన్లు, అందులో ఓబీసీ ఉపవర్గీకరణ అమల్లో ఉంది. కేంద్రంలో ఇటువంటి అవకాశం లేని ఫలితంగా ఓబీసీల్లో ఆర్థికంగా, సామాజికంగా బలంగా ఉన్న కులాల వారే అన్ని అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారనే ఆందోళనలు ఎంతో కాలంగా వ్యక్తమవుతున్నాయి. ఓబీసీ కులాలకు వర్తించే 27 శాతం రిజర్వేషన్లను వారిలోని 12 శాతం కులాల వారే పొందుతున్నారని, మిగిలిన కులాల వారు రిజర్వేషన్ల ద్వారా కలిగే లబ్ధికి దూరంగా ఉన్నారని కొన్ని అంచనాల ద్వారా స్పష్టమవుతోంది. కొన్ని ప్రభుత్వశాఖల్లో అయితే మొత్తం ఓబీసీ రిజర్వేషన్లను 6.67 శాతం ఓబీసీలే పొందుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఓబీసీ రిజర్వేషన్లలో కేంద్ర స్థాయిలో ఉపవర్గీకరణ చేపట్టాలనే డిమాండ్లు మొదలయ్యాయి. దీంతో కేంద్ర నిర్ణయంతో ఓబీసీల్లో అన్ని ఉప కులాలకు సమన్యాయం జరిగే అవకాశం ఉందని విశ్లేషకులంటున్నారు.

సవాళ్లు తప్పవు...

కేంద్రం స్థాయిలో ఓబీసీ ఉపవర్గీకరణ ఎన్నో సవాళ్లతో కూడుకున్నదిగా సంబంధిత నిపుణులు విశ్లేషిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఓబీసీ జనాభాపై పారదర్శకమైన లెక్కలు లేవు. వెనుకబడిన కులాలు దేశవ్యాప్తంగా ఒకే విధంగా లేకపోవటం పెద్ద సమస్య. ఒక రాష్ట్రంలో వెనుకబడిన కులం మరొక రాష్ట్రంలో అగ్రకులంగా ఉన్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఎక్కడైనా పనిచేసే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగంలోకి ఆ కులాన్ని ప్రామాణికంగా చేసుకొని ఉద్యోగం ఎలా కల్పించాలనే సమస్య ఉత్పన్నం కావచ్చు. మరోపక్క ఇప్పటి వరకూ ఉపవర్గీకరణను అమలు చేయని రాష్ట్రాల్లో ఇటువంటి డిమాండ్లు మొదలవుతాయి. ఆయా రాష్ట్రాలు ఉపవర్గీకరణను అమలు చేయాల్సి వస్తుంది. ఎస్సీ, ఎస్టీల్లోనూ ఉపవర్గీకరణ చేపట్టాలనే డిమాండ్లు ఉన్నాయి. దీనిపై కూడా కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాల్సి వస్తుంది.



మండల్ కమిషన్

బీపీ మండల్ సారథ్యంలో రెండవ వెనుకబడిన తరగతుల కమిషన్ 1979 జనవరి 1న ఏర్పాటైంది. ఇది మండల్ కమిషన్‌గా ప్రాచుర్యం పొందింది. 1980 డిసెంబరులో ఈ కమిషన్ నివేదిక సమర్పించింది. దేశ ప్రజల్లో 52 శాతం మంది ఓబీసీ (ఇతర వెనుకబడిన కులాలు) కులాల వారేనని, మొత్తం 3,743 ఓబీసీ కులాలున్నట్లు మండల్ కమిషన్ వివరించింది. వీరికి 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సిఫార్సు చేసింది. ఆ తర్వాత దశాబ్దకాలానికి వీపీ సింగ్ ప్రభుత్వం 1990 ఆగస్టు 7న మండల్ కమిషన్ నివేదికను ఆమోదిస్తూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27 శాతం ఓబీసీ రిజర్వేషన్లను అమల్లోకి తీసుకువచ్చింది. దీనికి అనుకూలంగా, వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చెలరేగాయి.

1980 డిసెంబరులో తన నివేదికను కేంద్ర హోంమంత్రి జ్ఞానీ జైల్‌సింగ్‌కు సమర్పిస్తున్న బీపీమండల్

మొదటి వెనకబడిన తరగతుల కమిషన్ : దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక వెనుకబడిన కులాల స్థితిగతులను అధ్యయనం చేసి వారికి లబ్ధి చేకూరే విధంగా రిజర్వేషన్లు కల్పించాలనే ఆలోచన విస్తరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి ఉత్తర్వు ద్వారా 1953లో మొదటి వెనకబడిన తరగతుల కమిషన్ ఏర్పాటైంది. దీనికి కలేల్కర్ ఛైర్మన్‌గా వ్యవహరించారు. 1955లో ఈ కమిషన్ నివేదిక వెలువడింది. దేశవ్యాప్తంగా 2,399 వెనుకబడిన కులాల వారు ఉన్నట్లు, ఇందులో 837 కులాలు బాగా వెనుకబడినవిగా ఈ నివేదిక తేల్చింది. కులం ఆధారంగా వెనుకబాటుతనాన్ని నిర్ధారించాలని, ప్రభుత్వ ఉద్యోగాల్లో వారికి రిజర్వేషన్లు కల్పించాలని సిఫార్సు చేసింది. ఈ సిఫార్సులు అమల్లోకి రాలేదు.

తమిళనాడు ముందంజ

- వెనుకబడిన కులాల వారికి రిజర్వేషన్లు కల్పించే విషయంలో, ఉపవర్గీకరణలో దక్షిణాది రాష్ట్రాలు ఎంతో ముందున్నాయి. 1990 నాటికి తమిళనాడులో బీసీలకు 30 శాతం, ఎంబీసీలకు 20 శాతం రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాయి.
- దేశానికి స్వాతంత్ర్యం లభించటానికి పూర్వమే మైసూరు సంస్థానంలో వెనుకబడిన కులాల వారికి రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌కు స్పందించి మైసూర్ మహారాజు ఒక కమిటీని నియమించారు.
- కొచ్చి, ట్రావెన్‌కూర్ సంస్థానాల్లో ఎన్నో ఏళ్ల నుంచి హిందూ, ముస్లిం, క్రిస్టియన్లలోని వెనుకబడిన కులాల వారికి రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ ఉంది.
- కొల్హాపూర్ సంస్థానంలోని విద్యా సంస్థల్లో 1902లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించారు.
- స్వాతంత్ర్యం వచ్చాక బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వంపై ఒత్తిళ్లు పెరిగిపోయాయి. కేంద్ర ప్రభుత్వం కంటే ముందుగానే కొన్ని రాష్ట్రాలు స్పందించి తమ తమ రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, విద్యా సంస్థల్లో ప్రవేశాలకు బీసీ రిజర్వేషన్లు అమలు చేశాయి.
- బీహార్‌లో సోషలిస్టు నాయకుడు కర్పూరీ ఠాకూర్ నేతృత్వంలో బీసీ రిజర్వేషన్లు 1978లో అమల్లోకి వచ్చాయి.
- తమిళనాడు, పూర్వఆంధ్రప్రదేశ్ తదితరరాష్ట్రాల్లో ఎప్పటి నుంచో ఉపవర్గీకరణ అమల్లో ఉంది.

– ఈనాడు ప్రత్యేక విభాగం



2015లో జస్టిస్ ఈశ్వరయ్య ఛైర్మన్‌గా ఉన్న ఓబీసీ కమిషన్ ఓబీసీ ఉపవర్గీకరణకు అనుకూలంగా సిఫార్సు చేయటంతో కేంద్ర ప్రభుత్వంలో కదలిక మొదలైంది. ఎట్టకేలకు దీన్ని కార్యరూపంలోకి తీసుకురావటానికి ప్రభుత్వం సిద్ధమైంది.

మూడు తరగతులుగా ఓబీసీ ఉపవర్గీకరణ ?

ఇతర వెనుకబడిన కులాల వారికి (ఓబీసీ) సమన్యాయాన్ని అందించేందుకు వారిని మూడు తరగతులుగా వర్గీకరించాలని రెండేళ్ల క్రితం జాతీయ వెనుకబడిన వర్గాల కమిషన్ (ఎన్‌సీబీసీ) కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఓబీసీలకు కేంద్ర ప్రభుత్వం వర్తింపజేస్తున్న 27 శాతం రిజర్వేషన్లను కొన్ని ఓబీసీ కులాలే అందిపుచ్చుకుంటున్నాయనే ఆరోపణలు, ఆందోళనల నేపథ్యంలో కమిషన్ ఈ పరిష్కారాన్ని సూచించినట్లు తెలుస్తోంది. ఆయా కులాల జనాభా ఆధారంగా రిజర్వేషన్లను వర్తింపజేయవచ్చని పేర్కొంది. ఓబీసీలను ఈబీసీ (ఎక్స్‌ట్రీమ్‌లీ బ్యాక్‌వర్డ్ క్లాసెస్), ఎంబీసీ (మోర్ బ్లాక్‌వర్డ్ క్లాసెస్), బీసీ (బ్లాక్‌వర్డ్ క్లాసెస్) అనే మూడు విభాగాలు వర్గీకరించాలని అభిప్రాయపడింది. అభివృద్ధి చెందిన ఓబీసీ కులాలను బీసీ తరగతిలో పెట్టాలనేది కమిషన్ ఆలోచన. అన్ని రకాలైన ప్రయోజనాలకు దూరంగా, ఆర్థికంగా- విద్య, సామాజికంగా వెనుకబడి ఉన్న కులాల వారిని ఈబీసీ తరగతిలో పొందుపరచాలని పేర్కొంది. అయితే ఏఏ కులాన్ని ఏ తరగతిలో పెట్టాలనే కసరత్తును ఎన్‌సీబీసీ చేపట్టలేదు. దీనిపై కమిషన్ ఏర్పాటు చేయాలని తాజాగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఓబీసీ కులాల వారీగా వర్గీకరణపై కసరత్తు మొదలయ్యే అవకాశం ఉంది.

రాష్ట్రాల్లో ఉపవర్గీకరణ ఇలా ఉంది

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ: రాష్ట్ర విద్యాసంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలకు 29 శాతం రిజర్వేషన్ ఉంది. దీని కోసం బీసీలను ఏ నుంచి బీ, సీ డీ, ఈ వర్గాలుగా విభజించి 7, 10, 1, 7, 4 శాతం చొప్పున రిజర్వేషన్ కల్పించింది.

అసోం : ఓబీసీలకు అసోం రాష్ట్ర ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్ ఉంది. కానీ అందులో ఉపవర్గీకరణ లేదు.

బీహార్ : బీహార్‌లో ఓబీసీలకు 33 శాతం రిజర్వేషన్ ఉంది. అందులో ఉపవర్గీకరణ కూడా ఉంది. బీసీ-1 జాబితాలోని వారికి 18 శాతం, బీసీ- 2 లో 12 శాతం, ఓబీసీ మహిళలకు 3 శాతం రిజర్వేషన్ వర్తిస్తుంది.

ఛత్తీస్‌గఢ్: ఓబీసీలకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సర్వీసుల్లో 14 శాతం రిజర్వేషన్ ఉంది. ఉపవర్గీకరణ లేదు.

దిల్లీ నేషనల్ కేపిటల్ రీజియన్ : దిల్లీ రాష్ట్ర సర్వీసుల్లో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్‌ను వర్తింపజేస్తున్నారు.

గోవా : గోవా రాష్ట్రంలో 27 శాతం రిజర్వేషన్ ఉంది. ఉపవర్గీకరణ లేదు.

గుజరాత్ : రాష్ట్ర సర్వీసుల్లో వెనుకబడిన కులాల వారికి 27 శాతం రిజర్వేషన్ అమలవుతోంది.

హరియాణా : ఓబీసీల్లో క్లాస్-1 నుంచి క్లాస్-4 వరకూ ఉపవర్గీకరణ ఉంది. క్లాస్-1, క్లాస్-2 జాబితాలో ఉన్న వారికి 10 శాతం, క్లాస్-3, క్లాస్-4 జాబితాలోని వారికి 27 శాతం రిజర్వేషన్ వర్తిస్తోంది. మొత్తం 37 శాతం ఓబీసీ రిజర్వేషన్లు అమలవుతున్నాయి. **హిమాచల్ ప్రదేశ్ :** హిమాచల్ ప్రదేశ్‌లోనూ క్లాస్-1 నుంచి క్లాస్-4 వరకూ ఓబీసీ ఉపవర్గీకరణ ఉంది. రాష్ట్ర సర్వీసుల్లో క్లాస్-1, క్లాస్-2 తరగతుల వారికి 12 శాతం, క్లాస్-3, క్లాస్-4 తరగతుల వారికి 18 శాతం రిజర్వేషన్ వర్తింపజేస్తున్నారు. మొత్తం ఓబీసీలకు 30 శాతం రిజర్వేషన్ అమల్లో ఉంది.

జమ్మూ కశ్మీర్ : జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలో సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాల వారికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలవుతున్నాయి. బలహీన- అండర్ ప్రివిలైజ్డ్ క్లాసెస్ (సాంఘిక కులాలు)కు 2 శాతం, వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) కు సమీపంలోని నివాస ప్రాంతాల వారికి 3 శాతం, వెనుకబడిన ప్రాంతాల్లోని నివాసితులకు (ఆర్‌బిఏ) 20 శాతం, రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి.

ఝార్ఖండ్ : ఓబీసీలకు 14 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. ఇందులో ఉపవర్గీకరణ లేదు.

మధ్యప్రదేశ్ : ఇక్కడ కూడా ఓబీసీలకు 14 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. ఇందులో ఉపవర్గీకరణ లేదు.

కర్ణాటక : విద్యా, ఉద్యోగావకాశాల్లో ఓబీసీలకు 32 శాతం రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి.

కేరళ : కేరళలో ఓబీసీలకు 40 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి.

మహారాష్ట్ర : మహారాష్ట్రలో ప్రత్యేక వెనుకబడిన కులాలకు 2 శాతం, ఓబీసీలకు 19 శాతం రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి.

మణిపూర్ : 17 శాతం ఓబీసీ రిజర్వేషన్లు ఉన్నాయి.

ఒడిషా: ఒడిషా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాల వారికి 27 శాతం రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి. ఇందులో ఉపవర్గీకరణ లేదు.

పంజాబ్ : నేరుగా చేపట్టే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో వెనుకబడిన కులాల వారికి 12 శాతం రిజర్వేషన్ అమల్లో ఉంది. విద్యాసంస్థల్లో 5 శాతం ఇస్తున్నారు.

రాజస్థాన్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసీలకు 21 శాతం రిజర్వేషన్ ఉంది.

సిక్కిం : ఓబీసీలకు 21 శాతం రిజర్వేషన్ వర్తింపజేస్తున్నారు.

తమిళనాడు : రాష్ట్ర సర్వీసుల్లో బీసీలకు 26.5 శాతం, బీసీ ముస్లింలకు 3.5 శాతం, బాగా వెనుకబడిన బీసీలు/ డీ-నోటిఫైడ్ కమ్యూనిటీలకు 20 శాతం రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి.

ఉత్తర్‌ప్రదేశ్ : 27 శాతం ఓబీసీ రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి. ఉపవర్గీకరణ లేదు.

ఉత్తరాఖండ్ : రాష్ట్ర సర్వీసుల్లో 14 శాతం ఓబీసీ రిజర్వేషన్లు ఉన్నాయి.

పశ్చిమబెంగాల్ : 17 శాతం ఓబీసీ రిజర్వేషన్లు ఉన్నాయి.

అండమాన్ నికోబార్ దీవులు : ఓబీసీలకు 38 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి.

పుదుచ్చేరి : పుదుచ్చేరిలో ఎంబీసీ (మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్) లకు 20 శాతం, ఓబీసీలకు 13 శాతం, బ్యాక్‌వర్డ్ ట్రైబ్స్ (బీటీ) లకు 1 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. మొత్తం బీసీ రిజర్వేషన్లు 34 శాతం అమలవుతున్నాయి.

- కేంద్ర పాలిత ప్రాంతాలైన చండీగఢ్, డామన్ - డయ్యూ లో 27 శాతం ఓబీసీ రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి. దాద్రా- నగర్ హవేలీ లో 5 శాతం ఓబీసీ రిజర్వేషన్లు ఉన్నాయి.
- మేఘాలయ, మిజోరమ్, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో ఓబీసీలు లేరు. అందువల్ల ప్రత్యేకంగా ఓబీసీ రిజర్వేషన్లు లేవు. లక్షద్వీప్ లోనూ ఇదే పరిస్థితి. త్రిపుర రాష్ట్రంలో ఓబీసీ రిజర్వేషన్లు అమల్లో లేవు.

కమలానికి ఓబీసీ వికాసం!

- **రాజకీయ ప్రయోజనాలపై భాజపా ఆశలు**
- **పార్టీ నేతల హర్షాతిరేకాలు**

దిల్లీ: ఓబీసీ కోటాలో క్రీమీలేయర్‌కు వార్షికాదాయ పరిమితిని పెంచడం, ఉపవర్గీకరణకు కమిషన్ ఏర్పాటు అంశాలపై కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయం జాతీయ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది. రెండు నిర్ణయాలతో వెనకబడిన తరగతుల్లో విద్యాపరంగా, సామాజికంగా ముందంజలో ఉన్న వారిపై సానుకూల ప్రభావం చూపడం తోపాటు, అత్యంత వెనకబడిన తరగతుల(ఎంబీసీ)కు చెందినవారు ప్రత్యేకంగా తమకే కేటాయించిన కోటా ప్రయోజనాల్ని పూర్తిగా దక్కించుకునే అవకాశం కలుగుతుందనే భావన వ్యక్తమవుతోంది. దీనివల్ల తమకు రాజకీయంగా ప్రయోజనాలు సిద్ధిస్తాయని అధికార భాజపా ఆశిస్తోంది. ఎన్నో ఏళ్లుగా ఓబీసీ గ్రూప్‌పై చేస్తున్న డిమాండ్లు నేరవేర్చిన ఈ ప్రకటన చరిత్రాత్మకమంటూ వెనకబడిన తరగతులకు చెందిన ప్రముఖ భాజపా నేతలు ప్రస్తుతించడం గమనార్హం. ఈ రెండు నిర్ణయాలు ఓబీసీల్లో అన్ని వర్గాలను సంతృప్తి పరిచే సమతుల చర్యగా భావిస్తున్నారు. ఓబీసీల్లో ప్రభావశీల కులాల్లో ఉపకోటాపై అనుమానాలు ఉన్న నేపథ్యంలో పరిమితిని పెంచడం ద్వారా మరింతమందికి అవకాశం కల్పించడం ద్వారా వారికి ప్రభుత్వం ఉపశమనం కల్పించినట్లయింది.

భాజపా ప్రధాన కార్యదర్శి భూపేంద్ర యాదవ్ స్పందిస్తూ.. వెనకబడిన తరగతులకు సాధికారత కల్పించే దిశగా ఇది అసమాన ముందడుగని వ్యాఖ్యానించారు. వెనకబడిన తరగతుల్లో కాలక్రమంలో సగటు ఆదాయం పెరిగిన నేపథ్యంలో క్రీమీలేయర్ పరిమితిని పెంచాలనే డిమాండు పెరుగుతోందనీ, ఈ నిర్ణయంతో రిజర్వేషన్ల ప్రయోజనాలు మరింత మందికి దక్కుతాయని పేర్కొన్నారు. వెనకబడిన తరగతుల్లోనే అత్యంత వెనకబాటుకు లోనైన వారికీ తోడ్పడుతుందన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన కుర్మీ నేత, కేంద్రమంత్రి సంతోష్ గంగ్వార్ స్పందిస్తూ.. ఓబీసీలకు సంబంధించి సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న డిమాండ్లను మోదీ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. జాతీయ కమిషన్, పార్లమెంటరీ సంఘం గతంలోనే ఉపవర్గీకరణ చేపట్టాలని స్పష్టం చేశాయని గుర్తుచేశారు. ఇది స్వాగతనీయ పరిణామమనీ, దేశవ్యాప్తంగా ఓబీసీలు దీనిని ప్రస్తుతిస్తారని భాజపా ఎంపీ, కేంద్ర మాజీమంత్రి హుకుందేవ్ నారాయణ్ యాదవ్ పేర్కొన్నారు. ఓబీసీల్లో అత్యంత వెనకబడిన తరగతులకు కోటా దక్కుతుందన్నారు.

బిహార్, యూపీ వంటి కొన్ని రాష్ట్రాల్లో వెనకబడిన తరగతుల్లో యాదవ్‌ల వంటి ఆధిపత్య కులాలు భాజపాకు కొంతమేర వ్యతిరేకంగా ఉన్న నేపథ్యంలో అత్యంత వెనకబడిన తరగతులకు నిర్దిష్ట ఉపకోటా కేటాయించడం వల్ల ఓటుబ్యాంకు నిర్మాణంలో తోడ్పడుతుందని నేతలు ఆశిస్తున్నారు. ఇప్పటికే యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో యాదవేతర ఓబీసీలే పార్టీ గెలుపులో కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. దీనితోపాటు క్రీమీలేయర్ పరిమితిని పెంచడం ద్వారా యాదవులు, కుర్మీల వంటి సంఖ్యాపరంగా బలమైన వర్గాల ఆందోళననూ పరిగణనలోకి తీసుకున్నట్లు ప్రభుత్వం బలమైన సందేశం పంపిందనే అభిప్రాయాలువ్యక్తమవుతున్నాయి. ఇటీవల జరిగిన యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా యాదవేతర ఓబీసీ ఓటర్లను సమీకరించేందుకు చేసిన యత్నం మంచి ఫలితాలనే అందించిందని విశ్లేషకులు చెబుతున్నారు.

భాజపా చిత్తశుద్ధికి నిదర్శనం: అమిత్‌షా

దిల్లీ: ఓబీసీలకు ప్రయోజనం కల్పిస్తూ మోదీ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వెనకబడిన తరగతుల సంపూర్ణ అభ్యున్నతిపై తమ పార్టీకి, ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్‌షా తెలిపారు. ఉపవర్గీకరణ వల్ల రిజర్వేషన్లు, ఇతర ప్రభుత్వ పథకాల్లో అత్యంత వెనకబడిన వర్గాలకు ప్రాధాన్యం దక్కుతుందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వార్షికాదాయ పరిమితిని పెంచడం వల్ల సమాజంలోని చాలామందికి రిజర్వేషన్లు, ఇతర ప్రయోజనాలు కల్పించినట్లయిందన్నారు. పలు రాష్ట్రాల్లో భాజపా ప్రభుత్వాలు అందించిన ఉపవర్గీకరణలు ఎన్నో ప్రయోజనాలు కలిగిస్తున్నాయన్నారు.

జగన్‌పై కేసు నమోదు

- **ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు**
- **ఎగ్జిట్‌పోల్స్ ప్రసారంపై సాక్షి టీవీఛానెల్‌పై కేసు**



కర్నూలు జిల్లా నంద్యాలలోని ఎస్‌పీజీ గ్రౌండ్‌లో ఓటేసేందుకు బారులుతీరిన ప్రజలు

కర్నూలు, హైదరాబాద్: నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైకాపా అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిపై బుధవారం నంద్యాల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కేంద్ర ఎన్నికల సంఘం సూచన మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆర్వో ప్రసన్న వెంకటేష్ వెల్లడించారు. రెచ్చగొట్టడం, బెదిరింపు, ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద సెక్షన్ - 188, 504, 506, ఐపీసీ రెడ్ విత్ 125, రిప్రజంటేషన్ ఆఫ్ పీపుల్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు. మరో వైపు జగన్‌కు నోటీసు జారీ చేయడంలో ఎటువంటి జాప్యం జరగలేదని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారి భన్వర్‌లాల్ హైదరాబాద్‌లో బుధవారం విలేకరులకు వెల్లడించారు. నంద్యాల ఉప ఎన్నిక పోలింగు ప్రశాంతంగా జరిగిందన్నారు. సోమవారం ఉదయం నుంచి నంద్యాలలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఓట్ల లెక్కింపును చేపడతామని చెప్పారు. అలాగే భన్వర్‌లాల్ ఫిర్యాదు మేరకు ఎగ్జిట్ పోల్స్ ప్రసారం చేశారంటూ సాక్షి టీవీ ఛానెల్‌పై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. నంద్యాలలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో... 'ముఖ్యమంత్రి చంద్రబాబును కాల్చి చంపినా పర్వాలేదు' అన్న వ్యాఖ్యలపై తెదేపా నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఎన్నికల సంఘం తాఖీదులకు 48 గంటల్లో జగన్ సమాధానమిస్తూ.... 'సీఎం ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకే మనస్తాపం కలిగి ఆవేదనతో మాట్లాడాని...' పేర్కొన్నారు. అనంతరం తెదేపా నేతలు దిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) ఫిర్యాదు చేశారు. ఈసీఐ సూచన మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆర్వో ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కర్నూలులో ఓఎస్డీ రవి ప్రకాశ్ విలేకరుల సమావేశంలో తెలిపారు.

జగన్‌కు ఆఖరి నోటీసు జారీ: ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డికి నియోజకవర్గ ఎన్నికల అధికారి ఆఖరి నోటీసు జారీ చేశారని కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారి భన్వర్‌లాల్ బుధవారం విలేకరులకు వెల్లడించారు. ' తెలుగుదేశం పార్టీ ఫిర్యాదు మేరకు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం సాయంత్రం ఆరు గంటలకు ఆఖరి నోటీసును పంపింది. తమ కార్యాలయం నుంచి అదే రోజు రాత్రి ఎనిమిది గంటలకు ఎన్నికల అధికారికి పంపాం. మంగళవారం పోలింగు సామగ్రిని పంపిణీ చేసే క్రమంలో బుధవారం దానిని జారీ చేశారు. పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో అక్కడి నుంచి నివేదికలు, వీడియో రికార్డింగులను రప్పించి, వాటిని తెలుగు నుంచి ఇంగ్లిషులోకి తర్జుమా చేసి కేంద్ర ఎన్నికల సంఘానికి పంపాం. జాప్యం ఏమీ లేదు. పరిపాలనాపరమైన జాప్యమే...' అని భన్వర్‌లాల్ వివరించారు.

ప్రశాంతంగా ఉప ఎన్నిక పోలింగ్

'ఎలాంటి అవాంఛనీయకర సంఘటనలు లేకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక ముగిసింది. గడిచిన రెండు ఎన్నికల పోలింగుతో పోలిస్తే ఉప ఎన్నికల్లో అధికంగా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు..'అని భన్వర్‌లాల్ చెప్పారు. బుధవారం సాయంత్రం పోలింగు ముగిసిన తర్వాత తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'పోలింగు ప్రశాంతంగా ముగిసింది. విధి నిర్వహణలో ఉన్న ఆర్మ్‌డు రిజర్వు కానిస్టేబుల్ ఉమామహేశ్వరరావు మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు కేంద్ర ఎన్నికల సంఘం పరిహారంగా సుమారు రూ. పది లక్షలను త్వరలో చెల్లించనుంది. సోమవారం ఉదయం నుంచి నంద్యాలలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఓట్ల లెక్కింపును చేపడతాం' అని తెలిపారు. కాగా ఎన్నికల్లో 79.20% ఓట్లు పోలైనట్లు సమాచారం.

దేశవ్యాప్తంగా

దిల్లీ: బుధవారం దేశవ్యాప్తంగా నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. గోవాలోని పనాజీ, వాల్పోయి, దిల్లీలోని బావన, ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాలలో ఈ ఉప ఎన్నికలు జరిగాయి.

సాక్షి టీవీ ఛానెల్‌పై కేసు నమోదు

ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల ఉప ఎన్నిక పోలింగు పూర్తికాకుండానే ఎగ్జిట్ పోల్స్ ప్రసారం చేశారంటూ సాక్షి టీవీఛానెల్‌పై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ప్రధాన ఎన్నికల అధికారి భన్వర్‌లాల్ ఫిర్యాదు మేరకు న్యాయనిపుణుల సలహాలు తీసుకుని ఈ కేసు నమోదు చేశామని డీసీపీ (నేర పరిశోధన) అవినాష్ మొహంతి తెలిపారు. నంద్యాల ఉప ఎన్నికల్లో రాజకీయ పార్టీల ప్రచారం గడువు ఈనెల 21న ముగిసింది. ఈ గడువు ముగిసిన అనంతరం ఫలానా పార్టీ గెలిచే అవకాశాలున్నాయంటూ సాక్షి ఛానెల్‌లో కథనాలను ప్రసారమయ్యాయని ప్రధాన ఎన్నికల అధికారి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును నాంపల్లి పన్నెండో అదనపు చీఫ్ మెజిస్ట్రేట్ కోర్టుకు పంపించారు. బుధవారం అక్కడి నుంచి అనుమతి లభించగానే.. సాక్షి టీవీ ఛానెల్‌పై ప్రజా ప్రాతినిధ్య చట్టం 126(1), 126(ఏ) రెడ్‌విత్ 155సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని డీసీపీ అవినాష్ మొహంతీ వివరించారు.

ఇది చీవాట్లు పెట్టడానికి తగిన కేసు: కేంద్ర ఎన్నికల సంఘం

ఈనాడు, దిల్లీ: ముఖ్యమంత్రిని రోడ్డుపై కాల్చి చంపినా తప్పులేదంటూ వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నంద్యాల ఎన్నికల ప్రచారంలో చేసిన వ్యాఖ్యలను కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించింది. అతనిపై ఐపీసీలోని సంబంధిత సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశిస్తూ రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి భన్వర్‌లాల్‌కు లేఖ రాసింది. అతని ప్రవర్తన తీరును తప్పుబడుతూ తీవ్రమైన హెచ్చరిక లేఖ కూడా జారీ చేయాలని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రచారసభల్లో జగన్‌మోహన్‌రెడ్డి చేసిన రెచ్చగొట్టే ప్రసంగాలను ఎన్నికల సంఘం పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపింది. ముఖ్యంగా... "అతని మోసపూరిత తనం చూసిన తర్వాత... చంద్రబాబునాయుడు నాకు తల్లిదండ్రులను చంపి కోర్టులో నిలిచిన ముద్దాయిలా అనిపిస్తున్నారు. అలాంటి వ్యక్తిని రోడ్డులో కాల్చి చంపినా తప్పు లేదు..." అంటూ చేసిన జగన్ ప్రసంగాన్ని కేంద్ర ఎన్నికల సంఘం తప్పుబట్టింది. ఎన్నికల ప్రచారం సందర్భంగా చేసిన ఇలాంటి అనుచితమైన, రెచ్చగొట్టే భాషా ప్రయోగం హింసను ప్రేరేపించేలా ఉందని పేర్కొంది. ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో పేరా 1(2) కింద పేర్కొన్న నిబంధనల ఉల్లంఘన కిందకి వస్తుందని తెలిపింది. అందువల్ల ఇది చీవాట్లు పెట్టడానికి తగిన కేసని పేర్కొంది. ఈ విషయాన్ని తక్షణం రిటర్నింగ్ అధికారికి పంపి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించాలని సూచించింది. ఈ కేసులో నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కాపీని కమిషన్‌కు పంపాలని ఆదేశించింది.

హ్యాష్‌ట్యాగ్(#)కు పదేళ్లు

పారిస్: ట్విటర్ హ్యాష్‌ట్యాగ్‌కు పదేళ్లు నిండాయి. దీన్ని సృష్టించిన ఘనత అమెరికాలోని సామాజిక మాధ్యమాల నిపుణుడు క్రిస్ మెస్సినాకు దక్కుతుంది. ట్వీట్లలో # సంకేతంతో సంబంధిత అంశాన్ని పేర్కొనడం ద్వారా.. అంశాలవారీగా వాటిని గుర్తించేందుకు వీలు కలుగుతుందని ఆయనే ప్రతిపాదించారు. సాంకేతిక అంశాలకు సంబంధించిన సదస్సులను గుర్తించేందుకు.. # బార్‌క్యాంప్ పేరుతో 2007, ఆగస్టు 23న క్రిస్ ట్వీట్‌ను పెట్టారు. హ్యాష్‌ట్యాగ్‌తో చేసిన తొలి ట్వీట్ అదే. ఇక అప్పటి నుంచి.. హ్యాష్‌ట్యాగ్‌కు ఆదరణ విపరీతంగా పెరుగుతూవచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా చోటు చేసుకుంటున్న పరిణామాలు, ఘటనలు.. అన్నింటికీ జనాలు అంశాలవారీగా హ్యాష్‌ట్యాగ్‌లను సృష్టించి ట్వీట్ల ద్వారా చర్చించుకోవడం ప్రారంభించారు. ఈ పోకడ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టంబ్లర్ లాంటి ఇతర సామాజిక మాధ్యమాలకూ వ్యాపించింది. ప్రస్తుతం రోజూ జనాలు హ్యాష్‌ట్యాగ్‌లతో చేస్తున్న పోస్ట్‌ల సంఖ్య 12.5 కోట్లకు పైమాటే.

ట్రంప్ వైఖరికి నిరసనగా మరో దౌత్యవేత్త రాజీనామా

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరికి నిరసనగా మరో దౌత్యవేత్త బుధవారం రాజీనామా చేశారు. డేనియల్ కమ్మేన్ 2016 నుంచీ అమెరికా విదేశాంగ శాఖలో దౌత్యవేత్తగా ఉన్నారు. శ్వేతజాతి దురహంకారం అమెరికాలో నాణ్యమైన జీవితాన్ని దెబ్బతీస్తోందని ఆయన తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ఆ వైఖరులను ట్రంప్ ఖండించకపోవడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం తెలిపారు. అమెరికా మౌలిక విలువలకు తీవ్రవిఘాత కలుగుతోందన్నారు.

క్రీమీలేయర్ పరిమితి పెంపుతో పేదలపై ప్రభావం: కాంగ్రెస్

దిల్లీ: ఓబీసీల్లో క్రీమీలేయర్ వార్షికాదాయం గరిష్ఠ పరిమితిని పెంచడంపై కాంగ్రెస్ పార్టీ ఆచితూచి స్పందించింది. ఇది సమాజంలోని పేదలపై ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశం ఉందనీ, ఈ సమస్యను జాగ్రత్తగా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరింది. ప్రభుత్వం రిజర్వేషన్ల లోపల రిజర్వేషన్లు సృష్టించిందనీ, క్రీమీలేయర్ పరిమితి పెంచడం వల్ల పేదలు ప్రయోజనాలకు దక్కకుండా పోయే ప్రమాదం ఉందని కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి రణదీప్ సూర్జేవాలా పేర్కొన్నారు. పరిమితి పెంచడం వల్ల కలిగే ప్రభావాల్ని అధ్యయనం చేస్తున్నామనీ, తర్వాత సవివవరంగా ప్రతిస్పందిస్తామని తెలిపారు. ఉద్యోగ రిజర్వేషన్లు పేదలకే అవసరమనీ, క్రీమీలేయర్ పరిమితిని పెంచడం ద్వారా భాజపా ప్రభుత్వం పేదలు ఉద్యోగాలు పొందకుండా చేయడం లేదా? అని ప్రశ్నించారు. దీనివల్ల ధనికులకు ప్రయోజనాలు కల్పించడం లేదా అని వ్యాఖ్యానించారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఉచితంగా స్మార్ట్ ఫోన్లు

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో 55 లక్షల స్మార్ట్ ఫోన్లను ఉచితంగా పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. బుధవారం ముఖ్యమంత్రి రమణ్ సింగ్ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పథకానికి 'సంచార్ క్రాంతి యోజన' అని పేరు పెట్టారు. రెండేళ్లలో రెండు దశల కింద ఈ పథకాన్ని అమలు చేస్తారు. తొలుత వేయికిపైగా జనాభా ఉన్న గ్రామాలు, పట్టణ పేదలు, కళాశాల విద్యార్థులకు 50.8 లక్షల ఫోన్లు అందజేస్తారు. రెండో దశలో 4.8 లక్షల ఫోన్లను 1000 కన్నా తక్కువ జనాభా ఉన్న గ్రామాల వారికి ఇస్తారు.

ఒకే గొడుగు కిందకు వేతన చట్టాలు

- నాలుగు చట్టాల స్థానంలో కొత్తగా వేతన స్మృతి-2017 బిల్లు
- కనీస వేతనాల నిర్ధరణ అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు
- కనీస వేతనం కంటే తక్కువ చెల్లించడానికి వీల్లేదు
- నిబంధనలు ఉల్లంఘించే యాజమాన్యాలకు జరిమానా

ఈనాడు - దిల్లీ

ఉద్యోగులు, కార్మికుల వేతనాల పర్యవేక్షణ కోసం తీసుకొస్తున్న వేతన స్మృతి(ద కోడ్ ఆన్ వేజెస్)-2017 బిల్లుపై కార్మిక సంఘాల భయాందోళనను కేంద్ర ప్రభుత్వ వర్గాలు తోసి పుచ్చాయి. ఇప్పటివరకూ నాలుగు చట్టాల పర్యవేక్షణలో ఉన్న వేతనాలను ఒకే ఛత్రం కిందికి తేవడానికే ఈ బిల్లును తీసుకొచ్చినట్లు వెల్లడించాయి. ఈ చట్టం కేవలం వేతనాలకే పరిమితమని, ఉద్యోగ భద్రతతో ఏమాత్రం సంబంధంలేదని స్పష్టం చేశాయి. నూతన వేతన స్మృతి తమ హక్కులను హరిస్తుందన్న ఆందోళన ఎంత మాత్రం తగదని పేర్కొన్నాయి. ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఈ బిల్లులోని ముఖ్యాంశాలు...

- ప్రస్తుతం అమల్లో ఉన్న (అ) వేతన చెల్లింపుల చట్టం-1936 (ఆ) కనీస వేతనచట్టం-1949 (ఇ) బోనస్ చెల్లింపు చట్టం-1965 (బి) సమాన పారితోషక చట్టం-1976లను విలీనం చేసి వాటన్నింటి స్థానంలో వేతన స్మృతి బిల్లు తీసుకొచ్చారు.
- ఈ కొత్త వేతన స్మృతి పరిశ్రమ, వాణిజ్యం, వ్యాపారం, తయారీరంగం, వృత్తులకు వర్తిస్తుంది. దీని పరిధిలోకి ప్రభుత్వ రంగ వ్యవస్థలూ వస్తాయి.
- కేంద్ర ప్రభుత్వం తన ఆధీనంలోని సంస్థల వేతన సంబంధిత నిర్ణయాలు తీసుకుంటుంది. మిగిలిన సంస్థల్లోని సిబ్బంది వేతనాలపై రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకుంటాయి.
- దేశవ్యాప్తంగా వర్తించే జాతీయస్థాయి కనీస వేతనాన్ని కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేస్తుంది. ఆయా భౌగోళిక పరిస్థితుల ఆధారంగా రాష్ట్రాల వారీగా విభిన్న కనీస వేతనాలను కేంద్ర ప్రభుత్వం నిర్ధారించవచ్చు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ధారించే కనీస వేతనాలు జాతీయస్థాయి కనీస వేతనాల కంటే తక్కువ ఉండకూడదు. ఒకవేళ అవి నిర్ణయించిన కనీస వేతనాలు జాతీయస్థాయి కంటే ఎక్కువ ఉంటే తగ్గించడానికి వీల్లేదు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి అయిదేళ్లకోసారి కనీస వేతనాలను సమీక్షించి పునరుద్ధరించాలి.
- రోజుకు ఎన్ని పనిగంటలు ఉండాలన్నది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయిస్తాయి. నిర్ధారించిన పని గంటల కంటే ఉద్యోగి/కార్మికుడు ఎక్కువ సమయం పనిచేస్తే ఓవర్‌టైం చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తం సాధారణ పని గంటకు చెల్లించే దాని కంటే కనీసం రెట్టింపు ఉండాలి.
- యజమాని ప్రతి ఉద్యోగికీ వార్షిక బోనస్ చెల్లించాలి. అది ఉద్యోగి వేతనంలో కనీసంగా 8.33% ఉండాలి. దీనికి అదనంగా యజమాని తనకు వచ్చిన స్థూల లాభాల్లో కొంతభాగాన్ని (కేటాయించదగిన మిగులు) ఉద్యోగులకు పంపిణీ చేయవచ్చు.
- ఉద్యోగి గరిష్ఠంగా వేతనంలో 20% వరకు బోనస్ పొందవచ్చు. ఇందులో కేటాయించదగ్గ మిగులు ద్వారా పంపిణీ చేసిన మొత్తం కూడా కలగలిసి ఉండొచ్చు.
- ఈ బిల్లులోని అంశాల అమలు పర్యవేక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ పరిధిలో ప్రత్యేక సలహామండళ్లను ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ మండళ్లలో 1/3వ వంతు మంది మహిళలు ఉండాలి.
- యజమాని కనీస వేతనాల కంటే తక్కువ వేతనం చెల్లించినా, ఈ బిల్లులోని నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించినా జరిమానా విధించవచ్చు. గరిష్ఠంగా మూడునెలల జైలు, రూ.లక్ష జరిమానా విధించడానికి అవకాశం ఉంది.
- ఉద్యోగి తనకు రావాల్సిన వేతనాల కోసం కేసు దాఖలుచేసే గరిష్ఠ కాలపరిమితిని (లిమిటేషన్) మూడేళ్లకు పెంచారు. ఇప్పుడు 6 నెలల నుంచి రెండేళ్ల వరకే సమయం ఉంది.
- వేతనం, బోనస్ చెల్లించలేదని చెప్పినా, తక్కువ చెల్లించారనో లేదా వేతనం నుంచి చేసే మినహాయింపులు చట్టపరిధిలో లేవని ఫిర్యాదు చేసినా అవి తప్పు అని నిరూపించాల్సిన బాధ్యత యజమానిదే. బకాయిలన్నీ చట్టబద్ధంగా చెల్లించినట్లు నిరూపించాల్సి ఉంటుంది.
- తనిఖీల సమయంలో జరిగే తప్పుడు పనులను నివారించడానికి ఇక మీదట ఇన్‌స్పెక్టర్ల స్థానంలో ప్రభుత్వం ఫెసిలిటేటర్స్‌ను నియమిస్తుంది. తనిఖీలను పూర్తి పాదర్శకంగా, వెబ్ ఆధారిత విధానం కింద చేపట్టాల్సి ఉంటుంది.
- ప్రస్తుతం నెలకు రూ.18వేలకుపైగా వేతనాలు పొందుతున్న వారికే వేతనాల నుంచి అధీకృత మినహాయింపులకు అవకాశం ఉంది. ఇక మీదట వేతన పరిమితితో సంబంధం లేకుండా ఉద్యోగులందరికీ ఈ నిబంధనలు వర్తింపజేయాలి.



దిల్లీలోని ఇందిరాగాంధీ విమానాశ్రయంలో నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవుబాకు స్వాగతం పలుకుతున్న సుష్మా స్వరాజ్

మోదీని కలిసిన నేపాల్ ప్రధాని

దిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవుబా బుధవారం కలిసారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం దిల్లీలో అడుగుపెట్టిన దేవుబా.. మోదీ నివాసానికి వెళ్లారు. ఆయన్ను మోదీ సాదరంగా ఆహ్వానించారు. ఇది అధికారిక భేటీకాదని, గురువారం ద్వైపాక్షిక అంశాలపై ఇద్దరు నేతలు సమగ్రంగా చర్చలు జరుపుతారని అధికారిక వర్గాలు తెలిపాయి. మరోవైపు ట్వీట్లతోనూ దేవుబాకు మోదీ ఆహ్వానం పలికారు. 'అత్యంత సన్నిహిత పొరుగు దేశం నేపాల్ ప్రధాని దేవుబాజీకి స్వాగతం పలకడం సంతోషంగా ఉంది'అంటూ మోదీ ట్వీట్‌చేశారు. ఇద్దరు నేతలూ కలిసిదిగిన ఓ ఫోటోను కూడా ఆయన నెటిజన్లతో పంచుకున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు సహా పలు రంగాల్లో ద్వైపాక్షిక బంధాల బలోపేతంపై ఇద్దరు నేతలూ గురువారం చర్చలు జరపనున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. నేపాల్‌లోని రాజకీయ పరిస్థితులు, భారత సంతతి మధేశీల డిమాండ్లపై దేవుబా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలూ చర్చకు వచ్చే అవకాశముందని పేర్కొన్నాయి. నేపాల్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం దేవుబా చేపడుతున్న తొలి విదేశీ పర్యటన ఇదే.

తోటి విద్యార్థిని నీళ్ల సీసాలో విషం కలిపింది!

ఎక్కువ మార్కులొచ్చాయని అక్కసు

సత్నా: తరగతిలో తోటి వారు ఎక్కువ మార్కులు సాధించినప్పుడు ఇతర విద్యార్థులకు అసూయ కలగడం సాధారణం. కానీ అది భరించలేని ఓ బాలిక తన స్నేహితురాలి నీళ్లు తాగే సీసాలో దోమలను నాశనం చేసే ద్రావణాన్ని కలిపింది. దాన్ని తాగిన విద్యార్థిని ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. అనంతరం పోలీసుల విచారణకు భయపడ్డ సదరు బాలిక ఆత్మహత్యాయత్నానికి యత్నించింది. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్నా పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఓ బాలిక తన కన్నా అధిక మార్కులు సాధించిన తోటి విద్యార్థినిపై అక్కసు పెంచుకుంది. ఆమె నీళ్ల సీసాలో దోమలను నాశనం చేసే ద్రావణాన్ని కలిపింది. దాన్ని తాగి వాంతి చేసుకున్న విద్యార్థినిని తల్లిదండ్రులు స్థానిక ఆసుపత్రికి తరలించడంతో ఆమెకు ఎలాంటి ప్రాణహాని జరగలేదు. ఘటనకు సంబంధించిన దృశ్యాలన్నీ తరగతి గదిలోని సీసీ కెమెరాలో నమోదయ్యాయి. బాలిక నీళ్ల సీసాలో ద్రావణాన్ని కలపడం, అనంతరం దాన్ని మరో విద్యార్థిని బ్యాగులో దాచడం నమోదయ్యింది. దీనిపై పోలీసులు విచారణ ప్రారంభించడంతో భయపడ్డ విద్యార్థిని అదే తరహా ద్రావణాన్ని ఇంట్లో తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి విషమంగా ఉందని జిల్లా ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

న్యాయవాదుల డిగ్రీలపై పరిశీలన పూర్తి చేయండి


- రాష్ట్రాల బార్‌కౌన్సిళ్లకు చివరి అవకాశం: సుప్రీంకోర్టు

దిల్లీ: నకిలీ డిగ్రీలతో న్యాయవాదులుగా చలామణీ అవుతున్నవారిని ఏరివేయడానికి వీలుగా న్యాయవాదుల డిగ్రీ పట్టాల పరిశీలనను పూర్తి చేసేందుకు అన్ని రాష్ట్రాల బార్ కౌన్సిళ్లకు చివరి అవకాశం ఇస్తున్నట్లు సుప్రీంకోర్టు బుధవారం ప్రకటించింది. అన్ని బార్ కౌన్సిళ్ల నుంచి సమాధానాలు వచ్చిన తర్వాత 'స్థాయీ నివేదిక'ను తమకు సమర్పించాలని 'బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా' (బీసీఐ)ని ఆదేశించింది. డిగ్రీ పట్టాల పరిశీలన నిమిత్తం దరఖాస్తుల్ని సమర్పించడానికి న్యాయవాదులకు 15 రోజుల గడువునిస్తున్నట్లు జస్టిస్ ఆర్.కె.అగర్వాల్, జస్టిస్ ఎ.ఎం.సప్రేల ధర్మాసనం తెలిపింది. న్యాయవాదులు ఈ దరఖాస్తుల్ని సమర్పించాక పరిశీలన ప్రక్రియను నెలరోజుల్లోగా రాష్ట్రాల బార్ కౌన్సిళ్లు పూర్తి చేయాలని ఆదేశించింది. 'విశ్వవిద్యాలయాలు ఈ డిగ్రీల పరిశీలనకు ఎలాంటి రుసుములు వసూలు చేయకూడదు. పరిశీలన పూర్తయ్యాక అర్హులైన న్యాయవాదుల జాబితాను రాష్ట్రాల బార్ కౌన్సిళ్లు రూపొందించి, ఎన్నికలకు తేదీలను ప్రకటించాలి. ఈ పనిని డిసెంబరు 31లోగా పూర్తి చేసి, బీసీఐకి సమాధానం పంపాలి. పరిశీలన ప్రక్రియను పర్యవేక్షించడానికి, న్యాయవాదుల పేర్లతో ఓటర్ల జాబితాను రూపొందించడానికి సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తిని కేటాయించాల్సిందిగా కోరాలని బీసీఐని ఆదేశిస్తున్నాం. అవసరమైన చర్యలన్నీ బీసీఐ తక్షణం తీసుకోవాలి' అని స్పష్టం చేసింది. తదుపరి విచారణను జనవరి రెండో వారానికి వాయిదా వేసింది.

మౌనంగానే మంచిచేస్తున్న చెట్లు

- ఒక్కో మహానగరానికీ ఏటా రూ.3 లక్షల పైచిలుకు విలువైన సేవలు

న్యూయార్క్: ఒక్కో మహానగరంలో చెట్లు ప్రజలకు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని పరిశోధకులు పేర్కొన్నారు. ఒక్కోనగరానికి ఏటా రూ.3లక్షల 20వేల పై చిలుకుడబ్బుతో సమానమైన సేవలను అందిస్తున్నట్లు వారు లెక్కకట్టారు. కాలుష్యాన్ని వడపోసేసి గుండెల నిండా స్వచ్ఛమైన గాలిని నింపుతాయవి. అయాచితంగా మనకు చెట్లు అందిస్తున్న ఈ సేవలను రెట్టింపు చేసుకోవాలంటే మరిన్ని నాటండి అని పరిశోధకులు సిఫారసు చేశారు. ముంబయితో సహా ప్రపంచంలోని పదినగరాల్లో పరిశోధకులు అధ్యయనాన్ని నిర్వహించారు. బీజింగ్, బ్యూనస్ ఎయిర్స్, కైరో, ఇస్తాంబుల్, లండన్, లాస్‌ఏంజెలిస్, మెక్సికోసిటీ, మాస్కో, టోక్యోల్లో ఈ అధ్యయనం జరిగింది. అంతులేని వాయుకాలుష్య నివారణ, వేడిగాలుల నుంచి



ఉపశమనం, చలిగాలులు, బొగ్గుపులుసు వాయువు దుష్ప్రభావాల నుంచి రక్షణ...ఇలా ఎన్నోరకాలుగా... ఆయా మహా నగరాల్లో మానవాళికి చెట్లు మౌనంగా సేవలను అందిస్తున్నాయని పరిశోధకులు వెల్లడించారు. ప్రపంచంలోని 7.5 బిలియన్ల జనాభాలో దాదాపు పదిశాతం మంది మహానగరాల్లోనే ఉంటున్నారు. ఒక్కో మహానగర పౌరుడికీ సగటున చెట్ల నుంచి అందుతున్న సేవల విలువ సుమారు రూ.2,243లుగా ఉన్నట్లు పరిశోధకులు లెక్కకట్టారు. అమెరికాలోని 'న్యూయార్క్ కాలేజ్ ఆఫ్ ఎన్విరాన్ మెంటల్ సైన్స్ అండ్ ఫారెస్ట్రీ' పరిశోధకులు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు.

మాజీ సీఎంలకు బంగ్లాలపై ఉత్తర్వులు ఇవ్వవద్దు: సుప్రీం

దిల్లీ: మాజీ ముఖ్యమంత్రులకు ప్రభుత్వ బంగ్లాల కేటాయింపులకు వ్యతిరేకంగా ఎలాంటి ఉత్తర్వులు ఇచ్చినా దాని ప్రభావం విస్తృతంగా ఉంటుందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చట్టాలు వేర్వేరుగా ఉన్నాయని గుర్తు చేసింది. ఈ చట్టాలపై పడే ప్రభావం దృష్ట్యా దీనిపై విస్తృతంగా చర్చించాల్సిన ఆవశ్యకత ఉందని జస్టిస్ రంజన్ గొగొయ్, జస్టిస్ నవీన్ సిన్హాల ధర్మాసనం బుధవారం అభిప్రాయపడింది. మాజీ సీఎంలకు బంగ్లాల కేటాయింపుపై సుప్రీంకోర్టు ఆదేశాలున్నా దానికి విరుద్ధంగా ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం కొన్ని చట్ట సవరణలు చేయడాన్ని లోక్‌ప్రహరీ స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ విషయంలో న్యాయస్థానానికి సహాయకునిగా సీనియర్ న్యాయవాది గోపాల్ సుబ్రమణియన్ని ధర్మాసనం నియమించింది.

పీఎస్ఎల్‌వీ-సీ39 అనుసంధానం పూర్తి

- 31న ప్రయోగం!

శ్రీహరికోట, న్యూస్‌టుడే: భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సతీశ్ ధవన్ స్పేస్‌సెంటర్ షార్ నుంచి వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే ఈ నెల 31వ తేదీన సాయంత్రం 6.58 గంటలకు పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్- సీ39 (పీఎస్ఎల్‌వీ) నింగిలోకి దూసుకెళ్లనుంది. షార్‌లోని రెండో ప్రయోగ వేదిక సమీపంలోని వ్యాబ్‌లో రాకెట్ అనుసంధాన పనులు పూర్తయ్యాయి. బుధవారం రాకెట్‌లోని శిఖర భాగాన ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్ ఉపగ్రహాన్ని ఉంచి ఉష్ణకవచాన్ని అమర్చారు. 27వ తేదీ ఉదయం వ్యాబ్ నుంచి ప్రయోగ వేదికకు రాకెట్‌ను తీసుకొచ్చి, కొన్ని పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నెల 29న రాకెట్ సన్నాహాలు జరపనున్నారు. అనంతరం రాకెట్ సన్నద్ధత సమావేశం, లాంచ్ ఆథరైజేషన్ బోర్డు సమావేశాలు జరగనున్నాయి. తర్వాత ప్రీ కౌంట్‌డౌన్, కౌంట్‌డౌన్ కార్యక్రమాలు జరుగుతాయి. ఈదఫా కౌంట్‌డౌన్ ప్రక్రియ 30 గంటలపాటు జరగనుంది. పీఎస్ఎల్‌వీ- సీ39 వాహకనౌక ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్ ఉపగ్రహాన్ని నింగిలోకి తీసుకెళ్లనుంది.



తుదిపరీక్షలు నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు

సెప్టెంబరు తొలి వారంలోనే రూ.200 నోట్లు

దిల్లీ: తొలిసారిగా ముస్తాబైన రూ.200 నోటు సెప్టెంబరు తొలివారంలోనే మన చేతుల్లోకి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. దీనికి సంబంధించిన ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కేంద్ర ఆర్థికశాఖ ఈ విషయంపై బుధవారం అధికారిక ప్రకటన విడుదలచేసింది. 'ఆర్‌బీఐ కేంద్ర బోర్డు డైరెక్టర్ల సూచనలపై రూ.200 విలువగల నోట్ల జారీకి కేంద్రం అనుమతినిస్తోంది' అని ప్రకటనలో పేర్కొంది. దీనిపై ఆర్థిక శాఖ వర్గాలు స్పందించాయి. పెద్దనోట్ల అక్రమ నిల్వలు, వాణిజ్యానికి కళ్లెం వేయడమే లక్ష్యంగా రూ.200 నోట్లను తెరపైకి తెచ్చినట్లు తెలిపాయి. వీటిని ఆగస్టు చివరి వారంలో లేదా సెప్టెంబరు మొదటివారం కల్లా చెలామణీలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నాయి. దాదాపు 50 కోట్ల నోట్లను విడుదల చేయనున్నట్లు పేర్కొన్నాయి.

రూ.2000 నోట్లు రద్దు చేయట్లేదు: జైట్లీ

మరోవైపు రూ.2000 నోట్లను రద్దుచేయట్లేదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టంచేశారు. 'రూ.200 నోట్లు ఎప్పుడు విడుదల చేయాలనే అంశంపై ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంటుంది. నోట్ల ముద్రణ, తేదీలకు సంబంధించిన విషయాలను ఆర్‌బీఐకే వదిలిపెట్టడం ఉత్తమం'అని ఆయన చెప్పారు. రూ.2000 నోట్లను రద్దు చేయబోతున్నారా? అని విలేకరులు ప్రశ్నించగా.. "లేదు. ఆ అంశంపై ఇప్పటివరకూ ఎలాంటి చర్చా జరగలేదు' అని సమాధానమిచ్చారు.

కార్తీ చిదంబరాన్ని వంద ప్రశ్నలడిగిన సీబీఐ



దిల్లీ: అవినీతి కేసులో విచారణ నిమిత్తం కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరం (45) బుధవారం సీబీఐ ముందు హాజరయ్యారు. చిదంబరం కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు కార్తీ..విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎఫ్.ఐ.పి.బి.)పై ఒత్తిడి తెచ్చి ఐఎన్ఎక్స్ మీడియా గ్రూపునకు మారిషస్ నుంచి నిధులు వచ్చేలా చేశారన్నది సీబీఐ ప్రధాన ఆరోపణ. ఇంద్రాణి, పీటర్ ముఖర్జీయాలకు చెందిన ఐఎన్ఎక్స్ మీడియా నుంచి కార్తీ పరోక్ష ఆధ్వర్యంలో ఉన్న సంస్థకు నిధులు అందాయని ఆరోపించింది. కుమార్తె షీనా బోరా హత్య కేసులో ఇంద్రాణి, పీటర్ ఇద్దరూ ప్రస్తుతం జైలులో ఉండడం గమనార్హం. ఈ ఆరోపణలపై విచారణ నిమిత్తం హాజరుకావాలని సీబీఐ కార్తీకి గత జూన్‌లో నోటీసు పంపించగా, ఆయన మరింత సమయం కావాలని కోరారు. దాంతో ఆయన విదేశాలకు వెళ్లకుండా నిరోధిస్తూ లుక్‌అవుట్ సర్క్యులర్ జారీ చేసింది. దీనిపై ఆయన మద్రాసు హైకోర్టును ఆశ్రయించగా లుక్‌అవుట్ సర్క్యులర్ అమలు కాకుండా స్టే ఉత్తర్వు ఇచ్చింది. దీనిపై సీబీఐ సుప్రీంకోర్టుకు వెళ్లడంతో కార్తీ విచారణకు హాజరు కావాల్సిందేనని ఆదేశించింది. ఉదయం 10.20 గంటలకు సీబీఐ ప్రధాన కార్యాలయానికి వెళ్లిన కార్తీని దర్యాప్తు సంస్థ దాదాపు ఎనిమిది గంటలపాటు విచారించింది. వందకుపైగా ప్రశ్నలు వేసినట్టు తెలిసింది. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది.

'బ్లూవేల్' క్రీడ... చెన్నైలో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

చెన్నై: 'బ్లూవేల్' వికృతక్రీడలో భాగంగా మరో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వేర్వేరు ప్రాంతాల్లో బాలిక, యువతి భవనాలపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మంగళ, బుధవారాల్లో చెన్నైలోని విరుగుంబాక్కం, కొట్టురపురంలో జరిగిన ఈ ఘటనల్లో వారి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విరుగంబాక్కంలోని ఏడు అంతస్తుల భవనంపై నుంచి ఓ యువతి కిందికి దూకింది. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే ఆస్పత్రిలో చేర్పించారు. కొట్టురుపురంలోని ఎరిక్కరై వీధిలో ఉండే 15ఏళ్ల బాలిక భవనం మూడో అంతస్తు నుంచి కిందికి దూకింది. వీరి ప్రాణాలకు ప్రమాదం లేదని వైద్యులు చెప్పారు.

అఫ్గానిస్థాన్‌లో తాలిబన్ కారుబాంబు దాడి

ఏడుగురు మృతి

కాబూల్: అఫ్గానిస్థాన్‌లోని దక్షిణ హెల్మాండ్ ప్రావిన్సులో సైనిక వాహనశ్రేణి లక్ష్యంగా తాలిబన్ కారుబాంబు దాడికి పాల్పడింది. హెల్మాండ్ ప్రావిన్సు రాజధాని అయిన లష్కర్ ఘా ప్రాంతంలో జరిగిన ఈ దాడిలో ఒక చిన్నారి, ఇద్దరు మహిళలు, నలుగురు సైనికులు సహా మొత్తం ఏడుగురు మృతిచెందగా, 42 మందికి తీవ్రగాయాలయ్యాయి. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశముందని ప్రావిన్సు ప్రతినిధి ఒకరు వెల్లడించారు. కారుబాంబు దాడి అఫ్గాన్ పోలీసు ఉన్నతాధికారుల ప్రధాన నివాస ప్రాంత సమీపంలో జరిగింది. ఈ దాడి చేసింది తామేనని తాలిబన్ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ ట్విట్టర్ ద్వారా పేర్కొన్నాడు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అఫ్గానిస్థాన్‌పై అమెరికా నూతన వ్యూహాన్ని ప్రకటించిన వెంటనే ఈ దాడి జరగడం గమనార్హం.

ఏఐఎస్‌ల కేటాయింపుల్లో మార్పులు

- రాష్ట్రాల కేడర్‌ల బదులు జోనల్ కేడర్లు
- ఈ ఏడాది నుంచే అమలు

దిల్లీ: జాతీయ సమగ్రత పెంపొందించేలా అఖిల భారత సర్వీసు అధికారుల కేడర్ కేటాయింపు విధానంలో మార్పులు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. అఖిల భారత సర్వీసు(ఏఐఎస్)లైన ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసు (ఐఏఎస్), ఇండియన్ పోలీసు సర్వీసు (ఐపీఎస్), ఇండియన్ ఫారెస్టు సర్వీసు (ఐఎఫ్ఓఎస్)ల విషయంలో ఈ మార్పులు తీసుకురానుంది. ఇంతవరకు రాష్ట్ర స్థాయి కేడర్ ఉండగా, ఇకపై జోనల్ స్థాయి కేడర్ ఉంటుంది. ఈ మూడు సర్వీసుల అధికారులను రాష్ట్ర కేడర్‌లకు కేటాయించిన తరువాత కొన్ని నిబంధనలకు అనుగుణంగా కేంద్రంలో డిప్యుటేషన్‌పై పనిచేసే అవకాశం కల్పిస్తారు. ఈ విధానంలో కొన్ని మార్పులు చేయాలని కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ నిర్ణయించింది. ఈ ఏడాది నుంచే వీటిని అమల్లోకి తీసుకురావాలని భావిస్తోంది.

అయిదు జోన్లుగా విభజన

ప్రస్తుతం రాష్ట్రాలను 26 కేడర్లుగా విభజించగా ఇకపై అయిదు జోన్లుగా ఏర్పాటు చేస్తారు.

జోన్ 1: ఎ.జి.ఎం.యూటీ కేడర్...(అరుణాచల్ ప్రదేశ్, గోవా, మిజోరాం, కేంద్రపాలిత ప్రాంతాలు(యూనియన్ టెరిటరీస్))., జమ్ము-కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, రాజస్థాన్,హరియాణ

జోన్2: ఉత్తర్ ప్రదేశ్, బిహార్, ఝార్ఖండ్, ఒడిశా

జోన్3: గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్

జోన్4: పశ్చిమ బెంగాల్, సిక్కిం, అస్సాం-మేఘాలయ, మణిపూర్, త్రిపుర, నాగాలాండ్

జోన్5: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ

సొంత రాష్ట్రంలోకన్నా ఇతర చోట్లే పనిచేయాలి: దీనిపై సిబ్బంది శాఖ అధికారి ఒకరు మాట్లాడుతూ 'అధికార యంత్రాంగంలో జాతీయ సమైక్యత ఉండేందుకు ఈ విధానం రూపొందిస్తున్నాం. అధికారులు తమ సొంత రాష్ట్రాల్లో కాకుండా ఇతర రాష్ట్రాల్లో పనిచేయాలి. ఉదాహరణకు బిహార్‌కు చెందిన వ్యక్తి ఈశాన్య, దక్షిణాది రాష్ట్రాల్లో పని చేయాల్సి ఉంటుంది. అఖిల భారత సర్వీసులు అంటే అంతేగదా మరి! విభిన్నమైన ప్రాంతాలు, కొత్త ప్రాంతాల్లో పని చేసినప్పుడే అఖిల భారత సర్వీసు అధికారులకు అపారమైన అనుభవం వస్తుంది. సొంత రాష్ట్రాల్లో పనిచేసినప్పుడు కొత్త విషయాలపై ప్రయోగాలు చేయడానికి అంతగా అవకాశాలు ఉండవ'ని వివరించారు.

ఒక్క సారి ఐచ్ఛికం ఇస్తే మారదు: అభ్యర్థులు తొలుత తమకు నచ్చిన జోన్లను అవరోహణ క్రమంలో గుర్తించాలి. ఆ తరువాత అందులో రాష్ట్రాల కేడర్‌లను ప్రాధాన్యత క్రమంలో గుర్తించాలి. అంటే అభ్యర్థి మొత్తం 26 రాష్ట్ర కేడర్‌లను ప్రాధాన్యత క్రమంలో గుర్తించే వీలుంది. జోన్‌కు ఇచ్చిన ప్రాధాన్యతల్లో ఎటువంటి మార్పులు చేయడానికి వీల్లేదు. తొలిసారి ఇచ్చిందే చివరి వరకు కొనసాగుతుంది. ఏ అభ్యర్థి అయినా జోన్లు/కేడర్లపై ఎటువంటి ప్రాధాన్యతలు పేర్కొనలేదంటే..ఆయనకు దేనిపైనా ప్రత్యేక ఆసక్తి లేదని గుర్తిస్తారు.

తొలి ప్రాధాన్యం కింద ఒక రాష్ట్రం/కేడర్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. రెండు నుంచి అయిదు ప్రాధాన్యతలను ఆ జోన్‌లోని రాష్ట్రాలను కాకుండా ఇతర జోన్లను ఎంచుకోవాలి. సాధారణంగా అభ్యర్థులు మొదటి ప్రాధాన్యం కింద సొంత రాష్ట్రాన్ని, తరువాత ప్రాధాన్యతలను పొరుగు రాష్ట్రాలకు ఇస్తుంటారు. ఇకపై అలా జరిగే అవకాశం లేదు. అభ్యర్థులకు వారు పేర్కొన్న కేడర్‌ను ఇవ్వలేకపోతే ఇతర కేడర్‌లు కేటాయిస్తారు. మిగిలిన కేడర్‌లను అకారాది అక్షర క్రమంలో రూపొందించి అందులో ఖాళీల ఆధారంగా కేటాయింపు జరుపుతారు. ఆ కేడర్‌లకు ప్రాధాన్యం ఇచ్చిన అభ్యర్థులనూ పరిగణనలోకి తీసుకుంటారు.

ప్రతిభ, ప్రాధాన్యతలు, ఖాళీలు ఆధారంగా అభ్యర్థులకు సొంత రాష్ట్రం కేడర్‌ను కేటాయించే వీలు కూడా ఉంది.

ఆ చిన్నారి నా మేనకోడలే

గాయకుడు తోషి సబ్రి వెల్లడి



దిల్లీ: అతి దీనంగా ఏడుస్తూ...ఎవరో ఓ మహిళ కరకు కంఠంతో గద్దిస్తుంటే...కళ్ల నీళ్లపర్యంతమౌతూ...ఒకటి..రెండు..మూడు అంటూ అంకెలు అప్పచెబుతున్న మూడేళ్ల చిన్నారి వీడియో వైరల్ అయిన తర్వాత...ఆ అమ్మాయి తన మేనకోడలే అంటూ గాయకుడు, సంగీతదర్శకుడు తోషి సబ్రి (హంప్టీ శర్మాకీ దుల్హనియా, రాజ్ చిత్రాల సంగీత దర్శకుడు) వెల్లడించారు. వాస్తవానికి ఆ వీడియోను ఆ పాప తల్లే తీశారనీ...మొండిఘటం అయిన ఆ చిన్నారి చేత చదివించడమే ఓ పెద్ద భగీరథ యత్నమనీ చెప్పారు. గట్టిగా చెప్పకుంటే కనీసం పుస్తకం ముఖం కూడా చూడదనీ... వీడియోలో అంతలా ఏడుస్తూ కనిపించిన ఆ పాప మరుక్షణం పుస్తకాలు అక్కడ పారేసి ఆటలకు వెళ్లిపోతుందన్నారు. నిజానికి ఆ వీడియోను పాప తండ్రి, సోదరుడికి చూపడానికే తల్లి తీశారనీ...కుటుంబ వాట్సాప్ గ్రూప్‌నకు మాత్రమే పరిమితం చేయాలనుకున్నామన్నారు. ఎంత మొండిగా తయారైందో చూపడానికే ఆమె వీడియో తీశారన్నారు. ఆ చిన్నారి అంటే తమకు ఎంతో ప్రేమ అనీ... కేవలం చదివించడం కోసమే వాళ్లమ్మ అలా చేశారన్నారు.

జైలు నుంచి పురోహిత్ విడుదల

ముంబయి, న్యూస్‌టుడే: ఉత్తర మహారాష్ట్రలోని మాలేగావ్ పేలుళ్ల కేసులో తొమ్మిదేళ్లుగా జైలులో ఉన్న లెఫ్టినెంట్ కల్నల్ శ్రీకాంత్ ప్రసాద్ పురోహిత్ బుధవారం విడుదలయ్యారు. ఈ కేసులో నవీ ముంబయిలోని తలోజా జైలులో శిక్ష అనుభవిస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ పురోహిత్‌కు సుప్రీం కోర్టు మంగళవారం బెయిలు మంజూరు చేసింది. మాలేగావ్ పేలుళ్ల కేసు నేపథ్యంలో పురోహిత్‌ను అప్పట్లో విధుల నుంచి సస్పెండ్ చేశారు. సస్పెన్షన్‌కు గురైన సైనిక ఉద్యోగికి బెయిలు లభిస్తే 24 గంటల వ్యవధిలోగా తనశాఖ(యూనిట్)కు వెళ్లి రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే బుధవారం జైలు నుంచి వెలుపలకు రాగానే పురోహిత్ అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న సైనికాధికారులతో కలిసి కొలాబాలోని ఆర్మీ యూనిట్‌కు బయలుదేరి వెళ్లారు.



న్యూయార్క్‌లోని వన్ వరల్డ్ ట్రేడ్ సెంటర్ టవర్‌ను తాకిన మెరుపు

పాక్ మూల్యం చెల్లించుకోవాల్సిందే

- ఉగ్రవాద ఊతంపై అమెరికా ఉద్ఘాటన

వాషింగ్టన్: ఉగ్రవాదులకు ఊతమిస్తుండడాన్ని పాకిస్థాన్ కొనసాగించినట్లయితే దానికి తగ్గ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఇద్దరు అమెరికా మంత్రులు హెచ్చరించారు. నాటో-యేతర కూటమిలో ప్రధాన భాగస్వామి హోదాను పాక్ కోల్పోవాల్సి వస్తుందన్నారు. వందల కోట్ల డాలర్ల మేర సాయాన్ని అమెరికా నుంచి పాకిస్థాన్ పొందుతున్నా, ఉగ్రవాదులకు ఆశ్రయాన్ని మాత్రం కొనసాగిస్తోందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ఒకరోజులోనే ఈ ఇద్దరు నేతలు ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఈసారి పాకిస్థాన్‌పై ట్రంప్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ఖాయమని అమెరికా రక్షణ మంత్రి జేమ్స్ మాటిస్ చెప్పారు. గతంలోనూ ఇలాంటి హెచ్చరికలు చేసినా చర్యలు తీసుకోకపోవడంపై బుధవారం ఆయన్ని విలేకరులు ప్రశ్నించారు. ఏం జరుగుతుందో చూస్తూ ఉండండని ఆయన సమాధానమిచ్చారు. అఫ్గానిస్థాన్, పాకిస్థాన్‌లపై ట్రంప్ వ్యూహాన్ని ఆచరణలో పెట్టడానికి సన్నాహాలు చేయాల్సిందిగా సైనిక బలగాల ఉన్నతాధికారుల్ని ఆయన ఆదేశించారు.

అమెరికా-పాక్ మధ్య విశ్వాసం తగ్గుతోంది... టిల్లర్‌సన్: నాన్ నాటో భాగస్వామిగా పాకిస్థాన్‌కు ఉన్న హోదా ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారిందని అమెరికా విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి రెక్స్ టిల్లర్‌సన్ అన్నారు. పాకిస్థాన్‌లో తాలిబన్, ఇతర సంస్థలు ఎదుగుతున్న తీరును చూస్తే ఒకానొక దశలో అవి పాక్ ప్రభుత్వ సుస్థిరతకే సవాల్‌గా నిలుస్తాయనేది స్పష్టమవుతోందన్నారు.

భారత్‌ను నెపంగా చేసుకుని ఉగ్రవాదులకు పాకిస్థాన్ మద్దతునిస్తోందని అమెరికా జాతీయ భద్రత మండలి అధికార ప్రతినిధి మైఖేల్ అంటన్ చెప్పారు. ఉగ్రవాదులకు పాక్ నేరుగా మద్దతునిస్తోందని ఆరోపించారు.

నీ చెత్త తీసుకుని వెళ్లిపో...

భారత సంతతి వ్యాపారవేత్తపై ట్రంప్ మద్దతుదారుల విద్వేషం

న్యూయార్క్: అమెరికాలో భారత సంతతి వ్యాపారవేత్త రవిన్ గాంధీపై.. దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతుదారులు విద్వేషపూరిత దూషణలకు దిగారు. శ్వేతజాతి ఆధిపత్యవాదులను ట్రంప్ వెనకేసుకురావడాన్ని నిరసిస్తూ.. ఇకపై అధ్యక్షుడి ఆర్థిక ఎజెండాకు మద్దతు ఇవ్వబోనని ఇటీవల రవిన్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఓ మీడియా సంస్థకు వ్యాసం రాశారు. అయితే దీనిపై ట్రంప్ మద్దతుదారులు అక్కసు వెళ్లగక్కారు. ఆన్‌లైన్ వేదికగా రవిన్‌ను అభ్యంతరకర పదజాలంతో దూషించారు. వాటిలో ట్రంప్ మహిళాభిమాని ఒకరు తనకు పంపిన వాయిస్‌మెయిల్‌ను రవిన్ బయటపెట్టారు. "నీ చెత్తనంతా తీసుకొని భారత్‌కు వెళ్లిపో. నిక్కీ హేలీ (ఐరాసలోని అమెరికా రాయబారి, భారత సంతతి మహిళ)ని వెంట తీసుకువెళ్లు. ఇక్కడున్న బౌద్ధ విగ్రహాలనూ కూలుస్తాం. వెళ్లి చెత్తతో నిండిన నీ దేశాన్ని శుభ్రపరుచుకో" అంటూ అసభ్యమైన భాషలో మహిళ చేసిన వ్యాఖ్యలున్న ఆడియో క్లిప్‌ను సామాజిక మాధ్యమాల్లో రవిన్ పోస్ట్ చేశారు. "భద్రత సిబ్బంది ఉన్న ఇంట్లో ఉంటున్న నాకు సమస్యలు ఎదురుకాకపోవచ్చు. సామాన్యులు ఎన్నో బాధలకు గురవుతున్నారు" అని రవిన్ అన్నారు.

భారత సంతతి నేత్ర నిపుణురాలి సేవల నిరాకరణ

లండన్: భారత్, పాకిస్థాన్ మూలాలు ఉన్న నేత్ర నిపుణురాలి సేవలను.. జాతి వివక్షతో నిరాకరించిన ఓ వ్యక్తిపై బ్రిటన్‌లో కోర్టు విచారణ చేపట్టింది. ఎరిక్ గ్రీన్ అనే 58 ఏళ్ల స్కాటిష్ వ్యక్తి మే 24న లానార్క్‌లో ఓ కళ్లజోళ్ల దుకాణానికి వెళ్లాడు. అక్కడ భారత్, పాక్ నేపథ్యమున్న సారాకెర్ ఆయనకు సేవలు అందించాల్సి ఉంది. అయితే గ్రీన్ అందుకు నిరాకరించారు. శ్వేతజాతీయులెవరితోనైనా తనకు సేవలు అందించాలని కోరాడు. మాంచెస్టర్ బాంబు పేలుడు ఘటనతో తనలో సహనం నశించిందన్నాడు. విషయం కోర్టు వరకూ వెళ్లింది. గ్రీన్.. తాను జాతి వివక్ష నేరానికి పాల్పడినట్లు అంగీకరించాడు. అతడి ప్రవర్తనతో కోర్టులోని ప్రతి ఒక్కరూ దిగ్భ్రాంతి చెందారని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

శ్రీవారికి కర్ణపత్రాల కానుక

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారికి బంగారు కర్ణపత్రాలను ఓ భక్తుడు బుధవారం కానుకగా సమర్పించారు. సుప్రభాత సేవలో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్న దాత.. 2 కిలోల స్వర్ణాభరణాలను ఆలయ అధికారులకు అందచేశారు. తన చిరునామా వివరాలను బహిర్గతం చేయవద్దని తితిదే అధికారులకు విన్నవించారు.

'దళితుల భూములకు నీటి వసతి కల్పించాలి'

ఈనాడు, హైదరాబాద్: దళితులకు ప్రభుత్వం పంపిణీ చేసిన భూములకు సెప్టెంబరు నెలాఖరులోగా నీటి వసతి కల్పించాలని ఎస్సీ సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా అధికారులను ఆదేశించారు. ఇప్పటికే మంజూరైన వారికి రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని, పంట ఖర్చులను అందించాలని సూచించారు. ఈ ఏడాదిలో గుర్తించిన 5810 ఎకరాల వ్యవసాయ భూములను లబ్ధిదారులకు అందించాలన్నారు. బుధవారమిక్కడ జిల్లాల సంయుక్త కలెక్టర్లు, ఎస్సీ సహకార అభివృద్ధి సంస్థ ఈడీలతో కలిసి ఆయన దూరదృశ్య సమీక్ష నిర్వహించారు.

ఘనీభవించిన క్షీరంతో పాలగుళికలు

★ పంచదార వలే కాఫీ, టీలో కలుపుకునే సౌలభ్యం



బెర్లిన్: కాఫీ, టీలో కలుపుకోవడానికి ద్రవరూపంలో ఉండే పాలు బదులు పంచదార గుళికలను పోలిన పాల గుళికలను(క్యాప్సూల్స్) శాస్త్రవేత్తలు అభివృద్ధి పరిచారు. వీటి వల్ల స్థలం కలసిరావడంతో పాటు వాడటం కూడా తేలికని చెబుతున్నారు. ఘనీభవించిన పాలను స్ఫటికాకార పొరతో తయారుచేసిన గుళికలో ప్యాక్ చేస్తామని, వేడినీటిలో వేయగానే కరిగిపోతుందని జర్మనీలోని మార్టిన్ లూథర్ విశ్వవిద్యాలయానికి చెందిన మార్తా వెల్‌నెర్ తెలిపారు. బాగా తీపిగా ఉండేలా ఒకరకం, కొంచెం మాత్రమే తీపిగా ఉండేలా మరో రకం పాలను పారిశ్రామిక పద్ధతిలో గుళికలు తయారు చేయనున్నామన్నారు. మనకు కావాల్సిన ఆకృతిలో గుళికలను తయారుచేసి గది ఉష్ణోగ్రత వద్ద నిల్వ ఉంచవచ్చని చెప్పారు. ఇవి మూడువారాలపాటు చెడిపోకుండా ఉంటాయన్నారు. పండ్ల రసాలను కూడా ఇదేపద్ధతిలో తయారుచేయవచ్చని చెప్పారు. పరిశోధన పూర్తి వివరాలు 'కెమికల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.



సంపూర్ణ సూర్యగ్రహణం ఆధారంగా సంగీతం



వాషింగ్టన్: ఆగస్టు 21న అమెరికాలో సంపూర్ణ సూర్యగ్రహణం సందర్భంగా సూర్యచంద్రుల గమనంతో పాటు క్రమంగా అలముకున్న చీకటి ఆధారంగా శాస్త్రవేత్తలు ప్రకృతిసిద్ధమైన(ఒరిజినల్) సంగీతాన్ని సమకూర్చారు. గ్రహణం సమాచారాన్ని ఉపయోగించుకుని పరిశోధకులు సంగీతాన్ని కూర్చడం ఇదే మొదటిసారి. విన్నవెంటనే సరైన స్వరం అని భావించేలా, శాంతికి ప్రతిరూపంగా స్ఫురించేలా జార్జియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన పరిశోధకుల బృందం అనేకసార్లు గ్రహణాన్ని నిశితంగా పరిశీలించింది. భారతీయ మూలాలున్న అవరోష్‌కుమార్ అనే పరిశోధకుడు ఇద్దరు అంధులతో మాట్లాడి గ్రహణం సమయంలో పరిసరాల్లో తమకు వినిపించిన శబ్దాలను గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. సూర్యుడికి, భూమికి మధ్య చంద్రుడు రావడం ప్రారంభమైనప్పుడు; పూర్తిగా సూర్యుణ్ని కమ్మేసినప్పుడు, వైదొలగినప్పుడు పరిసర ప్రాంతాల్లో కలిగిన అనుభవాన్ని(ఉదాహరణకు చీకటి ఏర్పడటం, పక్షుల కిలకిలారావాలు) కళ్లకు కట్టేలా సంగీతాన్ని సమకూర్చారు.

మనిషి చమట నుంచి విద్యుదుత్పాదన


★ సాగే గుణమున్న ప్రత్యేక ఘటాలకు రూపకల్పన



లాస్‌ఏంజెలెస్: మనుషుల స్వేదం నుంచి శక్తిని గ్రహించి విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయగలిగే సాగే గుణమున్న విద్యుత్ ఘటా(సెల్స్)లను శాస్త్రవేత్తలు తయారుచేశారు. శరీరానికి ధరించగలిగే ఎల్ఈడీ, బ్లూటూత్ రేడియో ఉపకరణాలకు వీటితో విద్యుత్తును సరఫరా చేయవచ్చు. ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉన్న ఇలాంటి ఘటాలతో పోలిస్తే ఈ జీవ ఇంధన ఘటాలు పదిరెట్లు ఎక్కువగా సమర్థవంతంగా పనిచేయగలుగుతాయి. అమెరికాలోని శాన్‌డియాగో, కాలిఫోర్నియా విశ్వవిద్యాలయానికి చెందిన ఇంజినీర్లు వీటిని తయారుచేశారు. స్వేదంలో ఉండే లాక్టిక్‌ఆమ్లాన్ని ఆక్సీకరణం చేయడానికి జీవ ఇంధన ఘటాల్లో ఎంజైమ్‌ను ఉపయోగించడంతో ఇది సాధ్యమైంది. ప్రొఫెసరు జోసెఫ్ వాంగ్ నేతృత్వాన జరిపిన పరిశోధన పూర్తి వివరాలు 'ద జర్నల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్'లో ప్రచురితమయ్యాయి.

నీటి పాచి నుంచి జీవ ఇంధనాల ఉత్పత్తి

★ సైనోబ్యాక్టీరియాపై ప్రయోగాలు చేస్తున్న శాస్త్రవేత్తలు



నీటిపాచి(ఆల్గే)లో ఉండే సైనోబ్యాక్టీరియాతో జీవ ఇంధనం తయారుచేసే దిశగా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. వీటి నుంచి ఉత్పత్తి అయ్యే షుగర్(ఇది ఒక రకమైన రసాయనం)తో రసాయనాలు, బయో ఇంధనాలు పారిశ్రామిక పద్ధతిలో తయారుచేయవచ్చని చెబుతున్నారు. ఆల్గేకు చెందిన మూడు రకాల ఏకకణజీవులపై ఓ కంపెనీ పేటెంట్లు కూడా పొందింది. ఈ మూడింటిని కలిపి పెంచితే, అవి స్రవించే షుగర్‌తో జీవ ఇంధనాన్ని తయారుచేస్తారు. సండియా నేషనల్ ల్యాబొరేటరీస్, హీలియోబయో సిస్ ఇంక్ అనే కంపెనీలు ఉమ్మడిగా పారిశ్రామిక పద్ధతిలో వీటిని పెంచితే కలిగే లాభనష్టాలపై అనేక ప్రయోగాలు చేస్తున్నాయి. సాధారణంగా లీటరు జీవద్రవ్యంలో కేవలం ఒక్క గ్రాము షుగర్ ఇచ్చే ఆల్గేలపై ప్రయోగాలు జరిపి నాలుగు నుంచి ఏడు గ్రాములు ఇచ్చేలా కృత్రిమంగా పెంచగలిగినట్లు సాండియాకు చెందిన జీవరసాయన శాస్త్రవేత్త ర్యాన్ డేవిస్ చెప్పారు. గాలిలో ఉండే నైట్రోజన్‌ను స్వీకరించి ఆహారోత్పత్తి చేసుకుంటుంది కాబట్టి, దీన్ని పెంచడానికి ఎరువులు కూడా అవసరం లేదని ఆయన తెలిపారు.

నాలుగోవంతు పరిమాణం తగ్గనున్న చేపలు



టొరంటో: వాతావరణ మార్పుల కారణంగా సముద్రాల ఉష్ణోగ్రతలు పెరుగుతూ పోతే, భవిష్యత్తులో చేపల పరిమాణం 20 నుంచి 30 శాతం తగ్గిపోతుందని ఓ అధ్యయనం హెచ్చరిస్తోంది. కెనడాలోని బ్రిటిష్ కొలంబియా విశ్వవిద్యాలయానికి చెందిన డేనియల్ పాలీ నేతృత్వాన జరిగిన పరిశోధన పైమేరకు వెల్లడిస్తోంది. చేపల పరిమాణం ఎందుకు తగ్గనుందో కూడా శాస్త్రీయంగా వివరించారు. చేపలు తమ శరీర ఉష్ణోగ్రతలను తాముగా నియంత్రించుకోలేవు. నీటి ఉష్ణోగ్రత పెరిగితే వాటిలో జీవక్రియలు కూడా ఊపందుకుంటాయి. వాటి అవయవాలు సరిగ్గా పనిచేయాలంటే మరింత ఆక్సిజన్ అవసరమవుతుంది. చేప శరీరానికి తగినట్లు మొప్పలు ఆక్సిజన్ సరఫరా చేయలేవు. ఫలితంగా చేప పెరగడం ఆగిపోతుంది.

శాకాహారంతో కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది



వాషింగ్టన్: కేవలం శాకాహారం తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయి తగ్గి, హృదయ సంబంధ వ్యాధులు, గుండెపోటు వచ్చే ప్రమాదం తగ్గుతుందని ఓ అధ్యయనం తెలిపింది. పాలు, పెరుగు వంటి జంతుసంబంధ ఆహారం లేని శాకాహారం తీసుకోవడం వల్ల బరువు, కొలెస్ట్రాల్, రక్తపోటు అదుపులో ఉండటం, వంటి సత్ఫలితాలు ఉంటాయని అమెరికాలోని ఫిజీషియన్స్ కమిటీకి చెందిన సుసాన్ లెవిన్ తెలిపారు. ఈ ఆహారం గుండెపోటు, గుండెనొప్పి, అకాల మరణ ప్రమాదాన్ని తగ్గిస్తుందన్నారు. శాకాహారంతో లిపోప్రోటీన్ సాంద్రతల స్థాయి తగ్గి కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుందని పేర్కొన్నారు. కూరగాయలు, పండ్లు, తృణధాన్యాలు, చిక్కుళ్లు, గింజలు ఆహారంగా తీసుకోవడం వల్ల పీచు, సోయా ప్రోటీనులు, కొలెస్ట్రాల్‌ను తగ్గించే మొక్క స్టెరాల్స్ శరీరంలోకి చేరి హృద్రోగ సమస్యలు తగ్గుతాయని తెలిపారు.

చేతులు వణుకుతున్నాయి!



ఈ కారణంతో రోజూ పది శాతం చెక్కులు తిరస్కరణ

ఖాతాదారులకు అపరాధ రుసుం వడ్డింపు ● రాతకు దూరమవుతున్న ఫలితం

రాజధానికి చెందిన రామకృష్ణ తన స్నేహితుడికి అవసరాల నిమిత్తం రూ.10 వేలకు చెక్కు ఇచ్చారు. బ్యాంకు ఖాతాలో రూ.లక్ష వరకూ నిల్వలున్నాయి. కానీ... రెండు రోజుల తర్వాత చెక్కును తిరస్కరించినట్లు సమాచారం వచ్చింది! పైగా ఖాతాలోంచి రూ.200 అపరాధ రుసుం తీసుకున్నారు.

ప్రభుత్వ రంగ బ్యాంకులోని ఓ సీనియర్ ఉద్యోగి... మరోవ్యక్తికి రూ.50 వేలకు చెక్కు ఇచ్చారు. డిపాజిట్ చేస్తే చెల్లలేదు. కారణమేంటని ఆరాతీస్తే.. దానిపై పెట్టిన సంతకం, ఖాతాలోని సంతకం సరి పోలడంలేదని తెలిసింది!

ఈనాడు - హైదరాబాద్

యాంత్రీకరణ, జీవనశైలి ప్రజల సాధారణ అలవాట్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఒకప్పుడు చేతిరాతతో లావాదేవీలు నిర్వహించేవారు. ఇప్పుడు చిన్న దుకాణాల్లోనూ కంప్యూటర్ బిల్లింగ్ నడుస్తోంది. పుస్తకాలస్థానంలో ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు వచ్చాయి. కంప్యూటరీకరణతో ప్రజలు చేతిరాతకు దూరమవుతున్నారు. పెన్ను పట్టుకుని పేపరుపై చేయిపెడితే, చేతులు వణుకుతున్నాయి. అక్షరాలు వంకరబోతున్నాయి. చిన్నపుడు...'నా అక్షరాలు ముత్యాల్లా ఉంటాయ'ని చెప్పుకొన్నవారు ఇప్పుడు తమ రాత దుస్థితి చూసి ఆశ్చర్యపోతున్నారు. చివరకు సంతకమూ మారిపోతోంది. బ్యాంకు ఖాతా తెరిచినప్పటి సంతకానికీ, రెండేళ్ల తర్వాత పెడుతున్న సంతకానికి పోలిక ఉండట్లేదు. ఒకేసారి 2,3 సంతకాలు చేయాల్సి వచ్చినపుడూ ఒక్కోటి ఒక్కోలా ఉంటోంది. వృద్ధుల్లోనేకాదు, పాతికేళ్లలేని యువతరం పరిస్థితీ ఇలాగే ఉంటోంది. సంతకాలు సరిపోలక దేశవ్యాప్తంగా రోజూ 10శాతానికిపైగా చెక్కులు తిరస్కారాణికి గురవుతున్నాయి.

ఎంతో కీలకం...: ఆర్థిక, పరిపాలన లావాదేవీల్లో సంతకం చాలా కీలకం. ఖాతా తెరిచినపుడు ఇచ్చే సంతకాన్ని ఆయా బ్యాంకులు స్కాన్‌చేసి డేటాబేస్‌లో నిక్షిప్తం చేస్తాయి. లావాదేవీ సమయంలో సిబ్బంది సంతకాన్ని సరిచూస్తారు. ఖాతాదారుడు తన మాతృశాఖకు వెళ్లి స్వయంగా లావాదేవీలు జరిపినప్పుడు సంతకంలో తేడా ఉన్నా, తమ ముందు ఖాతాదారుడున్నందున బ్యాంకులు అనుమతిస్తున్నాయి. కానీ, చెక్కుల రూపంలో నిర్వహించే లావాదేవీల్లో మాత్రం చిక్కులు ఎదురవుతున్నాయి. నగదు నిల్వలు లేకపోవడం, తేదీల్లో పొరపాట్లు, చేతిరాతలు దిద్దటం వంటి కారణాలతో 40 శాతానికి పైగా చెక్కులు చెల్లుబాటు కావడంలేదు. సంతకం సరిపోలక పదిశాతం చెక్కులు తిరస్కారానికి గురవుతున్నాయని బ్యాంకర్లు చెబుతున్నారు.

ఎందుకిలా...: సీటీఎస్ విధానం వచ్చాక ఆన్‌లైన్‌లో చెక్కుల మారకం జరుగుతోంది. ఉదాహరణకు గతంలో ఓ వ్యక్తి ఆంధ్రాబ్యాంకు చెక్కును జారీ చేశారనుకుందాం. స్వీకర్త దానిని ఎస్‌బీఐలో వేస్తే... ఎస్‌బీఐ ఆ చెక్కును సదరు బ్యాంకుకు పంపి, నిల్వలు చూసుకుని చెల్లుబాటు చేసేవారు. ఆ సమయంలో చెక్కుపై సంతకాలు, తేదీ, నగదు వివరాల్లో తేడాలుంటే, వాటిని సరిచేసి సంతకం చేస్తే అనుమతించేవారు. ఇందుకు మూడు రోజుల నుంచి పది రోజుల సమయం పట్టేది. ప్రజలకు వేగంగా సేవలందించేందుకు బ్యాంకులు సీటీఎస్ విధానాన్ని తీసుకొచ్చాయి. ప్రతి బ్యాంకు తమ శాఖ నుంచి జారీ అయిన చెక్కులను కేంద్రీకృత కేంద్రం ద్వారా ఆన్‌లైన్లోనే పరిష్కరిస్తోంది. డిపాజిట్ చేసిన చెక్కులను సదరు బ్యాంకు సిబ్బంది ఉదయం, సాయంత్రం వేళల్లో స్కాన్ చేస్తున్నారు. ఈ చిత్రం చెక్కు జారీచేసిన బ్యాంకు కేంద్రీకృత కేంద్రానికి వెళ్తోంది. అక్కడ చెక్కులపై పెట్టిన సంతకాన్ని, ఖాతాలో ఉన్న సంతకంతో పోల్చుతున్నారు. చిన్నపాటి తేడా ఉన్నా తిరస్కరిస్తున్నారు.

ఇద్దరికీ మోత...: చెక్కు చెల్లుబాటు కాకపోతే బ్యాంకులు తమదైన పద్ధతిలో అపరాధ రుసుమును వసూలు చేస్తున్నాయి. నగదు నిల్వలు మినహా ఇతర సాంకేతిక కారణాలైతే రూ.150, సేవా రుసుము తీసుకుంటున్నాయి. చెక్కు ఇచ్చిన వ్యక్తితో పాటు, తీసుకున్న వ్యక్తికీ ఈ మోత తప్పట్లేదు. కొన్ని బ్యాంకులైతే రూ.300 వరకూ వసూలు చేస్తున్నాయి. ఖాతా తెరిచినపుడు ఇచ్చిన సంతకం.. వాటిని మూసివేసినపుడూ సరిపోలాల్సిందే! రెండేళ్ల క్రితం నగరానికి చెందిన రమేష్ ఓ ప్రైవేటు సంస్థలో డీమ్యాట్ ఖాతాను తెరిచారు. ఖాతా తెరిచినపుడు ఇచ్చిన సంతకంతో మూసివేత సమయంలో ఇచ్చిన దరఖాస్తులో సంతకం సరిపోలేదు. దీంతో ఈ ఖాతాను మూసివేసేందుకు నిరాకరిస్తున్నామంటూ సమాచారం వచ్చింది. రెండేళ్లుగా నిర్వహణ ఛార్జీల పేరిట ఫీజు చెల్లిస్తూనే ఉన్నారాయన.

ఎప్పటికప్పుడు మార్చుకోవాలి...: సంతకంలో తేడాలుంటే ఇబ్బంది పడాల్సిన అవసరంలేదు. సంతకంలో మార్పువచ్చినట్లు ఖాతాదారుడు భావిస్తే, ఆ విషయాన్ని బ్యాంకులో తెలియజేయాలి. వారిచ్చే పత్రాల్లో వివరాలను పూరించి, కొత్త సంతకం చేయాలి. ఆధార్, బ్యాంకు పాస్‌పుస్తకం గుర్తింపుపత్రాలను జతచేయాలి. 6రోజుల తర్వాతి నుంచి కొత్తసంతకంతో లావాదేవీలు నిర్వహించుకోవచ్చు.

ప్రభుత్వాన్ని దించేందుకు వ్యూహం!

తమిళనాడులో దినకరన్ వర్గం యత్నం

చెన్నై: అన్నాడీఎంకే వర్గాల విలీనంతో అన్ని సర్దుకుంటాయనుకున్న పార్టీ, ప్రభుత్వానికి కొత్త సమస్యలు తలనొప్పి తెచ్చిపెడుతున్నాయి. ముఖ్యమంత్రిని మార్చాలని టీటీవీ వర్గం ప్రయత్నాలు చేస్తోంది. దీంతో తమిళనాట మరోమారు రాజకీయం వేడెక్కింది. పురట్చి తలైవి అమ్మ పేరవై రాష్ట్ర కార్యదర్శి పదవి నుంచి మంత్రి ఉదయ్‌కుమార్‌ను తప్పించి ఆయన స్థానంలో ఎమ్మెల్యే మారియప్పన్‌ను దినకరన్ తాజాగా నియమించారు. మంత్రి వీరమణి కామరాజ్, ఎమ్మెల్యే రాజన్ చెల్లప్పలను పార్టీ పదవుల నుంచి, మరో మంత్రి విజయభాస్కర్‌ను కరూరు జిల్లా పార్టీ కార్యదర్శి పదవి నుంచి తొలగిస్తున్నట్లు కూడా ప్రకటించారు. విజయభాస్కర్ స్థానంలో ఎమ్మెల్యే వి.సెంథిల్ బాలాజీని నియమించినట్లు దినకరన్ తెలిపారు. ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి, ఉపముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం దృష్టి పెట్టారు. పలువురు మంత్రులతో సమావేశమై వ్యూహరచన చేసినట్లు సమాచారం.

స్పీకర్ ద్వారా బలనిరూపణకు యత్నాలు

దినకరన్ వర్గం ఎమ్మెల్యేలు పుదుచ్చేరిలోని రిసార్ట్‌లో బస చేయడంతో క్యాంపు రాజకీయం మళ్లీ మొదలైంది. స్పీకర్ ధనపాల్‌ను ముఖ్యమంత్రిగా, దిండిగల్ శ్రీనివాస్‌ను ఉపముఖ్యమంత్రిగా చేస్తామని టీటీవీ తన మద్దతుదారులకు ఒక సందేశం పంపారన్న ప్రచారం సాగుతోంది. అలా చేస్తే 28 మంది దళిత వర్గం, దేవర్‌కులానికి చెందిన ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టుకోవచ్చని భావిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న 19 మందికి తోడు మరో 13 మంది తమవైపు చేరుతారని పేర్కొంటూ టీటీవీ దినకరన్, దివాకరన్‌లు కలిసి ఈ పథకం రచించారని ప్రచారం సాగుతోంది. శాసనసభ నియమావళి ప్రకారం 24 మంది ఎమ్మెల్యేలు కోరితే స్పీకర్ బల నిరూపణకు అనుమతించాల్సి ఉన్నందున ఆ మేరకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

శశికళ వ్యవహారాలపై దర్యాప్తు ముమ్మరం

ఈనాడు, బెంగళూరు: ఆదాయాన్ని మించిన ఆస్తుల కేసులో కారాగార శిక్ష అనుభవిస్తున్న శశికళ, సమీప బంధువు ఇళవరశి చెరసాల నుంచి లోపాయికారిగా బయటకు వచ్చి రాజకీయ అనుయాయుల నివాసానికి వెళ్లేవారని వచ్చిన ఆరోపణలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కర్ణాటక అవినీతి నియంత్రణ దళం (అనిద) ఉన్నతాధికారులు ప్రకటించారు. సంబంధిత అధికారులు ఈ అంశంపై బుధవారం బెంగళూరులో స్పందిస్తూ ఈ విషయం వెల్లడించారు. శశికళ, ఇళవరసి చెరసాలకు సమీపంలోని తమిళనాడు పట్టణం హోసూరులో ఉంటున్న ఓ ప్రజాప్రతినిధి ఇంటికి వెళ్లి వచ్చేవారని ప్రస్తుత రహదారి సురక్షిత విభాగం డి.ఐ.జి. (పూర్వపు కారాగార శాఖాధికారిణి) రూపా అనిదకు సమర్పించిన నివేదికలో పేర్కొన్నారని సమాచారం. ఆ ప్రజా ప్రతినిధి నివాసంలో తమిళనాడు ప్రభుత్వ పరిపాలన తీరుతెన్నుల్ని సమీక్షించి విధాన నిర్ణయాలు, రాజకీయాలపై చెన్నై నుంచి వచ్చిన రాజకీయ నేతలతో మంతనాలు సాగించేవారనీ అనుమానిస్తున్నారు.

సుప్రీం కోర్టు తిరస్కృతి

దిల్లీ: కారాగార శిక్షననుభవిస్తున్న శశికళ తన కేసులో ఇదివరకు ఇచ్చిన తీర్పును సమీక్షించాలంటూ చేసుకున్న అభ్యర్థనను సుప్రీంకోర్టు బుధవారం తోసిపుచ్చింది.

వడివడిగా పునాదులు

- రెండుపడక గదుల ఇళ్ల నిర్మాణంలో పెరిగిన వేగం
- 94 వేల గృహాలకు టెండర్లు పూర్తి
- నిర్మాణంలో 50 వేలకు పైగా..

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన రెండు పడక గదుల ఇళ్లకు వడివడిగా పునాదులు పడుతున్నాయి. గత మూడునెలలుగా వేగం పెరిగింది. తెలంగాణ వ్యాప్తంగా 2.67 లక్షల గృహాలను మంజూరు చేయగా వీటిలో 94 వేల గృహాలకు టెండర్లు పూర్తయ్యాయి. కొన్ని జిల్లాల్లో పనులు వేగంగా నడుస్తుంటే, మరికొన్ని జిల్లాల్లో ఇప్పుడే పనులు మొదలవుతున్నాయి. మరోవైపు గద్వాల, నాగర్ కర్నూల్ జిల్లాల్లో నేటికీ టెండర్లు ఖరారు కాకపోవడం గమనార్హం. నాలుగు నెలల క్రితం 70 వేల గృహాలకు మాత్రమే టెండర్లు పిలవగలిగారు. ఇప్పుడు ఆ సంఖ్య 1.4 లక్షలకు చేరడం గమనార్హం. జీహెచ్ఎంసీ పరిధిలోనూ లక్ష గృహాలకుగాను 51 వేల ఇళ్లకు టెండర్లు ఖరారయ్యాయి.

ప్రగతి లేని జిల్లాలు : జగిత్యాల, వనపర్తి, నాగర్‌కర్నూలు, నిర్మల్, నల్గొండ, రంగారెడ్డి, కరీంనగర్, వికారాబాద్, కుమురంభీమ్, మంచిర్యాల, జోగులాంబ గద్వాల

ప్రగతిలో పరవాలేనివి : జనగాం, మెదక్, మహబూబాబాద్, సంగారెడ్డి, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, యాదాద్రి భువనగిరి, పెద్దపల్లి, వరంగల్ రూరల్

వేగంగా పనులు : సిద్దిపేట, మేడ్చల్, జీహెచ్ఎంసీ, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, ఖమ్మం, నిజామాబాద్, వరంగల్ అర్బన్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్

ఇదీ ప్రగతి..

ప్రభుత్వం కేటాయించినవి:	2.67 లక్షల గృహాలు
ప్రభుత్వం అనుమతించినవి:	1.76 లక్షల గృహాలు
టెండర్లు పిలిచినవి:	1.40 లక్షల గృహాలు
టెండర్లు ఖరారైనవి:	94,939 గృహాలు
పునాదులు పడినవి:	50,046 గృహాలు
నిర్మాణం పూర్తయినవి:	2092 గృహాలు
ఇప్పటివరకు చేసిన ఖర్చు:	459.35 కోట్లు

2.07 లక్షల డిగ్రీ సీట్లు ఖాళీ

- చేరిన వారు 1,85,877 మందే

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో డిగ్రీ కళాశాలల్లో భర్తీ అయిన సీట్ల కంటే మిగిలినవే అధికంగా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 4,10,267 సీట్లుండగా చివరి విడత ప్రవేశాలు ముగిసే నాటికి 1,85,877 మంది విద్యార్థులు కళాశాలల్లోచేరారు. అంటే 2,07,423 సీట్లు ఖాళీగా ఉన్నాయి. కాకతీయ, మహాత్మాగాంధీ, పాలమూరు విశ్వవిద్యాలయాల పరిధిలో భర్తీ అయిన సీట్ల కంటే మిగిలిపోయినవే ఎక్కువగా ఉన్నాయి. కొన్ని కళాశాలలు తెలంగాణ ఆన్‌లైన్ సర్వీసెస్(దోస్త్) ద్వారా కాకుండా న్యాయస్థానానికి వెళ్లి సొంతగా ప్రవేశాలు జరుపుకున్నాయి. వాటిల్లో సుమారు 4,500 సీట్లున్నాయి. వాటిని కలుపుకున్నా ఖాళీగా ఉన్న సీట్లే ఎక్కువగా ఉన్నాయి. అత్యధికంగా బీఎస్‌సీ కోర్సుల్లో 83,572 మంది ప్రవేశాలు పొందారు. ప్రభుత్వ కళాశాలల్లో 21,396 సీట్లు భర్తీకాగా 25,510 సీట్లు మిగిలాయి. చివరి విడతలో సీజీజీ చేసిన పొరపాటు కారణంగా కొందరికి సీట్లు రాలేదు. వీరి విషయంలో ఏం చేయాలన్న అంశంపై గురువారం నిర్ణయం తీసుకోనున్నారు. వారికి ఈనెల 25 నుంచి 28 వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవడానికి అవకాశం ఇవ్వొచ్చని తెలుస్తోంది.

వర్సిటీల వారీగా భర్తీ అయిన సీట్లు.. .ఖాళీగా ఉన్నవి

వర్సిటీ	భర్తీ	మిగిలినవి
ఓయూ	69,894	65,130
కేయూ	49430	72596
మహాత్మా	16,451	19,234
పాలమూరు	13,713	16,001
శాతవాహన	22,661	22,606
తెలంగాణ	13,728	11,856
మొత్తం	1,85,877	2,07,423

కోర్సుల వారీగా ..

కోర్సు	భర్తీ	మిగిలినవి
బీఏ	23,750	40,963
బీఎస్‌సీ	83,572	87,400
బీకాం	76,312	73,890
బీబీఏ	1,638	3,936
బీబీఎం	287	589
బీసీఏ	317	485
బీఎస్‌డబ్ల్యూ	34	82
బి.ఒకేషనల్	17	78
మొత్తం	1,85,877	2,07,423



ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందచేసి అభినందిస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, కమిషనర్ జగన్‌మోహన్, ఉద్యాన శాఖ కమిషనర్ వెంకట్రామరెడ్డి తదితరులు

సీఎంకు వ్యవసాయ మంత్రి అభినందనలు

ఈనాడు, హైదరాబాద్: 'భారత ఆహార, వ్యవసాయ మండలి'(ఐసీఎఫ్ఏ) ఇచ్చే వ్యవసాయ నాయకత్వ ఉత్తమ పురస్కారానికి ఎంపికైనందుకు సీఎం కేసీఆర్‌కు వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆ శాఖ కార్యదర్శి పార్థసారథి, వ్యవసాయ, ఉద్యాన కమిషనర్లు డాక్టర్ ఎం.జగన్మోహన్, వెంకట్రాంరెడ్డిలు బుధవారం అభినందనలు తెలిపారు. వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులతో మంత్రి పోచారం ప్రగతిభవన్‌కు వచ్చి సీఎంకు పూలమాల వేసి సత్కరించారు. పంటల సాగుపై ఈ సందర్భంగా సీఎం అధికారులతో చర్చించారు.

భద్రతలో ప్రైవేట్ సెక్యూరిటీల పాత్ర అభినందనీయం: డీజీపీ

ఈనాడు, హైదరాబాద్: ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలు తెలంగాణ రాష్ట్ర భద్రతలో తమవంతు సేవలను అందిస్తున్నాయని తెలంగాణ డీజీపీ అనురాగ్‌శర్మ పేర్కొన్నారు. ఆ ఏజెన్సీల సేవలు అభినందనీయమని అన్నారు. ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ అభ్యర్థులకు శిక్షణాకాలం పూర్తయిన నేపథ్యంలో పోలీసు ప్రధాన కార్యాలయంలో బుధవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. పోలీసుశాఖకు ఆ ఏజెన్సీల సేవలు ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు. హోంశాఖ ముఖ్యకార్యదర్శి రాజీవ్ మాట్లాడుతూ.. ప్రైవేట్ సెక్యూరిటీ ఏజన్సీలు ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులను కలిగిఉండి రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టుగా వారు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు.

విదేశీ ఉద్యోగాలంటూ నిరుద్యోగులకు టోకరా

- రూ.4 కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేసిన సంస్థ
- పరారీలో నిర్వాహకుడు

సనత్‌నగర్, న్యూస్‌టుడే: విదేశాల్లో ఉద్యోగాలిప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి భారీగా దండుకున్న ఓ కన్సల్టెన్సీ బోర్డు తిప్పేసింది. దాదాపు 250 మంది నుంచి రూ.4 కోట్ల వరకు వసూలు చేసిన సంస్థ నిర్వాహకుడు పరారయ్యాడు. సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి, బాధితులు ఈ మేరకు వివరాలు వెల్లడించారు. సనత్‌నగర్‌లోని జెక్ కాలనీలో ఈ ఏడాది మార్చిలో 'సన్‌రైజ్ టూర్స్ అండ్ కన్సల్టెన్సీ' పేరిట శశిధర్‌రెడ్డి అనే వ్యక్తి ఓ కార్యాలయాన్ని తెరిచాడు. తన స్వగ్రామం కడప జిల్లా వల్లూరు మండలం యు.గణేష్‌పురం అని, ఎల్లారెడ్డిగూడలో ఉంటున్నట్లు తెలిపాడు. విదేశాల్లో ఉద్యోగాలున్నాయంటూ గత నెలలో ప్రకటనలిచ్చాడు. జార్జియా, కెనడా తదితర దేశాల్లో పనిచేయడానికి మనుషులు కావాలని, ఎలాంటి నైపుణ్యం లేనివారూ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నాడు. నెలకు రూ.1.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వేతనం చెల్లిస్తారని ఆశచూపాడు. దీంతో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు అతన్ని ఆశ్రయించారు. కొందరికి తనపేరు శశిధర్‌రెడ్డిగా, మరికొందరికి శ్రీనివాస్‌గా, ఇంకొందరికి సంతోష్‌గా చెప్పుకున్నాడు. దరఖాస్తుతో పాటు రూ.5 వేలు, తరవాత ఒక్కొక్కరి నుంచి రూ.50 వేలు మొదలు రూ.1.50 లక్షల వరకు వసూలు చేశాడు. కొందరికి జార్జియా, కెనడాల టూరిస్ట్ వీసాలను చేతిలో పెట్టాడు. వాటితో బయలుదేరిన నిరుద్యోగులకు దిల్లీ విమానాశ్రయంలో ఎదురుదెబ్బ తగిలింది. దీంతో బాధితులు జెక్‌కాలనీలోని కార్యాలయానికి చేరుకోగా తాళం కనిపించింది. శశిధర్‌రెడ్డి చరవాణి ఆపేసి ఉండడంతో వారు సనత్‌నగర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు.



శశిధర్‌రెడ్డి

ఆ రెండు రాష్ట్రాల్లో అప్రకటిత బంద్

- అత్యాచారం కేసులో ఆధ్యాత్మిక గురువు రామ్‌రహీమ్‌పై రేపు తీర్పు
- హరియాణా, పంజాబ్, చండీగఢ్‌లో అసాధారణ భద్రత ఏర్పాట్లు

చండీగఢ్/ దిల్లీ: అతనో వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు.. పంజాబ్, హరియాణాల్లో లక్షలాది భక్తులున్న అతను హత్య, అత్యాచారం కేసుల్లో నిందితుడు. ఇద్దరు మహిళాభక్తులపై లైంగికదాడి కేసులో అతనిపై ఈనెల 25న పంచకులలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించనుంది. అతనే డేరా సచ్చా సౌదా అధిపతి బాబా గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్. తీర్పు నేపథ్యంలో పంజాబ్, హరియాణా, చండీగఢ్ (కేంద్రపాలిత) ప్రభుత్వాలు కనీవినీ ఎరుగనిరీతిలో భద్రత ఏర్పాట్లు చేశాయి. భారీఎత్తున అల్లర్లు చెలరేగే అవకాశాలుండటంతో రెండు రాష్ట్రాల పోలీసు, భద్రత సిబ్బంది విస్తృతంగా మొహరించారు. అదనంగా కేంద్రం 110 కంపెనీల బలగాలను పంపించింది. మరో 115 కంపెనీలను పంపించాలని హరియాణా ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. అవసరమైతే కర్ఫ్యూ విధించడానికి సిద్ధం చేస్తున్నారు. పరిస్థితులను బట్టి సైన్యం సహకారం తీసుకుంటామని హరియాణా ప్రకటించింది. ఈనెల 25న రామ్ రహీమ్‌ను వ్యక్తిగతంగా హాజరు కావాలని సీబీఐ కోర్టు ఆదేశించడంతో.. అతనికి సంఘీభావం ప్రదర్శించేందుకు ఇప్పటికే లక్ష మంది అనుచరులు పంచకులలోని తమ ఆధ్యాత్మిక కేంద్రానికి చేరుకున్నారు. ఈ సంఖ్య భారీగా పెరగవచ్చని అంచనా. జిల్లాలో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. పంచకులకు రాకపోకలు సాగించే అన్ని బస్సులను రద్దు చేశాయి.

సాధ్వీలపై అత్యాచారం!: 2002లో ఇద్దరు సాధ్వీల (మహిళా భక్తులు)పై అత్యాచారానికి పాల్పడినట్లు రామ్ రహీమ్ సింగ్‌పై కేసు నమోదైంది. 2007లో అభియోగాలు నమోదు కాగా.. బాధిత మహిళల వాంగ్మూలాన్ని సీబీఐ నమోదు చేసిన అనంతరం విచారణ ప్రారంభమైంది. ఒక జర్నలిస్టు హత్యకేసులో కూడా నిందితుడు. అత్యాచారం కేసుకు రామ్ రహీమ్ వ్యక్తిగతంగా హాజరు కాకుండా వీడియో కాన్ఫరెన్సును కోరవచ్చని సమాచారం.

ఖతార్ పంపిస్తామని మోసం

ఈనాడు, హైదరాబాద్: ఖతార్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి తమను ఒక ఏజెంటు మోసం చేశారని, దీనిపై సిరిసిల్ల జిల్లా కోనరావుపేట పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరుగురు బాధితులు డీజీపీ అనురాగ్‌శర్మకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కోనరావుపేట మండలం కనగర్తికి చెందిన వంగపల్లి భూపతి, కిషన్, రావులపల్లి మల్లారెడ్డి, పోగుల మహేష్, గంభీరావుపేట మండలం సముద్రలింగపూర్‌కు చెందిన చిలువేలి నవీన్, బెజ్జంకి మండలం కల్లెపల్లికి చెందిన గొల్లపల్లి పవన్‌లు గల్ఫ్ తెలంగాణ సంక్షేమ, సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు బసంత్‌రెడ్డితో కలిసి బుధవారం డీజీపీకి వినతిపత్రం అందజేశారు. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని నర్సింహులపల్లెకు చెందిన ఒక ఏజెంటు ఖతార్‌కు పంపిస్తామని చెబితే రూ.75వేల చొప్పున చెల్లించామని తెలిపారు. తమ వద్ద పాస్‌పోర్టులు, ఇతర పత్రాలు తీసుకొని ఏజెంటు పరారయ్యారని చెప్పారు. ఏజెంటు కోసం వెతికి చివరికి ఈ నెల 19న కోనరావుపేట పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఏజెంటును పట్టుకొని తమ డబ్బులు తిరిగి ఇప్పించాలని కోరారు.

కృష్ణా, గోదావరి బేసిన్లలో తగ్గిన వరద

ఈనాడు, హైదరాబాద్: గోదావరిలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద ప్రవాహం తగ్గింది. కృష్ణా బేసిన్‌లో నామమాత్రంగానే ఉంది. ఎగువన ఆలమట్టిలోకి కేవలం 513 క్యూసెక్కులే ఉంది. శ్రీరాంసాగర్‌లోకి 44వేల క్యూసెక్కుల ప్రవాహం ఉంది. కృష్ణా, గోదావరి బేసిన్లలోని వివిధ జలాశయాల్లో బుధవారం ఉదయానికి నీటి ప్రవాహ వివరాలు..

ప్రాజెక్టు	నీటిసామర్థ్యం నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	వస్తున్న వరద (క్యూసెక్కుల్లో)	వదులుతున్న నీరు (క్యూసెక్కుల్లో)
ఆలమట్టి	129.72	121.40	513	513
నారాయణపూర్	37.64	34.21	0	230
జూరాల	9.66	6.17	2040	2214
తుంగభద్ర	100.86	54.57	10336	1101
శ్రీశైలం	215.81	21.26	1908	42
నాగార్జునసాగర్	312.05	115.62	608	608
పులిచింతల	45.77	3.71	0	0
సింగూరు	29.91	18.73	8331	345
నిజాంసాగర్	17.80	2.11	1215	67
శ్రీరాంసాగర్	90.31	26.3	44000	587
దిగువమానేరు	24.07	7.31	0	129
కడెం	7.60	7.12	1380	945
ఎల్లంపల్లి	20.18	11.80	2022	660



భారత్‌కు ఎదురుందా?

శ్రీలంకతో రెండో వన్డే నేడు

అలవోక విజయాలు. అద్భుత ఫామ్‌లో ఆటగాళ్లు. ఎవరొచ్చినా దంచేస్తున్నారు. ఎవరిని తుది జట్టులో పెట్టుకోవాలో తెలియని తీయని బాధ టీమ్‌మేనేజ్‌మెంట్‌ది. ప్రత్యర్థి ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోతోంది. అన్నీ సానుకూలతలే. ఈ నేపథ్యంలో భారత జట్టు మరో సమరానికి సన్నద్ధమైంది. ఆత్మవిశ్వాసం సన్నగిల్లిన ఆతిథ్య శ్రీలంకతో రెండో వన్డే నేడే. మరి నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడుతున్న భారత్‌కు లంక ఈసారైనా సవాలు విసరగలుగుతుందా ? సిరీస్‌ను ఆసక్తికరంగా మారుస్తుందా అన్నది చూడాలి.

పల్లెకెలె

తిరుగులేని ఫామ్‌లో ఉన్న టీమ్ ఇండియా గురువారం జరిగే రెండో వన్డేలో శ్రీలంకను ఢీకొంటుంది. టెస్టు సిరీస్‌ను 3-0తో కోల్పోయి... అదే పేలవ ప్రదర్శనను తొలి వన్డేలోనూ కొనసాగించిన ఆతిథ్య శ్రీలంకకు భారత్‌ను అడ్డుకోవడం కష్టమే. లంకేమో సమస్యల వలయంలో ఉంటే భారతేమో ఇష్టపడే ఇబ్బందుల్లో ఉంది. తుది జట్టు నుంచి ఎవరిని తీయాలన్నా భారత్‌కు సమస్యగానే ఉంది. కనీసం ఊహించడం కూడా కష్టంగానే ఉంది. టెస్టు సిరీస్ ఫామ్‌నే కొనసాగించిన ధావన్.. తొలి వన్డేలో అజేయంగా 132 చేసి అత్యుత్తమ ఫామ్‌లో ఉన్నాడు. కోహ్లి ఎప్పటిలాగే ఛేదనలో తనదైన శైలిలో అదరగొట్టాడు. 82 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ప్రయోగాలు చేయాలనుకుంటే తప్ప తుది జట్టులో మార్పులు చేసే అవసరం భారత్‌కు కనిపించట్లేదు. ఐతే సిరీస్‌లో ఒక్క మ్యాచే అయినందున ప్రయోగాల జోలికి పోకపోవచ్చు. చాహల్, అక్షర్ పటేల్ స్పిన్ భాగస్వామ్యం కొనసాగనుంది. కుల్‌దీప్, అజింక్య రహానె, మనీష్ పాండేలకు నిరీక్షణ తప్పదు. ఐతే బ్యాటింగ్ స్థానాల్లో మార్పులు జరిగే అవకాశాలను కొట్టిపారేయలేం. కేఎల్ రాహుల్, కేదార్ జాదవ్‌లకు మరింత బ్యాటింగ్ సమయం ఇచ్చేందుకు కెప్టెన్ కోహ్లి తన బ్యాటింగ్ స్థానాన్ని మార్చుకోవచ్చని భావిస్తున్నారు. ఈ మ్యాచ్‌లో భారతే నిస్సందేహంగా ఫేవరెట్. కానీ బలహీన శ్రీలంకపై చెలరేగడం.. 2019 ప్రపంచకప్‌కు సిద్ధమయ్యే క్రమంలో భారత్‌కు ఎంత మేర ఉపయోగపడుతుందన్నదే ప్రశ్న.

శ్రీలంక.. పుంజుకోగలదా?: వరుస ఓటములతో తీవ్ర ఒత్తిడిలో ఉన్న శ్రీలంకకు పుంజుకోవడం అంత తేలిక కాదు. ఫామ్ లేమి, సన్నగిల్లిన ఆత్మవిశ్వాసం, అభిమానుల నుంచి నిరసనలు... ఇలా ఆ జట్టుకు అన్నీ సమస్యలే. ఇవి చాలదన్నట్లు జట్టులో విభేదాలు. టీమ్ మేనేజర్ అసంక గురుసిన్హా జోక్యం ఎక్కువైందని కోచ్ నిక్ పొటాస్‌తో పాటు జట్టంతా భావిస్తోందట. ఈ సమస్యల నుంచి ఆ జట్టు ఎలా బయటపడుతుందో చూడాలి. లంక సెలక్షన్ విధానంపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎటాకింగ్ బ్యాట్స్‌మన్ దినేశ్ చండిమాల్‌ను తొలి వన్డేకు తుది జట్టు నుంచి తప్పించడం, సాధారణంగా ఓపెనర్‌గా వచ్చే కెప్టెన్ తరంగ.. చండిమాల్ ఆడే నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు రావడంతో లంక డ్రెస్సింగ్‌రూమ్‌లో అంతా సవ్యంగా లేదని.. కెప్టెన్, కోచ్‌పై ఎవరో (టీమ్ మేనేజర్ గురుసిన్హా) పెత్తనం చేస్తున్నారన్న చర్చ మొదలైంది. తొలి వన్డే అనంతరం విలేకర్ల సమావేశంలో కోచ్ పొటాస్ బహిరంగంగానే చండిమాల్‌ను తప్పించడాన్ని ప్రశ్నించాడు. ఈ సంగతులెలా ఉన్నా మ్యాచ్ మ్యాచ్‌కూ శ్రీలంక ఆటతీరు తీసికట్టుగా మారుతోందన్నది వాస్తవం. టీమ్ బస్సును అడ్డుకోవడం ద్వారా లంక అభిమానులు కూడా తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ వైఫల్యం ఇలాగే కొనసాగితే లంక 2019 ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించలేకపోయే ప్రమాదం ఉంది. వెస్టిండీస్ తమను తోసిరాజని ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించకుండా ఉండాలంటే ఈ సిరీస్‌లో లంక కనీసం రెండు వన్డేల్లో నెగ్గాలి. సెప్టెంబరు 30 నాటికి ఏడు అత్యుత్తమ ర్యాంకు జట్లు ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధిస్తాయి. ర్యాంకుతో సంబంధం లేకుండా ఆతిథ్య జట్టు హోదాలో ఇంగ్లాండ్ ప్రపంచకప్‌లో పోటీపడుతుంది..ర్యాంకింగ్స్‌లో శ్రీలంక ప్రస్తుతం ఎనిమిదో స్థానంలో ఉండగా.. విండీస్ తొమ్మిదో స్థానంలో ఉంది. విజయావకాశాలు ఏమాత్రం మెరుగుపడాలన్నా లంక మరింత నిలడకగా, బాధ్యతాయుతంగా ఆడాల్సిన అవసరముంది. సాధారణంగా జట్టు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పుడు మెరుగైన ప్రదర్శనతో సీనియర్ ఆటగాళ్లు దారి చూపిస్తారని ఎవరైనా భావిస్తారు. ఐతే ఇప్పుడు మాత్రం కుశాల్ మెండిస్, డిక్వెలా, గుణతిలక వంటి కుర్రాళ్లే లంకను గట్టెక్కించే సత్తా ఉన్న వారిలా కనిపిస్తున్నారు.


ప్రాక్టీస్‌లో లంక జట్టు సరదాగా..

పిచ్.. వాతావరణం: సాధారణంగా ఫ్లడ్‌లైట్ల వెలుతురులో పిచ్ సీమ్ బౌలింగ్‌కు సహకరిస్తుంది. అలాగని స్పిన్నర్లు ప్రభావం చూపలేరని కాదు. వర్షం వల్ల ఆటకు అంతరాయం కలిగే అవకాశాన్ని కొట్టిపారేయలేం.

బీసీసీఐ పెద్దలకు సుప్రీం నోటీసులు

దిల్లీ: బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా, కార్యదర్శి అమితాబ్ చౌదరీలకు సుప్రీం కోర్టు షోకాజ్ నోటీసులిచ్చింది. బీసీసీఐలో పాలనా సంస్కరణలకు సంబంధించి లోధా కమిటీ సిఫారసులను అమలు చేయకపోవడంపై వీరి నుంచి కోర్టు వివరణ కోరనుంది. బీసీసీఐ కోశాధికారి అనిరుధ్ చౌదరికి కూడా నోటీసులు జారీ చేసింది. వీరంతా సెప్టెంబర్ 19లోపు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలి. లోధా కమిటీ సిఫారసుల అమలుకు బీసీసీఐ ఆఫీస్ బేరర్లు అడ్డం పడుతున్నారని, వారిపై వేటు వేయాలంటూ వినోద్ రాయ్, డయానా ఎడుల్జీలతో కూడిన బోర్డు పాలకుల కమిటీ సర్వోన్నత న్యాయస్థానికి నివేదించిన సంగతి సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం బీసీసీఐ పెద్దలకు నోటీసులు జారీ చేసింది.



వన్డే కెప్టెన్సీకి ఏబీ వీడ్కోలు

కేప్‌టౌన్: ఏబీ డివిలియర్స్ దక్షిణాఫ్రికా వన్డే జట్టు నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. టెస్టుల్లో, టీ20ల్లో దక్షిణాఫ్రికా జట్టుకు సారథిగా ఉంటున్న డుప్లెసిస్‌కే వన్డే పగ్గాలు కూడా అప్పగిస్తే బాగుంటుందని అతను స్వయంగా తమ దేశ క్రికెట్ బోర్డుకు విన్నవించడం విశేషం. వన్డే జట్టు కెప్టెన్సీ వదిలేస్తున్న సమయంలోనే తాను టెస్టుల్లోకి పునరామగనం చేయబోతున్నట్లు కూడా డివిలియర్స్ వెల్లడించడం విశేషం. మూడు ఫార్మాట్లలో ఆడటం వల్ల ఒత్తిడి ఎక్కువవుతోందని భావించిన ఏబీ.. 2019 వన్డే ప్రపంచకప్‌ను కూడా దృష్టిలో ఉంచుకుని గత ఏడాది జనవరి నుంచి టెస్టు జట్టుకు దూరంగా ఉంటున్నాడు. రెండు నెలల కిందట డివిలియర్స్ నాయకత్వంలోని దక్షిణాఫ్రికా జట్టు ఛాంపియన్స్ ట్రోఫీలో పేలవ ప్రదర్శన చేసింది. గ్రూప్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించింది. మరోవైపు టెస్టుల్లో డుప్లెసిస్ నాయకత్వంలో ఆ జట్టు నిలకడగా సత్తా చాటుతోంది. ఈ నేపథ్యంలోనే తనంతట తానుగా వన్డే పగ్గాలు వదిలేసి, డుప్లెసిస్‌కే ఆ బాధ్యతలూ అప్పగించాలని బోర్డును కోరాడు డివిలియర్స్.

ఐపీఎల్ విలువ రూ.34వేల కోట్లు

ముంబయి: ఐపీఎల్ బ్రాండ్ విలువ ఏడాదికేడాది పెరుగుతూనే ఉంది. పదో సీజన్‌లో ప్రేక్షకుల సంఖ్య పెరగడం, ఎలాంటి వివాదాలు లేకుండా ముగియడంతో బ్రాండ్ విలువ దాదాపు రూ.34 వేల కోట్లకు చేరింది. ప్రపంచ మూల్యాంకన కార్పొరేట్ ఫైనాన్స్ సలహా సంస్థ డఫ్ అండ్ ఫెల్ప్స్ ఈ మేరకు ఐపీఎల్ విలువను లెక్కకట్టింది. నిరుడు ఈ విలువ రూ.26వేల కోట్లుగా పేర్కొంది. జట్ల బ్రాండ్ విలువలు కూడా పెరిగాయి. రూ.678 కోట్లతో ముంబయి ఇండియన్స్ జట్టు మొదటి స్థానంలో ఉండగా, రూ.634 కోట్లతో కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు రెండో స్థానంలో నిలిచింది. మూడో స్థానంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు (రూ.563 కోట్లు) ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఐపీఎల్ మ్యాచ్‌లు చూసేవాళ్ల సంఖ్య 45 శాతానికి పెరగడం, ప్రకటనలు, స్పాన్సర్‌షిప్, బ్రాడ్‌కాస్టింగ్ వల్ల బ్రాండ్ విలువ పెరిగిందని నివేదిక తెలిపింది.

ఛాంపియన్స్

తొలి సెట్ ప్రత్యర్థి సొంతమైంది. హోరాహోరీగా సాగిన రెండో సెట్‌ను అతి కష్టం మీద గెలుచుకున్నాడు. నిర్ణయాత్మక మూడో సెట్లో 12-18తో వెనుకబడ్డాడు. ప్రత్యర్థి విజయం లాంఛనం లాగే కనిపించింది. ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో తెలుగుతేజం సాయి ప్రణీత్ పోరాటానికి తెరపడ్డట్లే కనిపించింది. కానీ ఈ దశలో ప్రణీత్ అసాధారణంగా పుంజుకున్నాడు. తీవ్ర ఒత్తిడిలో గొప్పగా పోరాడి ప్రత్యర్థిని మట్టికరిపించాడు. అద్భుత విజయంతో ప్రిక్వార్టర్స్‌లోకి దూసుకెళ్లాడు. కిదాంబి శ్రీకాంత్, సైనా నెహ్వాల్ సైతం రెండో రౌండ్లో విజయాలతో భారత అభిమానుల్లో సంతోషం నింపారు.


సాయిప్రణీత్

ప్రణీత్ అదరహో

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్

- ఓటమి కోరల్లోంచి ప్రిక్వార్టర్స్‌కు
- శ్రీకాంత్, సైనా, అజయ్ ముందుకు


శ్రీకాంత్

గ్లాస్గో

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ జోరు కొనసాగుతోంది. ఇప్పటికే పి.వి.సింధు ప్రిక్వార్టర్స్‌లో అడుగుపెట్టగా.. తాజాగా ఇంకో నలుగురు ఆ దశకు చేరుకున్నారు. బుధవారం కిదాంబి శ్రీకాంత్, సాయిప్రణీత్, అజయ్ జయరాం, సైనా నెహ్వాల్ రెండో రౌండు మ్యాచ్‌ల్లో విజయాలు సాధించారు. ఈ నలుగురి మ్యాచ్‌ల్లో అత్యంత ఉత్కంఠ రేకెత్తించింది, ఉత్రూతలూగించింది సాయిప్రణీత్ పోరే. ఓటమి ఖాయమనుకున్న మ్యాచ్‌లో అతను అద్భుత పోరాటంతో విజయం సాధించాడు. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్లో 15వ సీడ్ ప్రణీత్ 14-21, 21-18, 21-19తో ఆంటోనీ జింటింగ్ (పోలెండ్)పై గెలిచాడు. పూర్తిగా ప్రత్యర్థి ఆధిపత్యం సాగిన తొలి గేమ్‌లో ప్రణీత్.. ఆరంభం నుంచి వెనుకబడే ఉన్నాడు. ఓ దశలో 6-16తో వెనుకబడ్డ ప్రణీత్.. కొంచెం పుంజుకుని 12-17తో అంతరం తగ్గించినా.. గేమ్ మాత్రం గెలవలేకపోయాడు. ఐతే రెండో గేమ్‌లో ప్రణీత్ పుంజుకున్నాడు. దూకుడుగా ఆడి 7-4తో ఆధిక్యంలో నిలిచాడు. కానీ ప్రత్యర్థి అతడికి అంత తేలిగ్గా లొంగలేదు. అతను స్కోరు సమం చేయడమే కాక.. ఓ దశలో 16-15తో ఆధిక్యం కూడా సంపాదించాడు. ఐతే ప్రణీత్ ఒత్తిడిలో తడబడకుండా ఆడి గేమ్ గెలుచుకున్నాడు. నిర్ణయాత్మక మూడో గేమ్ కూడా సగం వరకు హోరాహోరీగానే సాగింది. ఐతే 11-11తో స్కోరు సమమైన దశలో జింటింగ్ చెలరేగాడు. 18-12తో ఆధిక్యం సాధించి, మ్యాచ్‌ను కూడా సొంతం చేసుకునేలా కనిపించాడు. ఐతే ఆత్మవిశ్వాసం కోల్పోని ప్రణీత్.. ఒత్తిడిలోనూ గొప్పగా ఆడాడు. వరుసగా 8 పాయింట్లు కొల్లగొట్టి ప్రత్యర్థినే ఒత్తిడిలోకి నెట్టేశాడు. ప్రత్యర్థి 19-20తో తనకు చేరువయ్యే ప్రయత్నం చేసినా.. ప్రణీత్ పట్టు వదల్లేదు. ఈ స్కోరు వద్ద ఓ పాయింట్ సాధించి, గేమ్‌తో పాటు మ్యాచ్‌ను కూడా సొంతం చేసుకుని.. ప్రిక్వార్టర్స్‌లోకి దూసుకెళ్లాడు. ఈ మ్యాచ్ గంటా 12 నిమిషాలు జరగడం విశేషం.

శ్రీకాంత్ కొంచెం కష్టంగా.. సైనా తేలిగ్గా..

పురుషుల సింగిల్స్‌లో మరో రెండో రౌండ్ మ్యాచ్‌లో ఎనిమిదో సీడ్ శ్రీకాంత్ కొంచెం చెమటోడ్చి నెగ్గాడు. అతను 21-9, 21-17తో ఫ్రాన్స్ ఆటగాడు లూకాస్ కార్వీపై విజయం సాధించాడు. తొలి గేమ్ హోరాహోరీగానే ఆరంభమైనప్పటికీ 6-6తో స్కోరు సమమైన దశలో శ్రీకాంత్ తన జోరు చూపించాడు. ఏకంగా 10 వరుస పాయింట్లు సాధించి ప్రత్యర్థికి అందని స్థాయికి చేరిపోయాడు. 16-9తో ఆధిక్యంలో ఉన్నపుడు వరుసగా మరో ఐదు పాయింట్లు సాధించి గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో గేమ్‌లో శ్రీకాంత్ 15-9తో ఆధిక్యంలో ఉన్న దశలో ప్రత్యర్థి పుంజుకుని స్కోరు సమం చేశాడు. ఐతే శ్రీకాంత్ మళ్లీ తన దూకుడు చూపిస్తూ గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. ప్రిక్వార్టర్స్‌లో శ్రీకాంత్.. ఆంటోన్సెన్ (డెన్మార్క్)ను ఢీకొంటాడు. అజయ్ జయరాం 21-13, 21-18తో మార్క్ కాల్జౌ (నెదర్లాండ్స్)పై విజయంతో ప్రిక్వార్టర్స్ చేరాడు. సమీర్ వర్మ 20-22, 9-21తో రాజీవ్ (ఇంగ్లాండ్) చేతిలో పరాజయం పాలయ్యాడు. మహిళల సింగిల్స్ రెండో రౌండ్లో సైనా 21-11, 21-12తో స్విస్ షట్లర్ సబ్రినాను అలవోకగా ఓడించింది. రెండు గేముల్లోనూ సైనాదే సంపూర్ణ ఆధిపత్యం. తొలి గేమ్‌లో సగం వరకు సైనాకు పోటీ ఇచ్చిన సబ్రినా.. తర్వాత ఆమె ధాటికి తట్టుకోలేకపోయింది. రెండో గేమ్ ఆరంభంలో ప్రత్యర్థి నుంచి కాస్త ప్రతిఘటన ఎదురైనా.. ఆ తర్వాత సైనా తనదైన శైలిలో ఆడి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. సైనా ప్రిక్వార్టర్స్‌లో రెండో సీడ్ సుంగ్ జి హ్యూన్‌ను ఢీకొనబోతోంది. మరో భారత అమ్మాయి తన్వి లాడ్ 9-21, 19-21తో సుంగ్ చేతిలోనే ఓడింది. రితుపర్ణ దాస్ కూడా టోర్నీ నుంచి నిష్క్రమించిది. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-సిక్కి రెడ్డి రెండో రౌండ్లో 22-24, 21-17, 15-21తో రెండో సీడ్ కమిలా-క్రిస్టినా (డెన్మార్క్) జంట చేతిలో ఓడారు. ఆర్తి సారా-సంజన సంతోష్ జోడీ కూడా రెండో రౌండ్లో ఓడింది.

ఆంధ్ర విజయం

ఈనాడు, హైదరాబాద్: అఖిల భారత మొయినుద్దౌలా గోల్డ్‌కప్ క్రికెట్ టోర్నీలో ఆంధ్ర బోణీకొట్టింది. బుధవారం రెండో రౌండ్ మ్యాచ్‌లో ఆంధ్ర 118 పరుగుల తేడాతో గోవాను చిత్తుచేసింది. మొదట ఆంధ్ర 50 ఓవర్లలో 9 వికెట్లకు 292 పరుగులు సాధించింది. జ్ఞానేశ్వర్ (68), రవితేజ (55) మెరిశారు. అనంతరం గోవా 49.2 ఓవర్లలో 174 పరుగులకు ఆలౌటైంది. కమ్రుద్దీన్ (3/18), సురేందర్‌కుమార్ (2/29), శ్రీనివాస్ (2/39) రాణించారు. ఈ విజయంతో ఆంధ్రకు 4 పాయింట్లు లభించాయి.

ఇంగ్లాండ్ జట్టుకు రూనీ గుడ్‌బై



లండన్: ఇంగ్లాండ్ ఫుట్‌బాల్ స్టార్ వేన్ రూనీ బుధవారం అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. 31 ఏళ్ల రూనీ ఇంగ్లాండ్ తరఫున 119 మ్యాచుల్లో 53 గోల్స్ చేశాడు. 2004 యూరో టోర్నీలో ఇంగ్లాండ్ క్వార్టర్ ఫైనల్ చేరడంలో రూనీ కీలక పాత్ర పోషించాడు. "ఇది చాలా కఠినమైన నిర్ణయం. నా సన్నిహితులతో మాట్లాడిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నా. ఇంగ్లాండ్‌కు ఆడడం నాకు ఎప్పుడూ ప్రత్యేకమైన విషయమే. జట్టుకు ఎంపికైన ప్రతిసారీ గర్వపడేవాణ్ని" అని రూనీ అన్నాడు.

హరియాణా 27.. దిల్లీ 25


మిడ్‌లైన్ పైకి దూకుతున్న మిరాజ్

ప్రో కబడ్డీలో ఈనాడు
యూపీ యోధ × తెలుగు టైటాన్స్ రాత్రి 8 గంటలకు
ప్రసారం: స్టార్‌స్పోర్ట్స్-2, వేదిక: లఖ్‌నవూ


లఖ్‌నవూ: ప్రొ కబడ్డీ లీగ్‌లో బుధవారం హరియాణా స్టీలర్స్ జట్టు 27-25తో దబాంగ్ దిల్లీపై విజయం సాధించింది. ప్రత్యర్థిని ఓసారి ఆలౌట్ చేసిన హరియాణా.. విరామానికి 17-9తో ఆధిక్యం సంపాదించింది. ఐతే ద్వితీయార్ధంలో దిల్లీ పుంజుకుంది. 25వ నిమిషంలో హరియాణాను ఆలౌట్ చేసి 14-18తో నిలిచింది. ఒత్తిడిని కొనసాగించిన దిల్లీ.. అబోల్‌ఫాజ్ సాధించిన రెండు రైడ్ పాయింట్లతో స్కోరు సమం (19-19) చేసింది. పుంజుకున్న హరియాణా 33వ నిమిషంలో 24-20తో తిరిగి ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. పట్టువదలని దిల్లీ 24-24తో మళ్లీ స్కోరు సమం చేసింది. కానీ 38వ నిమిషంలో సుర్జీత్ రెండు పాయింట్లు స్కోరు చేయడంతో చివరికి హరియాణాదే పైచేయి అయింది. మిరాజ్ (6) పోరాటం వృథా అయ్యింది. యూపీ యోధా, తమిళ్ తలైవాస్ మధ్య ఉత్కంఠభరితంగా సాగిన మరో మ్యాచ్ 33-33తో టైగా ముగిసింది. యూపీ యోధ తరఫున రిషాంక్ (16 పాయింట్లు).. తలైవాస్ తరఫున అజయ్ ఠాకూర్ (10 పాయింట్లు) రాణించారు.



టీ10 లీగ్‌లో వీరూ!

బెంగళూరు: ఇప్పటివరకు టీ20 లీగ్‌లు చూశాం. ఇక త్వరలో టీ10 లీగ్‌లు కూడా రానున్నాయ్. అంటే పది ఓవర్లలోనే ధనాధన్. ఇలాంటి ఓ లీగ్‌లోనే వీరేంద్ర సెహ్వాగ్ మళ్లీ తన బ్యాట్‌కు పనిచెప్పనున్నాడు. ఒక్క వీరూయే కాదు.. అఫ్రిది, సంగక్కర, గేల్ కూడా షార్జా క్రికెట్ స్టేడియంలో డిసెంబర్‌లో ఆరంభమయ్యే ఈ లీగ్‌లో తమ బ్యాటింగ్ విన్యాసాలతో అభిమానులను అలరించనున్నారు. లీగ్‌లో పంజాబీస్, ఫక్తూన్స్, మరాఠ, బంగ్లాస్, లంకన్స్, సింధీస్, కేరలైట్స్ జట్లు పోటీపడనున్నాయి.

అఫ్రిది.. 43 బంతుల్లో 101



లండన్: అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైరైన పాకిస్థాన్ మాజీ ఆల్‌రౌండర్ షాహిద్ అఫ్రిది.. ఇంగ్లాండ్‌లో జరుగుతున్న టీ20 బ్లాస్ట్ టోర్నీలో చెలరేగిపోయాడు. హ్యాంప్‌షైర్‌కు ఆడుతున్న అఫ్రిది.. డెర్బీషైర్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో 43 బంతుల్లోనే 101 పరుగులు చేశాడు. 10 ఫోర్లు, 7 సిక్సర్లు బాదాడు. అతడి ధాటికి హాంప్‌షైర్ 8 వికెట్లకు 249 పరుగుల భారీ స్కోరు సాధించడమే కాక, 101 పరుగుల తేడాతో నెగ్గి సెమీస్ చేరింది. 20 బంతుల్లోనే అర్ధశతకం సాధించిన అఫ్రిది.. ఇంకో 23 బంతుల్లో శతకం పూర్తి చేశాడు.

జైళ్ల శాఖ ఆదాయం పెంచేందుకే
కంపెనీలతో ఒప్పందాలు

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: తెలంగాణ జైళ్ల శాఖ ఆర్థిక స్వావలంబన దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఆ శాఖ ఐజీ ఆకుల నర్సింహ తెలిపారు. హైదరాబాద్ చంచల్‌గూడ డీజీ ఉన్నత కార్యాలయంలో బుధవారం హిమాలయ ఔషధ కంపెనీతో కుదుర్చుకున్న అవగాహనా ఒప్పంద (ఎంఓయు) పత్రాలపై ఐజీ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. జైళ్ల శాఖ ఆర్థిక స్వావలంబన దిశగా ప్రయాణిస్తోందని, ఇందుకు డీజీ వీకే.సింగ్ తగిన ప్రణాళికలతో ముందుకు పోతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే హిమాలయ కంపెనీతో ఆల్ఫా ఆల్ఫా, తులసి మొక్కలను పెంచే వాణిజ్య ఒప్పందాన్ని చేసుకున్నట్లు వివరించారు. చర్లపల్లి వ్యవసాయ క్షేత్రంలోని 5 ఎకరాల్లో ఆల్ఫా ఆల్ఫా, తులసి మొక్కలను పెంచి హిమాలయ ఔషధ కంపెనీకి విక్రయిస్తామన్నారు. ఇందుకు కాలవసిన వ్యవసాయ పనిముట్లు, సాంకేతిక సలహాలు, మొక్కల పెంపకంపై కంపెనీ వారు ఖైదీలకు శిక్షణ ఇస్తున్నారని తెలిపారు.



ఒప్పంద పత్రాలు చూపుతున్న హిమాలయ కంపెనీ ప్రతినిధి, జైళ్లశాఖ ఐజీ ఆకుల నర్సింహ

కూలిన రామప్ప ఉప ఆలయం



వెంకటాపూర్, న్యూస్‌టుడే: కాకతీయులు రామప్పలో నిర్మించిన ఉప ఆలయాల్లో ఒకటైన శివుని(యాకూబ్ సాబ్)గుడి బుధవారం కురిసిన వర్షానికి కూలిపోయింది. క్రీ.శ.1213లో పాలంపేట (జయశంకర్ భూపాలపల్లి జిల్లా) సమీపంలో కాకతీయులు నిర్మించిన ఆలయాల్లో రామప్ప ప్రధానమైనది. దీని పరిధిలో 18 ఉప ఆలయాలు ఉన్నాయి. ఇవి ఎలాంటి అభివృద్ధికీ నోచుకోవడం లేదు. ధూపదీప నైవేద్యాలకు దూరంగా ఉన్నాయి. దాంతో భక్తుల తాకిడి లేక ..పిచ్చిమొక్కలతో, పెద్ద చెట్లతో, ముళ్ల పొదలతో ఇవి కమ్ముకుపోయాయి. పాముల పుట్టలతో భూమిలో కలిసి పోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పుట్టల్లోకి, చిన్న రంధ్రాల్లోకి నీళ్లుపోయి శివుని గుడి కుంగిపోయింది. కుంగిన గర్భాలయం ముందు భాగంలోని ఆలయ ప్రాంగణం ఒకవైపు కూలిపోయింది. పురాతన రాతిశిల్ప కళా సంపద, స్తంభాలు, రాళ్లు విరిగిపోయాయి.

నిబంధనల మేరకే చంద్రబాబు ప్రమాణం

- తీర్పు వెల్లడించిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని నిబంధనల మేరకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర సభ్యులు శాసనసభ్యులుగా ప్రమాణం చేయలేదని, ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబుతో గవర్నర్ ప్రమాణం చేయించడాన్ని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని అభ్యర్థిస్తూ దాఖలైన వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టేసింది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసి 3 ఏళ్ల 2నెలలు గడిచిందని, ఇప్పటి వరకు పిటిషనర్ ఏమిచేస్తున్నట్లని ప్రశ్నించింది. ఇప్పుడు ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చెల్లదని వ్యాజ్యం దాఖలు చేయడం న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ టి.రజనీతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు తీర్పు ఇచ్చింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు కొనసాగడాన్ని సవాలు చేస్తూ గుంటూరు జిల్లా సత్తెనపల్లికి చెందిన న్యాయవాది/ఏపీ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి.సూరిబాబు హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిని విచారించిన ధర్మాసనం బుధవారం నిర్ణయాన్ని వెల్లడించింది. అధికరణ 164(1) ప్రకారమే రాష్ట్ర గవర్నర్ ఇరు రాష్ట్ర శాసన సభ్యులతో ప్రమాణం చేయించి వారి నాయకులను ముఖ్యమంత్రులుగా నియమించారని తెలిపింది. వ్యాజ్యాన్ని కొట్టేస్తూ తీర్పు ఇచ్చింది.

‘వరకట్నం’ కేసుల దుర్వినియోగానికి అడ్డుకట్ట

- ప్రతి జిల్లాలో కుటుంబ సంక్షేమ కమిటీ
- 498ఏ కేసుల్లో ఇక వాటి పాత్రే కీలకం
- జిల్లా జడ్జి ఆధ్వర్యంలో పనిచేయనున్న కమిటీలు
- విస్పష్టమైన ఆదేశాలిచ్చిన సుప్రీంకోర్టు

ఈనాడు, సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: వరకట్నం వేధింపులకు సంబంధించి ఐపీసీ 498ఏ సెక్షన్ దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు విస్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రతి జిల్లా న్యాయసేవాధికార సంస్థ (జిల్లా లీగల్ సర్వీసు అథారిటీ) ఆధ్వర్యంలో కుటుంబ సంక్షేమ కమిటీ (ఫ్యామిలీ వెల్ఫేర్ కమిటీ) ఏర్పాటు చేయాలని అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. గత నెల 27న రాజేశ్ శర్మ-ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వానికి మధ్య జరిగిన కేసులో ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఇక నుంచి వరకట్నం వేధింపుల కేసులో పోలీసులు తమ ఇష్టానుసారం నిందితులుగా ఎవరిని పడితే వారిని అరెస్టు చేయడానికి అవకాశం ఉండదు. పోలీసు స్టేషన్లలో ఈ సెక్షన్ కింద నమోదయ్యే కేసులను కుటుంబ సంక్షేమ కమిటీలకు పంపిస్తే సంబంధిత కమిటీ దీనిపై విచారణ చేసి నిర్ణయం తీసుకుని ఈ విషయాన్ని పోలీసు స్టేషన్లకు తెలియజేస్తుంది. ప్రస్తుతం వరకట్న వేధింపుల కింద నమోదైన కేసుల్లో చాలా వరకు ఒత్తిళ్లు, ఇతరత్రా కారణాలతో నిందితులను అరెస్టు చేస్తున్నారు. ఇదే సమయంలో నిజంగా వేధింపులకు గురిచేసిన వారిపై కేసులు నమోదైనా.. అరెస్టు చేయడంలేదన్న ఆరోపణలూ ఉన్నాయి. ఈ సెక్షన్ ముసుగులో తప్పుడు కేసులు కూడా నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు విస్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలు అమల్లోకి వస్తే ఈ సెక్షన్ దుర్వినియోగం చేయడం దాదాపుగా అసాధ్యమని నిపుణులు చెబుతున్నారు.

ఏం చేయాలంటే..

- సుప్రీంకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యులతో కుటుంబ సంక్షేమ కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. పారా లీగల్ వలంటీర్లు/సోషల్ వర్కర్లు/ పదవీ విరమణ చేసిన ఉద్యోగులను ఇందులో సభ్యులుగా తీసుకోవచ్చు. ఒక్కో జిల్లాకు అక్కడి పని ఒత్తిడిని బట్టి ఒకటి కంటే ఎక్కువ కమిటీలు కూడా ఏర్పాటు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంది. ఈ కమిటీ జిల్లా జడ్జి ఆధ్వర్యంలో పని చేస్తుంది.
- పోలీసుస్టేషన్లో కేసు నమోదైన వెంటనే ఆ వివరాలతోపాటు బాధితులను ఈ కమిటీ దగ్గరకు పోలీసులు పంపించాల్సి ఉంటుంది. కోర్టుల ద్వారా వచ్చే కేసులు కూడా ఈ కమిటీ దగ్గరకు చేరతాయి. ఈ కమిటీ సభ్యులు ఇరు వర్గాలను ఒకసారిగానీ రెండు సార్లుగానీ పిలిపించి మాట్లాడతారు. వాస్తవ పరిస్థితిని తెలుసుకుంటారు. ఒక వేళ ఈ కేసుల్లో అరెస్టు చేయాల్సిన పరిస్థితి వస్తే ఒక నివేదిక ద్వారా పోలీసుస్టేషన్లకు తెలియజేస్తారు. ఇదంతా జిల్లా జడ్జి ఆధ్వర్యంలో జరుగుతుంది కాబట్టి అంతా పారదర్శకంగా జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.
- ఇరువర్గాలను పిలిపించి మాట్లాడినప్పుడు రాజీకి అంగీకరిస్తే ఇక కేసు అవసరంలేదని ఈ కమిటీ పోలీసులకు సిఫార్సు చేయొచ్చు.
- ఈ సెక్షన్ పరిధిలోకి వచ్చే వాటిలో భౌతిక దాడులు, చనిపోయిన కేసుల్లో మాత్రం ఈ నిబంధనలేవీ వర్తించవని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది.

మూడు నెలల్లో ఈ ఆదేశాలను అన్ని రాష్ట్రాలూ అమలు చేయాలని సుప్రీంకోర్టు కోరింది. ఇప్పటికే ఈ ఆదేశాలతో కూడిన తీర్పు ప్రతిపై హైదరాబాద్ నగర పోలీసులు విశ్లేషణ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన వెంటనే సుప్రీంకోర్టు ఆదేశాలను అమల్లోకి తెస్తామని ఓ పోలీసు అధికారి తెలిపారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. L/RN/KAR/48/2015-17 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00